

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

నిజామాబాద్ సిటీ*

పేజీలు: 20 + 16

సంపుటి: 14
సంచిక: 229

వెల: రూ.5.00



బుధవారం | 28-2-2018

శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి ఉ. 11.46 తదుపరి చతుర్దశి; నక్షత్రం: ఆశ్లేష రా. 1.45 తదుపరి మఖ; వర్జ్యం: మ. 3.32-5.00; దుర్ముహూర్తం: మ. 12.05-12.52; అమృతఘడియలు: రా. 12.17-1.45; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.39; సూర్యాస్తమయం: 6.18

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



పూల రెక్కలు.. కొన్ని కన్నీటి చుక్కలు

దేవతకు ప్రేమాభిషేకం చేసిన అవే పూలరెక్కలు.. నిశ్శబ్దంగా ఆమె పాదాల ముందు రాలిపోయాయి.

అతిలోక సుందరి కోసం..కన్నీటి చుక్కలతో అభిమానం సంద్రమైంది.

ఎర్ర గులాబీ వాడిపోయిందో.. తన ముళ్లే గుచ్చుకుని రాలిపోయిందో..

అరేబియా సముద్రం దాటి శ్రీదేవి మృతదేహం ముంబై చేరింది! కలలరాణి కడపటి చూపుల కోసం దేశమంతా కలవరిస్తోంది!

ఇప్పుడు ఆ నవ్వులు లేవు.. చిలిపి అల్లరులు లేవు. అప రంజి బొమ్మ సోయగాలు లేవు.. వెండితెరపై వసంతాలు లేవు..

చివరకు బిడ్డలకు 'మామ్' కూడా లేదు!!

కలగా కల్పనగా కనిపించిన దేవకన్య 'మానవా ఇక సెలవ్' అని వెళ్లిపోయింది!!


విమానాశ్రయం నుంచి శ్రీదేవి భౌతికకాయాన్ని తీసుకువచ్చిన అంబులెన్స్

భారత్‌కు చేరుకున్న శ్రీదేవి భౌతికకాయం

- ప్రమాదవశాత్తూ నీట మునిగారు
- పబ్లిక్ ప్రాసిక్యూటర్‌దీ అదే మాట
- దుబాయ్ ప్రభుత్వ మీడియా ప్రకటన
- 3 రోజుల ఉత్కంఠకు ఎట్టకేలకు తెర
- పార్థివ శరీరం బోనీకి అప్పగింత
- నేడు 3:30కి ముంబైలో అంత్యక్రియలు
- మధ్యాహ్నం 2 నుంచి అంతిమ యాత్ర

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

మూడు రోజుల ఉత్కంఠకు తెర పడింది. దుబాయ్‌లో మరణించిన శ్రీదేవి కేసు ముగిసింది. ఆమె మృతదేహాన్ని దుబాయ్ అధికారులు మంగళవారం మధ్యాహ్నం ఆమె కుటుంబసభ్యులకు అప్పగించారు. శ్రీదేవి అనుమానాస్పద మృతిపై వెల్లువెత్తిన సందేహాలకు సమాధానాలు దొరకలేదుగానీ.. కేసు క్లోజ్ అయినట్టు దుబాయ్ ప్రభుత్వ మీడియా కార్యాలయం ట్విట్టర్ ద్వారా ప్రకటించింది. శ్రీదేవి బాత్‌టబ్‌లో ప్రమాదవశాత్తూ మునిగి

మిగతా 16వ పేజీలో...


జననం: 13.8.1963 మరణం: 24.2.2018


ఆదిలాబాద్ జిల్లా డైట్ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

కేంద్రానికి దమ్ముందా!?

మద్దతు ధర పెంచగలరా?.. పెంచితే మీ అయ్య సొమ్ము పోతుందా!?

- తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ ముఖ్యమంత్రి
- ప్రాజెక్టులు, నీటి వాడకంపై జవాబు చెప్పగలరా?
- దేశంలో రైతులు సహనం కోల్పోతున్నారు
- పరీక్షించడం జాతీయ పార్టీలకు మంచిది కాదు
- కలిసి పనిచేసే సంస్కారం మా సర్కారుది: కేసీఆర్

ఆదిలాబాద్, పెద్దపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించే పంటలకు మద్దతు ధర పెంచితే 'మీ అయ్య సొమ్ము ఏమైనా పోతుందా?' అంటూ కేంద్ర ప్రభుత్వంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దేశంలో రైతులు సహనం కోల్పోతున్నారని, వారి ఓపికను పరీక్షించడం జాతీయ పార్టీలకు మంచిది కాదని

మిగతా 6వ పేజీలో...

సీఎంకు తప్పిన ముప్పు

- హెలికాప్టర్లోని వైర్‌లెస్ సెట్ నుంచి పొగలు
- దూరంగా తీసుకెళ్లి పారేసిన అధికారులు 6
- బ్యాటరీ వేడెక్కడమే కారణం

రైతులకు అచ్ఛేదిన్!

- వారి కడగండ్లు తీరుస్తాం
- చిత్తశుద్ధితో పని చేస్తున్నాం
- దావణగెరె రైతుసభలో మోదీ



దావణగెరె, ఫిబ్రవరి 27: దేశంలో రైతుల కష్టాలు, కడగండ్లు తీర్చే దిశగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కర్ణాటక రాష్ట్రం దావణగెరెలో మంగళవారం బీజేపీ భారీ రైతు ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. కర్ణాటక ప్రజలు రైతు బిడ్డ యడ్యూరప్ప నేతృత్వంలోని బీజేపీకి ఓటేస్తే రైతులకు మంచి రోజులు వస్తాయని అన్నారు. గుజరాత్‌లో అన్నదాతలు ప్రతీ నీటి చుక్కనూ సద్వినియోగం చేసుకునేలా కార్యక్రమాలను రూపొందించామని, ఫలితంగా అక్కడ

మిగతా 16వ పేజీలో...

దమ్ముంటే చర్చకు రండి

- ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడండి 6
- సీఎం కేసీఆర్ వ్యాఖ్యలపై బీజేపీ ఫైర్
- బేషరతుగా క్షమాపణ చెప్పాలి: లక్ష్మణ్
- నేడు రాష్ట్రవ్యాప్త ఆందోళనకు పిలుపు



కేసీఆర్‌కు మంత్రి పదవి ఇవ్వకపోవడం పొరపాటు

- హైదరాబాద్‌కు జూబ్లీహిల్స్ కటాఫ్ అన్నారు
- అది కాదని హైటెక్ సిటీతో నిరూపించాను
- అమెరికాలో ఫైళ్లు పట్టుకుని తిరిగాను
- తెలుగువారి కోసమే ఇదంతా చేశాను
- తెలంగాణ, ఏపీ రెండూ అభివృద్ధి చెందాలి
- ఏపీ ఫస్ట్!.. ప్రధానిగా చాన్సొచ్చినా వెళ్లను
- ఎన్టీఆర్‌ది ఆత్మగౌరవ నినాదం
- నేను ఇస్తున్నది 'ఆత్మ విశ్వాసం'
- విద్యార్థిగా నాది దూకుడు స్వభావం
- కానీ... హింస, విధ్వంసం చేయలేదు
- చెన్నారెడ్డిని నాడే మంత్రి పదవి అడిగా
- వేరే విషయంలో మందలిస్తే ఎదురుతిరిగా
- నా సస్పెన్షన్‌పై ఢిల్లీ స్థాయిలో ప్రచారం
- 24 గంటల్లో దానిని ఎత్తివేశారు
- కాంగ్రెస్ వ్యవహారాలు చూసి విసిగిపోయా
- పాలిటిక్స్‌లోకి వస్తారా అని ఎన్టీఆర్‌ను అడిగా
- అల్లుడిని చేసుకుంటానని ఆయనే అన్నారు
- 1999-2004 మధ్య తప్పులు నిజమే

ఆర్కేతో ముఖాముఖి ముచ్చట్లలో 40 ఏళ్ల నాయకుడు చంద్రబాబు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'ఆంధ్రులకు అవమానం జరిగినప్పుడు ఎన్టీఆర్ అందించింది ఆత్మగౌరవ నినాదం! అన్యాయం జరిగినందున ముందుకు వెళ్లేందుకు నేను ఇస్తున్నది ఆత్మవిశ్వాసం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. ఐదుకోట్ల మంది ఆంధ్రులు, వారి పిల్లలు, భవిష్యత్ తరాలు ఆనందంగా, సుఖంగా ఉండేందుకు బలమైన పునాదులు వేస్తున్నానని తెలిపారు. 1978 ఫిబ్రవరి 27న తొలిసారి ఎమ్మెల్యేగా నెగ్గిన చంద్రబాబు... 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. విద్యార్థి జీవితం నుంచి నేటి రాజకీయాల దాకా మనసు విప్పి మాట్లాడారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలి రోజుల్లోనే నాటి సీఎం చెన్నారెడ్డిని కలిసి 'నాకూ మంత్రి పదవి ఇవ్వండి' అని అడిగానన్నారు. విద్యార్థి దశలో

మిగతా 5వ పేజీలో...









ఉప్పును ఊదేస్తున్నాం!

- వాడకంలో తెలంగాణదే తొలిస్థానం
- జాతీయ సగటు కంటే ఎక్కువ 5
- 95% మాంసాహార కుటుంబాలే
- ఐసీఏఆర్-జయశంకర్ వర్సిటీ సర్వే

ఆన్‌లైన్‌లోనే ఈపీఎఫ్ క్లెయింలు

- 10 లక్షల పైన విత్‌డ్రాయల్స్‌కు తప్పనిసరి 16
- పెన్షనర్లకు 5 లక్షలలోపే ఆఫ్‌లైన్‌లో అనుమతి

హోలీ సెలవు 1న.. 2న ఐచ్ఛికం 5

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

నిమిషం ఆలస్యమైనా ప్రవేశం ఉండదు 2


తాండూరు బహిరంగ సభలో ప్రసంగిస్తున్న టీపీసీసీ చీఫ్ ఉత్తమ్,

4 వేలతో ఓట్ల కొనుగోలు!

- అందుకే 'పెట్టుబడి' పథకం.. బీమా ప్రకటనా అంతే
- డిసెంబరులోనే ఎన్నికలు.. కాంగ్రెస్‌దే అధికారం
- ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మారుస్తాం
- రైతులకు 2లక్షల రుణమాఫీ.. సీపీఎస్ రద్దు చేస్తాం
- 6 నెలల్లో ఖాళీల భర్తీ.. ప్రజాచైతన్యయాత్రలో కాంగ్రెస్

(ఆంధ్రజ్యోతి, వికారాబాద్/సంగారెడ్డి)

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నీరుగార్చిన కేసీఆర్‌కు ముఖ్యమంత్రిగా కొనసాగే అర్హత లేదని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను కేసీఆర్ నీరుగార్చారని ఆరోపించారు. ఎన్నికల ముందు జనాన్ని మోసగించేందుకే రైతులకు రూ.5 లక్షల ప్రమాద బీమా పథకం ప్రకటన చేశారన్నారు. మంగళవారం

మిగతా 2వ పేజీలో...

క్రీడా కోటా.. అక్రమాల పుట్ట!

- మెడికల్ సీట్ల సిఫారసులో నిబంధనలకు నీళ్లు
- ఇంకా సర్కారుకు చేరని కమిటీ నివేదిక
- క్రీడా కోటాకు ఫెన్సింగ్‌పై ప్రభుత్వం నిషేధం
- నిషేధానికి ముందే ఆడినవారికీ దక్కని కోటా
- డిప్యూటీ డైరెక్టర్ రాజీనామా? 2

మందుల డబ్బు మాయం



- రెండేళ్లుగా కాటన్, టించరూ కరువే
- మందులు, ప్రథమ చికిత్స కిట్‌లు కూడా
- అంగన్వాడీ కేంద్రాల్లో వసతుల్లేవ్ 2
- నిధులు మళ్లించిన ఐసీడీఎస్ అధికారులు
- కేంద్రానికి తప్పుడు యూసీల సమర్పణ





ఆధునిక మానవుడి కరదీపిక.. భజగోవిందమ్

శ్రీ శంకరుల భజగోవిందమ్ వారి శిష్యులను తీవ్రంగా ప్రభావితం చేసింది. గురువు బోధించిన దానికి కొనసాగింపుగా వారందరూ జీవన పరిసత్యాలను, తాత్విక చింతనను, లోక రీతులను, మానవ స్వభావాలను, కపట గురువుల వైనాలను, భగవంతుని దివ్యత్వాన్ని, ఆయన సర్వ వ్యాపకత్వాన్ని, సరళంగా గంభీరంగా బోధించారు. శ్రీ పద్మపదాచార్యులు, తోటకాచార్యులు, హస్తామలకుడు, సుబోధుడు, యోగానందుడు, ఆనందగిరి వంటి సమర్థ శిష్యుల ఆలోచనలన్నీ గురుదేవుల భావనలకు ప్రతిబింబాలే! ప్రతిధ్వనులే! సజ్జన సాంగత్యం, మనిషిని సంసార సాగరాన్ని దాటమని స్పష్టంగా బోధిస్తుంది; శరీరం శిథిలావస్థకు చేరుకున్నా ఆశాపాశం తెగకపోతే ఎట్లా? ముసలితనం ముంచెత్తినా, యింద్రియాలన్నీ ముడుచుకుపోయినా, మరణాన్ని గురించి తీవ్ర ఆలోచన పీడిస్తున్నా, బాహ్యసాధనలను వదులుకోకుండా, ప్రపంచాపేక్ష తుంచుకోకపోతే ఎట్లా? జ్ఞానం లభించకపోతే కైవల్యం లభించదు. సముద్ర, నదీ స్నానాలు, వ్రత దానాదులు, మనసును నిర్మలం చేస్తాయేగానీ.. ముక్తినివ్వవు. అవి కేవలం ముక్తికి మార్గాలే; 'చెట్టునీడే భద్ర భవనం; నేలే భవ్య శయ్య; అరచేయే పాత్ర; జింక చర్మమే పట్టుబట్ట, పళ్లే పరమాన్నం, నదిలో నీళ్లే అమృతం; ఈ విధంగా జీవించే నిత్యతృప్తుడే నిత్యసుఖి!; భగవద్గీతా పఠనం, గంగాజల పానం, గోవింద స్మరణం, ఆధ్యాత్మిక పురోగమనానికి సాధనలు; పుట్టడం-ఉండటం-పోవటం యిదొక విచిత్ర జన్మచక్రం. ఎన్నిసార్లు జరిగినా, ఏమీ మిగల్చని ఆట. తప్పని, తప్పించుకోలేని, అక్కరకు రాని పరుగు; భగవంతుని కృపతో దీనిని తప్పించుకోవాలి. అంతటా ఉన్నది దైవమేనని తెలుసుకుని శత్రు, మిత్రభావం వదిలిపెట్టి, ఆత్మదర్శనం చేయాలి; అరిషడ్వర్గాలను హరిమయం చేయాలని చెప్పే శంకర భగవత్పాదుల భజగోవిందమ్, అధునాతన మానవుడికి కరదీపిక, సత్యకాలిక, ఆనందమాలిక.

- వి.యస్.ఆర్. మూర్తి, ఆధ్యాత్మిక శాస్త్రవేత్త

Paramjyothi పరంజ్యోతి

మందుల డబ్బులు మాయం!

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారికి దెబ్బ తగిలితే కట్టు కట్టడానికి కాటన్ లేదు! టించర్ లేదు! కనీసం ప్రథమ చికిత్స కిట్ లేదు! రక్తం ఓడుతూండగానే ప్రైవేటు ఆస్పత్రికి పరుగెట్టాలి. జ్వరం వచ్చినా.. అనారోగ్యం అయినా ఇదే పరిస్థితి! అదేంటీ.. అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారుల అత్యవసర చికిత్సకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయల నిధులు ఇస్తున్నాయి కదా!? అని అంటారా!? రెండేళ్లుగా ఆ నిధులను అధికారులు ఖర్చు చేయడం లేదు. ఇతర పథకాలకు మళ్లిస్తున్నారు. పైగా, ఖర్చు చేసినట్లు కేంద్రానికి యుటిలైజేషన్ సర్టిఫికెట్లు (యూసీ)లు పంపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని మోసం చేసి మరిన్ని నిధులు రాబడుతున్నారు. కానీ, చిన్నారులకు కనీసం ప్రథమ చికిత్స కూడా అందించడం లేదు. అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారుల అత్యవసర చికిత్సకు కేంద్రం అందజేస్తున్న నిధులను ఖర్చు చేయడంలో రెండేళ్లుగా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహించారు. ఆ తప్పును కప్పిపుచ్చుకునేందుకు 'ఫండ్స్ యుటిలైజ్డ్' అంటూ కేంద్రానికి నివేదికలు పంపారు. మరిన్ని నిధులు రాబట్టారు. అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పోషకాహారాన్ని అందించడంతోపాటు వారికి దెబ్బ తగిలినా, అనారోగ్య సమస్యలు వచ్చినా వెంటనే ప్రథమ చికిత్స అందించే మందులు, కిట్‌ల కోసం కేంద్ర ప్రభుత్వం నిధులను కేటాయిస్తుంది. మొత్తం ఐసీడీఎస్ పథకం కింద కేంద్రం 2015-16లో రూ.183.57 కోట్లు; 2016-17లో రూ.96.54 కోట్లు విడుదల చేసింది. ఈ ఏడాది (2017-18) కూడా రూ.153.23 కోట్లు అందజేసింది. ఈ నిధులను పిల్లల ప్రథమ చికిత్స, ఇమ్యునైజేషన్‌కి ఉపయోగించాలి. మందుల సరఫరాలో కేంద్రం వాటా 60% కాగా రాష్ట్రం వాటా 40 శాతం. ఈ నిధులతో కాటన్, టించర్, డెటాల్, ఇతర మందులను కొనుగోలు చేయాలి. చిన్నారుల రోగనిరోధక శక్తి పెంచే మందులు అందించాలి. ఈ మందులను మహిళా శిశు సంక్షేమ శాఖ కాంట్రాక్టు పద్ధతిలో కొనుగోలు చేసి అన్ని జిల్లాలకు సరఫరా చేసేది. కానీ, రెండేళ్లుగా ఈ నిధులను ఆ శాఖ మళ్లించింది. మందుల సరఫరా నిలిపి వేసింది. రాష్ట్రంలో మొత్తం 149 అంగన్వాడీ ప్రాజెక్టులున్నాయి. వాటిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు కలిపి మొత్తం 19,04,234 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి దెబ్బ తగిలినా, అనారోగ్యానికి గురైనా ప్రైవేటు ఆస్పత్రులకు పరిగెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రథమ చికిత్స కేంద్రాలు లేకపోవడంతో ఒకవేళ ప్రైవేటు ఆస్పత్రులు లేకపోతే ఆ చిన్నారిని ఇంటికి పంపించే వరకూ రక్తం ఓడుతూనే ఉంటుంది. ఒకవేళ జ్వరం వస్తే తల్లిదండ్రులు వచ్చే వరకూ కేంద్రాల్లోనే పడుకోబెట్టేస్తున్నారు. దాంతో, ఆయాలపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అరకొర వసతులతో అనారోగ్యం

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సరైన వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. అంగన్వాడీ భవనాల అద్దెకు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రూ.750, పట్టణ ప్రాంతాల్లో రూ.3 వేలు, మెట్రోపాలిటన్ ప్రాంతాల్లో రూ.5 వేలను కేంద్రం అందజేస్తుంది. ఈ నిధులు సరిపోవడం లేదంటూ అధికారులు అరకొర వసతులతోనే కేంద్రాలను నిర్వహిస్తున్నారు. చిన్నారులకు కనీసం మంచినీటి సదుపాయం కూడా కరువైంది. అంగన్వాడీ కేంద్రాల్లో మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలు సుమారు 5,36,372 మంది ఉన్నారు. కేంద్రాల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ ఇరుకు భవనాల్లో పిల్లలందరినీ ఒకచోట కూర్చోబెట్టేయడం వల్ల ఒకరి వ్యాధులు మరొకరికి సోకుతున్నాయి. ప్రభుత్వ అధికారులు ఇకనైనా స్పందించి తమ పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

రాష్ట్రంలో కొత్తగా రెండు నీట్ కేంద్రాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రానికి అదనంగా రెండు నీట్ (జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష) కేంద్రాలు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు హైదరబాద్, వరంగల్‌లో మాత్రమే నీట్ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఖమ్మం, రంగారెడ్డిలో కూడా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ ట్విటర్‌లో వెల్లడించారు.

4వేలతో ఓట్ల కొనుగోలు!

(మొదటిపేజీ తరువాయి)

వికారాబాద్ జిల్లా తాండూరు, సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి గంజ్‌లో నిర్వహించిన ప్రజా చైతన్య బస్సు యాత్ర బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. నాలుగేళ్లుగా రాష్ట్రంలో దోపిడీ వ్యవస్థ ఏర్పడిందన్నారు. ఆరు శాతం కమీషన్‌తో జేబులు నింపుకొనేందుకే కేసీఆర్, కేటీఆర్ మిషన్ భగీరథ, సాగునీటి ప్రాజెక్టులు చేపడుతున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటి వరకు రైతుల గురించి పట్టించుకోని టీఆర్ఎస్.. వారి ఓట్లను ప్రజాధనంతో కొనుగోలు చేసేందుకే 'ఎకరానికి రూ.4వేలు సాయం' పథకాన్ని తెస్తోందన్నారు. రాష్ట్రంలో నాలుగు వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే పట్టించుకోని కేసీఆర్ సర్కారు ఇప్పుడు అన్నదాతల మీద కపట ప్రేమ ప్రదర్శిస్తోందని ఆరోపించారు. డిసెంబరులోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పంట బీమా పథకం అమల్లోకి తీసుకొస్తామని ప్రకటించారు. రైతులకు ఏక కాలంలో రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పారు. మహిళా సంఘాలకు లక్ష రూపాయల రివాల్వింగ్ ఫండ్ అందజేయడమే కాకుండా ప్రభుత్వం నిలిపివేసిన అభయహస్తం పథకాన్ని పునరుద్ధరించి రూ.500 ఉన్న పింఛన్‌ను రూ.1000కు పెంచుతామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆయన ప్రకటించారు. నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. అర్హులందరికీ పింఛను ఇస్తామని చెప్పారు. ప్రస్తుతం కొనసాగుతున్న కాంట్రిబ్యూటరీ పింఛను విధానం రద్దు చేసి పాత విధానాన్నే అమల్లోకి తీసుకొస్తామని ఉత్తమ్ హామీ ఇచ్చారు. నాపరాతి పరిశ్రమపై జీఎస్టీ తగ్గించేలా కృషి చేస్తామని, ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ గ్రూప్‌లోకి మార్చేందుకు బీసీలతో కమిటీ వేసి సమీక్షిస్తామని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా ప్రజా చైతన్య యాత్ర కొనసాగుతుందని పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్ర ఖుంటియా అన్నారు. దేశంలో తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కువ సంఖ్యలో రైతు ఆత్మహత్యలు చోటు చేసుకోవడం సిగ్గు పడాల్సిన విషయమని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన ఘన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని, చివరకు తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన ఘనత కూడా కాంగ్రెస్‌దేనని, దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన కాంగ్రెస్‌ను 'ఏం చేసింది' అని ప్రశ్నించే అర్హత టీఆర్ఎస్ మంత్రులకు లేదని సీఎల్పీ నేత జానారెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ తెలంగాణ కోసం దొంగ దీక్ష చేశారని, పోషకాలు కలిగిన ఇంజెక్షన్లు తీసుకుని దీక్ష కొనసాగించారని కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ మోదీకి చెంచాలా మారాడన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఆరుగురు తెలంగాణ ద్రోహులు మంత్రులుగా ఉన్నారని, వారిలో మహేందర్‌రెడ్డి ఒకరని మండలిలో విపక్ష నేత షబ్బీర్ అలీ అన్నారు. సోనియా తెలంగాణ ఇవ్వకుంటే నాంపల్లి దర్గా వద్ద కేసీఆర్‌తో పాటు ఆయన కుమారుడు, అల్లుడు, కూతురు 'భగవాన్‌కే నామ్‌పే దేదే బాబా' అని అడుక్కునేవారని సీనియర్ నేత వీహెచ్ ఎద్దేవా చేశారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ప్రభుత్వం ఏ రోజూ వారిని పట్టించుకోలేదని ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి విమర్శించారు. బాహుబలిలో కాలకేయుడిలాంటి సుఖేందర్‌రెడ్డికి రైతు సమన్వయ సమితి చైర్మన్ పదవి కట్టబెట్టడంతోపాటు సమితుల్లో టీఆర్ఎస్ జేబు దొంగలకు స్థానం కల్పిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ బస్సు యాత్ర మీడియాలో కనిపించవద్దనే ఉద్దేశంతోనే రైతు సమన్వయ యాత్రల పేరిట కేసీఆర్ దిక్కుమాలిన సమావేశాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ నియంతృత్వ పాలనకు చరమగీతం పాడేందుకే యాత్ర చేపట్టినట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఆకుల లలిత, నేతలు మల్లు రవి, పొన్నం ప్రభాకర్, దానం నాగేందర్, ప్రసాద్‌కుమార్, నారాయణరావు, మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు.



అనంతగిరి అడవుల్లో మార్నింగ్ వాక్ చేస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నాయకులు

మార్నింగ్ వాక్.. దైవ దర్శనాలు

వికారాబాద్ అర్బన్ : ప్రజా చైతన్య యాత్రలో భాగంగా నేతలు సోమవారం రాత్రి అనంతగిరి హరిత రిసార్ట్స్‌లో బస చేశారు. తెల్లవారు జామునే టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్, షబ్బీర్ అలీ, వీహెచ్ మార్నింగ్ వాక్ చేశారు. అనంతరం యాత్రకు సంబంధించి పత్రికల్లో వచ్చిన కథనాలను పరిశీలించారు. ఆంధ్రజ్యోతి కథనాలను ఎక్కువగా చదవడం కనిపించింది. అనంతపద్మనాభ స్వామి ఆలయానికి చేరుకున్న నేతలకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతంపలికి దైవ దర్శనం చేయించారు. అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ అనంతపద్మనాభస్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.



అనంతపద్మనాభ స్వామిని దర్శించుకుంటున్న ఉత్తమ్, దానం నాగేందర్, ఇతర నేతలు

కార్యకర్తల తీరుపై అసహనం

తాండూరు బహిరంగ సభలో పలువురు పార్టీ సీనియర్ నేతలు కార్యకర్తల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ నేత వీహెచ్ మాట్లాడే సమయంలో కార్యకర్తలు రేవంత్‌రెడ్డి మాట్లాడాలంటూ నినాదాలు చేశారు. 'ఉండండ్రా భై.. అందరూ మాట్లాడతారు. మేము చెప్పేది కూడా వినండి' అంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. జైపాల్‌రెడ్డి మాట్లాడుతున్న సమయంలోనూ రేవంత్‌తో మాట్లాడించాలంటూ కొందరు మీడియా సెల్‌లోకి దూసుకొచ్చారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతున్నప్పుడూ ఇలాగే వ్యవహరించడంతో దానం నాగేందర్ మందలించారు.

క్రీడా కోటా.. అక్రమాల పుట్ట!

మెడికల్ సీట్ల సిఫారసులో నిబంధనలకు నీళ్లు.. ఇంకా ప్రభుత్వానికి చేరని ద్విసభ్య కమిటీ నివేదిక

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : క్రీడా కోటా కింద మెడికల్ సీట్ల సిఫారసు అంశంలో తవ్వినకొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయి. నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వులను కూడా పక్కనబెట్టి.. ఇష్టానుసారంగా సిఫారసులు చేసినట్లు వెల్లడవుతోంది. ఇప్పుడే కాదు.. ఐదారేళ్ల నుంచి ఇదే తతంగం జరిగినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై లోతైన అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు ప్రభుత్వం ద్విసభ్య కమిటీని నియమించింది. ఈ కమిటీ ఈ నెల 24వ తేదీకే తన నివేదిక ఇవ్వాల్సి ఉన్నప్పటికీ.. దాని కసరత్తు ఇంకా పూర్తికాలేదు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ సిఫారసులో జరిగిన అన్యాయంపై వివరించేందుకు కొందరు విద్యార్థుల తల్లిదండ్రులకు తమను కలిసే అవకాశాన్ని కమిటీ ఇచ్చింది. అయితే జరిగిన తప్పులను వివరించడానికి వచ్చిన విద్యార్థులను తికమకపెట్టేలా కమిటీ వ్యవహరించిందనే ప్రచారం నేపథ్యంలో కొందరు తల్లిదండ్రులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషీని కలిసి వినతిపత్రం సమర్పించారు. క్రీడా కోటాలో సీట్ల సిఫారసు విషయంలో ఉమ్మడి రాష్ట్రంలో 2008లో ఇచ్చిన ఉత్తర్వు(జీవో 11)నే ప్రభుత్వం అనుసరిస్తోంది. దీని ప్రకారం రాష్ట్ర స్థాయిలో ఆడిన క్రీడాకారుడికి సంబంధించిన పత్రాల నిర్ధారణ తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చేస్తుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడినప్పుడు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) చేయాల్సి ఉంటుంది. అయితే, జాతీయ స్థాయిలో క్రీడలకు సంబంధించి ఆయా క్రీడా సమాఖ్యలు ఇచ్చిన పత్రాలనే టీఎస్ఏ పరిగణనలోకి తీసుకుందని వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది.

29 క్రీడలకే కోటా అమలు

క్రీడా కోటాలో సుమారు 29 రకాల క్రీడలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొంది. ఫెన్సింగ్ క్రీడపై 2017 ఫిబ్రవరిలో నిషేధం విధించింది. అయితే అంతకుముందే రాష్ట్ర, జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు కొందరు ఉన్నారు. ఒక విద్యార్థి 2014 నుంచి జాతీయ స్థాయిలో పది సార్లు ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొన్నాడు. నిషేధం విధించడానికి ముందే ఆడినందున తన పేరును సిఫార్సు చేయాలని టీఎస్ఏను కోరగా, పక్కన పెట్టిందని విద్యార్థి తల్లిదండ్రులు కమిటీ దృష్టికి తీసుకెళ్లారు.

అక్రమార్కులపై చర్యలేవీ?

నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలినా అక్రమార్కులపై చర్యలు కొరవడినట్లు వెల్లడైంది. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి రాసిన లేఖతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. టెన్నిస్ క్రీడాకారులు కొంత మొత్తం చెల్లించి హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఆడుకునే వెసులుబాటును అథారిటీ కల్పిస్తోంది. ఇలా 2014లో రూ.3.88 లక్షలు, 2015లో ఏప్రిల్ నాటికి రూ.1.43 లక్షలు వసూలయ్యాయి. కానీ, ఈ మొత్తం 'అథారిటీ' ఖాతాలో జమ కాలేదు. దీనిపైనే 2015 మేలో స్టేడియం అడ్మినిస్ట్రేటర్ శోభ, టెన్నిస్ కోచ్ ఎస్.శ్రీకాంత్ నుంచి ఎండీ వివరణ కోరారు. అయితే ఆ డబ్బు తిరిగి అథారిటీకి వచ్చిందా, లేదా.. అన్న విషయం వెల్లడికాలేదు. దీనిపైనే వెంకటేశ్వరరెడ్డి మూడు రోజుల కిందట ఎండీ దినకరబాబును వివరణ కోరారు. ఎండీ దీనికి ఇంకా స్పందించాల్సి ఉండగానే శోభ తన పదవికి రాజీనామా సమర్పించారని చెబుతున్నారు. క్రీడా కోటా సిఫారసు కమిటీలో కూడా ఆమె ఉన్న నేపథ్యంలో రాజీనామా అంశం కలకలం సృష్టించింది.

1149 మంది రైతుల ఆత్మహత్య

- రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి నేటి వరకు
- జిల్లాల త్రిసభ్య కమిటీల నిర్ధారణ



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాటినుంచి ఇప్పటివరకూ 1149 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వీరంతా వ్యవసాయ సంబంధ కారణాల వల్లే బలవన్మరణాలకు పాల్పడినట్లు త్రిసభ్య కమిటీలు నిర్ధారించాయి. వీరిలో 90 శాతం వరకు కేసులకు రూ.6 లక్షల చొప్పున పరిహారం మంజూరు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. వరుసగా కరువు పరిస్థితులు ఏర్పడటం, పండించిన పంటలకు గిట్టుబాటు ధర రాక అప్పుల పాలు కావడం తదితర కారణాలతో రైతు ఆత్మహత్యలు జరిగాయి. దీనిపై రైతుసంఘాలు కోర్టులను ఆశ్రయించాయి. ఆ సంఘాల లెక్కల ప్రకారం.. రాష్ట్రంలో 3వేలకు పైగానే రైతు ఆత్మహత్యలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి రిపోర్టయిన 2066 మంది రైతుల ఆత్మహత్యల కేసుల్లో 1808 కేసులపై ఆయా జిల్లాల్లో తహసీల్దారు, జిల్లా వ్యవసాయ అధికారి, పోలీసు అధికారితో కూడిన త్రిసభ్య కమిటీలు విచారణ జరిపాయి. ఇందులో 1149 మంది వ్యవసాయ సంబంధ కారణాలతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించాయి. కాగా నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 168 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డట్లు త్రిసభ్య కమిటీ నిర్ధారించింది. మేడ్చల్ జిల్లాలో ఒక్క రైతు ఆత్మహత్య కూడా నిర్ధారణ కాలేదు.

జిల్లాల వారీగా నిర్ధారణ అయిన రైతు ఆత్మహత్యలు..

నల్లగొండ(168), సంగారెడ్డి(144), కరీంనగర్(109), రంగారెడ్డి(78), వరంగల్ అర్బన్(66), వికారాబాద్(64), ఆదిలాబాద్(63), మహబూబ్‌నగర్(63), వరంగల్ రూరల్(48), సిద్దిపేట(45), ఖమ్మం(41), నిర్మల్(36), యాదాద్రి(34), జనగాం(34), నాగర్‌కర్నూల్(29), జగిత్యాల(26), సిరిసిల్ల(25), మహబూబాబాద్(17), వనపర్తి(16), నిజామాబాద్(16), ఆసిఫాబాద్(9), సూర్యాపేట(5), గద్వాల(5), పెద్దపల్లి(3), భూపాలపల్లి(3), భద్రాద్రి(2).



బాచుపల్లి శ్రీ గాయత్రి కళాశాలలో పూజల అనంతరం హారతి కళ్లకు అద్దుకుంటున్న ఇంటర్ విద్యార్థులు

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- మొత్తం విద్యార్థుల సంఖ్య 9,63,546
- పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, జామర్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 9,63,546 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 4,55,635 మంది. రెండో సంవత్సరం విద్యార్థులు 5,07,911 మంది. రాష్ట్రవ్యాప్తంగా 1,294 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మాస్ కాపీయింగ్‌ను నిరోధించేందుకు ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం గమనార్హం. సెల్‌ఫోన్లు పని చేయకుండా జామర్లను అమర్చారు. విద్యార్థులెవరూ సెల్‌ఫోన్లు, కాలిక్యులేటర్స్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లొద్దని అధికారులు సూచించారు. పరీక్ష కేంద్రాల్లోని అధికారులు, ఇన్విజిలేటర్లు కూడా సెల్‌ఫోన్లను వినియోగించవద్దని బోర్డు కార్యదర్శి ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రం నుంచి కిలో మీటరు పరిధిలో ఉన్న జిరాక్స్ షాపులను మూసివేయిస్తున్నట్లు తెలిపారు.

వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు

హాల్ టికెట్లను www.bietelangana.cgg.gov.in, www.tsbie.cgg.gov.in వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచారు. కళాశాల యాజమాన్యాలు హాల్ టికెట్ ఇవ్వని పక్షంలో విద్యార్థులు ఈ వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష రాయొచ్చని అధికారులు సూచించారు. ఈ హాల్ టికెట్‌పై ప్రిన్సిపల్ సంతకం లేకపోయినా పరీక్షకు అనుమతిస్తారు. పరీక్ష సమయంలో ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే కంట్రోల్ రూం నంబర్లు 040-24601010 లేదా 24732369కు ఫిర్యాదు చేయవచ్చు. పరీక్ష కేంద్రాలను గుర్తించేందుకు మొబైల్ యాప్‌ను ఈ యేడాది కూడా అందుబాటులో ఉంచారు. ఈ యాప్‌లో హాల్ టికెట్ నంబరును ఎంటర్ చేస్తే సంబంధిత పరీక్ష కేంద్రాన్ని, మార్గాన్ని కూడా చూపిస్తుంది.

లోకం తీరు



సారీ... చూసుకోలేదు...!

ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	35.3	14.6
హైదరాబాద్	35.1	17.6
వరంగల్	35.5	18.5
ఖమ్మం	38.0	19.0
రామగుండం	34.6	19.6

ఎండలు మండుతున్నాయ్

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. అత్యధికంగా మంగళవారం భద్రాచలంలో 37.8 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోని 11 వాతావరణ కేంద్రాల్లో 8 కేంద్రాల పరిధిలో 35 డిగ్రీల కన్నా ఎక్కువగా పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లోనూ ఎండలు మండిపోతున్నాయి. సాధారణం కంటే 2 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. ఫిబ్రవరిలో తొలిసారిగా మంగళవారం 35.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.



ఆయుధం లేకున్నా కాపాడేందుకు వెళ్లేవాణ్ణి

మీరు నన్ను పరీక్షించే వరకు నమ్మలేరు. కానీ అలాంటి పరిస్థితుల్లో ఆయుధం లేకున్నా విద్యార్థులను కాపాడటానికి ఫ్లోరిడా స్కూల్‌లోకి వెళ్లేవాడిని. నాపై నాకు విశ్వాసం ఉంది.

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్

(ఫ్లోరిడా పాఠశాలలో ఓ మాజీ విద్యార్థి కాల్పులు జరిపి 17 మందిని బలిగొన్న ఘటనపై..)




రాహులే కాంగ్రెస్ 'ప్రధాని అభ్యర్థి'

వచ్చే ఎన్నికల్లో రాహుల్‌గాంధీయే మా ప్రధాని అభ్యర్థి. యూపీఏ భాగస్వామ్యపక్షాల సాయంతో 2019లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం తథ్యం. హామీలను నెరవేర్చడంలో మోదీ సర్కారు ఘోరంగా విఫలమైంది.

- కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎంవీ రాజీవ్‌గౌడ

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.75.72	పాత ధర 67.52
కొత్త ధర రూ.75.72	కొత్త ధర 67.52
మార్పులేదు	మార్పులేదు



తేలు విషంతో కీళ్లవాతానికి చెక్

హ్యూస్టన్, ఫిబ్రవరి 27: తేలు కుడితే ప్రాణానికే ప్రమాదం. దాని విషం నాడుల్ని దెబ్బతీసి నాలుగు గంటల్లో మనిషిని చంపేస్తుంది. అయితే, తేలు విషంతోనూ లాభాలున్నాయంటున్నారు శాస్త్రవేత్తలు. విషంలో ఉండే ఒక సమ్మేళనం కీళ్ల నొప్పులను దూరం చేస్తుందని, దుష్ప్రభావాలూ ఉండవని చెబుతున్నారు. కీళ్లలో ఉండే ఫైబ్రోబ్లాస్ట్ లైక్ సైనోవియోసైట్స్ కణాలు.. రోగనిరోధక కణాలను ఆకర్షించి నొప్పులకు గురిచేస్తాయి. దాంతో కీళ్లవాతం వస్తుంది. దాన్ని తగ్గించేందుకు తేలు విషంలో ఉండే 'ఐబెరియోటాక్సిన్' అనే సమ్మేళనం దోహదపడుతుందని అమెరికాలోని బేలర్ కాలేజ్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు వెల్లడించారు.

గర్భ నిరోధక మాత్రలతో కుంగుబాటు రాదు

వాషింగ్టన్, ఫిబ్రవరి 27: గర్భ నిరోధక మాత్రలు హార్మోన్లపై ప్రభావం చూపి కుంగుబాటుకు గురయ్యే అవకాశాలున్నాయని అపోహలు ఉన్నాయి. అది నిజం కాదని, ఆ మాత్రలతో కుంగుబాటు వస్తుందనడానికి ఎలాంటి శాస్త్రసంబంధ ఆధారాలు లేవని అమెరికాలోని ఓహియో స్టేట్ వర్సిటీ శాస్త్రవేత్తలు తెలిపారు. గర్భ నిరోధక మాత్రలు వాడే వేలాది మందిపై పరీక్షలు నిర్వహించి నివేదికలను అధ్యయనం చేయగా ఈ విషయం తేలిందని వివరించారు.

యాదాద్రీశుడికి అష్టోత్తర శతఘటాభిషేకం


యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు మంగళవారం బాలాలయంలో లక్ష్మీనారసింహులకు అష్టోత్తర శతఘటాభిషేకం

» శృంగార డోలోత్సవం.. తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి

యాదాద్రి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి లక్ష్మీనారసింహుడికి అష్టోత్తర శతఘటాభిషేకం.. శృంగార డోలోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. దీంతో పదకొండు రోజుల పాటు బాలాలయంలో శాస్త్రోక్తంగా సాగిన స్వామివారి తిరుకల్యాణ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి.. ఉత్సవాల ముగింపు రోజు మంగళవారం బాలాలయంలో స్వామివారి అష్టోత్తర శతఘటాభిషేకంలో భాగంగా ఉత్సవ మండపంలో 108 కలశాలను స్థాపన జరిపి 108 ద్రవ్యాలు, 108 ఔషధాలు, 108 మంత్ర జపాలతో వేదయుక్తంగా అర్చించారు. ఈ అష్టోత్తర శత ఘటాలకు ముక్కోటి దేవతలను ఆవాహన చేసి ఆహూతులకు సమర్పించారు. మహా పూర్ణాహుతిని నిర్వహించి శ్రీస్వామి వారికి శాంతి అభిషేకం చేశారు. ఈ అష్టోత్తర శతఘటాభిషేకం వలన స్వామివారికి బ్రహ్మోత్సవాల్లో జరిగిన అనాజ్ఞాతాది కర్మలు విహితమై, మహానంద దివ్యానుభూతి కలుగుతుందని అర్చకులు వివరించారు. రాత్రి లక్ష్మీనారసింహులకు విశేష అలంకరణ నిర్వహించి శృంగార డోలోత్సవం నిర్వహించారు. ద్వాదశ ఆరాధన, నివేదనలతో ఈ కార్యక్రమాన్ని డి.లక్ష్మణదేవి బృందంతో నిర్వహించారు.

వైభవంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన చిన జీయర్‌స్వామి

» పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి అల్లోల

» ధార్మిక ప్రసంగం చేసిన చిన జీయర్‌స్వామి

ధర్మపురి, ఫిబ్రవరి 27: జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలో శ్రీ లక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవం మంగళవారం సాయంత్రం గోధూళి సుముహూర్తాన అత్యంత వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే కల్యాణోత్సవానికి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి (యోగ, ఉగ్ర), శ్రీ వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను శేషప్ప కళావేదిక పైన ఆసీనులను చేశారు. సంకల్పం, ఆచమనం, యజ్ఞోపవీతధారణ, కూడజీరధారణ, బాసికం ధారణ, అక్షితారోహణం, కల్యాణం నిర్వహించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ దంపతులు వేర్వేరుగా పట్టు వస్త్రాలు సమర్పించారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి ధార్మిక ప్రసంగం చేశారు.

వేరుశనగకు దక్కని 'మద్దతు'

దిగుబడి పెరగడంతో తగ్గిన ధర.. నాణ్యత లేదంటూ వ్యాపారుల సాకులు.. పెట్టుబడి చేతికందని పరిస్థితిలో రైతాంగం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం శ్రమించి వేరుశనగ సాగు చేసిన రైతులకు నిరాశే మిగులుతోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో ఈ ఏడాది పెద్ద ఎత్తున వేరుశనగ సాగైంది. పంట చేతికొచ్చే సమయానికి ధర తగ్గిపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. మద్దతు ధర చెల్లించాలని రైతులు ఆందోళనలకు దిగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. నాణ్యత లేకపోవడం వల్లే వేరుశనగ తక్కువ ధర పలుకుతోందని వ్యాపారులు చెబుతుండగా.. ఒకరిద్దరికి మినహా ఎవరికీ మద్దతు ధర ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి జిల్లాల్లో ఈ ఏడాది వేరుశనగ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. కల్వకుర్తి, భీమా ఎత్తిపోతల పథకాల ద్వారా నీరు అందుతుండడంతో ఉమ్మడి జిల్లాలో సాగు జోరందుకుంది. ఈ రెండు ఎత్తిపోతల పథకాల ఆయకట్టు విస్తరించి ఉన్న నాగర్‌కర్నూల్ జిల్లాలో గత ఏడాది 87 వేల ఎకరాల్లో వేరుశనగ సాగవగా, ఈ సీజన్‌లో ఏకంగా 1,37,000 ఎకరాలకు విస్తరించింది. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 2,84,226 ఎకరాల్లో పల్లి సాగైంది. గత ఏడాదితో పోలిస్తే అదనంగా 44,942 ఎకరాల మేర సాగు పెరిగింది. ఈ మేరకు సుమారు 21.59 లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఉమ్మడి జిల్లాలో రెండు వారాలుగా వ్యవసాయ మార్కెట్లకు వేరుశనగ పోటెత్తుతోంది. ప్రధానంగా నాగర్‌కర్నూల్, అచ్చంపేట, మహబూబ్‌నగర్, జడ్చర్ల, గద్వాల, వనపర్తి మార్కెట్లలో పల్లి కొనుగోళ్లు ఊపందుకున్నాయి. మహబూబ్‌నగర్ మార్కెట్‌కు వేరుశనగ పోటెత్తుతుండడంతో రోజు మార్చి రోజు సెలవు ప్రకటించాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లాలోని మార్కెట్లకు 4.50 లక్షల క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా, గత వారమే 3లక్షల క్వింటాళ్లకుపైగా వచ్చాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.4250తోపాటు రూ.200 బోనస్ కలుపుకుని


మహబూబ్‌నగర్ మార్కెట్‌లో వేరుశనగ రాశులు

మొత్తంగా క్వింటాలుకు రూ.4450 రైతులకు అందాల్సి ఉంది. సరుకు నాణ్యంగా లేదని, నూనె శాతం తక్కువగా ఉంటోందని, రకరకాల సాకులు చూపుతూ వ్యాపారులు ధర తగ్గించేస్తున్నారు. కనిష్ఠంగా క్వింటాల్‌కు రూ.3,300, గరిష్ఠంగా రూ.4000 మించి ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నామమాత్రంగా ఒకరిద్దరికి మాత్రమే గరిష్ఠ ధర ఇస్తున్నారని వాపోతున్నారు. మార్కెట్‌కు 20 వేల బస్తాలకు మించి వచ్చిన రోజు ధర కావాలనే తగ్గిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

పెట్టుబడి కూడా రాదు



ఈ ఏడాది నీళ్లు రావడంతో నాలుగు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. ఎకరాకు 6 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మద్దతు ధర వస్తే పెట్టుబడి పోనూ కష్టానికి కాస్త దొరుకుతుంది. ధర లభించకపోతే పెట్టుబడి కూడా కష్టంగా మారుతుంది. సాగుకు నీళ్లు ఇచ్చినట్లు పంటకు కూడా గిట్టుబాటు ధర కల్పిస్తే రైతు బాగుపడతాడు.

-ఈశ్వరయ్య, రైతు, గోపాల్‌పేట

విత్తనాల ఖర్చూ రాలేదు



వేరుశనగ పంట కోసం విత్తనాలకు పెట్టిన ఖర్చు కూడా రావడం లేదు. తెగుళ్లు సోకడంతో దిగుబడి తగ్గింది. అప్పులు చేసి రేయింబవళ్లు కష్టపడినా ఫలితం లేకుండా పోయింది. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చలేని పరిస్థితిలో ఉన్నాం. మార్కెట్‌లో దళారుల కారణంగా సరైన ధర లభించడం లేదు.

-గోద చిన్నయ్య, రైతు, మొలచింతలపల్లి

వైరాలో కొర్రమీను విత్తనోత్పత్తి

వైరా, ఫిబ్రవరి 27: రాష్ట్రంలో తొలిసారిగా కొర్రమీను చేప పిల్లల పునరుత్పత్తికి రాష్ట్ర స్థాయిలో ఖమ్మం జిల్లా వైరాలోని చేప పిల్లల విత్తనోత్పత్తి కేంద్రాన్ని ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు ఒడిసా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో ఉన్న జాతీయ మంచినీటి చేపల, రొయ్యల ఉత్పత్తి పరిశోధన కేంద్రం - సీఫా (సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఆక్వా రీసెర్చ్ సెంటర్) తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. రాష్ట్రం మొత్తం మీద కొర్రమీను పునరుత్పత్తికి వైరా కేంద్రం అనుకూలంగా ఉంటుందని నిర్ణయించింది. సీఫా శాస్త్రవేత్తలు కొర్రమీను చేపపిల్లల పునరోత్పత్తికి అవసరమైన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తారు.

జాతీయ పక్షుల కలేబరాలు స్వాధీనం

వర్ని, ఫిబ్రవరి 27 : నిజామాబాద్ జిల్లా వర్ని మండలం కూనిపూర్ అటవీ ప్రాంతంలో మంగళవారం రాత్రి రెండు నెమళ్ల కలేబరాలను స్థానికులు గుర్తించారు. రాత్రి వేళలో అటవీ ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో సంచరిస్తుండడంతో గ్రామస్థులు పట్టుకొని సోదా చేయగా వారి వద్ద గల సంచిలో రెండు నెమళ్ల కలేబరాలు లభ్యమయ్యాయి. దీంతో గ్రామస్థులు అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందించి అప్పగించారు.


నెమళ్ల కలేబరాలు



భద్రాచలంలో శ్రీరామనవమి పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. మార్చి 18నుంచి ఏప్రిల్ 1 వరకు వసంతపక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 26న సీతారాముల కల్యాణ మహోత్సవం జరగనుంది.

- భద్రాచలం

చంచల్‌గూడ జైలుకు రవీందర్‌రావు

» లంచం కేసులో 14 రోజుల రిమాండ్

వరంగల్ అర్బన్ క్రైం, ఫిబ్రవరి 27: వరంగల్ రూరల్ జిల్లా డీఈవో కార్యాలయంలో లంచం తీసుకుంటూ పట్టుబడిన తెలంగాణ సర్వశిక్షా అభియాన్ ఈఈ మార్తినేని రవీందర్‌రావును జైలుకు తరలించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో ఆయనను హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల జుడీషియల్ రిమాండు విధించారు. దీంతో రవీందర్‌రావును చంచల్‌గూడ జైలుకు తరలించారు. రెండో రోజు సైతం ఆయన ఇళ్లు, బ్యాంకు లాకర్లను తెరిచినట్టు ఏసీబీ వరంగల్ రేంజ్ డిప్యూటీ డైరెక్టర్ సుదర్శన్ గౌడ్ తెలిపారు. ఎస్‌బీఐ లాకర్‌లో 440 గ్రాముల బంగారు నగలు, ఇంట్లో 100 గ్రాముల బంగారు నగలు, రూ. 5.60 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఇంకా 15 బ్యాంకు అకౌంట్లు గుర్తించామని, వాటిని బుధవారం పరిశీలిస్తామని చెప్పారు.

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య


శ్రీశైలం (ఫైల్)

సదాశివపేట రూరల్/ కనగల్, ఫిబ్రవరి 27: అప్పుల బాధ మరో ఇద్దరు రైతుల ఉసురు తీసింది. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం బొబ్బిలిగామకు చెందిన తలారి శ్రీశైలం (55) తనఎకరాతో పాటు మరో 25 ఎకరాలు కౌలు తీసుకుని పత్తి వేశాడు. నకిలీ విత్తనాల కారణంగా దిగుబడి రాలేదు. సాగు కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక మంగళవారం ఉదయం చేనులో చెట్టుకు ఉరేసుకున్నాడు. నల్లగొండ జిల్లా కనగల్ మండలం జిచెన్నారం గ్రామానికి చెందిన సత్తయ్య (55) తన నాలుగెకరాల్లో పత్తి, వరి సాగు చేశాడు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు వడ్డీతో కలిపి రూ.2 లక్షలకు చేరాయి. ఆశించిన మేర దిగుబడులు రాకపోవడంతో అప్పు తీర్చే మార్గం కనిపించలేదు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరి వేసుకున్నాడు.

తెలంగాణ వర ప్రదాయిని 'కాళేశ్వరం'

» ప్రాజెక్టు పనులను పరిశీలించిన ఎంపీ కవిత


అన్నారం పంపుహౌస్‌ను పరిశీలిస్తున్న కవిత

మంథని, ఫిబ్రవరి 27: గోదావరి నదిపై నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతాంగానికి వర ప్రదాయినిగా మారబోతుందని ఎంపీ కవిత అన్నారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలంలో గోదావరి నదిపై నిర్మిస్తున్న సుందిళ్ల బ్యారేజీ, అన్నారం పంపు హౌస్‌లను.. అదేవిధంగా జయశంకర్ జిల్లా మహదేవ్‌పూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ పనులను మంగళవారం కవిత సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుతో రైతులకు కరువు దరి చేరదని చెప్పారు.

'సుందిళ్ల'ను సందర్శించిన ప్రెస్ అకాడమీ చైర్మన్లు

సుందిళ్ల బ్యారేజీ, అన్నారం పంపుహౌస్‌లను తెలంగాణ, కర్ణాటక ప్రెస్ అకాడమీ చైర్మన్లు అల్లం నారాయణ, సిద్ధి రాజుల బృందం మంగళవారం సందర్శించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టులను సందర్శించడానికి వచ్చినట్లు తెలిపారు.

రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి: జాజుల

చింతపల్లి, ఫిబ్రవరి 27: రాజ్యాధికారం కోసం బీసీలు ఐక్యంగా ఉద్యమించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం వీటీనగర్‌లో జరిగిన గౌడ సంఘం మహాసభలో ఆయన మాట్లాడారు. జనాభాలో 54శాతం ఉన్న బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని అన్నారు. బీసీల ఓట్లతో ఉన్నత వర్గాలు రాజ్యమేలుతున్నాని, బీసీల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు.

హాస్టల్‌లో ఉరేసుకున్న ఇంటర్ విద్యార్థి

» కళాశాల యాజమాన్యం ఒత్తిడే కారణమనే ఆరోపణలు

వనపర్తి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కళాశాల హాస్టల్‌లో ఓ ఇంటర్ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లారితే పరీక్ష అనగా ఘాతుకానికి పాల్పడ్డాడు. మహబూబ్‌నగర్ జిల్లా నర్వ మండలం రాయికోడ్‌కు చెందిన నవీన్(16) వనపర్తిలోని రావూస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం తెలుగు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా ఫ్లోర్ రేలింగ్‌కు ఉరివేసుకున్నాడు. అయితే సాయంత్రం వరకు విద్యార్థి తండ్రి బాలకృష్ణ హాస్టల్‌లోనే ఉన్నట్లు తెలిసింది. చదువులో ముందుండే నవీన్ ఫీజు చెల్లించలేదని కళాశాల యాజమాన్యం ఒత్తిడి తేవడమే ఆత్మహత్యకు కారణంగా పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయం మాట్లాడేందుకే విద్యార్థి తండ్రి కళాశాలకు వచ్చినట్లు తెలిసింది. అయితే యాజమాన్యం మాత్రం ఫీజు ఎప్పుడో కట్టేశారని, హాల్ టికెట్ కూడా అందరితో పాటే అందజేశామని చెబుతోంది. ఆత్మహత్య విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల హాస్టల్ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యే చిన్నారెడ్డి మృతదేహాన్ని పరిశీలించి, ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. నిష్పక్షపాతంగా కేసు నమోదు చేసుకొని విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

పక్కాఇళ్లు లేకున్నా పాయఖానాలు

» గుట్టబోరు గ్రామస్థుల ఆదర్శం.. స్వచ్ఛభారత్‌కు జై


మరుగుదొడ్డి నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారుడు

చర్ల, ఫిబ్రవరి 27: అదో గిరిజన గ్రామం. ఊళ్లో 34 ఇళ్లుంటే వాటిలో 29 పూరి గుడిసెలే! వాటిల్లో ఉంటున్న వారంతా నిరుపేదలే. చాలా గుడిసెల్లో కరెంటు కూడా లేదు. అయితే, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు వారంతా స్వచ్ఛ భారత్‌కు జై కొట్టారు. ఉండేందుకు పక్కా ఇల్లు లేక పోయినా.. అందరూ తమ తమ గుడిసెల వద్ద చక్కగా మరుగుదొడ్లను నిర్మించుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం గుట్ట బోరు ప్రజల ఆదర్శమిది. గుట్టబోరును వందశాతం బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దడంలో 29 గుడిసెల వాసులు పూర్తిగా సహకరించారు.

గౌటా ఘోరకలి

శవాల దిబ్బగా మారిన సిరియా ఎంతో ఆవేదన కలిగిస్తున్నది. తిరుగుబాటుదారుల గుప్పిట్లో ఉన్న గౌటా నగరాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడం కోసం అసద్ ప్రభుత్వం అమానుషంగా ప్రవర్తిస్తున్నది. వారం రోజులుగా ప్రభుత్వ దళాలు ఈ నగరంపై జరుపుతున్న దాడుల్లో రెండువందల మంది పిల్లలతో సహా ఏడువందల మంది పౌరులు మరణించారు. వైమానిక దాడుల్లో ఆసుపత్రులు, ఇళ్ళు నేలమట్టమవుతున్నాయి. సిరియాలో మిగతా ప్రాంతాల్లో ఓటమి పాలైన అసద్ వ్యతిరేక శక్తులన్నీ ఈ నగరానికి చేరి, మరింత బలపడి ఉన్న నేపథ్యంలో దీనిని స్వాధీనం చేసుకోవడం సులభమేమీ కాదన్న విషయం ముందుగా ఊహించినదే. అయితే, అనేక గ్రూపుల చేతిలో ఉన్న ఈ నగరాన్ని తిరిగి తన అధీనంలోకి తెచ్చుకోవడానికి యుద్ధక్షేత్రంలో చిక్కుకున్న నాలుగు లక్షలమంది ప్రజల ప్రాణరక్షణను కూడా అసద్ ప్రభుత్వం బేఖాతరు చేస్తున్నది.

రష్యా వెన్నుదన్నుతో అసద్ ప్రభుత్వం సాగిస్తున్న దాడులపై ఎప్పటిలాగానే అమెరికా మిత్రపక్షాలు మండిపడ్డాయి. మానవహక్కులను కాలరాస్తూ రష్యా–సిరియాలు సాగిస్తున్న ఈ దమనకాండకు అడ్డుకట్టవేయాలన్న విజ్ఞప్తుల మేరకు మూడురోజుల క్రితం సమావేశమైన భద్రతామండలి తక్షణ కాల్పుల విరమణకు పిలుపునిచ్చింది. రష్యా కూడా ఇందుకు సరేనన్నప్పటికీ, ఇప్పుడది రోజుకు ఐదు గంటల యుద్ధవిరామానికి మాత్రమే సిద్ధపడింది. యుద్ధక్షేత్రంలో చిక్కుకున్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవడమైనా, తీవ్రగాయాలపాలై వైద్యసౌకర్యాలు అందని వందలాదిమందిని తరలించడమైనా కేవలం ఈ సమయంలోనే జరగాలి. కాల్పుల విరమణ అమలులోకి వచ్చిన మంగళవారం నాడే ఇది ఆచరణలో సాధ్యపడేది కాదనీ, ప్రజలకు ఏమాత్రం ఉపకరించదని తేలిపోయింది. తాము మినహాయింపు ఇచ్చిన ఆ కొద్దిగంటల్లోనూ తిరుగుబాటు దారులు తమపై దాడులకు పాల్పడుతున్నా, ఇచ్చిన హామీ మేరకు తాము ఎదురుకాల్పులు జరపడం లేదని సిరియా–రష్యా చెబుతున్నాయి. కానీ, పరిస్థితిలో పెద్దగా మార్పురాలేదని హక్కుల సంస్థలు అంటున్నాయి. మానవతాదృష్టితో తాను ఈ విరామానికి సరేనన్నా మిగతావారు ఈ నియమాన్ని పాటించకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని రష్యా అంటున్నది. ఈ ఐదుగంటల కాలంలో కూడా కాలు బయట పెట్టలేని విధంగా కాల్పులు సాగుతూనే ఉండటం, ఒక్క పౌరుడు కూడా అక్కడ నుంచి కదలలేకపోవడాన్ని బట్టి ఈ చర్య ఎంతగా విఫలమైందో అర్థమవుతుంది. రష్యా వ్యతిరేక శక్తులు ఇందుకు రష్యానే తప్పుబడుతుంటే, తిరుగుబాటుదారులు ప్రజలను అక్కడనుంచి పోకుండా నిర్బంధించడమే అసలు కారణమని రష్యా అంటున్నది. ఐదుగంటల విరామం ప్రతిపాదన ఆదిలోనే ఇలా సన్నగిల్లిపోయిన నేపథ్యంలో, ఆహారపదార్థాల సరఫరా వంటి సహాయక చర్యల విషయంలో ఒక్కడుగు కూడా ముందుకు పడటం లేదు. యుద్ధక్షేత్రంలో అనేక గ్రూపులు ఉండటం, ప్రతిదాని వెనుకా బలమైన శక్తులు ఉండటం, వాటన్నింటినీ ఏకతాటిపైకి తెచ్చి కాల్పుల విరమణకు ఒప్పించలేని దుస్థితిలో మిగతా ప్రపంచం ఉండటం ఈ దుస్థితికి కారణం. తిరుగుబాటు దారుల అధీనంలో ఉన్న ఈ చిట్టచివరి బలమైన కోటను హస్తగతం చేసుకోవడానికి అసద్ ప్రభుత్వం సిద్ధపడిన నాటినుంచి అక్కడ ఊచకోతలు సాగుతూనే ఉన్నాయి. శత్రుకోటలను ఛేదించేందుకు అసద్ ప్రభుత్వం రసాయనిక ఆయుధాల ప్రయోగానికి కూడా సిద్ధపడతారన్నది గతానుభవమే. ఇప్పుడు గౌటాను వశం చేసుకోవడం కోసమూ అసద్ ప్రభుత్వం రసాయనిక ఆయుధాల ప్రయోగం జరిపిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. గతంలో మాదిరిగానే, తిరుగుబాటుదారులే ఈ పనిచేసి తమపై నిందవేస్తున్నారని సిరియా రష్యాలు ఆ ఆరోపణలను ఖండిస్తున్నాయి. ఉత్తరకొరియా నుంచి అందుతున్న రసాయనాలతో సిరియా ఈ ఆయుధాలను తయారుచేస్తున్నదనీ, ఇందుకు ప్రతిగా సిరియానుంచి ఉత్తరకొరియాకు పెద్ద ఎత్తున సొమ్ము తరలుతున్నదని ఐక్యరాజ్యసమితి నిపుణులు అంటున్నారు. అసద్ ప్రభుత్వం రసాయనిక ఆయుధాల ప్రయోగానికి ఒడిగట్టిందని అమెరికా మిత్రదేశాలు ఆరోపించినప్పుడల్లా ఇటువంటి కథనాలు వెలుగుచూడటం జరుగుతున్నదే. నిజానిజాలేమిటన్నవి అటుంచితే, సామాన్యుల ప్రాణాల కంటే పరస్పర విమర్శలకే ఇక్కడా ప్రాధాన్యం దక్కడం విషాదం. సిరియాలో 2011నుంచి రెండువందల సార్లు, ఒక్క ఈ ఏడాదిలోనే 18 సార్లు రసాయనిక ఆయుధాల ప్రయోగం జరిగిందని కొన్ని సంస్థలు లెక్కలు కట్టాయి. రష్యా పైలట్ ఒకరు తిరుగుబాటుదారుల చేతిలో మరణించడంతో సిరియా రష్యాలు ప్రతీకారంతో విరుచుకుపడుతున్నాయి. గాయపడినవారికి వైద్యం అందే దిక్కులేదు. కుప్పకూలిన భవనాలనుంచి వెలికితీసిన మృతదేహాలు ఒక్కటొక్కటిగా పోగుపడుతున్నాయి. సిరియాలో సాగుతున్న ఈ యుద్ధం అనేకమంది పాత్రధారులు, సూత్రధారులతో అత్యంత సంక్లిష్టమైపోయింది. హిజ్బుల్లా, ఇరాన్, రష్యాల మద్దతుతో అసద్ ప్రభుత్వం ఒకపక్కా, అతడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అల్ కాయిదా నుంచి ఇస్లామిక్ స్టేట్ జిహాదీల వరకూ వేర్వేరు గ్రూపులు మరొక పక్కా పోరాడుతున్నాయి. ఎవరి ప్రయోజనాలకు అనుగుణంగా, ఎవరికి తోచిన రీతిలో వారు ఎదుటివారిపై బాంబుల వర్షం కురిపిస్తూ అంతిమంగా సామాన్యులను చంపుతున్నారు. అగ్రరాజ్యాల ఈ భౌగోళిక రాజకీయ క్రీడలో ప్రజల ప్రాణాలకు విలువలేకుండా పోవడం ఓ ఘోరమైన విషాదం.



'వెన్నెల' నిష్క్రమణం

బాలీవుడ్ తో సహా యావత్ భారతీయ చలనచిత్ర పరిశ్రమకు దుబాయి కొత్తదేమీ కాదు. పైగా పన్ను తాలూకు వ్యవహారాలు చక్కబెట్టుకోవడానికి భారతీయ చలనచిత్ర రంగ ప్రముఖులకు అంతకంటే అనువైన ప్రదేశం దగ్గర్లో మరొకటి లేదు. అనేక మంది భారతీయ సినీ తారలు దుబాయిను వివిధ కారణాల దృష్ట్యా తరుచుగా సందర్శిస్తుండడం పరిపాటి. తెలుగు రాష్ట్రాల అధికారులు, నాయకుల మొదలు ముంబై హిందీ చిత్ర సీమ అగ్ర నటీనటుల వరకు అందరూ తరచూ దుబాయికి వచ్చి వెళ్ళడం సాధారణమే. ముంబాయి సంపన్నులు అనేకులు తమ శుభ కార్యక్రమాలకు కూడా దుబాయి, ఇతర ఏమిరేట్లను ఎంచుకోవడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో నటి శ్రీదేవి కూడా యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్ కు రావడం జరిగింది. దుబాయికు సమీపంలోని రాస్ అల్ ఖైమా అనే ఏమిరేట్‌లో తన ఆడపడుచు ఇంట జరిగిన పెళ్ళి విందు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన శ్రీ దేవి, విందు అనంతరం దుబాయిలోని తన బసకు వెళ్ళిన విషయం అందరికి విదితమే.

తనకు ఏ మాత్రం పడని తన సవతి పిల్లలతో సహా యావత్తు అత్తింటివారి కుటుంబం ఆ పెళ్ళి విందుకు హాజరైంది. ఆ తర్వాత శ్రీదేవి దుబాయిలోని ఒక ప్రఖ్యాత హోటల్ లో బస చేసినప్పటి నుంచి మరణించే వరకు జరిగిన విషయాలు పలు సందేహాలకు తావిస్తున్నాయి. ఆ సందేహాలకు నిర్దిష్టమైన సమాధానాలు ఇప్పటి వరకు ఎవరి వద్ద లేవు. ఎవరూ ఏమీ చెప్పలేకపోతున్నారు. తన పై వచ్చిన అరోపణలలో ఒక్క దానికి కూడా శ్రీదేవి భర్త బోనీ కపూర్ దుబాయిలో ఉండి కూడా సమాధానం ఇచ్చుకోలేని పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఇక ఆ సందేహాలను నివృతి చేసే విషయమై అంతకు మించి చెప్పదేమీ లేదు. దుబాయి నుంచి వెలువడే పత్రికలు గానీ దుబాయి పోలీసులు లేదా ప్రభుత్వ అధికారులు సంక్షిప్తంగా శ్రీదేవి మరణంపై ముసురుకున్న సందేహాల విషయమై ఒకటి రెండు ప్రకటనలు చేయడం మినహా ఎలాంటి సమాచారాన్ని వెల్లడించలేదు. భారతీయ రాయబారి ఇతర దౌత్యవేత్తలు కూడా చాల అచీతూచీ మాట్లాడారు. మన తెలుగు కార్మికుల మృతదేహాలను భద్రపరిచే చోటే శ్రీదేవి మృతదేహం గత మూడు రోజులుగా ఉంది. దుబాయిలో మరణ కేసుల విచారణలో స్థానికంగా అమలులో ఉన్న విధి విధానాల గూర్చి ఏమాత్రం అవగాహన లేని భారతీయ మీడియా శ్రీదేవి మృతిపై తమకు తోచిన విధంగా కథనాలు వెలువరించింది. వీటిలో అత్యధికం వాస్తవ విరుద్ధంగా ఉన్నాయి. భారతీయ మీడియా కథనాలకు తోడుగా దుబాయి అధికారవర్గం మౌనం పరిస్థితిని మరింత జటిలం చేసింది. దీంతో చివరకు దుబాయి పోలీసులు శ్రీదేవి స్నానపు గది టబ్ లో పడి మరణించారని ప్రకటించారు. భారతదేశంలో నెలకొన్న ఉత్కంఠను మన దేశంలో ఉన్న యు.ఏ.ఇ దౌత్యవర్గాలు తమ ప్రభుత్వానికి నివేదించాయి.

> **శ్రీదేవి మృతి వెనుక కుట్ర ఏమి లేదని, కేవలం మద్యం సేవించడంతో మరణించినట్లుగా సమాచారం. మద్యం సంబంధిత విషయాలతో కూడిన కథనాలతో తమ పర్యాటక రంగంపై ప్రతికూల ప్రభావం పడుతుంది కాబట్టి సాధారణంగా అలాంటి విషయాలను దుబాయి ప్రభుత్వం బయటకు వెల్లడించదు.**

మంగళవారం మధ్యాహ్నం మాత్రం దుబాయి ప్రభుత్వ మీడియా కార్యాలయం శ్రీదేవి మృతి పై విచారణ పూర్తి చేశారని వెల్లడించింది. శ్రీదేవి కేసును మూసివేసి మృతదేహాన్ని ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించడానికి పబ్లిక్ ప్రాసిక్యూషన్ నిర్ణయించినట్లుగా వెల్లడించింది. ఈ రకంగా మీడియా కార్యాలయం ఒక మృతి కేసుపై ప్రకటన చేయడం అనేది దుబాయి చరిత్రలో చాలా అరుదైన విషయం. శ్రీదేవి మృతి వెనుక కుట్ర ఏమి లేదని, కేవలం మద్యం సేవించడంతో మరణించినట్లుగా సమాచారం. మద్యం, వ్యభిచారం మొదలగు విషయాలతో కూడిన కథనాలతో తమ పర్యాటక రంగంపై ప్రతికూల ప్రభావం పడుతుంది కాబట్టి సాధారణంగా అలాంటి విషయాలను దుబాయి ప్రభుత్వం బయటకు వెల్లడించదు. బోనీ కపూర్‌ను శంకించవల్సిన అవసరం లేదని అతన్ని ప్రశ్నించిన పోలీసు వర్గాలు కూడ ఒక అభిప్రాయానికి వచ్చాయి. శ్రీదేవి మృతదేహాన్ని రెండవ సారి కూడా పరిక్షించిన వైద్యులు, పోలీసులు ఆమె మరణంలో నేర కోణం లేదని నివృత్తి చేసుకున్నారు. పైగా దుబాయి అధికారుల విచారణకు తాను సహకరించానని బోనీ కపూర్ చెప్పారు. ఈ నేపథ్యంలో శ్రీదేవి మృతదేహాన్ని అప్పగించడానికి అధికారులు అనుమతించారు. తెలుగు పేద కార్మికుల మరణాల కేసులలో సహకరించిన మలయాళీ మిత్రుడు అష్రఫ్ తమరసెర్రీ ఈ సారి సెలెబ్రిటీ శ్రీదేవి కేసులో సహకరించారు, శ్రీదేవి మృతదేహాన్ని దుబాయి అధికారులు అతనికి అప్పగించారు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి



వైజ్ఞానిక భారత ధ్రువతార

ఆకాశం నీలంగా ఉండడానికి, పగలు నక్షత్రాలు కనిపించకపోవడానికి కారణాలను సామాన్యులకూ సుబోధకంగా, మనోజ్ఞంగా వివరించిన మహా శాస్త్రవేత్త సర్ సి.వి. రామన్. భౌతిక విజ్ఞాన శాస్త్రంలో ఎన్నో విజయవంతమైన ఆవిష్కరణలతో నోబెల్ బహుమతి అందుకున్న రెండో భారతీయ వ్యక్తిగా ఆయన చరిత్ర పుటల్లో నిలిచిపోయారు. అందుకే ఆయన పరిశోధన ఫలితాన్ని ధ్రువపరచిన రోజుని భారతీయులు జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటారు. 1928 ఫిబ్రవరి 28న సి.వి. రామన్ 'రామన్ ఎఫెక్ట్' అనే వైజ్ఞానిక సత్యాన్ని కనుగొని ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తారు. రామన్ 1921 లో కలకత్తా విశ్వవిద్యాలయం తరపున ఇంగ్లండులోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆయన సముద్రయానం చేశారు. ఆ ప్రయాణంలో ఓడ పైనుండి సముద్రాన్ని వీక్షించిన రామన్ మదిలో ఎన్నో సందేహాలు మొలకెత్తాయి. సముద్ర జలాలు ఆకుపచ్చ నీలి రంగుతో ఎందుకు కనిపిస్తాయి? అనే సందేహం ప్రధానమైనది. కలకత్తాకు చేరగానే కాంతి వివర్తనం, విక్షేపాలపై ప్రయోగాలు ప్రారంభించారు. ఈ ప్రయోగాల ఫలితంగా రామన్ విజ్ఞాన శాస్త్ర ప్రపంచంలోనే అత్యంత ప్రభావం కలిగిన 'రామన్ ఫలితాన్ని' (రామన్ ఎఫెక్ట్) కనుగొన్నారు. ఈ పరిశోధనకే ఆయనకు 1930 లో భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. నోబెల్ పురస్కారం పొందిన మొట్టమొదటి శ్వేతేతర శాస్త్రజ్ఞుడు రామన్ కావడం మనకు గర్వకారణం. అంత వరకూ సైన్సులో నోబెల్ బహుమతులు అన్నీ శ్వేత జాతీయులైన పాశ్చాత్యులకే లభించాయి. కానీ రామన్ నూటికి నూరుపాళ్ళు భారతీయునిగా ఈ గడ్డపై, యిక్కడ చదువుకొని, తలమానికమైన పరిశోధన జరిపి సైన్సులో భారతీయుల శక్తిసామర్థ్యాలను చాటిచెప్పారు. అదే ఆ ప్రతిభావంతుని విశిష్టత. భారతదేశానికి సంబంధించి ముఖ్యమైన సమస్యల పరిష్కారంలో, మిగతా దేశాలతో మన దేశాన్ని సమవుజ్జీగా నిలపడంలో, వైజ్ఞానిక పరిశోధనలలో ప్రపంచస్థాయిలో అగ్ర నాయకత్వ స్థితికి చేర్చడంలో... ఇలా ఇంకా ఎన్నో సాధించాలనుకోవడంలో, సాధించడంలో శాస్త్ర సాంకేతిక రంగాల పాత్ర, శాస్త్రజ్ఞుల పాత్ర విలువకట్టలేనిది. జాతీయ స్థాయిలో సైన్స్ స్ఫూర్తిని చాటడం, వ్యాప్తి చేయడం ప్రతి ఫిబ్రవరి 28న మనం జరుపుకునే జాతీయ సైన్స్ డే ముఖ్య లక్ష్యం.

■ డాక్టర్ తన్నీరు కళ్యాణ్ కుమార్
(నేడు జాతీయ సైన్స్ దినోత్సవం)

> **ప్రశ్నించకుండా జవాబులు రావు. 'తమకు రావల్సింది రాబట్టుకోవడం ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కు..' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వాన్ని ఇప్పుడు రాష్ట్రాలు, ప్రజలు తమ హక్కుల గురించి ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైంది.**

ఇండియాగేట్

■ ఎ. కృష్ణారావు

ప్రశ్నించాల్సిన సమయం

రెండు రోజుల క్రితం కేంద్ర మాజీ మంత్రి జై రాం రమేశ్ విజయవాడలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా కల్పిస్తామని ప్రకటించారు. ప్రత్యేక హోదాపై ఫిబ్రవరి 20న రాజ్యసభలో నాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ప్రకటించారు. సరిగ్గా 9 రోజుల తర్వాత మార్చి 1న కేబినెట్ దానికి ఆమోద ముద్ర వేసింది. మరో నాలుగురోజులకు మార్చి 5న కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూలు ప్రకటించింది. అంటే ప్రత్యేక హోదా పై హామీ ఇచ్చిన నాటికీ ఎన్నికల షెడ్యూలు ప్రకటించే నాటికి మధ్య రెండువారాల అమూల్యమైన సమయం గడిచిపోయిందన్నమాట. తమకు సమయం లేనందు వల్ల ప్రత్యేక హోదా ను అమలు చేయలేకపోయామని మన్మోహన్ సింగ్ కూడా తర్వాత రోజుల్లో రాజ్యసభలో ప్రకటించారు కాని కాంగ్రెస్ హయాంలో కూడా ప్రత్యేక హోదాను అమలు చేసే విషయంలో కొంత తర్జన భర్జన జరిగిందని స్పష్టమవుతోంది. జై రాం రమేశ్ తో ఈ విషయం ఇష్టాగోష్టిగా మాట్లాడుతున్నప్పుడు నాటి ప్రణాళికా సంఘం డిప్యూటీ చైర్మన్ మాంటెక్ సింగ్ ఆహ్లువాలియా ఈ జాప్యానికి కారణమని వెల్లడించారు. అప్పుడు ప్రణాళికాసంఘం కార్యదర్శిగా ఉన్న సింధుశ్రీ ఖుల్లర్ ప్రత్యేక హోదా ఫైలును ముందుకు కదిపే విషయంలో నాన్పుడు ధోరణితో వ్యవహరించారన్నారు. ఎన్నికల షెడ్యూలు ఎలాగూ వస్తున్నందువల్ల కాంగ్రెస్ సర్కార్ తమ నిర్ణయాలను తర్వాత వచ్చే ప్రభుత్వంపై రుద్దేందుకు ప్రయత్నించిందన్న విషయం స్పష్టం. సరే ఆ తర్వాత ఇదే సింధుశ్రీ ఖుల్లర్ కు మోదీ ప్రభుత్వం ప్రమోషన్ ఇచ్చి తాము ప్రణాళికా సంఘం స్థానంలో ఏర్పర్చిన నీతీ ఆయోగ్ కు సిఇఓగా నియమించింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న ఒక అధికారికి బిజెపి ప్రభుత్వం ప్రమోషన్ ఇవ్వడం ఒక అరుదైన విషయం.



కాలంలో స్పష్టం చేశారు. ప్రత్యేక కేటగరీ రాష్ట్రాల తర్వాత రెవిన్యూ లోటును ఎదుర్కొంటున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని, 2019–2020లో కూడా ఏపీ రెవిన్యూ లోటును ఎదుర్కొంటునేవచదా? రాజధానీ నగర శంఖుస్థాపనకు వచ్చిన ప్రధానమంత్రి మట్టీ, నీరు ఇవ్వడంతో ఊరుకోక ఉదార హృదయంతో నిధులు ఇస్తామని ప్రకటిస్తే జనం ఎంత సంతోషించేవారు? ఎంతోకాలానికి తన వద్దకు వచ్చిన ఒక ముఖ్యమంత్రి 19 డిమాండ్లతో చిట్టా సమర్పిస్తే వాటిపై వెంటనే ప్రతిస్పందించకుండా ఇంకా వివరాలు కావాలని కోరడం, 114 పేజీలతో నివేదిక సమర్పించిన తర్వాత కూడా ఇంకేమాత్రం స్పందించకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటి? రెవిన్యూ లోటు, ప్రత్యేక హోదా బదులు విదేశీ సహాయ ప్రాజెక్టులకు, పోలవరంకు నిధులు ఇచ్చే విషయంలో కేంద్రం నానుస్తోంది. రెవిన్యూ లోటు విషయంలో కాగ్ చేసిన అంచనాలను కూడా కేంద్రం విస్మరించినట్లు కనపడుతోంది. కొత్త పథకాలు, పే రివిజన్ కమీషన్ బకాయిలు కూడా రెవిన్యూ లోటు పరిధిలోకి రావంటే వాటిని రాష్ట్రం ఎక్కడనుంచి భరించాలి? విదేశీ సహాయ ప్రాజెక్టులకు అయిదేళ్లలో నిధులు ఖర్చుపెట్టే పరిస్థితి లేనందువల్ల 90:10 నిష్పత్తిలో నాబార్డు, హడ్కో, ఇతరవాణిజ్య బ్యాంకులనుంచి రుణాలు తీసుకునే అవకాశం కల్పించాలని, కేంద్రమే తిరిగి చెల్లిస్తున్నందువల్ల ఎఫ్ ఆర్ బిఎం పరిమితి వర్తించకుండా చూడాలని ఎనిమిది నెలల క్రితం చేసిన అభ్యర్థనపై ఇంత వరకూ స్పష్టతనీయలేదు. రైల్వే జోన్ పై రాజకీయ నిర్ణయమే తీసుకోవాల్సి వస్తే ఇంత ఆలస్యం ఎందుకు జరుగుతుందో అర్థం కావడం లేదు.పార్లమెంట్ లో ఎంపిలు గందరగోళం సృష్టించిన తర్వాత కూడా ప్రధానమంత్రి నుంచి స్పందన కనపడకపోగా కాంగ్రెస్ హయాంలో అంజయ్యను అవమానించి, ఆత్మగౌరవం దెబ్బతీశారంటూ విమర్శించడంలో అర్థం కనపడలేదు. మరి ఆయన మాత్రం చేస్తున్నదేమిటి?. నిజానికి ఆంధ్రప్రదేశ్ కు అన్యాయం జరిగిందని దాదాపు అన్ని రాజకీయ పార్టీలు పార్లమెంట్ లో చెప్పాయి. తెలంగాణ రాష్ట్ర సమితి ఎంపి కవిత కూడా ఆంధ్రాకు అన్యాయం జరిగిందని స్పష్టీకరిస్తూ సంఘీ భావం ప్రకటించారు.

అంతర్గత విషయాల మాట ఎలా ఉన్నా, ప్రత్యేక హోదాపై తాము నిర్ణయం తీసుకున్నామని, మోదీ సర్కారే దానిపై వెనుకడుగు వేసిందని ఆరోపించడానికి కాంగ్రెస్ నేతలకు అవకాశం ఏర్పడింది. ఇటీవల విదేశీ వ్యవహారాలకు సంబంధించిన పార్లమెంటరీ కమిటీ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తన ప్రక్కనే కూర్చున్న తెలుగుదేశం సభ్యుడితో మాట్లాడుతూ 'ఈ మోదీ ప్రభుత్వం మీకేమీ చేయదు. ఇది మొత్తం ప్రాంతీయ పార్టీలనే తుడిచిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నది. మీరు ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా బయటపడడం మంచిది.'. అని రెచ్చగొట్టే ప్రయత్నం చేసినట్లు సమాచారం. దేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కాంగ్రెస్ నాయకుడు ఇలాంటి మాటలు మాట్లాడడంలో ఆశ్చర్యం లేదు కాని కాంగ్రెస్, బిజెపి రెండు పార్టీలు చేసిన తప్పిదాల వల్లే ఇవాళ ఆంధ్రప్రదేశ్ నిధులకోసం ఢిల్లీపై పూర్తిగా ఆధారపడవలసిన పరిస్థితి ఏర్పడిందన్న విషయం స్పష్టం.

ప్రత్యేక హోదా వచ్చి తీరుతుందని, రాజ్యసభలో ఒక ప్రధాని చేసిన ప్రకటన ను ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంగానే భావిస్తామని మోదీ ప్రభుత్వం వచ్చిన తొలి రోజుల్లో బిజెపి నేతలు ఊరటనిచ్చే ప్రయత్నం చేశారు. జాతీయ అభివృద్ధి మండలిలో మెజారిటీ ముఖ్యమంత్రులు బిజెపి, కాంగ్రెస్ కు చెందిన వారే కనుక ఎన్డీసీ అనుమతి కూడా లభిస్తుందని వాదించారు. కాని స్వయంగా మోదీయే ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చేందుకు సుముఖంగా లేరన్న విషయం వారికి కూడా క్రమంగా స్పష్టమైంది. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా కల్పిస్తామని ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుపతిలో వెంకన్న సాక్షిగా ప్రకటించిన నరేంద్రమోదీ తర్వాత వెనుకడుగు వేయడానికి కారణమేమిటి? ప్రత్యేక కేటగరీ రాష్ట్రాలకూ, ఇతర రాష్ట్రాలకూ తేడా చూపడం లేదని అన్న 14వఆర్థిక సంఘం మాటల్ని ప్రాతిపదికగా తీసుకుని ప్రత్యేక హోదా ఇవ్వడం లేదని చెప్పిన మాటలూ సరైనవి కావని ఆతర్వాత తేలింది. నిజానికి 14వ ఆర్థిక సంఘం ఈ ప్రకటన చేసిన తర్వాత కూడా 11 ప్రత్యేక కేటగరీ రాష్ట్రాలకు గతంలో లాగా 90:10 నిష్పత్తి లో కేంద్రం కేంద్ర ప్రాయోజిత పథకాలకూ, విదేశీ సహాయ ప్రాజెక్టులకూ నిధులు అంద జేస్తూనే ఉన్నది. హిమాచల్ ప్రదేశ్ కు ప్రతి ఏడాదీ రు. 8వేల కోట్ల చొప్పున రెవిన్యూ లోటు ను కేంద్రం భర్తీ చేస్తున్నది. అంతేకాక ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా ఇవ్వకూడదని తామెక్కడా చెప్పలేదని ఆర్థిక సంఘం నివేదిక రాసిన పెద్దలే తర్వాతి కాలంలో స్పష్టం చేశారు...

టుందని కూడా ఆర్థిక సంఘం స్పష్టం చేసింది. మరి మోదీకి ఏపీకి ప్రత్యేక హోదా కల్పించడానికి ఎందుకు మనస్కరించలేదు? ప్రత్యేక హోదా కల్పించాలని బిహార్, ఒడిషా తో పాటు అనేక రాష్ట్రాలు డిమాండ్ చేశాయని, ఏపీకి ప్రత్యేక హోదా కల్పిస్తే కర్ణాటకకు నష్టం జరుగుతుందని కాంగ్రెస్ ఎంపి వీరప్పమొయిలీ లోక్ సభలో వాదించారని, అందుకే వెనక్కు తగ్గామని కూడా బిజెపి నేతలు చెప్పుకున్నారు. ప్రత్యేక కేటగరీ రాష్ట్రాల్లో పెద్దగా ఒరిగిందేమీ లేదని కూడా వాదనలు వచ్చాయి. కాని ఏపీకి గాడ్గిల్, ముఖర్జీ ప్రతిపాదనలకు అనుగుణంగా ప్రత్యేక హోదా కల్పిస్తే మాత్రం దాన్ని సద్వినియోగం చేసుకోగలిగిన పూర్తి శక్తి చంద్రబాబునాయుడుకు ఉన్నదని, ఏమీ లేనప్పుడే పెట్టుబడులు రాబట్టగలిగిన వ్యక్తి ప్రత్యేక హోదా కల్పిస్తే విజృంభించగలరని నరేంద్రమోదీ కి కూడా బాగా తెలుసు. వీరప్ప మొయిలీ కర్ణాటక నుంచి పరిశ్రమలు తరలిపోతాయేమోనని భయపడినట్లే నరేంద్ర మోదీ కూడా గుజరాత్ గురించి భయపడి ఉంటారా? ఆయన ఆత్మన్యూనతే ఏపీకి ప్రత్యేక హోదా రాకుండా చేసి ఉంటుందా? విచిత్రమేమంటే కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఏమి జరుగుతున్నదో ఇప్పుడు కూడా అదే జరుగుతోంది .కాంగ్రెస్ హయాంలో మన రాష్ట్ర నేతలు ఢిల్లీ చుట్టూ తిరిగేవారు. ఒక రకంగా రెండు ప్రాంతాలు ఘర్షించుకోవడంతో మొత్తంగా తెలుగువారి ఆత్మగౌరవం ఢిల్లీ వీధుల్లో దెబ్బతిన్న విషయం స్పష్టంగా కనపడేది. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత మరో రకంగా తెలుగు వారి ఆత్మగౌరవానికి భంగం కలుగుతోంది. కేంద్రమంత్రులను కలుసుకుని ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం క్రింద చేసిన హామీలను నెరవేర్చి నిధులు విడుదల చేయమని కోరేందుకు గత మూడేళ్లలో 29 సార్లు ఢిల్లీ వెళ్లానని, వెళ్లిన ప్రతిసారీ ఖాళీ చేతులతో తిరిగి వచ్చానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల గుంటూరు లో ప్రకటించడం గమనార్హం. కనీసం ఈ బడ్జెట్ లో నైనా కొంతన్యాయం జరుగుతుందని చివరి ఆశ పెట్టుకున్నానని, కాని అందులో కూడా ఏపీని విస్మరించారని ఆయన ఆవేదన చెందారు. అసలు కేంద్రం చుట్టూ, ప్రధానమంత్రి, కేంద్రమంత్రుల చుట్టూ ఒక ముఖ్యమంత్రి ఎందుకు తిరగాల్సి వచ్చింది? శ్రీహరి కోట నుంచి ఢిల్లీ వరకూ ఆయన ప్రధానమంత్రిని కలుసుకోవాలని ప్రయత్నించింది రాష్ట్ర ప్రయోజనాలను నెరవేర్చమని అభ్యర్థించేందుకే కదా.. రాష్ట్రానికి రావల్సిన వాటి గురించి అనుక్షణం కేంద్రానికి గుర్తు చేసి, కాళ్లరిగేలా తిరిగితే కాని కేంద్రం స్పందించదా?...

నిజానికి ఒక్క ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాక దక్షిణాది రాష్ట్రాలు మొత్తం కేంద్రంపట్ల గుర్రుగా వ్యవహరిస్తున్నాయి. రైల్వే పోస్టుల్లో నియామకాల విషయంలో మలయాళ భాషను తొలగించడం వల్ల తమ ప్రజలకు అన్యాయం జరిగిందని కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ తీవ్రంగా విమర్శించారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆత్మగౌరవ నినాదాన్ని తలకెత్తుకున్నారు.. రాఫెల్ ఒప్పందం వల్ల బెంగళూరులో ఉన్న హెచ్ ఏ ఎల్ కు కాంట్రాక్టు రాకుండ పోయిందని కర్ణాటక కాంగ్రెస్ నేతలు అంటున్నారు. తమిళనాడు సంగతి సరేసరి. 'మహారాష్ట్ర తర్వాత తమిళనాడు ప్రజలు ఎక్కువ పన్నులు కడతారు. తమిళనాడు ప్రజలు కడుతున్న పన్నులతో ఉత్తరాదిని అభివృద్ధి చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.' అని కొత్తగా రాజకీయాల్లోకి ప్రవేశించిన ప్రముఖ సినీనటుడు కమల్ హసన్ వ్యాఖ్యానించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ కూడా తెలంగాణ నుంచే కేంద్రానికి పన్నుల రూపేణా ఎక్కువ చెల్లిస్తున్నామని, కేంద్రం నుంచి తెలంగాణకు వచ్చే నిధులే తక్కువని లెక్కలతో సహా ఇటీవల ప్రకటించారు. తాజాగా ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన లెక్క ప్రకారం ఆంధ్రప్రదేశ్ నుంచి 2.16 లక్షలు, తెలంగాణ నుంచి 1.84 లక్షలమంది అదనంగా జీఎస్టీ చెల్లించారని తేలింది. ప్రశ్నించకుండా జవాబులు రావు. 'తమకు రావల్సింది రాబట్టుకోవడం ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కు..' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వాన్ని ఇప్పుడు రాష్ట్రాలు, ప్రజలు తమ హక్కుల గురించి ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రధానమంత్రి అనే వ్యక్తి ఎప్పుడూ ప్రజల బోనులో ఉంటారని గ్రహించాలి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

కాలం హరించని హక్కుల స్ఫూర్తి


ఆతివాదుల మధ్య ఉదారవాదంతో వ్యవహరించిన ప్రజాస్వామ్యవాది, ప్రజాన్యాయవాది అస్మా జహంగీర్ ఒక్క పాకిస్థాన్‌కే కాదు, దక్షిణాసియా అంతటికీ గర్వకారణమైన హక్కుల యోధురాలు.

మానవ హక్కుల కోసం కోర్టుల్లోనూ, వీధుల్లోనూ పోరాడిన పాకిస్థాన్ 'హక్కుల సేనాని' అస్మా జాహంగీర్(66) ఇటీవల గుండెపోటుతో మరణించారు. పాకిస్థాన్‌లో మహిళా హక్కులు, మానవ హక్కులు, మైనార్టీ హక్కులు, బాలల హక్కులు అన్నింటికీ కేరాఫ్ అడ్రస్ అస్మానే. తను నమ్మిన దానికోసం వీధి పోరాటాలు కూడా చేసేవారు. పాకిస్థాన్ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌కి అధ్యక్షురాలిగా వ్యవహరించిన తొలి మహిళ ఆమె. ఎన్నో వివాదాస్పద కేసుల్లో ధైర్యంగా ముందుకు వచ్చి ఆమె వాదించేది. పాకిస్థాన్‌లో అత్యంత కఠిన చట్టాల్లో 'దైవదూషణ చట్టం' ఒకటి. ఈ విషయంలో ప్రజలు కూడా చాలా సెంటిమెంటల్‌గా ఉంటారు. తమకు గిట్టని వ్యక్తులను అడ్డు తొలగించుకోవడం కోవడం కోసం, స్థానికంగా తమ బలం పెంచుకోవడం కోసం రాజకీయ నాయకులు లేదా స్థానిక మత పెద్దలు దైవదూషణ చట్టాన్ని అస్త్రంగా ఉపయోగించుకుంటారు. దీనికి ఎక్కువగా మైనారిటీ వర్గాలవారు బలవుతుంటారు. దైవదూషణ కేసు కింద మరణశిక్ష పడిన ఖైదీల తరపున అస్మా పోరాడేవారు. ఇందుకుగాను ఆమెను చంపివేస్తామంటూ మతతత్వవాదులు ఎన్నోసార్లు బెదిరించారు. అలాంటివాటికి ఆమె చెక్కుచెదరలేదు.

1993లో లాహోర్‌కు సమీపంలోని చిన్నపట్టణంలో 11 సంవత్సరాల సలామత్ మాషి అనే క్రిస్టియన్ బాలుడిని, అతని బాబాయి మంజూర్ మాషిని దైవదూషణ చట్టం కింద అరెస్టు చేశారు. తొలుత గుజ్రన్‌వాలా జిల్లా కోర్టులో కేసు విచారణ ప్రారంభమైనప్పుడు మంజూర్ మాషిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. ఈ బాలుడి కేసును అస్మా జహంగీర్ చేపట్టి అతడిని విడిపించేందుకు కృషి చేశారు. అస్మా కారణంగానే 1995 ఫిబ్రవరి 23న మాషిపై పెట్టిన దైవదూషణ ఆరోపణలను కోర్టు కొట్టివేసింది. కేసు సందర్భంగా ఏర్పడిన ఉద్రిక్త వాతావరణాన్ని పాకిస్థాన్‌లో ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. పాకిస్థాన్‌లో సైన్యం, ప్రభుత్వం, ఐఎస్ఐలతో పెట్టుకోవాలంటే ఎవరైనా భయపడాల్సిందే. సైన్యం, ఐఎస్ఐ చేతిలో ఆచూకీలేకుండా పోయిన ఎంతో మంది కోసం ఆమె కోర్టులో కేసులు వేసి వాదించేవారు. పాకిస్థాన్‌లోని ప్రధాన పార్టీల్లో ఒకటైన 'ముత్తహిది క్వామీ మూవ్‌మెంట్'(ఎంక్యూఎం) పార్టీ అధినేత అల్తాఫ్ హుస్సేన్‌కు మీడియా కవరేజ్ ఇవ్వవద్దని లాహోర్ హైకోర్టు 2015లో ఉత్తర్వులు జారీ చేసింది. ఎంక్యూఎం, దాని అధ్యక్షుడూ అస్మా జాహంగీర్‌కు బద్ధ వ్యతిరేకులు. అయినా, లాహోర్ కోర్టు తీర్పు నేపథ్యంలో అల్తాఫ్ హుస్సేన్‌కు మద్దతుగా అస్మా ఆ కేసును వాదించారు. ఎవరి హక్కుల కోసమైనా ఆమె అంతే కన్సర్న్‌డ్‌గా ఉండేవారు.

పాకిస్థాన్‌లో పదిహేనో రాజ్యాంగ సవరణ ద్వారా షరియా చట్టం అమలు చేయాలని అనుకున్నప్పుడు తీవ్రంగా వ్యతిరేకించారు. పాకిస్థాన్‌లో షరియా చట్టం కనక అమలైతే దేశంలోని ప్రాథమిక హక్కులన్నిటినీ పునర్ నిర్వచించుకోవాల్సి వస్తుంది, స్వతంత్ర న్యాయవ్యవస్థ ఉండదంటూ ఆమె ఆ చట్టానికి వ్యతిరేకంగా పోరాడారు. 1985లో ఓ సమావేశం కోసం అస్మా జహంగీర్ న్యూఢిల్లీ వచ్చారు. ఆ సమావేశానికి మార్గరెట్ అల్వా అధ్యక్షత వహించారు. మధ్యలో మార్గరెట్ అల్వా చిరునవ్వుతో మీ దేశంలో ఏమి జరుగుతోంది అని అస్మాను ప్రశ్నించగా, 'ఒకదేశంలో జరుగుతున్న విషయంపై ఇంకో దేశం ఆనందపడిపోకూడదు, మా దేశంలో ఏమి జరుగుతుందో దాని ప్రభావం మీపైన కూడా ఉంటుంది. ఆ తరవాత ఇద్దరం కలిసి వాటిపై చింతిస్తుంటాం' అని బదులిచ్చారు. దేశంలోని ప్రతి మైనారిటీ గ్రూప్ తమ హక్కుల కోసం డిమాండ్ చేయవచ్చని అస్మా జహంగీర్ అభిప్రాయపడేవారు. ప్రజాస్వామ్యబద్ధంగా చేసే డిమాండ్‌ను ప్రభుత్వం అణిచివేస్తే అది 'స్టేట్ టెర్రరిజం' అవుతుందనేవారు. పాకిస్థాన్ వర్తమానం, భవిష్యత్తు పట్ల ఆమెకు స్పష్టమైన అభిప్రాయాలు ఉండేవి. రాజకీయాల్లో మత ప్రమేయం లేకుండా చేస్తేనే అభివృద్ధి సాధ్యమని నమ్మేవారు. 'ప్రపంచంలోని అత్యంత చెడ్డ నియంతల్లో ఒకడైన జనరల్ జియాను, ఆఫ్ఘాన్‌లోని జీహాదీలను అమెరికా ప్రభుత్వం వెనకేసుకువచ్చింది. దేశ రాజకీయాలను ఇస్లామీకరిస్తుంటే అందుకు కూడా మద్దతిచ్చింది. మహిళా హక్కుల పట్ల జియా ప్రవరిస్తున్న తీరుపై అమెరికన్ సమాజం మేల్కొనేంత వరకు అక్కడి ప్రభుత్వం గుడ్డిగానే వ్యవహరించింది. మొదట్లో తమను తలకెత్తుకున్న అమెరికా తరవాత పట్టించుకోనందున జీహాదీ నెట్‌వర్క్ అగ్రరాజ్యానికి వ్యతిరేకంగా తయారైంది' అని ఒక ఇంటర్వ్యూలో ఆమె స్పష్టం చేసింది. భారత్ పాక్ సమస్యల పట్ల కూడా అస్మా చాలా నిశ్చితమైన అభిప్రాయంతో ఉండేవారు. 'కశ్మీర్ సమస్యను పరిష్కరించడానికి రెండు దేశాలు నిజాయితీగా పనిచేయడం లేదు. సమస్యకు పరిష్కారం లభించాలంటే చర్చల్లో మూడు పక్షాలను భాగస్వాములను చేయాలి, లేకుంటే పరిస్థితిలో మార్పు ఉండదు' అని చెప్పేవారు.

> **ప్రతీ మైనారిటీ గ్రూప్ తమ హక్కుల కోసం డిమాండ్ చేయవచ్చని అస్మా జహంగీర్ అభిప్రాయపడేవారు. ప్రజాస్వామ్యబద్ధమైన డిమాండ్లను ప్రభుత్వం అణిచివేస్తే అది 'స్టేట్ టెర్రరిజం' అవుతుందనేవారు. పాకిస్థాన్ వర్తమానం, భవిష్యత్తు పట్ల ఆమెకు స్పష్టమైన అభిప్రాయాలు ఉండేవి. రాజకీయాల్లో మత ప్రమేయం లేకుండా చేస్తేనే అభివృద్ధి సాధ్యమని అస్మా విశ్వసించారు.**



'భవిష్యత్తులో కశ్మీర్ సమస్య సమసిపోయినా ఇరు దేశాల మధ్య ఉద్రికత్తలు మాత్రం తగ్గవని, అప్పుడు నీటి పంపకాలు, దక్షిణాసియాలో ఆధిపత్యం తదితరాలు ముందుకు వస్తాయి. భారత్‌తో పోలిస్తే పాకిస్థాన్ భౌగోళికంగా చిన్న దేశమైనా గతంలో అమెరికాతో జట్టుకట్టడంతో దక్షిణాసియాలో కొంత ప్రభావవంతమైన దేశంగా వెలుగొందింది. అది ఎట్టిపరిస్థితుల్లో వదులుకోవడానికి ఇష్టపడదు. ఇవన్నీ కూడా భవిష్యత్తులో పెరిగిపోతాయి. అంతేకాదు పాకిస్థాన్‌లో హిందువులు, ఇండియాలో ముస్లింలు ఉన్నారు. ముంబాయిలోని ముస్లింలపై దాడులు జరిగితే వెంటనే సింద్‌లోని హిందువులపై దాడులు జరుగుతాయి. పాక్‌లోని హిందువులపై దాడులు జరిగితే భారత్‌లోని ముస్లింలపై దాడి జరుగుతుంది' అనేవారు. భారత్ పోఖ్రాన్ అణు పరీక్షల అనంతరం పాకిస్థాన్‌లో కూడా అణుపాటవ పరీక్షలు జరపాలన్న డిమాండ్ ఊపందుకుంది. వాటిని అస్మావ్యతిరేకించారు. పాక్ విదేశాంగ విధానం అనేది భారత్ చర్యలకు ప్రతిస్పందనగా ఉండకూడదని ఆమె వాదించారు. అణు పరీక్షలు జరపడం వల్ల మనకు వచ్చే లాభం ఏమీలేదు. మనం వారికి భిన్నం అని చెప్పడానికి వచ్చిన మంచి అవకాశాన్ని ఉపయోగించుకుందామని వాదించారు. భారత్–పాక్‌ల మధ్య అణ్వస్త్ర యుద్ధం వస్తుందా? అన్న ప్రశ్నకు 'ఇరు దేశాల మధ్య ఏదైనా సాధ్యమే. మన చర్యలన్నీ అప్పటికప్పుడు తాత్కాలిక ఆవేశాలతో తీసుకోబడతాయి. ప్రభుత్వాల దగ్గర ఒకరి గురించి మరొకరికి పూర్తిగా తప్పుడు సమాచారం ఉంటుంది. ఎవరో కొంత మంది చెప్పిన సమాచారం ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటారు. మాకు జిహాదీలు, మీకు ప్రెజర్ గ్రూపుల ఒత్తిడి ఎక్కువ. ఎక్కడో బిహార్‌లోనో లేదా క్వెట్టాలోనో కూర్చుని మాట్లాడే మహిళ గొంతు వినేది ఎవరు?' అని అమితావ్ ఘోష్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె అన్నారు. ప్రజలు తరచు కలుస్తుంటేనే ఇరు దేశాల మధ్య విద్వేషాలు వాటంతట అవే సమసిపోతాయని ఆమె చెపుతుండేవారు.' నా ఆఫీసులో పనిచేసే ఇద్దరు యువ న్యాయవాదులు ఏదో పనికోసం ఇండియా వెళ్ళారని, తిరిగి పాక్ వచ్చిన తరువాత వారి స్పందన అద్భుతంగా ఉంది. లాహోర్, క్వెట్టాల మధ్య ఉన్న తేడా కన్నా లాహోర్, ఢిల్లీల మధ్య తేడా చాలా తక్కువగా ఉంది. మేము భారత సుప్రీంకోర్టుకు వెళ్లాం. పాక్ చట్టాల గురించి వారికి చాలా తెలుసు. అలాగే పాక్‌లో ఏం జరుగుతుందో అని ఆందోళన పడే వర్గం కూడా అక్కడ ఉంది అంటూ... వారు పూర్తిగా మైమరిచిపోయా'రంటూ ప్రజల రాకపోకలు పెరుగుతుంటే ఇవన్నీ తగ్గిపోతాయనడానికి ఇలాంటి సంఘటనలే ప్రత్యక్ష ఉదాహరణ అని అస్మా నొక్కిచెప్పారు.

జీవితాంతం పోరాటంలో ఉన్న ఆమెకు ఎన్నో అవార్డులు, రివార్డులు లభించాయి, ఎన్నో కమిషన్లకు సారథ్యం వహించారు. బెదిరింపులకు లొంగనట్లే..అవార్డులకు ఆమె పొంగిపోలేదు. తన పనిని తను యథావిధిగా చేసుకుంటూ పోయారు. పాకిస్థాన్‌లో ప్రాణహాని ఉన్న వ్యక్తుల్లో ఆమె తొలి రెండు మూడు స్థానాల్లో ఉంటారని ఆ దేశ గూఢచార సంస్థ ఐఎస్ఐ ఎప్పుడో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది ఇలాంటి వార్తలు వచ్చినప్పుడల్లా నా పనిలో ఇవన్నీ భాగం అనేవారు. 'సలామత్ మాషి కేసు వాదిస్తున్న సమయంలో మా ఇంటికి వచ్చి బెదిరించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. నా సోదరుడిని, అతడి కుటుంబాన్ని బందీలుగా కూడా పట్టుకున్నారు. ఆ సమయంలో నన్ను చంపడానికి వచ్చిన వ్యక్తులను తుపాకి సహా కోర్టులోనే అరెస్టు చేశారు. వారిని కలవడానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్లాను. నా మీద వారికి నరనరాన వ్యతిరేకత నింపి పంపించారు. అయితే నాతో మాట్లాడుతున్న కొద్దీ వారికి స్థానిక ముల్లాలు కల్పించిన భ్రమలు తొలిగిపోయాయి. వాళ్లు బెయిలుపై విడుదలై వచ్చాక తామెంత తప్పు చేశామో తెలుసుకుని మా ఇంటికి స్వీట్స్ తీసుకువచ్చారు' అని చెప్పారు.

అస్మా లాంటి వ్యక్తులు లేక పోవడం ఒక్క పాకిస్థాన్‌కే కాదు మొత్తం దక్షిణాసియా ప్రాంతానికే తీరని లోటు.

■ గోవర్ధనం కిరణ్‌కుమార్

కేసీఆర్‌కు మంత్రి పదవి ఇవ్వకపోవడం పొరపాటు



(మొదటి పేజీ తరువాయి)

తన దూకుడు, అలవాట్లు, వర్సిటీ గొడవలు, ఎన్టీఆర్‌తో బంధం, ఆయన ఇంటికి అల్లుడవడం... వంటి అనేక అంశాలపై తన సహజ శైలికి భిన్నంగా, మనసు విప్పి మాట్లాడారు. ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన... 67 ఏళ్ల వయసులోనూ నాటి పెళ్లి సంగతుల దగ్గరికొచ్చేసరికి సిగ్గుతో నవ్వులు చిందించారు. 1999లో రెండోసారి ముఖ్యమంత్రి అయ్యాక కొన్ని తప్పులు చేశానని హుందాగా అంగీకరించారు. ఇప్పుడు అలాంటి తప్పులు చేయకుండా టెక్నాలజీని సామాన్య ప్రజల బాగుకోసం ఉపయోగిస్తున్నానని, సమతుల్యత పాటిస్తున్నానని తెలిపారు. కొన్ని 'క్యాలిక్యులేటెడ్ మిస్టేక్స్' చేయడం సహజమేనని, కేసీఆర్‌కు మంత్రి పదవి ఇవ్వకపోవడం కూడా అలాంటిదేనని అంగీకరించారు. 'అప్పట్లో మంత్రి పదవికి విజయరామారావుకంటే కేసీఆర్ మెరుగైన అభ్యర్థే కదా! కొన్ని అలా జరుగుతుంటాయి. కాలాన్ని వెనక్కి తీసుకెళ్లి తప్పులను దిద్దుకోలేం' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. పలువురు ప్రధానమంత్రుల ఎంపిక కీలక పాత్ర పోషించిన ఆయన... తనకు మాత్రం ఆ పదవి చేపట్టే ఆలోచన లేదని స్పష్టం చేశారు. అందుకు కారణాలూ వివరించారు. 'మీరు 50 ఏళ్ల రాజకీయ జీవితాన్ని పూర్తి చేసుకున్నప్పుడు మళ్లీ ఇంటర్వ్యూ చేస్తాను' అని వేమూరి రాధాకృష్ణ అన్నప్పుడు... "మీది చాలా లాంగ్ విష్! మీకు కూడా ఆల్ ది బెస్ట్' అని చంద్రబాబు గట్టిగా నవ్వేశారు.

ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు..

నలభై ఏళ్ల రాజకీయ జీవితాన్ని పూర్తి చేసుకున్న మీకు శుభాకాంక్షలు. మొట్టమొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచానని తెలియగానే ఎలా అనిపించింది?

అది చరిత్రాత్మకమైన పోరు. అది మొదటి గెలుపు. అదో సంతృప్తి. చంద్రగిరి నియోజకవర్గం ఒక ప్రత్యేకమైనది.

మీరు మంత్రి కాకముందే ఎన్టీఆర్‌తో పరిచయముందా?

అంజయ్య కేబినెట్‌లో సినిమాటోగ్రఫీ మంత్రిగా ఉన్నాను. ఎన్టీఆర్ కుమారుడు జయకృష్ణ ఎగ్జిబిటర్. నేను సినిమాటోగ్రఫీ మినిస్టర్‌ను. ఆయన అప్పుడప్పుడు నావద్దకు వచ్చేవారు. ఎన్టీఆర్‌ను కలవాలని అడిగాను. ఆయన సరే అన్నారు. 'అనురాగ దేవత' సినిమా షూటింగ్ జరుగుతుండగా... ఎన్టీఆర్ వద్దకు వెళ్లాను. ఆయన నన్ను గౌరవంగా కూర్చోబెట్టి... గంటన్నర మాట్లాడారు. రాజకీయాల్లోకి వచ్చే అవకాశముందా అని ఆయనను అడిగాను. 'నాకు ఏడాదిన్నరలో 60 ఏళ్లు వస్తాయి. ఆ తర్వాత ప్రజల కోసమే పని చేయాలనుకుంటున్నాను. అది స్వచ్ఛంద సంస్థ ద్వారానా, రాజకీయాల ద్వారానా అనేది తెలియదు" అని ఎన్టీఆర్ బదులిచ్చారు. అప్పటికే నేను మంత్రిని కావడంతో కారుదాకా వచ్చి వీడ్కోలు పలికేందుకు ఆయన సిద్ధమయ్యారు. 'నేను పిల్లవాడిని. మీరు రావడం ఎందుకు' అని నేనే ఆయనను సెట్‌లో వదిలిపెట్టాను. ఆ తర్వాత 'వీరబ్రహ్మంగారి చరిత్ర' సినిమా షూటింగ్ సమయంలోనూ మాట్లాడుకున్నాం.

భువనేశ్వరితో పెళ్లి ప్రతిపాదన ఎలా వచ్చింది?

మా బంధువులు, వాళ్ల బంధువులు... జయకృష్ణ ద్వారా ఎన్టీఆర్ ఈ ప్రతిపాదన పంపించారు. ఎన్టీఆర్ ఇంటి సంబంధం... నేనూ యువకుడిని! (నవ్వుతూ) అయినా కాస్త బెట్టు చూపించాలి కదా! ఇంట్లో అడిగి చెబుతానన్నాను. కొంత సమయం తీసుకుని అంగీకరించాం.

పెళ్లిచూపుల్లో భువనేశ్వరి, మీరూ మాట్లాడుకున్నారా?

మాట్లాడుకున్నాం! మొత్తం పరిస్థితి వివరించాను. మాది గ్రామీణ నేపథ్యం. ఆమె పెరిగిన వాతావరణం, కుటుంబ నేపథ్యం వేరు. నాకు పదవి పోతే మళ్లీ పల్లెకు వెళ్లాల్సి ఉంటుంది. ఇవన్నీ చెప్పాను. ఆమె అంగీకరించారు.

ఎన్టీఆర్‌ను చూడటమే మహద్భాగ్యం అనుకునే వారు. అలాంటి వ్యక్తి మీకు కాళ్లు కడిగి కన్యాదానం చేశారు. మీకు ఎలా అనిపించింది?

అదొక అనుభూతి. ఆయన అప్పటికే టాప్‌లో ఉన్నారు. నా అర్హతంతా మంత్రిగా ఉండటమే. డబ్బులు (కట్నం) అక్కర్లేదుకానీ... పెళ్లి మాత్రం ఘనంగా చేయాలని కోరాను. ఏపీ, తమిళనాడుకు చెందిన నాయకులు, సినిమా వాళ్లు, ఢిల్లీ పెద్దలు చాలామంది వచ్చారు. సినిమా వాళ్లంతా వడ్డించారు. నేను మంత్రిగా, యువనేతగా పాపులర్ కావడంతో చిత్తూరు జిల్లాలో ఇంటికి ఒక ఆహ్వాన పత్రిక ఇచ్చాను. విపరీతంగా జనం వచ్చేశారు. జన సమూహాన్ని నియంత్రించడం కష్టమైపోయింది. అదంతా ఒక థ్రిల్!

పార్టీ పెట్టాలని ఎన్టీఆర్‌కు సలహా ఇచ్చిన మీరు... వెంటనే అందులో ఎందుకు చేరలేదు?

నేను చేరతానన్నాను. ఆయన ఒక పార్టీ పెట్టాక, అల్లుడిగా నేను మరోచోట ఉంటే బాగుండదని చెప్పాను. కానీ, ఆయన బలవంతంగా నన్ను నిలువరించారు. బహుశా... రాజకీయంగా సక్సెస్ కాకపోతే నేను రిస్క్‌లో పడతానని భావించినట్లుంది. దీంతో... నేను పారిశ్రామికవేత్తగా ఎదగాలనుకున్నాను. విష్ణుప్రియ హోటల్, కార్బైడ్ ఫ్యాక్టరీ పెట్టాను. అంతా సవ్యంగా సాగితే... ఎన్టీఆర్ రాజకీయాల్లో ముందుకెళ్లేవారు. నేను పారిశ్రామికవేత్తగా ఎక్కడో ఉండేవాడిని. కానీ... ఆగస్టు సంక్షోభం వచ్చింది. దీనిని ఎదుర్కోలేకపోయారు. ఎన్టీఆర్ నన్ను పిలిచారు. నేను విధిలేని పరిస్థితిలో రంగంలోకి దిగాల్సి వచ్చింది. అనుభవమున్న వారు కావాలని అడిగారు.

బాగా బాధపడిన సంఘటన ఏమిటి?

ఎన్టీఆర్‌ను ఎదిరించి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ప్రధానంగా బాధ కలిగించింది. రాష్ట్ర విభజన చేసిన విధానం కూడా చాలా బాధపెట్టింది.

విద్యార్థిగా ఆ వయసులో ఉండే సరదాలు మీకూ ఉండేవా? సిగరెట్, డ్రింక్ లాంటివి!

సిగరెట్ మాత్రం తాగేవాడిని కాను. (నవ్వుతూ...) విద్యార్థిగా అన్ని వేషాలూ వేశాను.


అప్పట్లో అంత ఫెరోషియస్‌గా ఉన్న మీరు ఇప్పుడు సాఫ్ట్ ఎలా అయ్యారు?

పదవిని బట్టి మనిషి స్వభావాన్ని మార్చుకోవాలి. విద్యార్థి రాజకీయాలను ఎమ్మెల్యేగా, మంత్రిగా, సీఎంగా చేయలేం. అప్పుడు నాయకుడు కాలేం. విద్యార్థి రాజకీయాల్లోనూ నేను మంచి కోసం గట్టిగా నిలబడ్డాను. అంతే తప్ప... ఎప్పుడూ హింస, విధ్వంసం జోలికి వెళ్లలేదు. అప్పుడైనా సరే... ఇప్పుడైనా సరే! మా వాళ్లను చంపినా... నిరసన వ్యక్తం చేశాను, పోరాడాను! హత్యకు హత్యే సమాధానం అని వెళ్లలేదు. పరిటాల రవీంద్రను చంపినప్పుడు నేను పోరాడిన తీరును గమనించే ఉంటారు. కంటికి కన్ను అనుకుంటూ పోతే అంతు ఉండదు. అది జరగకూడదు.

'ఆంధ్రజ్యోతి' గుర్తుచేసింది

- 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై
- చంద్రబాబు వెల్లడి

తన రాజకీయ ప్రవేశం గురించి తాను మరచిపోయానని, 'ఆంధ్రజ్యోతి' గుర్తుచేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. మంగళవారమిక్కడ తన నివాసంలో టీడీపీ సమన్వయ కమిటీ భేటీలో ఆయన మాట్లాడారు. 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో వివిధ దశలను వివరించారు. తన విద్యార్థి దశ, యూనివర్సిటీ రాజకీయాలు, తొలి ఎన్నికలు తదితర విషయాలు తనకు అంతంతమాత్రంగానే గుర్తున్నాయని, కానీ 'ఆంధ్రజ్యోతి' పరిశోధించి రాసిందని అభినందించారు. తనకు గుర్తులేని చాలా అంశాలు ప్రస్తావించారని తెలిపారు.



కేసీఆర్‌ను మంత్రిని చేసి ఉంటే రాష్ట్రం విడిపోయేది కాదా?

కొన్ని క్యాలిక్యులేటెడ్ మిస్టేక్స్ చేస్తుంటాం. కొన్ని తప్పులను దిద్దుకోలేం. కేసీఆర్ నాతో చాలా బాగుండేవాడు. ఆయనకు వ్యతిరేకంగా కరణం రామచంద్రరావు ఉన్నప్పటికీ... సరి చేశాం. నిజానికి... మంత్రి పదవి విషయంలో కేసీఆర్ కంటే విజయరామారావు బెటర్ లీడర్ కాదు కదా! విజయరామారావు ఒక అధికారి. పీజేఆర్‌ను ఓడించగలిగారనే ఉద్దేశంతో పదవి ఇచ్చాం. కొన్ని పరిణామాలు ఊహకు కూడా అందవు. అయితే.. ప్రతిదానికీ ఏదో అయిపోతుందనుకుంటే... ఏదీ చేయలేం. ఒక్కోసారి 'జడ్జిమెంట్ ఆఫ్ ఎర్రర్' ఉంటుంది.

విభజన తర్వాత పనితీరు, అభివృద్ధి విషయంలో మీకు, కేసీఆర్‌కు మధ్య పోలిక వస్తోంది కదా!

'హైదరాబాద్‌ను ఇంత అభివృద్ధి చేశారు. ఇప్పుడు వదిలి వెళ్లినందుకు బాధగాలేదా' అని చాలామంది అడుగుతుంటారు. ఏం చేసినా తెలుగువారి కోసమే చేశాను. తనను మొట్టమొదటిసారిగా ఒక ముఖ్యమంత్రి డెవలప్‌మెంట్ సెంటర్ కోసం కోరినట్లు బిల్ గేట్స్ చెప్పారు. కేవలం హైదరాబాద్ చూసేందుకు క్లింటన్ వచ్చారు. 'నాలెడ్జ్ ఎకానమీ' కోసం న్యూయార్క్‌లో 14 రోజులు నేను స్వయంగా ఫైళ్లు పట్టుకుని తిరిగాను. 'హైదరాబాద్ నగరానికి జూబ్లీహిల్స్ కటాఫ్! సైబరాబాద్ ఎక్కడ, ఎలా వస్తుంది?' అన్నారు. అది కాదని హైటెక్ సిటీతో నిరూపించాను. ఏదైనా నేను తెలుగువారి కోసమే చేశాను.

ఇప్పుడు రాజకీయం జూదంలా మారింది కదా?

ఒక్కొక్కరు ఒక్కో కెరీర్ ఎంపిక చేసుకుంటాం. రాజకీయాల ద్వారా సమాజాన్ని మార్చాలని, ఒక గైడెన్స్ ఇవ్వాలని, ఆదర్శంగా ఉండాలని మంచివైపు నడిపించాలన్నది నా ఆలోచన. నిద్రపోయే కొద్దిసేపు తప్ప... మిగిలిన సమయమంతా పనిచేస్తూనే ఉంటాను. పనిని ఎంజాయ్ చేస్తాను. ఇష్టపడి చేసేది కష్టమనిపించదు.

మరి... మీ ఇంట్లో వాళ్లకు ఎలా ఉంటుంది? మీ సతీమణి ఏమంటారు?

నా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని చాలాసార్లు. కోప్పడుతుంది.

భర్తగా మీ నుంచి ఆమె కొన్ని ఆశిస్తారు కదా?

ఆమె నన్నేమీ కోరలేదు. పాతికేళ్లుగా కంపెనీ బాధ్యతలను ఆమే చూసుకుంటోంది. చదువులు, బంధువులు, పిల్లలు అన్ని బాధ్యతలు నిర్వహిస్తోంది. ఆమె సహకారం లేకపోతే... కష్టంగా ఉంటుంది. మాకు కూడా టైమ్ ఇవ్వాలని, తమతో సమయం గడపాలని అడుగుతుంది. కనీసం అది చేయకపోతే ఎలా? అప్పుడప్పుడు ప్రయత్నిస్తుంటాను. ఒక్కోసారి చేయలేను. ఇది ప్రతి భార్యా భర్త మధ్య ఉండేదే. లైఫ్ ఈజ్ అడ్జస్ట్‌మెంట్. (నవ్వుతూ) ఒక్కోసారి బతిమాలుకోవడం కూడా తప్పదు!

నాలుగైదు రోజులు హాలిడేకు వెళ్లినా కాన్ఫరెన్స్‌లు పెడతారు కదా!

ఒక్కొక్క పనిలో ఒక్కొక్కరికి సంతృప్తి ఉంటుంది. కొందరు గంటలకొద్దీ పేకాట ఆడతారు. నాకు పని చేయడంలో సంతృప్తి!

మొత్తానికి భార్యా పిల్లలకు మాత్రం టైమ్ ఇవ్వనంటారా?

(నవ్వు!) నాకు కుటుంబంపట్ల బాధ్యత ఉంది. మనవడితో కలిసి ఐదుమందిమి ఉన్నాం. మాది చిన్న, ఉమ్మడి కుటుంబం. కలిసి మాట్లాడుకోవడం అవసరం. కుటుంబ వ్యవస్థ పటిష్ఠంగా ఉండాలి. నేను, లోకేశ్ ఇక్కడ ఉన్నాం. భువనేశ్వరి, బ్రాహ్మణి అక్కడున్నారు. నలుగురికి నాలుగు వ్యాపకాలున్నాయి. వీలైనంతగా సమన్వయంతో, అనుబంధంతో సాగుతున్నాం.

భర్తగా మీకు ఎన్ని మార్కులు?

నా భార్యను గౌరవిస్తాను. ఆమె పెద్ద బలం.

ఆమెకు డెఫినెట్‌గా మార్కులు వేయాల్సిందే. కానీ, భర్తగా మీకు మీరు ఎన్ని మార్కులు వేసుకుంటారు?

హైదరాబాద్ నుంచి రమ్మంటే ఆమె అమరావతికి వచ్చేస్తుంది. కానీ... పాతికేళ్లుగా ఆమె నిర్మించుకున్న కెరీర్‌ను వదులుకుని రమ్మంటే ఎవరైనా ఫీల్ అవుతారు. అందువల్ల... ఎప్పుడు రావాలనిపిస్తే అప్పుడు రావొచ్చు అని చెప్పాను.

రాత్రి 9గంటలకల్లా ఇంటికి వచ్చేయాలని చెబుతుంది. అంతేకాదు... "నీవల్ల చాలామంది ఇబ్బంది పడుతున్నారు. ఆఫీసర్లకు కూడా కుటుంబాలు ఉంటాయి కదా! వాళ్లు కూడా నాలాగే తిట్టుకుంటారు" అని చెబుతుంది.

ఫాదర్‌గా లోకేశ్‌కు ఎన్ని మార్కులు వేస్తారు?

మా ఫ్యామిలీలో ఎక్కువ క్రెడిట్ మా భార్యకు ఇస్తాను. లోకేశ్ బాగా చదువుకోవాలని పట్టుపట్టింది. లిటిల్ ఫ్లవర్‌కు పంపి, నారాయణ వద్ద స్పెషల్ కోచింగ్ ఇప్పించింది. విదేశాలకు పంపించింది. . లోకేశ్‌కు స్పష్టమైన లక్ష్యాలు ఇచ్చాను. ఎంత పని చేసుకుంటే అతనికి అంత ఉపయోగపడుతుంది. మా కుటుంబానికి చెప్పింది ఒకటే. డబ్బులు కావాలంటే... నిజాయితీతో వ్యాపారం చేయండి. త్యాగం, సేవ చేయాలంటే రాజకీయాల్లోకి రండి!

ఉప్పును ఊదేస్తున్నాం!

- వాడకంలో తెలంగాణ టాప్
- జాతీయ సగటు కంటే ఎక్కువ
- ఐసీఏఆర్- జయశంకర్ వర్సిటీ సర్వేలో వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆవకాయ, పప్పన్నం నుంచి పలావుల వరకు ఉప్పు లేనిదే ముద్ద దిగదు. జిహ్వాకు లవణ లావణ్యం ఉంటేనే తిన్నామన్న తృప్తి. 'ఉప్పు లేక రుచి పుట్టగ నేర్చునటయ్య భాస్కరా!' అని ఉప్పు ను గొప్పగా వర్ణించాడు ఓ కవి. అందుకే ఇది షడ్రుచుల్లో రారాజు. భారతీయ వంటకాలకు రుచిని అందించడంలో ప్రధాన పాత్ర దీనిదే. ఏ కూర లేకున్నా అన్నంలో కాసిన్ని నీళ్లు పోసుకొని ఉప్పు వేసుకొని పూట కడుపు నింపుకోవచ్చు. అయితే, తెలంగాణలో మాత్రం మోతాదుకు మించి అసాధారణ స్థాయిలో.. రెండు రెట్లు అదనంగా ఉప్పును వినియోగిస్తున్నామట. ఐసీఏఆర్-నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్, ఆచార్య జయశంకర్ వ్యవసాయ వర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో తేలిన నిజమిది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి వ్యక్తి రోజుకు 5 గ్రాముల ఉప్పు తింటే సరిపోతుందని సూచిస్తే మన తెలంగాణ వాసులు ఏకంగా 14.67గ్రాముల ఉప్పును ఊదేస్తున్నారట. జాతీయ సగటు కూడా 8.33 గ్రాములే. దానికంటే కూడా మనం ఎక్కువ ఉప్పును వాడుతున్నామన్నమాట. రాష్ట్ర తలసరి ఉప్పు వినియోగం నెలకు 440 గ్రాములుగా ఉందని అధ్యయనంలో వెల్లడైంది. సర్వే ప్రకారం.. ఉప్పు తర్వాత అత్యధికంగా పొద్దుతిరుగుడు, శనగనూనెను కూడా మనం విపరీతంగా వినియోగిస్తున్నాం. రాష్ట్రంలో ప్రతి కుటుంబం నెలకు ఆహార పదార్థాలపై రూ.2156 ఖర్చు చేస్తోంది. రాష్ట్రంలో 95శాతం కుటుంబాలు మాంసాహార ప్రియులే. ఇందులో 40 శాతం మంది కోడిమాంసాన్ని ఇష్టపడుతున్నారు. తృణధాన్యాల కంటే బియ్యాన్ని ఎక్కువగా వాడుతున్నాం. పప్పుధాన్యాల వాడకంలో పట్టణ ప్రజల కంటే గ్రామీణులే ముందున్నారు. మసాలాల వినియోగంలో మాత్రం పల్లెవాసుల కంటే పట్టణ ప్రజలే ముందున్నారు. పాలు, పాలపదార్థాల వాడకంలోనూ పట్టణవాసులే ముందున్నారు.

అధ్యయనంలో ఆసక్తికర అంశాలు:

- అధ్యయనం చేసింది: 31 జిల్లాల్లో
- గృహ సముదాలు: 6200
- పప్పు ధాన్యాల తలసరి వినియోగం: 12.6 కేజీలు(నెలకు)
- పాల తలసరి వినియోగం: 4.6 లీటర్లు(నెలకు)
- పంచదార, బెల్లం వాడకపు తలసరి వినియోగం: 890 గ్రాములు
- ఎక్కువగా చికెన్ తింటున్న జిల్లా: జయశంకర్ భూపాలపల్లి
- రాష్ట్రంలో ఎక్కువగా తినే పండు: అరటి
- ఎక్కువగా తినే ఆహారం: వరి అన్నం
- పప్పు ధాన్యాల్లో ఎక్కువగా వాడేది: కంది పప్పు

హోలీ సెలవు 1న.. 2న ఐచ్ఛిక సెలవు

హైదరాబాద్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): హోలీ పండుగ సందర్భంగా మార్చి 2(శుక్రవారం)న ఐచ్ఛిక సెలవుగా ప్రభుత్వ సీఎస్ ఎస్‌కే జోషి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సెలవుల కేలెండర్‌లో మార్చి 1న సాధారణ సెలవుగా గుర్తించారు. కేంద్రం మార్చి 2న హోలీ సెలవు ఇచ్చింది. దీంతో దేవాదాయశాఖను సంప్రదించిన రాష్ట్రప్రభుత్వం హోలీ సెలవును యథాతథంగా ఉంచుతూనే మార్చి 2ను ఐచ్ఛిక సెలవుగా గుర్తించింది.

ఒకేరోజు రెండు ప్రతిభా పరీక్షలు

- ఆందోళనలో గిరిజన విద్యార్థులు

నల్లగొండ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అధికారులు ఒకే రోజు రెండు ప్రతి భా పరీక్షలు ఖరారు చేయడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఎస్టీ గురుకుల కళాశాలల్లో గిరిజనులకే ప్రవేశం ఉండగా, ఎస్సీ గురుకులాల్లో ఎస్సీలతో పాటు ఎస్టీ, బీసీలకు ప్రవేశం ఉంది. వీటిలో ప్రవేశాలకు రెండు దశల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ఇప్పటికే మొదటి దశ పూర్తి కాగా.. రెండో దశ పరీక్షను ఎస్టీ, ఎస్సీ గురుకుల సంక్షేమ శాఖల అధికారులు 4న ఖరారు చేశారు.

స్వరం మారుతోంది!

మోదీపై కేసీఆర్ నేరుగా విమర్శలు.. రైతుల సమస్యలే అస్త్రంగా దాడులు

- ఇటీవలి కాలంలో ఇదే తొలిసారి
- పోయేదేం లేదనే భావనలో టీఆర్ఎస్
- కేంద్రంలో వచ్చేది హంగేనని ధీమా

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్వరం మారుతోంది. కేంద్ర ప్రభుత్వంపై గతంలో కంటే భిన్నంగా స్పందిస్తున్నారు. రైతుల విషయంలో ప్రధాని నరేంద్రమోదీపై నేరుగా విమర్శలు సంధిస్తున్నారు. రైతు సమన్వయ సమితి దక్షిణ, ఉత్తర తెలంగాణ ప్రాంతీయ సదస్సుల్లో ఆయన చేసిన ప్రసంగాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. హఠాత్తుగా ఈ మార్పునకు కారణమేంటనే చర్చ అన్ని వర్గాల్లో జరుగుతోంది. కేంద్రంలోని బీజేపీ సర్కారుతో, ప్రధాని మోదీతో చెడిందా? సీఎం కేసీఆర్ మాటల వెనుక పరమార్థం ఏమిటి? అనే అంశాలు ప్రస్తావనకు వస్తున్నాయి. రాష్ట్ర కాంగ్రెస్ తన కార్యకలాపాలను పెంచిన నేపథ్యంలో ఆ పార్టీతో పాటు, బీజేపీ పైనా ముఖ్యమంత్రి విమర్శలు చేస్తుండటం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి, టీఆర్ఎస్ తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కొత్తలో కేసీఆర్ కేంద్రంతో అంటీ ముట్టనట్లు వ్యవహరించారని, ప్రధాని మోదీతో ఆయన సంబంధాలు కూడా అంతంత మాత్రమేననే ప్రచారం జరిగింది. కొంతకాలానికి కేంద్రంతో, ముఖ్యంగా ప్రధాని మోదీతో సఖ్యత కుదిరిందనే వార్తలు వచ్చాయి. అదే క్రమంలో టీఆర్ఎస్ పార్లమెంటులో, బయట కేంద్రంలోని బీజేపీ సర్కారుకు అంశాల వారీ మద్దతు ఇస్తూ వస్తోంది. ప్రధాని మోదీ తీసుకుంటున్న నిర్ణయాలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. బీజేపీ ప్రభుత్వానికి పరోక్ష మిత్రపక్షమనే ముద్రను కూడా వేయించుకుంది. ఈ స్థాయిలో మద్దతు తెలుపుతున్నా.. కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో సహాయ సహకారాలు లభించటం లేదని, రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారానికి తగిన చొరవ చూపటం లేదనే అసంతృప్తి 'గులాబీ' పార్టీ పెద్దల్లో ఎప్పటినుంచో ఉంది. కేంద్రం ప్రవేశపెట్టిన చివరి పూర్తి స్థాయి బడ్జెట్ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలను ఆకట్టుకోలేదు. టీఆర్ఎస్ నేతలు బాహాటంగానే తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ అప్పుడే తన సన్నిహితుల వద్ద ఢిల్లీ సర్కారుపై ఒకింత ఆగ్రహం, అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలకు తాయిలాలు ప్రకటించి, మిగిలిన రాష్ట్రాలను విస్మరించటం పైనా అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. రైతులకు మేలుచేసే నిర్ణయాలు లేకపోవటం కూడా కేసీఆర్‌కు నచ్చలేదని తెలిసింది. ఇటీవల ఢిల్లీ పర్యటనలో ఆయన బీజేపీ, కాంగ్రెస్‌లకు సమాన దూరం పాటిస్తున్న వివిధ రాష్ట్రాల నేతలతో ఇదే విషయమై ఫోన్‌లో మంతనాలు సాగించినట్లు ప్రచారం జరిగింది. హైదరాబాద్‌లో మొదటి ప్రాంతీయ రైతు సదస్సులో ఈ విషయాన్ని స్వయంగా సీఎం కేసీఆరే వెల్లడించారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా కేంద్రం, ప్రధాని మోదీపై సీఎం కేసీఆర్ రుసరుసలాడటానికి బడ్జెట్‌లో తెలంగాణకు సరైన కేటాయింపులు లేకపోవటం ఒక్కటే కారణం కాదని తెలుస్తోంది. ముస్లిం, ఎస్టీల రిజర్వేషన్ల పెంపు బిల్లుకు కేంద్రం కొర్రీలు పెట్టి వెనక్కి పంపటం కూడా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు ఆగ్రహం తెప్పించిందని సమాచారం. దీంతో కేంద్రంతో తమకు వచ్చేది, పోయేది ఏమీ లేదనే భావనకు వచ్చినట్లు సమాచారం. మరోవైపు దేశవ్యాప్తంగా మెజార్టీ పార్టీలు.. ముందస్తు ఎన్నికలు వస్తాయనే ఉద్దేశంతో ప్రచారానికి కూడా శ్రీకారానికి చుట్టిన దరిమిలా ఇంకా కేంద్రంలోని బీజేపీ సర్కారు విషయంలో తమ వైఖరిపై స్పష్టమైన సంకేతాలు ఇవ్వకపోతే రాజకీయంగా నష్టపోతామనే అభిప్రాయానికి కేసీఆర్ వచ్చినట్లు తెలిసింది. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పూర్తి స్థాయి మెజార్టీని ఇటు బీజేపీ, అటు కాంగ్రెస్ రెండూ సాధించలేవని టీఆర్ఎస్ అధిష్ఠానం భావిస్తోంది. వచ్చేసారి కేంద్రంలో సంకీర్ణ సర్కారు మాత్రమే కొలువు దీరుతుందని అంచనా వేస్తోంది. అప్పుడు టీఆర్ఎస్, ఇతర ప్రాంతీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో కీలక భూమిక పోషిస్తాయని విశ్వసిస్తోంది. ఎన్నికలతో సంబంధం లేకుండా రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధుల సర్దుబాటు తప్పక సాధ్యపడుతుందని అభిప్రాయపడుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ తమ ప్రధాన రాజకీయ శత్రువు కావటంతో బీజేపీతోపాటు, ఎప్పటిలాగే ఆ పార్టీని లక్ష్యంగా చేసుకొని అధినేత విమర్శలు ఉంటున్నాయని టీఆర్ఎస్ ముఖ్యులు అంటున్నారు. ఆయన మాటలకు తగినట్లుగానే.. మార్చి 5 నుంచి మొదలయ్యే రెండో విడత పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో తమ ఎంపీలు కేంద్రంపై కత్తి దూస్తారని వారు చెబుతున్నారు.

సింగరేణిని 'ప్రైవేటు' చేయం

- అవసరమైతే కేంద్ర వాటాధనం చెల్లిస్తాం
- కార్మికులు బెంగటిల్లొద్దు.. ఆగం కావద్దు
- లంచం అడిగితే చెప్పుతో కొట్టండి: కేసీఆర్
- సింగరేణి కార్మికులతో ఆత్మీయ సమ్మేళనం

మంచిర్యాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటుపరం చేసే ప్రసక్తే లేదని, అవసరమైతే కేంద్రానికి వాటాధనం చెల్లించి, పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోకి తెచ్చుకుంటామని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. ఇది తెలంగాణ ప్రభుత్వ విధానమన్నారు. తాను ఉన్నానని, బొగ్గు గని కార్మికులు, వారి కుటుంబాలు బెంగటిల్లవద్దని, ఆగం కావద్దని తనదైన శైలిలో భరోసా ఇచ్చారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో మంగళవారం సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో 35 వేల మందికి పైగా కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులకు ఆయన వరాలు ప్రకటించారు. "సింగరేణి, ఆర్టీసీ, జెన్‌కో, ట్రాన్స్‌కోలు తెలంగాణకు జంబో సంస్థలు. వాటిని వదులుకునే ప్రసక్తే లేదు. వాటిని మరింత బలోపేతం చేస్తాం" అని తెలిపారు. సింగరేణి కార్మికులు ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న కారుణ్య నియామకాలను ఈ ఏడాది మార్చి మొదటివారం నుంచి అమల్లోకి తెస్తామన్నారు. "తెలంగాణకు అన్నం పెట్టిన తల్లి సింగరేణి. దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కార్మికులకు రూ.400 కోట్లతో 10 వేల నూతన గృహాలను విశాలంగా నిర్మించి ఇస్తాం. రేపటి నుంచి వారికి కరెంట్, మంచినీటి బిల్లులు ఉండబోవు. క్వార్టర్లకు ఏసీల బిగింపు ప్రక్రియ ప్రారంభమైంది. 60 వేల మందికిపైగా రిటైర్డ్ కార్మికులున్నారు. వారి పింఛను పెంపుపై నిర్ణయం తీసుకుంటాం" అని వివరించారు. శ్రీరాంపూర్‌లోని 156 ఎకరాల సింగరేణి స్థలంలో ఇండ్లు నిర్మించుకొని ఉంటున్న కార్మిక కుటుంబాలందరికీ పట్టాలు జారీ చేస్తామని చెప్పారు. "ఆరోగ్య శాఖలో అవినీతి, అక్రమాల సమాచారం ఉంది. నాయకులు, అధికారుల మాదిరి లంచాన్ని భోజనంగా తింటున్నారు. లంచం అడిగినోన్ని చెప్పుతో కొట్టి పొట్టు పొట్టు తన్నాలి. అడుగు తీస్తే, అడుగు వేస్తే అవినీతి దండంలా మారింది. దీనిని అరికట్టాలి" అని కేసీఆర్ విరుచుకుపడ్డారు. యూనియన్ చందా ఇకపై నెలకు రూపాయి మాత్రమే ఉంటుందని, దీనిపై రేపే ఆదేశాలు ఇవ్వాలని సీఎండీ శ్రీధర్‌ను సీఎం ఆదేశించారు.

సీఎండీ శ్రీధర్‌కు ప్రశంసలు

సింగరేణి సీఎండీ శ్రీధర్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశంసించారు. శ్రీధర్ నాయకత్వంలో సింగరేణి ఎంతో అభివృద్ధి చెందుతోందని, ఆయన పని విధానం బాగుందని, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంలోనూ ఆయన బాగా పని చేస్తున్నారని కొనియాడారు. ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగిందన్నారు. కాగా, సింగరేణికి గత ఏడాది రూ.410 కోట్ల లాభాలు వచ్చాయని, ఈ ఏడాది (2017-18) రూ.1100 కోట్ల లాభాలు వచ్చే అవకాశం ఉందని సీఎండీ శ్రీధర్ చెప్పారు. బొగ్గు ఉత్పత్తి 52 మిలియన్ టన్నుల నుంచి 65 మిలియన్ టన్నులకు పెరిగిందన్నారు. మంచిర్యాల వద్ద సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ దేశంలోనే ఉత్పత్తిలో నాలుగో స్థానం సాధించిందన్నారు.

నిర్మల్ పర్యటన వాయిదా?

నిర్మల్ : నిర్మల్ జిల్లాలో మార్చి 5న కేసీఆర్ పర్యటన వాయిదా పడినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అధికారిక కార్యక్రమాల దృష్ట్యా పర్యటన వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఏప్రిల్‌లో పర్యటన ఖరారయ్యే అవకాశం ఉందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు.





ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, కోర్టా-చనకా బ్యారేజీ పనులను మంత్రులతో కలిసి పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్

కేంద్రానికి దమ్ముందా?

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. జాతీయ పార్టీలపై బరాబర్ విమర్శలు చేస్తానని, వాటిపై చేసిన విమర్శలకు కట్టుబడి ఉన్నానని తేల్చి చెప్పారు. దేశవ్యాప్తంగా భగవంతుడు 70 వేల టీఎంసీల నీటిని వరంగా ఇస్తే.. చేతకాని జాతీయ పార్టీలు, నేతలు కేవలం 24 వేల టీఎంసీలను వాడుకునేలా ప్రాజెక్టులు నిర్మించడం సిగ్గుచేటన్నారు. దమ్ముంటే ఆ రెండు జాతీయ పార్టీలూ తన వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లాలోని కోర్టా-చనకా బ్యారేజీ పనులను మంగళవారం మంత్రి హరీశ్‌రావుతో కలిసి ఆయన పరిశీలించారు. పనుల పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరయ్యారు. అనంతరం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ముర్మూర్ వద్ద చేపడుతున్న రామగుండం ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. రెండు సందర్భాల్లోనూ ఆయన మాట్లాడుతూ తెలంగాణ ధనిక రాష్ట్రమని, డబ్బులకు ఎలాంటి కొదవ లేదని చెప్పారు. రైతులు బలపడితేనే గ్రామీణ అభివృద్ధి సాధ్యమని, అందుకే ఎకరాకు రూ.4వేలు ఇస్తున్నామని చెప్పారు. గొర్రెల పంపిణీతో యాదవులను ధనవంతులను చేయడమేలక్ష్యమన్నారు.

ఆదిలాబాద్.. తెలంగాణ కశ్మీరు

"ఆదిలాబాద్ జిల్లాలో జరగాల్సిన అభివృద్ధి ఇంకా జరగలేదు. రాత్రీపగలు కష్టపడి మరిన్ని ప్రాజెక్టులను నిర్మిస్తున్నాం. గత పాలకుల తెలివితక్కువ విధానాలతోనే జిల్లాకు అన్యాయం జరిగింది. ఆదిలాబాద్‌లో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టు డ్రామానే ప్రధానంగా కనిపించేది. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నేను స్వయంగా మహారాష్ట్ర సీఎంను కలిసి 'మీరు బతకండి, మమ్మల్ని బతికించండి. ఇద్దరం కలిసి అభివృద్ధి చెందుదాం' అని నచ్చచెప్పా. బ్యారేజీ నిర్మాణానికి అడ్డంకులు లేకుండా చేశా" అని తెలిపారు. ఆదిలాబాద్‌ను తెలంగాణ కశ్మీరుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. మరో 6 నెలల్లో లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టును పూర్తి చేసి ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో 70 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. కోర్టా- చనకా బ్యారేజీ పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టులో భాగంగా గోమూత్రి, గుబిడి, పిప్పల్‌కోటి రిజర్వాయర్ పనులను చేపట్టాలని చెబుతూనే, పిప్పల్‌కోటి రిజర్వాయర్‌కు రూ.315 కోట్లు, గోమూత్రి రిజర్వాయర్‌కు రూ.210 కోట్ల నిధులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. బోథ్‌లోని కుప్టి ప్రాజెక్టును రూ.870 కోట్లతో చేపడతామన్నారు. జిల్లా కేంద్రంలో మినీ ఏరోడ్రమ్ పనులను చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించారు.



పెద్దపల్లి జిల్లాలో రామగుండం ఎత్తిపోతల పథకం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

తలాపున పారుతుంది గోదారి.. మా పొలంల కూడా పారుతుంది గోదారి

- సదాశివుడి పాటను ఇకనుంచి ఇలా మార్చుకోవాలన్న సీఎం

"ఈ ప్రాంతానికి చెందిన టీచర్ సదాశివుడు రాసిన 'తలాపున పారుతుంది గోదారి.. మన చేను చెలక ఎడారి' పాటను ఆంధ్రప్రదేశ్‌లో పాడుకున్నం. అది ఆనాటి దుఃఖం. ఇప్పుడు 'తలాపున పారుతుంది గోదారి.. మా పొలంల కూడా పారుతుంది గోదారి' అని పాడుకోవాలి. ప్రాజెక్టుల నిర్మాణంతో ధర్మపురి సదర్‌మాట్ నుంచి ఖమ్మం జిల్లా కొత్తూరు వరకు గోదావరిలో 65 టీఎంసీల నీటి నిల్వతో జలకళ సంతరించుకోనుంది" అని రామగుండంలో సీఎం కేసీఆర్ చెప్పారు. పెద్దపల్లి రాష్ట్రంలోనే ధనవంతమైన జిల్లాగా ఎదుగుతుందన్నారు. కాళేశ్వరం దేవుడి దయ వల్ల పుష్కలంగా నీళ్లు వస్తాయని, ఎల్లంపల్లిలో 365 రోజులూ నీళ్లు ఉంటాయన్నారు. ఎత్తిపోతలను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రారంభానికి మళ్లీ తానే వస్తానని చెప్పారు

ఎమ్మెల్యేలంటే ఇట్లుండాలి!

స్థానిక ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ రామగుండం ఎత్తిపోతల పథకం ద్వారా ఈ ప్రాంతానికి నీళ్లు ఇవ్వాలని అనేకసార్లు తనకు విన్నవించారని సీఎం కేసీఆర్ చెప్పారు. "ఆయనకు ఆర్టీసీ చైర్మన్ పదవి ఇచ్చినా సంతృప్తి చెందలేదు. ఎత్తిపోతలకు నిధులు మంజూరు చేస్తేనే తృప్తి ఉంటుందని చెప్పాడు. 'పదే పదే ఎందుకు చెబుతావయ్యా! నీకేం పని లేదా?' అని కసురుకుని తిట్టినా ఆయన ఊరుకోలేదు. అయినా, మళ్లీ వచ్చాడు. ఒకసారి రిపోర్టు తెప్పించుకోండని చెప్పాడు. ఇంటెలిజెన్స్ వాళ్లతో రిపోర్టు తెప్పించుకుని ఆ పని తప్పకుండా చేయాలని అనుకున్నాను. ఆయన పట్టుదల నాకు బాగా నచ్చింది. కొట్లాడి సాధించుకోవాలే! కొట్లాడనిదే తెలంగాణ వచ్చిందా? ఎమ్మెల్యేలంటే ఇట్లా ఉండాలి. నాకు కూడా తృప్తిగా ఉంటుంది" అని కేసీఆర్ స్పష్టం చేశారు. సీఎం ఏమనుకుంటడో, కసురుకుంటాడేమోనని ఊరుకోవద్దని, అడిగితేనే లాభం జరుగుతుందని సూచించారు. నాలుగైదు నెలల్లో ఎత్తిపోతలను పూర్తి చేసి వర్షాకాలం పంటకు నీళ్లు ఇవ్వాలని, దాంతో ఈ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని చెప్పారు.

కేసీఆర్‌కు తప్పిన ముప్పు

- హెలికాప్టర్లోని వైర్‌లెస్ సెట్ నుంచి పొగలు
- దూరంగా తీసుకెళ్లి పారేసిన అధికారులు
- బ్యాటరీ ఓవర్ హీట్ కావడమే కారణం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 27: ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పెను ప్రమాదం తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ గాల్లోకి లేవకముందే ముప్పును గుర్తించారు. కరీంనగర్ నుంచి ఆయన పెద్దపల్లి పర్యటనకు బయలుదేరే సమయంలో హెలీకాప్టర్‌లోని ఓ బ్యాగ్ నుంచి వెలువడిన పొగలు కలకలం సృష్టించాయి. కరీంనగర్ శివారు తీగలగుట్టపల్లిలోని కేసీఆర్ భవన్ నుంచి మంగళవారం ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి బయలుదేరారు. హెలీకాప్టర్‌లోకి ఆయన ఎక్కిన తర్వాత ఓ బ్యాగ్‌లో నుంచి అకస్మాత్తుగా పొగలు రావడాన్ని సీఎంవో అధికారి గుర్తించారు. వెంటనే ఆయన దానిని హెలికాప్టర్లో నుంచి తీసుకొని పరుగెత్తారు. సెక్యూరిటీ సిబ్బంది దానిని 100 మీటర్ల దూరంలో పడేశారు. దాంతో, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఊపిరి పీల్చుకున్నారు. అది సీఎం క్యానాయ్‌లోని వైర్‌లెస్ సెట్ పరికరాలతో కూడిన బ్యాగ్‌గా తెలుస్తోంది. సీఎం హెలీకాప్టర్‌లో వెళుతున్నప్పుడు అధికారులతో అత్యవసరంగా మాట్లాడేందుకు దీనిని ఉపయోగిస్తారు. వైర్‌లెస్ సెట్‌లో 22 వాట్స్ బ్యాటరీ ఉంటుందని, అది ఓవర్ హీట్ అయిందని, దాంతో పొగలు వెలువడ్డాయని స్థానిక పోలీసు అధికారులు తెలిపారు. గత ఏడాది కాళేశ్వరం పర్యటనకు వెళ్లినప్పుడు కూడా ఇక్కడే సీఎం హెలికాప్టర్ సిగ్నల్ సమస్య కారణంగా మూడుసార్లు కిందకు పైకి లేచింది.



కరీంనగర్ జిల్లా తీగలగుట్టపల్లిలోని కేసీఆర్ భవన్ వద్ద పొగలు వస్తున్న కిట్ బ్యాగుతో సీఎంవో అధికారుల పరుగులు, (ఇన్‌సెట్లో) కిట్ బ్యాగులో నుంచి పొగలు వస్తున్న దృశ్యం

విచారణకు డీజీపీ ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో పొగలు వచ్చిన ఘటనపై విచారణకు ఆదేశించినట్లు డీజీపీ మహేందర్ రెడ్డి తెలిపారు. సెక్యూరిటీ విభాగానికి చెందిన వైర్‌లెస్ వాకీటాకీ కిట్‌లో పొగ వచ్చిందని, సిబ్బంది వెంటనే స్పందించి దూరంగా పడేశారని చెప్పారు. ప్రమాదంపై విచారణకు ఆదేశించామన్నారు.

సీఎం సభలో బాంబు కలకలం

ఆదిలాబాద్: నాలుగేళ్ల తర్వాత జిల్లా కేంద్రానికి మొదటిసారిగా వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ సభలో బాంబు కలకలం రేపింది. సీఎం సభాస్థలికి చేరుకోవడానికి గంటముందు స్టేజీ ముందున్న పూలకుండీలో బాంబు ఉందన్న వదంతులు వినిపించాయి. వెంటనే బాంబు స్క్వాడ్ బృందం పోలీసు జాగిలాలతో తనిఖీ చేశారు. పూలకుండీలో బాంబు లేదని, ఇదంతా దుష్ప్రచారమని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. కేసీఆర్ భవన్ వద్ద కానిస్టేబుళ్ల పనితీరుపై ముఖ్యమంత్రి భద్రత విభాగం ఐజీ ఎంకే సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది సెల్‌ఫోన్లో బిజీగా ఉన్నారని, తమతో అమర్యాదకరంగా ప్రవర్తించారని ప్రజా ప్రతినిధులు ఆయనకు ఫిర్యాదు చేశారు. కానిస్టేబుళ్లు సెల్‌ఫోన్లలో బిజీగా ఉండడాన్ని ఆయన కూడా గుర్తించి ఇద్దరికి మెమోలు జారీ చేయాలని ఏసీపీకి ఆదేశాలు జారీ చేశారు.



టీఆర్ఎస్.. అసలైన ద్రోహి

- కేంద్రంతో కుమ్మక్కయింది : జీవన్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్/హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణకు ద్రోహం చేస్తున్నది టీఆర్ఎస్ పార్టీనేనని సీఎల్పీ ఉపనేత టి.జీవన్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీలోని మీడియా హాల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాలుగేళ్లుగా టీఆర్ఎస్ ఉద్యమ స్ఫూర్తి ఏమైందని, విభజన చట్టం హామీలు అమలుకాకపోయినా ఎందుకు మౌనంగా ఉందని నిలదీశారు. రాష్ట్రంలో బీజేపీ, టీఆర్ఎస్ మధ్య వైరం ఉన్నా కేంద్రంతో మాత్రం మిత్రపక్షంగానే వ్యవహరిస్తోందన్నారు. సీబీఐ విచారణ భయంతోనే కేంద్రంతో కేసీఆర్ కలిసిపోయారని విమర్శించారు. నాలుగేళ్లుగా ఎన్డీఏతో అంటకాగి.. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో విభేదిస్తున్నట్లు నాటకాలాడుతున్నారని ధ్వజమెత్తారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా కేంద్రం మీద నెపం నెడుతున్నారని ఆరోపించారు. ఒక్క హామీని కూడా నెరవేర్చని టీఆర్ఎస్ వచ్చే ఎన్నికల గురించి గాలిలో మేడలు కడుతోందని ఎద్దేవా చేశారు. ప్రజలు బుద్ధి చెప్పి ఆ పార్టీని ఇంటికి పంపించడం ఖాయమని జోస్యం చెప్పారు. అంతకుముందు ఆయన కరీంనగర్‌లో మాట్లాడుతూ మెట్‌పల్లి షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వపరం చేస్తానని హామీ ఇచ్చి నాలుగేళ్లు గడిచిందని, మూతపడి రెండేళ్లవుతున్నా పట్టించుకోవటం లేదని విమర్శించారు. పసుపు పంటకు మద్దతు ధరను కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో 20 శాతం మంది కౌలు రైతులున్నారని, వారికి పెట్టుబడి ఎందుకివ్వరని ప్రశ్నించారు.



గవర్నర్ నరసింహన్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు రాంచంద్రారెడ్డి, ఇంద్రసేనారెడ్డి తదితరులు

దమ్ముంటే చర్చకు రండి

- ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడండి
- సీఎం కేసీఆర్ వ్యాఖ్యలపై బీజేపీ ఫైర్
- భేషరతుగా క్షమాపణ చెప్పాలి : లక్ష్మణ్
- నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగానికి కేంద్రం ఇచ్చిన నిధులపై దమ్ముంటే చర్చకు రావాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బీజేపీ సవాల్ విసిరింది. ప్రగతి భవనా? అసెంబ్లీనా? ఎల్‌బీ స్టేడియమా? స్పీకర్ వద్దనా? ఎక్కడైనా సరే.. తాము చర్చకు సిద్ధమని ప్రకటించింది. చర్చకు అల్లుడు వస్తడా? కుమారుడు వస్తడా.. తేల్చి చెప్పాలని డిమాండ్ చేసింది. ప్రధాని స్థాయి వ్యక్తి గురించి సోయి ఉండే మాట్లాడారా? అని ప్రశ్నించింది. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని సూచించింది. పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, జాతీయ నాయకుడు ఎన్.ఇంద్రసేనారెడ్డి, పార్టీ నాయకులు ఎన్‌వీ సుభాష్, ప్రకాశ్‌రెడ్డి, సుధాకర్‌శర్మ, రాకేశ్‌రెడ్డి తదితరులు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాల్లో తమ పార్టీ అధికారంలో ఉన్నా.. లేకున్నా.. మోదీ ఉదార స్వభావంతో సాయం చేస్తున్నారని, ఆయనపై కేసీఆర్ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఈ విషయమై తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి సంబంధించి రాష్ట్ర వాటా కింద ఇప్పటికే రూ.4లక్షల కోట్లను కేంద్రం ఇచ్చిందని ఎమ్మెల్యే రాంచంద్రారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో మంచి అధికారులున్నారని, కావాలంటే వారితో లెక్కలు తెప్పించుకోవాలని సీఎం కేసీఆర్‌కు సూచించారు. సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథకు కేంద్రం నిధులు ఇవ్వలేదా? అని నిలదీశారు. తెలంగాణ మంత్రులకు కేంద్ర మంత్రులు అపాయింట్‌మెంట్ ఇస్తున్నారు గానీ, సీఎం కేసీఆర్ ఏ ఒక్కరికైనా అపాయింట్‌మెంట్ ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. ప్రధానిని అవమానిస్తూ మాట్లాడితే 125కోట్ల మందిని అవమానించినట్లేనని కేసీఆర్ గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను కేంద్రంపైకి నెట్టేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని ఇంద్రసేనారెడ్డి ఆరోపించారు. దేశ ప్రధానిపై సీఎం కేసీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మండిపడ్డారు. కేసీఆర్ ఉపయోగించిన భాషపై వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవడం చేతగాని కేసీఆర్ కేంద్రాన్ని విమర్శిస్తున్నారని దుయ్యబట్టారు.

గవర్నర్ నరసింహన్‌కు ఫిర్యాదు

ప్రధాని మోదీని ఉద్దేశించి సీఎం కేసీఆర్ వాడిన భాష, యాసపై గవర్నర్ నరసింహన్‌కు బీజేపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, ఇంద్రసేనారెడ్డితో పాటు పలువురు నాయకులు మంగళవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను కలిశారు. అనంతరం ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ గౌరవప్రదమైన పదవిలో ఉంటూ ప్రధానిని వాడు..వీడు అని వ్యాఖ్యానించిన సీఎం కేసీఆర్ నుంచి వివరణ కోరాలని విజ్ఞప్తి చేశామన్నారు. కాగా, సీఎం అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు నిర్వహించాలని శ్రేణులకు బీజేపీ పిలుపునిచ్చింది. మునిసిపల్, డివిజన్ కేంద్రాల్లోనూ నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి చెప్పారు.

అవి రౌడీ సమన్వయ సమితులు : డీకే అరుణ



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : టీఆర్ఎస్ ఏర్పాటు చేస్తోంది రైతు సమన్వయ సమితులు కాదని, టీఆర్ఎస్ గుండాలతో కూడుకున్న రౌడీ సమన్వయ సమితులని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే డీకే అరుణ అన్నారు. అసెంబ్లీలోని మీడియాహాల్‌లో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతోనే వీటిని ఏర్పాటు చేస్తున్నారని దుయ్యబట్టారు. నాలుగేళ్లుగా ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా, ఇప్పుడు కొత్త నాటకానికి సీఎం కేసీఆర్ తెర తీశారని విమర్శించారు. కేసీఆర్‌పై జనం తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. తాను చేయతలపెట్టిన పాదయాత్రకు సంబంధించిన రూట్ మ్యాప్ సిద్ధమవుతోందని తెలిపారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలే యాత్ర ఎజెండా అని వివరించారు.

మేమూ పెట్టుబడి సాయం వదులుకుంటాం

- సీఎం స్ఫూర్తితో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే ప్రకటన
- రైతుసమితికి కలిసిరానున్న 'గివ్ ఇట్ అప్'

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఎకరాకు రూ.4 వేలు చొప్పున ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయాన్ని స్వచ్ఛందంగా వదులుకున్న (గివ్ ఇట్ అప్)సీఎం కేసీఆర్ స్ఫూర్తితో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. ఇటీవల జరిగిన రైతు సమన్వయ సమితి సదస్సుల్లో ఈ మేరకు ప్రజాప్రతినిధులు పెట్టుబడి సాయాన్ని వదులుకున్నట్లు ప్రకటించారు. వారిలో స్పీకర్ మధుసూదనాచారి, మంత్రులు పోచారం, ఈటల, హరీశ్, ఇంద్రకరణ్‌రెడ్డి, తుమ్మల, ఎంపీలు కెప్టెన్ లక్ష్మీకాంతరావు, కవిత, బాల్క సుమన్, ఎమ్మెల్సీలు భానుప్రసాద్‌రావు, పల్లె రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, రాంలింగారెడ్డి, కోవా లక్ష్మి, రేణుక, జీవన్‌రెడ్డి, గోవర్ధన్, ప్రశాంత్, ధర్మారెడ్డి, సతీష్‌కుమార్‌తో పాటు మరికొంత మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డితో పాటు పలువురు సమన్వయ సమితి ప్రతినిధులు ఉన్నారు.

భూములున్న ఉన్నతాధికారులూ..

ఉన్నతాధికారులు, రిటైర్డ్ అయిన వారు, గెజిటెడ్, ఆ పైస్థాయి అధికారులు కూడా పెట్టుబడి సాయం వదులుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. అలాగే వ్యాపార, పారిశ్రామిక, ఉత్పత్తి రంగాల్లోనూ ఉన్న అనేక మంది స్వచ్ఛందంగా పెట్టుబడి సాయాన్ని వదులుకోవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. అయితే రాజకీయ నేతలు, ఉన్నతాధికారులు, వ్యాపారులు తమ పేరున ఉన్న భూమి వరకే స్వచ్ఛందంగా పెట్టుబడిసాయం వదులుకుంటారా? తమ కుటుంబ సభ్యుల పేరున ఉన్న భూమికి సంబంధించినవీ వదులుకుంటారా? అన్న విషయంపై చర్చ జరుగుతోంది. గివ్ ఇట్ అప్.. ఒక ఉద్యమంలా మారితే రైతు సమితికి కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుందని వ్యవసాయశాఖ భావిస్తోంది.

జ్ఞాపకం





శ్రీదేవీ! నీవల్లే నే జీవిస్తున్నా!!

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎంతోమంది అభిమానులు శ్రీదేవి అకాల మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. అంతర్జాలం వేదికగా తమ జ్ఞాపకాలను, అభిప్రాయాలను పంచుకుంటున్నారు. వెండితెరపై అతిలోకసుందరిగా వెలుగొందిన శ్రీదేవి టీవీ షోలకు అతిథిగా వెళ్లిన సంఘటనలు వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. అయితే శ్రీదేవి మరణవార్త చూసి తట్టుకోలేక, ఒక టీవీ షోలో ఆమెతో తనకున్న జ్ఞాపకాన్ని 'శ్రీదేవి, నీవల్లే నేను జీవిస్తున్నా..' అంటూ 'పోస్ట్' చేశారు ప్రముఖ ఎల్‌జిబిటీక్యూ కార్యకర్త హరీశ్ అయ్యర్. ఇంతకీ అసలు విషయం ఏమిటంటే...

ఆమిర్‌ఖాన్ నిర్వహించిన 'సత్యమేవ జయతే' టీవీ షో గురించి అందరికీ తెలిసిందే. 2012లో ప్రసారమైన ఈ షోలోని ఒక ఎపిసోడ్‌కు శ్రీదేవి అతిథిగా హాజరయ్యారు. 'పిల్లలపై లైంగిక వేధింపులు' అనే అంశం ప్రధానంగా సాగిన ఎపిసోడ్‌లో పాల్గొన్న హరీశ్ అక్కడ ప్రత్యక్షమైన శ్రీదేవిని చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. స్టేజీ మీద ఆమె చేతిని ముట్టుకున్నాకగానీ అది కలో? నిజమో? అర్థం కాలేదతనికి. ఆ వేదికపై అప్పటికే చిన్నతనంలో తనపై జరిగిన లైంగిక వేధింపులను ధైర్యంగా వెల్లడించారు హరీశ్. వేదికపైకి వెళ్లిన శ్రీదేవి "హరీశ్... నీకు 18 ఏళ్లు వచ్చేదాకా నువ్వు పడ్డ మానసిక వేదనను అర్థం చేసుకున్నా. చిన్నపిల్లలపై అలాంటివి కూడా జరుగుతాయా అనేది ఊహించడానికే భయంగా ఉంది. నీ గతాన్ని అందరికీ చెప్పే ధైర్యం చేశావు. ఇలాంటి నరకాన్ని అనుభవిస్తున్న ఎంతోమంది పిల్లలకు ధైర్యం నూరిపోశావు. అది నిన్ను రియల్ హీరోను చేసింది" అని మెచ్చుకున్నారు.

ఆమె మెచ్చుకోలుకు ఉబ్బితబ్బిబ్బయిన హరీశ్ "చిన్నతనంలో లైంగిక వేధింపుల నుంచి బయటపడటానికి నేనొక ఫాంటసీ ప్రపంచాన్ని సృష్టించుకున్నా. అది శ్రీదేవి ప్రపంచం. అది 'మై తేరీ దుష్మన్' (శ్రీదేవి 'నగీనా'లోని పాట). అందుకే ఆ ఫాంటసీ ప్రపంచాన్ని 'సినిమా' అంటాం. సీ న్యూ మా.. ఆమె విభిన్నమైన తల్లి" అంటూ శ్రీదేవిని చూపించారు.

హక్కుల పోరాటంలో హరీశ్ ధైర్యాన్ని, అంకితభావాన్ని చూసి మెచ్చుకున్న శ్రీదేవి... పిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపులపై కఠినమైన చట్టాలను తేవాలని పార్లమెంట్‌ను అడ్రస్ చేసిన లెటర్ మీద సంతకం కూడా చేశారు. షోలో ఒకానొక సందర్భంలో ఉద్వేగానికి లోనైన హరీశ్‌ను ఆమె ఓదార్చడం కూడా కనిపిస్తుంది.

శ్రీదేవి మరణవార్త విన్న వెంటనే హరీశ్ 'ఆమెకున్న అశేష అభిమానుల్లో నేనూ ఒకణ్ణి. కానీ ఆమెకు నా పేరు తెలుసు' అంటూ ట్వీట్ చేస్తూ పై విషయాలను తెలిపారు.

ఎ లవ్‌స్టోరీ











ఒక రాజు ఒక రాణి

ప్రేమ చదరంగం

చదరంగంలో రాజుని కట్టేస్తేగానీ ఆట ముగియదు. ఎంతోమందిని ఓడించిన చదరంగపు రారాజు పెంటాల హరికృష్ణ కూడా ఇప్పుడు తన బాల్య స్నేహితురాలి చేతిలో బందీ అయ్యాడు. ఆ అమ్మాయే సెర్బియాకు చెందిన నరెజ్డా స్టొయనోవిచ్. ఈ ప్రేమ జంట మార్చి 3న హైదరాబాద్‌లో పెళ్లితో ఒకటవనుంది. ఈ సందర్భంగా తన నెచ్చెలి నరెజ్డా, ఆమెతో తనకున్న అనుబంధం గురించి హరికృష్ణ చెబుతున్న ప్రేమ కబుర్లు.....

ఇంతకు ముందంతా అందరూ 'ఏ టోర్నమెంట్ ఆడబో తున్నావు'? అంటూ నా కెరీర్ గురించి అడిగేవాళ్లు. కానీ ఇప్పుడు ఎవరి నోట విన్నా నా పెళ్లి మాటే! తను విదేశీయురాలు కావటంతో ఆసక్తి మరింత ఎక్కువైందను కుంటా! సరే! ఆ అమ్మాయి గురించి చెప్పాలంటే... తను నా చిన్ననాటి స్నేహితురాలే! వాళ్లది సెర్బియాలోని బెల్‌గ్రేడ్! ఆమెకు ఒక తమ్ముడు, ఒక చెల్లి! ఆమె తల్లి వైద్య రంగంలో ఉంది. తండ్రి వ్యాపారవేత్త. నరెజ్డా ఎకనామిక్స్ గ్రాడ్యుయేషన్ చేసింది. చెస్ ఫెడరేషన్ 'ఫిడే' ఆర్బిటర్. దాన్లో ఇన్‌స్ట్రక్టర్ కూడా! ఫిడే మాస్టర్ టైటిల్ ఫర్ ఉమెన్ కోర్సు కూడా పూర్తి చేసింది. ఆమె సెర్బియాలో జూనియర్ చెస్ ఛాంపియన్. అలా పూర్తిగా చదరంగం చుట్టూ తిరిగే కెరీర్ ఆమెది. ఆ కెరీర్‌లో భాగంగానే 1996 నుంచి 2000 మధ్యలో, టీనేజ్ వయసు నుంచే జూనియర్ టోర్నమెంట్లు, వరల్డ్ టోర్నమెంట్లు, అంతర్జాతీయ ఈవెంట్లలో మేం కలిసి పాల్గొనేవాళ్లం. కలిసి పోటీల్లో పాల్గొనటం, కలిసి ప్రయాణాలు చేయటం....అలా కొన్నేళ్ల స్నేహంతో ఒకరి కొకరం పూర్తిగా అర్థమయ్యాం! ఒకరి అభిప్రాయాల్ని మరొకరు గౌరవించుకుంటాం. ఒకరి గురించి మరొకరం జాగ్రత్త తీసుకుంటాం! అలా కాలక్రమేణా, ఇద్దరి మన సుల్లో ప్రేమ ఉందని గ్రహించాం. అయితే అందరు ప్రేమికుల్లా 'ఐ లవ్ యు' లాంటివి మా మధ్య లేవు. అసలు అలా చెప్పుకోవలసిన అవసరం ఉందని కూడా మాకు అనిపించలేదు. ఒక రంటే ఒకరికి ఇష్టం, ఒకరి మీద మరొకరికి ప్రేమ ఉన్నట్టు ఇద్దరూ గ్రహించినప్పుడు, బయటికి చెప్పుకోవలసిన అవసరం ఏముంది? అయినా ఇద్దర్లో ఎవరో ఒకరు ముందడుగు వేయాలి కాబట్టి, తనను ఇష్ట పడుతున్నట్టు, పెళ్లి చేసుకోవాలని అనుకుంటు న్నట్టు ముందుగా నేనే చెప్పాను. తనూ ఒప్పుకుంది.

పెద్దలు షాకయ్యారు

తనైతే ఒప్పుకుంది. కానీ ఇద్దరి ఇళ్లలో వ్యతిరేకత ఎదురైంది. మా ప్రేమ గురించి చెప్పగానే అమ్మా, నాన్నా షాక్ అయ్యారు. వాళ్లలా షాక్ అవటంలో ఆశ్చర్యపోవలసిందేమీ లేదనిపించింది. తను సెర్బియన్, నేను ఇండియన్! బహుశా మన సంస్కృతికి తను అడ్జస్ట్ అవగలుగుతుందో, లేదోననే భయం తల్లితండ్రులకు కలిగి ఉండొచ్చు. అయితే పరిస్థితి కొంచెం నెమ్మదించిన తర్వాత నరెజ్డా గురించి వివరంగా చెప్పాను. కాస్త శాంతించి, నరెజ్డా పేరెంట్స్‌తో మాట్లాడారు. ఆ తర్వాత పరిస్థితులన్నీ సర్దుకున్నాయి. పెళ్లికి కూడా ఒకే చెప్పేశారు. నరెజ్డా ఇంట్లో కూడా ఇదే పరిస్థితి. కానీ మేమిద్దరం మా ప్రేమ విషయంలో బలంగా ఉండటం చూసి రెండు వైపుల పెద్దలూ భయాలను వదులుకుని, మమ్మల్ని ఆశీర్వదించారు.

అన్ని సంస్కృతులూ తెలుసు!

పెళ్లికైతే గ్రీన్ సిగ్నల్ అందింది. మరి భాష సమస్య కాదా? అనుకుంటున్నారా? ఆ ఇబ్బందైతే ఉండదనే అనుకుంటు న్నాను. ఎందుకంటే తను తెలుగు మాట్లాడలేదుగానీ, కొద్దో గొప్పో అర్థం చేసుకోగలదు. తనలాగే అమ్మానాన్నా కొంత వరకూ ఇంగ్లీషులో మాట్లాడగలరు. కాబట్టి వాళ్ల మధ్య భాష సమస్య ఉంటుందనుకోను. అయినా ఏ భాష ఒంటబట్టాలన్నా, ఆ భాష తెలిసిన నలుగురి మధ్య ఉండాలి. పెళ్లి తర్వాత నా కుటుంబంతో కొద్ది రోజులు కలిసి ఉంటే, నరెజ్డా కచ్చితంగా తెలుగులో మాట్లాడేస్తుంది. అప్పుడిక ఎవరికీ ఏ సమస్యా ఉండదు. నిజానికి తనకు నేను తెలుగు నేర్పొచ్చు. కానీ నాకేమో నేర్చుకోవటమేగానీ నేర్పటం రాదు.

అన్నట్టు నరెజ్డాకెలా తెలుగు రాదో, నాకూ సెర్బియన్ రాదు. ఇక తన గురించి చెప్పాలంటే... నరెజ్డా స్వతహాగా ఎంతో బాధ్యతాపరురాలు. ఓపెన్ మైండెడ్. ముందస్తు ఏర్పాట్లు చేయటంలో, అన్నీ సమకూర్చి పెట్టడంలో తను సిద్ధహస్తురాలు. ఈ విషయంలో నేను జీరో. నరెజ్డా ముక్కుసూటిగా మాట్లాడుతుంది. తను ఏం అనుకుంటుందో స్పష్టంగా చెప్పేస్తుంది. ఈ గుణం వల్ల మనం అడగక ముందే తనేమనుకుంటుందో అర్థమైపోతుంది. ఈ తత్వం వల్ల చాలా సమయం, శక్తి సేవ్ అవుతాయి. తన సంస్కృతికే కట్టుబడి, దాన్నే గౌరవించే తత్వం కాదు ఆమెది. నరెజ్డాకి ఆసియా, ఐరోపా సంస్కృతుల గురించి తెలుసు. అన్నిటినీ సమానంగా గౌరవిస్తుంది. దేని గురించీ ఎటువంటి స్థిరమైన అభిప్రాయమూ ఏర్పరుచుకోదు. దేన్నైనా అనుభవపూర్వకంగా తెలుసుకుని, స్వాగతిస్తుంది.

> నేను ఏదైనా టోర్నమెంట్‌లో మెరుగ్గా ఆడలేకపోతే, ఏదైనా ఆటలో వచ్చిన అవకాశాల్ని కోల్పోయి డీలా పడితే, తను నాకు అసరా అందిస్తుంది. ఆ ఓటమిని మర్చిపొమ్మని నన్ను ప్రోత్సహిస్తుంది. ఎప్పుడు ఓడిపోయినా ఆ ఓటమి నుంచి నేను కోలుకుని తర్వాతి టోర్నమెంట్‌కి సిద్ధపడేలా చూస్తుంది. చదరంగం ఆటపరంగా తను నాకు సహాయం చేయలేకపోయినా, ఆట బయట తన తోడ్పాటు, సహకారం ఇప్పటి నా స్థితికి ఎంతో సహకరించాయి.

పెళ్లి... ఆ తర్వాత...

వ్యక్తిగత జీవితం మాట ఎలా ఉన్నా....ప్రస్తుతానికి నా లక్ష్యం, వరల్డ్ ఛాంపియన్ టైటిల్ గెలవటం! నెరజ్డాకి కూడా చెస్ ఆటలో కొన్ని లక్ష్యాలున్నాయి. కొంతకాలంగా నా షెడ్యూల్‌ను అనుసరిస్తూ, నా కెరీర్‌కు సంబంధించిన పనుల్లో పడిపోయి తను చెస్‌కు దూరంగా ఉంది. కాబట్టి ఆటలో కొంత శిక్షణ అవసరం తనకు! ప్రస్తుతానికైతే మేం ఇద్దరం పెళ్లి ఏర్పాట్లలో బిజీగా ఉన్నాం. నరెజ్డా ప్రస్తుతం హైదరాబాద్‌లోనే ఉంది. కలిసి కొంత షాపింగ్ చేశాం. ఇక పెళ్లి తర్వాత యూరప్‌లో సెటిలవ్వాలనేది ఒక ప్లాన్. నావరకు నా ఆటకు అనుకూలమైన ప్రదేశమది. చాలాకాలంగా చెస్ ఆట గురించి యూరప్‌లోనే తిరుగుతూ ఉన్నాను. వరల్డ్ టాప్ టెన్ చదరంగం క్రీడాకారుల్లో నేనూ ఉండాలనేది నా లక్ష్యం. కాబట్టి ఆ లక్ష్యం నెరవేరాలంటే నేను యూరప్‌లోనే ఉండాలి. చెస్ క్లబ్ నేను ప్రాగ్‌లో ఉండటానికి సహాయం చేస్తోంది. కాబట్టి పెళ్లి తర్వాత మేం ప్రాగ్‌కి వెళ్లిపోతాం. అక్కడ ఎన్నేళ్లు ఉంటామనేది చెప్పలేను.

వాలెంటైన్స్ డే!

ఇటీవల వాలెంటైన్స్ డే రోజు నేను జర్మనీ, చెక్ రిపబ్లిక్‌లో టోర్నమెంట్లతో చాలా బిజీగా ఉన్నాను. అయినా ప్రేమికుల రోజు కాబట్టి ఆరోజు తప్పకుండా కలుసుకోవాలనే పట్టింపులు మాకేం లేవు. మేం ఎప్పుడు కలిస్తే, ఆరోజే వాలంటైన్స్ డే! మేం చెస్ ప్లేయర్స్ కాబట్టి కలిసినప్పుడల్లా చెస్ ఆడతాం అనుకున్నా పొరపాటే! మేం కలిసినప్పుడల్లా... చాక్లెట్లు బహుమతులుగా ఇచ్చిపుచ్చుకుని తింటూ ఉంటాం. ఎందుకంటే, సాధారణంగా మేమెప్పుడూ టోర్నమెంట్లతో బిజీగా ఉంటూ ఉంటాం. కాబట్టి కాస్త ఖాళీ సమయం దొరికి, ఇద్దరం కలవటమే అరుదు. అలా కలిసినప్పుడు మాత్రం ఎంతో సరదాగా గడుపుతాం! నెరజ్డాకు అడవులు, ప్రకృతి అంటే చాలా ఇష్టం. అలాగే ఇతర దేశాల సంస్కృతులు తెలుసుకోవాలన్నా ఆసక్తే! కాబట్టి పెళ్లయ్యాక అడవులుండే ప్రదేశానికి తీసుకెళ్లాలనే ఆలోచన ఉంది. నాకైతే ఆమెకి మన దేశం మొత్తం చూపించాలని ఉంది. మన దేశం చాలా విశాలమైనది. కొంత భాగం చుట్టి రావటానికే కొన్ని నెలల సమయం పడుతుంది. ఒక్కో రాష్ట్రంలో చూడదగిన విశేషాలు ఎన్నో ఉంటాయి. అలా చూపించుకుంటూ తిరగాలంటే ఎంత కాలం పడుతుందో? అన్నట్టు, ఎంతైనా చెస్ ప్రేమికులం కదా! మేమిద్దరం కలిసి అప్పుడప్పుడూ చెస్ ఆడుతూ ఉంటాం. కానీ ప్రత్యర్థులుగా మాత్రం కాదు. కేవలం ఫ్రెండ్స్ గానే! అసలు ప్రత్యర్థులుగా ఆడే అవకాశం కూడా మాకు దక్కలేదు. ఎందుకంటే, యూత్ టోర్నమెంట్లలో అమ్మాయిలు...అమ్మాయిలతో, అబ్బాయిలు....అబ్బాయిలతో తలపడతారు. ఓపెన్ టోర్నమెంట్లలో ఎవరు ఎవరితోనైనా ఆడొచ్చు. కానీ జూనియర్స్ లెవెల్లో అమ్మాయిలు అబ్బాయిలతో ఆడొచ్చు. కానీ అబ్బాయిలు అమ్మాయిలతో ఆడటానికి వీల్లేదు. కాబట్టి వాళ్ల చాంపియన్‌షిప్స్ వాళ్లకుంటే, మావి మాకుంటాయి.

• గోగుమళ్ల కవిత

సమ్మర్ జ్యూస్



జలబ్

కావలసినవి:
బాదం గింజలు - ఐదు (తురిమి, క్రష్ చేసి కూడా వాడొచ్చు), ఎండుద్రాక్షలు - పది, రోజ్ వాటర్ - రెండు టీస్పూన్లు, దానిమ్మ గింజలు - అర టీస్పూన్, క్రష్డ్ ఐస్ - ఒక కప్పు, డేట్ సిరప్ - అర కప్పు.

తయారీ:
ఒక గిన్నెలో బాదం గింజల తురుము, ఎండు ద్రాక్షలు, రోజ్ వాటర్, దానిమ్మ గింజలు, డేట్ సిరప్, క్రష్డ్ ఐస్‌లను వేసి బాగా కలపాలి. తరువాత దాన్ని సర్వింగ్ గ్లాసుల్లో పోయాలి. అంటే జలబ్ డ్రింక్ రెడీ. ఈ పదార్థాలతో ఇద్దరికి వస్తుంది.

పేరెంటచ్

పరీక్షల వేళ ఆరోగ్యం చెడకుండా..

ఒక్కోసారి, సరిగ్గా పరీక్షల సమయంలోనే పిల్లలు అస్వస్థతకు గురికావడం లేదా ప్రమాదాల బారిన పడటం జరుగుతూంటుంది. కొన్నిసార్లు పరీక్షలకే హాజరు కాలేని పరిస్థితి ఏర్పడవచ్చు. అందుకే పరీక్షలయ్యేదాకా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న క్రికెట్ లాంటి క్రీడలకు దూరంగా ఉండేలా చేయాలి. ఎందుకంటే, ఏది జరిగినా విద్యాసంవత్సరం వృథా అయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. కొన్నిసార్లు పిల్లలకు సరిగ్గా పరీక్షల వేళల్లోనే జ్వరం, దగ్గు లాంటివి మొదలై మంచం మీది నుంచి లేవలేని స్థితిలో పడిపోతారు. అయితే, కాసిన్ని ముందు జాగ్రత్తలు తీసుకుంటే ఆ ప్రమాదాన్ని చాలావరకు నివారించవచ్చు. వ్యాధి నిరోధక శక్తిని పెంచే బలవర్ధకమైన ఆహారాన్ని వీరికి ఇవ్వడం వల్ల ఆ సమస్యలను చాలా వరకు అరికట్టవచ్చు.

ముఖ్యంగా విటమిన్లు, లవణాలు సమృద్ధిగా ఉండే పండ్లు వారికి ఎక్కువగా ఇవ్వాలి. పరీక్షల ముందు ఎక్కువ గంటలు చదవడం వల్ల గానీ, ఆ సమయంలో పీచు పదార్థం ఉండే పండ్లు తినకపోవడం వల్ల గానీ మలబద్ధకం ఏర్పడుతూ ఉంటుంది. దీనివల్ల తలనొప్పి, జ్వరం, దగ్గు మొదలవుతాయి. సమస్య ఇలాగే ఉంటే అప్పుడప్పుడు కడుపు నొప్పి కూడా రావచ్చు.

అందుకే పరీక్షలకు ఒకటి రెండు నెలల ముందు నుంచే వీరి ఆహారంలో పండ్లకు అధిక ప్రాధాన్యత నివ్వాలి. సరిగా నిద్ర పోకపోవడం కూడా ఇలాంటి సమస్యలకు కారణం కావచ్చు. నిద్ర మరీ తక్కువైతే చదివినదేదీ జ్ఞాపకం ఉండదనే నిజాన్ని వారికి చెప్పి ఓ ఐదారు గంటల పాటు నిద్రపోయేలా చూడాలి.



మిత్రులంతా నిద్రాహారాలు మానేసి తెల్లవార్లూ చదివేస్తున్నారని ఎవరో చెబితే విని వీళ్లూ కూడా అలాగే ఉండాలనుకుంటారు. దీనివల్ల కలిగే లాభం కన్నా నష్టమే ఎక్కువ. అందుకే పరీక్షల వేళ పిల్లలు ఈ కష్టనష్టాల పాలు కాకుండా కాసిన్ని జాగ్రత్తలు తీసుకోవడం తల్లిదండ్రుల కనీస బాధ్యత.

నవ్య
ఆంధ్రజ్యోతి యంగ్
బుధవారం • 28 ఫిబ్రవరి 2018



'ట్యూబ్' టాక్

'ఎక్స్‌ప్రెస్' హిట్

ప్రేమ... తర'గని' సబ్జెక్ట్. అప్పటికి... ఇప్పటికీ 'కథల'కు అదే కాన్సెప్ట్! మళ్లీ ఆ సబ్జెక్టుతోనే విభిన్నంగా తెరకెక్కింది 'ఎక్స్‌ప్రెస్ లవ్'. యువ దర్శకుడు ఎంఎస్ విష్ణు అద్భుతంగా మలిచిన ఈ షార్ట్ ఫిల్మ్ యూట్యూబ్‌లో సూపర్ హిట్ అయింది. ఎనిమిది వేల రూపాయల బడ్జెట్‌తో తీసిన ఈ చిత్రం కోటికి పైగా వ్యూయర్‌షిప్‌తో దూసుకుపోతోంది. కోటి మార్కును దాటిన తొలి తెలంగాణ లఘు చిత్రంగా రికార్డు సృష్టించింది...

సినిమా రంగంలో రాణించాలనుకొనేవారు తమ ప్రతిభను చాటుకోడానికి పెద్ద సాధనం షార్ట్ ఫిలిం. ఇంటర్‌నెట్ వినియోగం బాగా పెరిగిపోయాక వీటి సంఖ్య కూడా అధికమయింది. ఇలాంటి ఔత్సాహికులందరికీ యూట్యూబ్ వేదికగా మారింది. అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకుని సత్తా చాటిన మరో లఘు ...

... ప్రతిభను కనబర్చాడు విష్ణు. చిత్రంలోని యువతి గ్లామర్... అనూహ్యమైన క్లైమాక్స్ టచ్ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇప్పటికే కోటి మందికి పైగా దీన్ని వీక్షించారు. తెలంగాణలో మరే ఇతర షార్ట్ ఫిల్మ్ కూడా ...

విజయం వెనుక కష్టం...



● మహ్మద్ ఖాజా అఫ్రీద్



కొత్త బండి గురూ

'ఎస్' క్లాస్!

భారత్‌లో లగ్జరీ కార్లకు కేరాఫ్ అడ్రస్‌గా చాలా మంది ఇప్పటికీ బెంజ్‌నే భావిస్తుంటారు. భద్రతా పరంగా అత్యున్నత ప్రమాణాలు పాటించే ఈ సంస్థ ఇప్పుడు పర్యావరణ పరిరక్షణకూ ప్రాధాన్యం ఇస్తోంది. భారత్‌లో తొలిసారి బీఎస్ 6 ప్రమాణాలతో కూడిన 'ఎస్-క్లాస్' శ్రేణిని ఆవిష్కరించింది. పూర్తిగా దేశంలోనే తయారైన ఈ కారుకు ఎన్నో విశేషాలున్నాయి...

లగ్జరీ, ఇంటిలిజెన్స్, క్రాఫ్ట్‌మెన్‌షిప్‌తో పాటుగా అత్యాధునిక డ్రైవర్ అసిస్టెన్స్ వ్యవస్థల సమ్మేళనం 'ఎస్-క్లాస్'. 350డీ-డీజిల్, ఎస్450- పెట్రోల్ వెర్షన్లలో రెండు మోడల్స్‌ను ఇటీవలే సంస్థ ఆవిష్కరించింది. మెర్సిడెస్ భారత్‌లో ఇప్పటి వరకూ రూపొందించిన అత్యంత శక్తివంతమైన ఇంజిన్-ఓఎం 656ను ఎస్ 350లో అమర్చారు. బీఎస్4 డీజిల్‌తో ...

పక్కా లోకల్

ట్రెండ్

ఫ్యాషన్ అంటే ? వెస్ట్రన్ స్టయిల్ ఒక్కటేనా? కాదు ట్రెండ్ మారింది. లుక్ ఉంటే చాలు! అదీ మనదై ఉండాలి. టైమ్‌ను కాస్త రివైండ్ చేసి ఆనాటి వెలుగులకు రెక్కలిస్తున్నారు. ఇదే ఇప్పుడు భారత ఫ్యాషన్ లేబుల్స్‌లో ప్రతిబింబిస్తోంది. 'మేం లోకల్' అంటూ కొత్త ఫ్యాషన్‌ను కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. దీనికి మూలం 'సస్టయినబుల్ ఫ్యాషన్'. ఇది ఇప్పుడు ప్రపంచ ఫ్యాషన్ పరిశ్రమను ఊపేస్తోంది.

'సస్టయినబిలిటీ' అంటే ఏంటి? మీకు సందేహం రావచ్చు. స్పష్టంగా చెప్పాలంటే ఆ ఫ్యాషన్ లేదా ఫ్యాబ్రిక్‌కు మన్నిక ఉండాలి. అదీ ఎకో-ఫ్రెండ్లీగా ఉండాలి. ఇదే ఫ్యాషన్‌లో సరికొత్త అధ్యాయం. దీన్నే భారత్ ఫ్యాషన్ డిజైనర్లు కూడా అనుసరిస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి మన దేశంలో రకరకాల చేనేత వస్త్రాలున్నాయి. ఆధునిక ...



తయారు చేసే కాటన్ ఇది. ఇప్పటికే 24 దేశాలను ఈ కాటన్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. ఇప్పటికే ఈ తరహా కాటన్‌ను భారత్‌లో పలువురు డిజైనర్లు వీటినే వినియోగిస్తున్నారు. 'గ్రాస్‌రూట్స్', 'భూ సత్వా', 'డు యూ స్పీక్ గ్రీన్' వంటి దేశీ బ్రాండ్స్ ఈ ...



... జాతీయంగానే కాదు అంతర్జాతీయంగా కూడా గుర్తింపు పొందింది. త్వరలోనే ఈ సంస్థ 'క్రాఫ్ట్‌మార్క్ గ్రీన్' సీల్‌ను కూడా ప్రవేశపెట్టనుంది.

సయాటికాకు హోమియో చికిత్స

సయాటికా, నడుమునొప్పి అనే పదాలను యుక్తవయస్సు, మధ్యవయస్సు వయసు వచ్చినవారిలో చాలా మంది వినే ఉంటారు. శరీరంలో వీపు కింది భాగం నుంచి పిరుదుల నుంచి కాలువెనుక భాగంలో ప్రయాణించే నరము సయాటిక నరం. మనిషి శరీర భాగాల్లో ముఖ్యమైనది వెన్నుపూస. సయాటిక నరం అయిదు ఇతర నరాల సమూహంతో ఏర్పడి ఉంటుంది. వెన్నుపూస లోపల నుంచి ప్రయాణించు నరాలపై ఒత్తిడి వలన కాలు వెను భాగం నొప్పికి గురవుతుంది. దానినే సయాటిక నొప్పి అంటారు. వివిధ రకాల ఒత్తిడి వల్ల జీవన విధానాలలో మార్పుల వల్ల , వ్యాయామం చేయకపోవడం, వెన్నుముకపై ప్రభావం చూపి, వెన్నుపూసలో తరుగుదల మొదలువుతుంది.

సాధారణంగా అధిక బరువును ఎత్తడం వల్ల చాలాసాపు ఒకే భంగిమలో ఉండటం వల్ల ముందుకు వంగి పనిచేయడం వల్ల వెన్నుముకపై ఒత్తిడి ఏర్పడుతుంది. తద్వారా వెన్నుముక కండరాలపై, నరాలపై ఒత్తిడి ప్రారంభమవుతుంది. ఈ నొప్పి వర్ణనాతీతంగా ఉండటమే కాకుండా వారి దైనందిన జీవితానికి ఆటంకం కలిగిస్తుంది. మొదటగా నొప్పి వచ్చినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకున్నట్టయితే ఈ సమస్యను కొద్దిరోజుల్లోనే దూరం అవుతుంది. వెన్నుముక నొప్పి 12 వారాలకు పూగా ఉన్నట్లయితే దానిని దీర్ఘకాలిక నొప్పిగా పరిగణించి వైద్యుడిని సంప్రదించాలి. ముఖ్యంగా సయాటిక అంటే ఆపరేషన్ వరకూ వెళుతుందేమో అని భయపడుతుంటారు. కానీ హోమియోలో ఏ విధమైన దుష్ప్రభావం లేని చికిత్స అందుబాటులో ఉంది.



కారణాలు:

లక్షణాలు:

వ్యాధి నిర్ధరణ

ఎక్స్‌రే, ఎమ్ఆర్ఐ, సిబిపి ఇఎస్ఐఆర్, డిస్క్ ప్రోలాప్స్, డిస్క్ హెర్నియేషన్

హోమియో చికిత్స

సయాటిక నొప్పికి, వెన్నుపూస సమస్యలకు హోమియోపతిలో మంచి చికిత్స లభిస్తుంది. రోగి శారీరక, మానసిక లక్షణాలను పరిగణలోకి తీసుకొని దానికి మందులు ఇస్తారు. రస్టాక్స్, కాల్కేరియాఫ్లోర్, ఆర్నికా, బ్రయోనియా, హైపర్నికమ్ మొదలైనవి అందుబాటులో ఉన్నాయి. డాక్టర్ పర్యవేక్షణలో వాడితే నొప్పి నయమవుతుంది.

స్టార్ కార్

కార్ల క్యూ...

బాలీవుడ్ హీరోల్లో సంజయ్‌దత్ క్రేజ్ గురించి చెప్పక్కర్లేదు. ఒకప్పుడు అమితాబ్ తరువాత అంతటి స్టార్‌డమ్‌తో వెలిగిన ఈ స్టార్‌కు కార్లంటే చెప్పలేని పిచ్చి. అతడి గ్యారేజ్ చూస్తే విలాసవంతమైన కార్లు కొలువుదీరి ఉంటాయి. ఎంతో ఖరీదైన ఫెరారీ 599 జీటీబీతో పాటు టూసీటర్ ఆడీ ఆర్8, ఆడీ క్యూ7, ఆడీ 8ఎల్ డబ్ల్యూ12, బెంట్లే కాంటినెంటల్ జీటీ, లెక్సస్ ఎల్ఎస్ 4709, టయోటా ల్యాండ్ క్రూజర్, మెర్సిడెజ్ ఎం-క్లాస్, పోర్షే ఎస్‌యూవీ, రోల్స్ రాయిస్ ఘోస్ట్ తదితర టాప్ బ్రాండ్ కార్లన్నీ సంజయ్ కొనుగోలు చేశాడు. లేటెస్ట్ వెర్షన్లు... అందులోని సౌకర్యాలను బట్టి సంజయ్ కార్లను సెలెక్ట్ చేస్తాడు. వీటితోపాటు చూడగానే ఆకర్షణీయంగా, హుందాగా ఉండటం ముఖ్యం. రోల్స్ రాయిస్ ఘోస్ట్ ధర సుమారు రూ.3.5 కోట్లు. దీన్ని సంజు తన భార్య మాన్యతకు బహుమతిగా ఇచ్చాడు. ...



యువతే మార్కెట్ 'పల్స్'

అధ్యయనం



దేశ భవితకే కాదు... ఆన్‌లైన్ వ్యాపారానికీ యువతే పట్టుకొమ్మ. 'రీటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' (ఆఏఐ) తాజా అధ్యయనం ఇదే చెబుతోంది. భారత్‌లోని 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్కుల్లో అత్యధికంగా ఆన్‌లైన్‌లోనే ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా ఈ-రీటైల్ పరిశ్రమ మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. 2010లో 3 శాతం ఉన్న ఈ-పరిశ్రమ వృద్ధి రేటు 2021 నాటికి 30 శాతానికి చేరుకుంటుందని అధ్యయనంలో తేలింది. తమ ఆదాయంలో అధిక మొత్తం నెలవారీ అత్యవసర ఉత్పత్తుల కోసం ఖర్చు చేస్తున్నారు. ఇంక్రిమెంట్లు తదితర ఆదాయంలో విందు, వినోదాల (32.7 శాతం)కు వెచ్చిస్తున్నారు. ఇతర యాక్సరీలకు 21.4 శాతం, ఎలక్ట్రానిక్స్‌కు 11.2 శాతం వినియోగిస్తున్నారు. దేశ జనాభాలో 18-35 ఏళ్ల వారు 440 మిలియన్లు (34 శాతం) ఉన్నట్టు 'ట్రెండ్ సెట్టింగ్ మిలేనియల్స్' పేరుతో చేసిన ఈ సర్వే వెల్లడించింది. వీరి సగటు వయసు 28 సంవత్సరాలు. అమెరికా, చైనా, ఇతర ఐరోపా దేశాలకు భిన్నంగా ప్రపంచంలోని 'యంగెస్ట్ మేజర్ ఎకానమీస్'లో భారత్ ఒకటి.

ఆరోగ్యంపై దృష్టి...

ఇక యువతరం ఆరోగ్యానికి కూడా అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఈ జనాభాలో 36 శాతం మంది తమ మొబైల్ ఫోన్లలో ఫిట్‌నెస్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకున్నారు. సౌకర్యానికి ప్రాధాన్యం ఇస్తుండటంతో 'రెడీ టూ ఈట్' ఉత్పత్తుల మార్కెట్ ఏడాదికి 28 శాతం చొప్పున వృద్ధి సాధిస్తోందని ఆర్ఏఐ నివేదికలో వెల్లడించింది. వీళ్లని దృష్టిలో పెట్టుకునే ఏ బ్రాండైనా ఉత్పత్తులు తయారు చేయాల్సిన పరిస్థితి ఇప్పుడు.

కౌన్సెలింగ్

నో క్లెయిమ్ బోనస్



ఆమె లేని నేను లేను..



ఎలా చెప్పను!

- పవన్

మీ మనసులో మాట మాతో పంచుకోండి: navya@andhrajyothy.com

కాస్త మారండి!

ట్రాఫిక్‌ను ఛేదించుకొని అపార్ట్‌మెంట్ పార్కింగ్ లాట్‌లో బైక్ పార్క్ చేసి లిఫ్ట్‌లోకి ఎంటరయ్యాడు వికాస్. ఒకపక్క ఆకలి, మరో పక్క ఆఫీసు ఒత్తిళ్లు... వెరసి అతని బుర్ర వేడెక్కిపోతోంది. లిఫ్ట్ తలుపు తీయగానే కనిపించిన సీన్ చూసి ఉస్సూరుమన్నాడు. పట్టలేని కోపం వచ్చింది. కారణం... ఇంటికి తాళం వేసి ఉంది. శ్రీమతికి ఫోన్ చేశాడు. రింగ్ అవుతోంది గానీ 'నో రెస్పాన్స్'. పదినిమిషాలు కాస్త పావుగంట అయింది. పావుగంట కాస్తా గంట అయింది. ఇంతలో లిఫ్ట్ తెరుచుకుంది. హడావిడిగా ఆమె వికాస్ దగ్గరకు వస్తూ - "సారీ... లేట్ అయిపోయింది...." అంటూ సంజాయిషీ ఇచ్చుకునే ప్రయత్నం చేసింది . కానీ ఆమె చేతిలో కీ లాక్కొని తలుపు తీసుకొని తన రూమ్‌లోకి వెళ్లిపోయి ధడేల్ మని తలుపువేసుకున్నాడు వికాస్. తను చెప్పే మాట వినకుండానే అతను అలా ప్రవర్తించడం ఎందుకో చివుక్కుమనిపించిదామెకు. తనకు ఆఫీసులో 'ఎంప్లాయి ఆఫ్ ది ఇయర్ అవార్డు' వచ్చింది. సంతోషంగా చెబుదామనుకుంది. మర్నాడు కూడా అతను మాట్లాడలేదు. ...

... తన కెరీర్‌ను కొనసాగిస్తూ ఉంటే అంతకుమించిన ఆనందం ఎక్కడ ఉంటుంది? భర్తగా ఆమెను అభినందించండి. అంతేగానీ, ఆమె శ్రమను తేలిగ్గా తీసిపారేయద్దు. ఎంత బిజీగా ఉన్నా ఆమె కచ్చితంగా మీతో సమయాన్ని గడపాలనుకుంటారు. కానీ కుదరకపోవచ్చు. మీరే ఒక అడుగు ముందుకు వేసి, ఆమె అవసరాలను అర్థం చేసుకొని మెలగండి. డబ్బు కన్నా ముఖ్యమైనది భరోసా. అది గుర్తించాలి.

పోటీ వద్దు!

'నా కన్నా ఆమె ఎక్కువ జీతం సంపాదిస్తోంది. నేను ఎలాగైనా పోటీపడాలి' అంటూ అనవసరమైన ఈర్ష్యాసూయలకు పోకండి. అనుబంధంలో పోటీ ఎందుకు? మీ దారి మీది. తన దారి తనది.. ఆమెకు విజయం లభిస్తే వెన్నుతట్టి ప్రోత్సహించండి. అలాగే మీరు ప్రొఫెషనల్‌గా ఇబ్బందుల్లో ఉంటే ఆమె చెప్పే ఓదార్పు మాటలను మీరు నెగటివ్‌గా తీసుకోవద్దు. బీ హ్యాపీ... మేక్ హర్ హ్యాపీ.

ఇగోలే అన్నిటికీ మూలం!

అర్థరాత్రి తర్వాతే ...

అర్థం చేసుకోండి!

లైఫ్ లెసన్



ట్రెండింగ్ హిట్



దుమ్ము రేపుతోంది!

వ్యూస్: 3,029, 384

విడుదలైన మూడు రోజుల్లోనే ఒక వీడియోకు 30 లక్షలకు పైగా వ్యూస్ రావడమంటే మాటలు కాదు. ఆ వీడియోలో ఎంతో కంటెంట్ ఉండాలి. అందులో ఉన్న యాక్టర్స్‌కు బాగా క్రేజ్ అయినా ఉండి తీరాలి. జోయనర్ లుకాస్, క్రిస్ బ్రౌన్ స్వరపరిచిన పాప్ సాంగ్స్‌కి ఎంతో డిమాండ్ ఉంది.. వారిద్దరూ సంగీతం అందించిన తాజా మ్యూజిక్ వీడియో ఇటీవలే విడుదలైంది. దాని పేరు 'స్ట్రేంజర్ థింగ్స్'. ఫిబ్రవరి 25న విడుదలైంది.

డైలీ సుడోకు - 117

7	6	2		4				
				1		8		
3							9	
	1		9	7				8
	2	7				5	3	
5				3	4		7	
	7							4
		9		5				
				9		7	2	1

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 116 సమాధానం

[illegible]

రుతుచక్ర సమస్యకు శాశ్వత పరిష్కారం

రుతుచక్ర సమస్యల్లో రకాలు



కారణాలు: ఎండోమెట్రియాసిస్, గర్భాశయంలో కణితులు, అండాశయంలో నీటి తిత్తులు, హార్మోన్ల అసమతుల్యతలు.

హోమియోకేర్ ఇంటర్నేషనల్ చికిత్స: హోఇయోకేర్ ఇంటర్‌నేషనల్‌లో ఎలాంటి హార్మోన్ల సప్లిమెంటేషన్ లేకుండా కేవలం జెనెటిక్ కాన్‌స్టిట్యూషనల్ పద్ధతిలో జరిపే చికిత్స ద్వారా రుతుచక్ర సమస్యలకు మూల కారణమైన హార్మోన్ల అసమతుల్యతను, పీసీఓడీతో పాటుగా గర్భాశయం ఇతర సమస్యలను సరిచేసి ఆరోగ్యంగా ఉండేలా ఎటువంటి సైడ్‌ఎఫెక్ట్స్ లేకుండా రుతుచక్ర సమస్యలను సరిజేసే అవకాశం ఉంది.



శ్రియ పెళ్లి నిజమేనట!

రష్యాకు చెందిన క్రీడాకారుడు, వ్యాపారవేత్త ఆండ్రీ కొశ్చీవ్‌తో శ్రియ శరన్ ప్రేమలో ఉందని త్వరలోనే ఇద్దరూ వివాహబంధంతో ఒకటి కాబోతున్నారని ఇటీవల పుకార్లు వచ్చిన విషయం తెలిసిందే. ఆ వార్తలో నిజం లేదని శ్రియ తల్లి ఖండించారు. 'నేను ఇప్పట్లో పెళ్లి చేసుకోవడం లేదు' అని శ్రియ స్టేట్‌మెంట్ ఇచ్చారు. కానీ శ్రియ మాటలే అబద్ధమై.. పుకార్లు నిజం కానున్నట్లు తెలుస్తోంది. శ్రియ పెళ్లి సన్నాహాల్లో ఉందనే వార్త మంగళవారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. మార్చి 17, 18, 19 తేదీల్లో ఉదయ్‌పూర్‌లో మూడురోజులపాటు శ్రియ పెళ్లి గ్రాండ్‌గా జరగనుందని సమాచారం. ఇప్పటికే పెళ్లికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయని, శ్రేయోభిలాషులకు, సహనటులకు ఆహ్వానాలు పంపిస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే నెల 18న శ్రియ-ఆండ్రీ హిందూ సంప్రదాయంలో పెళ్లి చేసుకోబోతున్నారని, 19న అతిథులు, స్నేహితులకు గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటుచేస్తారని శ్రియ సన్నిహితవర్గాలు చెబుతున్నాయి. అయితే శ్రియ మాత్రం పెళ్లి గురించి ఎక్కడా స్పందించలేదు. "ఇప్పటికే ఆసక్తికరమైన కథలతో నా జీవితం నిండిపోయింది. నేను నటిని కాబట్టి నా వృత్తి గురించి, నా సినిమాల గురించి అడిగితే సమాధానం చెబుతాను. అందుకు నేనెప్పుడూ సిద్ధంగానే ఉంటా. నా ప్రైవేట్ లైఫ్ గురించి ఇతరులకు అనవసరం. దానిని నేను అమ్మకానికి పెట్టలేదు" అని శ్రియ అంటోంది.

ఆఫీసర్ వచ్చేశాడు



నాగార్జున హీరోగా రామ్‌గోపాల్ వర్మ స్వీయ దర్శకత్వంలో సుధీర్ చంద్రతో కలిసి నిర్మిస్తున్న చిత్రానికి 'ఆఫీసర్' టైటిల్ ఖరారు చేశారు. మంగళవారం టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ మోషన్ టీజర్, నాగార్జున కొత్త లుక్ విడుదల చేశారు. మే నెలలో 25వ తేదీన చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. నిజానికి, ఆదివారం ఈ సినిమా టైటిల్, ప్రచార చిత్రాలు విడుదల చేయాలనుకున్నారు. శ్రీదేవి మరణంతో వాయిదా వేశారు. రెండు రోజులు ఆలస్యంగా ఆఫీసర్ వచ్చేశాడు. ఈ టైటిల్ విడుదల చేసిన వర్మ "శ్రీదేవి మరణంతో నా చుట్టూ నెగెటివిటీ అలుముకుంది. నాకు కొంత పాజిటివ్ ఎనర్జీ కావాలి" అని ట్వీట్ చేశారు. బదులుగా నాగార్జున "నీ మాటల్లో భావం నాకు అర్థమవుతుంది రాము. ప్రముఖ పాటలోని లైన్లు 'అనుకున్నామని జరగవు అన్నీ... అనుకోలేదని ఆగవు కొన్ని' గుర్తు చేసుకుంటున్నా" అన్నారు. ఈ చిత్రం ద్వారా మైరా సరీన్ కథానాయికగా పరిచయమవుతున్నారు.



అప్పట్లో అందరూ విమర్శించారు!

- కె. విశ్వనాథ్



'జాగ్ ఉఠా ఇన్సాన్'లో మిథున్‌తో...

బాల నటులుగా బాగా నటించి, పేరు తెచ్చుకున్న చాలామంది పెద్దయిన తరువాత కూడా అంతగా రాణించడం చాలా తక్కువ. దానికి మినహాయింపు దక్షిణాదిలో కమల్‌హాసన్, శ్రీదేవి. ఇద్దరూ చిన్నప్పుడు ఎంత అందంగా ఉండేవారో, ఎంత చక్కగా నటించేవారో, పెద్దయ్యాక కూడా అంతే అందంగా ఉన్నారు. అద్భుతంగా నటించారు. శ్రీదేవి బాలనటిగా ఉండగా నా సినిమాల్లో వేటిలోనూ చేయలేదు. కానీ, హీరోయిన్‌గా స్థిరపడ్డాక నా సినిమాల్లో ఒకే ఒక్కసారి నటించింది. ఆ సినిమా - 'జాగ్ ఉఠా ఇన్సాన్'. అంతకు ముందు తెలుగులో తీసిన 'సప్తపది' సినిమాకు అది హిందీ రీమేక్.

గుంటూరులో శ్రీదేవి, మిథున్!

నటుడు, నిర్మాత రాకేశ్ రోషన్‌కి 'సప్తపది' బాగా నచ్చి, హిందీలో తీద్దామని వచ్చి అడిగాడు. అప్పటికే హిందీలో శ్రీదేవి స్టార్ అయిపోయింది. తెలుగులో సబిత వేసిన నాయిక పాత్రకు ఆమెను పెడదాం, బాగుంటుందని రాకేశ్ అన్నాడు. నాకేమీ అభ్యంతరం లేదన్నా. అలా తొలిసారిగా నా సినిమాలో శ్రీదేవి నటించింది. మురళి వాయిస్తూ తిరిగే హీరో పాత్ర మిథున్ చక్రవర్తి, శ్రీదేవి భర్తగా, పూజారి పాత్రలో రాకేశ్ రోషన్ నటించారు. ఈ సినిమాకు సంగీతం రాకేశ్ సోదరుడు రాజేశ్ రోషన్ ఇచ్చారు. తెలుగులో వాడిన జాతవేదసే... అనే మంత్రాల ట్రాక్‌ను హిందీలో యథాతథంగా వాడాం. శ్రీదేవి అప్పటికే తెలుగు ఒరిజినల్ చూసింది. అయితే, తెలుగు మాతృకలోని కీలక పాయింట్, సినిమాలోని ప్రధాన ఘట్టాలు అలానే ఉన్నా, హిందీకి తగ్గట్లుగా కథ ట్రీట్‌మెంట్, టేకింగ్ వేరేగా ఉంటుంది. షాట్స్ కూడా యథాతథంగా ఉండవు. అప్పటికే సీజన్డ్ ఆర్టిస్ట్ కాబట్టి, శ్రీదేవి మనం చెప్పిన విషయాన్ని గ్రహించి, ఆ మార్పుల్ని సులభంగా ఎడాప్ట్ చేసుకొనేది. తెలుగు 'సప్తపది' లాగానే, 'జాగ్ ఉఠా ఇన్సాన్' సినిమా చాలా భాగం మన అమరావతిలోనే షూటింగ్ చేశాం. అప్పుడే కృష్ణా పుష్కరాల కోసం ఐ.ఏ.ఎస్. అధికారి రాంబాబు (గుంటూరు కలెక్టర్) గారి ఆధ్వర్యంలో అమరావతిలో వసతి సత్రాలన్నిటినీ బాగు చేశారు. అప్పట్లో నేను, మా టెక్నీషియన్స్ అందరం అమరావతిలోనే స్థానికంగా ఉండే ఆ చౌల్ట్రీలలో బస చేశాం. అయితే, హీరో హీరోయిన్లు మిథున్ చక్రవర్తి, శ్రీదేవి, రాకేశ్ రోషన్, కెమేరామన్ పి.ఎల్. రాయ్ లాంటి వారికి మాత్రం గుంటూరులో ప్రత్యేకంగా గెస్ట్‌హౌస్‌లలో బస ఏర్పాటు చేశాం. రాయపాటి సాంబశివరావు గారిదనుకుంటా... మంచి పొగాకు వ్యాపారుల గెస్ట్ హౌస్ గుంటూరులో ఉండేవి. అక్కడ నుంచి రోజూ షూటింగ్‌కు శ్రీదేవి, మిథున్ చక్రవర్తిని అమరావతికి తీసుకొచ్చేవాళ్ళం. ఆ షూటింగ్ ఒక మంచి అనుభవం.

గ్లామర్ తారకు క్లాసికల్ డ్యాన్సేమిటన్నారు!

'నెమలికి నేర్పిన నడకలివీ...' పాట హిందీ వెర్షన్ లాంటి కొంత షూటింగ్ మాత్రం బొంబాయిలో తీశాం. మా సినిమా చిత్రీకరణ సమయంలోనే దర్శకుడు శేఖర్ కపూర్ వాళ్ళు 'మిస్టర్ ఇండియా' చర్చల కోసం సెట్స్‌కు వచ్చి శ్రీదేవిని కలిశారు. శాస్త్రీయ నృత్యం, సంగీతం ప్రధానమైన డ్యాన్సర్ పాత్రకు శ్రీదేవిని ఎంచుకోవడాన్ని ఆ రోజుల్లో కొందరు విమర్శించారు. గుంటూరులో షూటింగ్ టైమ్‌లో మాకు ఒక అభినందన సభ జరిగింది. ఆ రోజు వేదికపై శ్రీదేవి కూడా ఉంది. అప్పుడు ఆడియన్స్ నుంచి ఎవరో కాగితం మీద ప్రశ్న రాసి, నన్ను జవాబివ్వమని అడిగారు. గ్లామర్‌గా కనిపిస్తూ, డ్యాన్సులు చేసే శ్రీదేవితో ఈ క్లాసికల్ డ్యాన్స్ సినిమా ఏ ధైర్యంతో చేస్తున్నారని ప్రశ్నించారు. ఏ నటి అయినా దర్శకుడు ఎలా చెబితే అలా చేస్తారు. ఇందులో శ్రీదేవి తప్పేమీ లేదు. ఆమెపై అలా గ్లామర్ ముద్ర వేయడం తప్పు. ఈ పాత్రకు, సినిమాకు ఆమె న్యాయం చేస్తుందనే నమ్మకం ఉంది అని సభాముఖంగా చెప్పా. అలాగే ఆమె ఫిల్మీ సాంగ్స్ చేసినంత బాగా, మా సినిమాలో క్లాసికల్ డ్యాన్సులూ చేసింది.

ఆ సినిమాలు నాకు ఇష్టం!

నిజం చెప్పాలంటే, జయప్రద, రాధిక లాంటి ఇతర హీరోయిన్లతో చేసినన్ని సినిమాలు శ్రీదేవితో చేయలేదు. జయప్రద లాంటి వాళ్ళు చిన్నప్పటి నుంచీ కళ్ళ ముందు మా సినిమాల్లో పెరిగినవాళ్ళు కాబట్టి, కొంత సాన్నిహిత్యం ఉండేది. శ్రీదేవితో అంత సాన్నిహిత్యం లేదు. చేసింది ఒక సినిమానే అయినా శ్రీదేవితో సినిమా అనుబంధం ఎంతో స్నేహపూర్వకంగా, గౌరవంగా సాగింది. షూటింగ్ అంతా చాలా చాలా సాఫీగా జరిగిపోయింది. కొంతమంది నటీనటులు దర్శకుడి చేతిలో మైనంముద్దలుగా మారి, పాత్రకూ, కథలో ఆ సన్నివేశానికీ కావాల్సినట్టు అద్భుతంగా చేస్తారు. శ్రీదేవి కూడా సరిగ్గా అలాంటి ఉత్తమ లక్షణాలున్న నటీమణుల్లో ఒకరు. 'పదహారేళ్ళ వయసు'లో చంద్రమోహన్, ఆమె చేసిన నటన, బాలూమహేంద్ర తీసిన 'వసంత కోకిల'లో గతం మర్చిపోయిన అమ్మాయిగా ఆమె అభినయం, అలాగే కమలహాసన్‌తో చేసిన తమిళ చిత్రం 'మీణ్డుమ్ కోకిల'లో ఆమె పాత్రపోషణ నాకు ఇప్పటికీ గుర్తే. అందుకే, దర్శకుడిగా శ్రీదేవిని అక్షరాలా 'డైరెక్టర్స్ యాక్టర్' అంటాను. ఎక్కడా తలాయించకుండా, దర్శకుడు తీస్తున్న షాట్‌లో తన శక్తియుక్తులన్నీ పెట్టే అరుదైన నటి.

వారం క్రితమే టీవీలో...

చాలా కాలం తరువాత, గత ఏడాది నవంబర్ చివరలో గోవాలో నలభై ఎనిమిదో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) జరిగినప్పుడు శ్రీదేవిని ఆఖరుసారిగా చూశా. ప్రభుత్వ పక్షాన ఆ ఉత్సవానికి నేను అతిథిగా హాజరయ్యా. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు రావడంతో, నా సినిమాలు 'శంకరాభరణం', 'సాగరసంగమం' మొదలైనవాటితో అక్కడ ప్రత్యేక చిత్రోత్సవం (రెట్రాస్పెక్టివ్) కూడా చేశారు. ఇఫీలో ఇండియన్ పనోరమా విభాగంలో ప్రదర్శనల ప్రారంభోత్సవానికి శ్రీదేవి ప్రత్యేక అతిథిగా వచ్చారు. అయితే, అక్కడ మేము విడిగా కలుసుకొని, మాట్లాడే సావకాశం దొరకలేదు. సరిగ్గా వారం క్రితమే టీవీలో 'జాగ్ ఉఠా ఇన్‌సాన్' సినిమా ఎందుకనో మా ఇంటిల్లపాదీ కలసి చూసి, మాట్లాడుకున్నాం. ఇంతలోనే ఈ దుర్వార్త వినాల్సి వచ్చింది. అందరం చెన్నైలో కెరీర్‌ను మొదలుపెట్టి, పైకి వచ్చినవాళ్ళం. అలా దగ్గర నుంచి చూసిన అమ్మాయి, మన తెలుగమ్మాయి ఎంతో ఉన్నత శిఖరాలు అధిరోహించడం ఒక రకంగా ఆనందంగా అనిపిస్తుంది. బొంబాయికీ, హిందీ సినీ రంగానికీ వెళ్ళిన తరువాత శ్రీదేవి తనకు తాను మరింత హుందాతనాన్ని సంతరించుకుంది. ఒక ప్రత్యేకతను ఆపాదించుకున్నట్లు అనిపిస్తుంది. అలా ఉన్నతంగా ఎదిగిన శ్రీదేవి గురించి ఇలా నివాళిగా మాట్లాడాల్సి వస్తుందని అనుకోలేదు.



శ్రీదేవి, జయప్రదలను కలపాలని చూశాం!

- కె.బాపయ్య



శ్రీదేవి అద్భుతమైన నటి అని, ఎంతో హుందాగా, గౌరవంగా ఉండేవారని సీనియర్ దర్శకుడు బాపయ్య పేర్కొన్నారు. ఆయన శ్రీదేవి స్మృతులను నెమరువేసుకుంటూ... "ఆమెతో 16 సినిమాలు చేశాను. అందులో రెండు విడుదల కాలేదు. మొదటగా ఆమెతో 'గురుశిష్యులు' చేశాను. అందులో అక్కినేని నాగేశ్వరరావు, కృష్ణ, సుజాత, శ్రీదేవి హీరోహీరోయిన్లు. తరువాత ఎన్టీఆర్ సొంత సినిమా 'అగ్గిరవ్వ', అనంతరం 'ముందడుగు' చేశాను. తరువాత ఎక్కువగా హిందీ సినిమాలు చేశాను. హిందీలో తొలిగా పద్మాలయా వారి 'మవాలి' చేశాను. అలాగే 'మక్సద్', 'సోనేపే సుహాగ్' వంటివన్నీ హిట్ పిక్చర్సే. ముందడుగు, మక్సద్‌లలో శ్రీదేవి, జయప్రద హీరోయిన్లు. కారణం తెలియదు గానీ వారిద్దరూ ఎడమొహం, పెడమొహంగా ఉండేవారు. మేం కూడా చాలాసార్లు వారిని కలిపేందుకు ప్రయత్నించాం. అయినా కుదరలేదు. 'మక్సద్' నిర్మాణ సమయంలో రాజేష్‌ఖన్నా, జితేందర్ వారిని కలిపారు. కానీ మళ్లీ రెండుమూడు రోజులకే కథ మొదటికి వచ్చింది. . కానీ కెమెరా ముందు ఆ గొడవలేవీ కనిపించేవి కావు. అప్పట్లో ఆ ఇద్దరూ పోటీపడి నటించేవారు. కానీ శ్రీదేవి ఒక్కశాతం అధికమేమో అనిపించేది. కెమెరా ముందు నిలబడితే ఎలాంటి పాత్రనైనా అవలీలగా చేసేది. కృష్ణతో తీసిన 'జయం మనదే' సినిమాలో కోర్టులో సాక్ష్యం చెప్పాల్సిన సీన్‌లో మాత్రం ఆమె ఎందుకో ఎక్కువ టేక్స్ తీసుకొంది. దాంతో 'మధ్యాహ్నం చేస్తాను సార్' అంది. అన్నట్లుగానే ఆ మధ్యాహ్నం షాట్ పూర్తి చేసింది. 'మక్సద్' పిక్చర్‌లో ఆమె స్నేక్ డ్యాన్స్ తీస్తుండగా ఆమె మోకాళ్లు కొట్టుకుపోయాయి. దాంతో మోకాళ్లకు నీక్యాప్స్ తెప్పించి వేస్తే, అవి వేసుకోవడానికి కూడా ఆమె ఇబ్బంది పడింది. అయినా ఎక్కడా ఆమె డ్యాన్స్‌లో వెనుకడుగు వేయలేదు. బాధను భరిస్తూనే, ఆ ఛాయలేవీ ముఖంమీద కనిపించకుండా ఆ డ్యాన్స్ అద్భుతంగా చేసింది. ఆ తరువాత రెండుమూడేళ్లకు 'నాగిని' వంటి సినిమాలు వచ్చాయి. సెట్‌లో ఎంతో హుందాగా, గౌరవంగా ఉండేది. ప్రతి షాట్‌ను ఛాలెంజింగ్‌గా తీసుకునేది. దర్శక, నిర్మాతలను ఇబ్బంది పెట్టేదికాదు. 'అగ్గిరవ్వ' సినిమా చేసేటప్పుడు ఒక సారి కారులో షూటింగ్‌కు వెళ్తున్నాం. ముందుసీట్లో శ్రీదేవి, వెనుకసీట్లో నేను, ఎన్టీఆర్ కూర్చున్నాం. తెలుగులో హిట్టయిన 'కార్తీకదీపం' సినిమాను ఆ సమయంలోనే హిందీలో రీమేక్ చేస్తున్నారు. .. ఎన్టీఆర్ గారు ఆ విషయం ప్రస్తావించి 'ఏమండీ ఆ పిక్చర్ రీమేక్ కదా! ఈ అమ్మాయిని పెట్టుకోవచ్చుగా ' అన్నారు. 'హిందీ భాషపై పట్టుండాలి, బాగా మాట్లాడగలిగి వుండాలి. అందువల్ల ప్రొడ్యూసర్ కాదన్నారండీ అని చెప్పాను. ఆ మాటలు వింటూ శ్రీదేవి కామ్‌గా ఉండిపోయింది. ఏమీ మాట్లాడలేదు. శ్రీదేవి బాలీవుడ్‌కు వచ్చిన తరువాత 15 సినిమాల వరకూ నాజ్ అనే యువతి డబ్బింగ్ చెప్పింది. తరువాత 'వక్త్‌కి ఆవాజ్'లో ఆమె తొలిసారిగా డబ్బింగ్ చెప్పింది. అందులో హీరో మిథున్ చక్రవర్తి. అప్పుడు కూడా ఆమెకు కాన్ఫిడెన్స్ వచ్చేవరకూ వారంరోజులు డబ్బింగ్ ఆపాం. దానికి ప్రొడ్యూసర్ త్రివిక్రమరావ్. ఆ పిక్చర్ తరువాత అన్నింటికీ ఆమే డబ్బింగ్ చెప్పుకుంది.

మిథున్‌తో పెళ్లయింది!

శ్రీదేవితో వివాహం అయిందని మిథున్‌చక్రవర్తి నాతో చెప్పారు. ఆ పెళ్లికి ఆయన తల్లిదండ్రులు కూడా వచ్చారట. బాంబేలోని మడ్ ఐల్యాండ్‌లోని బీచ్‌హౌస్‌లో ఆ పెళ్లయింది. బెంగాలీ సంప్రదాయం ప్రకారం తాళి కట్టకుండా, చేతికి కడియం తొడిగి ఒక్కటయ్యారు. అయితే ఈ వ్యవహారాలేవీ ప్రత్యక్షంగా నాకు తెలియదు. ఆమె తల్లిదండ్రుల వల్లనే మిథున్‌తో విడిపోయారనుకుంటాను. విచిత్రమేమంటే అంతకుముందు వేరే విషయం గురించి మాట్లాడుతూ... 'రెండో పెళ్లివాడిని మాత్రం చేసుకోవద్దమ్మా' అని నేను శ్రీదేవితో అని వున్నాను. కానీ అనుకోని పరిస్థితుల్లో అదే జరిగిపోయింది.

ఇంటర్వ్యూలు : రెంటాల జయదేవ, వినాయకరావు, సత్య పులగం, ఎం.డి. గౌస్‌బాషా

శ్రీదేవి నిజాయితీకి ఆశ్చర్యపోయా

- సరోజ్ ఖాన్


అతిలోక సుందరి శ్రీదేవికి హిందీ కొరియోగ్రాఫర్ సరోజ్‌ఖాన్ మంచి స్నేహితురాలు. శ్రీదేవి ఈలోకం విడిచి వెళ్ళడంతో ఆమెతో తన అనుబంధాన్ని సరోజ్‌ఖాన్ గుర్తు చేసుకున్నారిలా.... సుభాష్ ఘయ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'కర్మ' చిత్రంలో 'మైనే రబ్ సే తుఝే..' పాట కొరియోగ్రఫీ సమయంలో శ్రీదేవిని తొలిసారి కలిశా. తను వేసే స్టెప్పులు సౌతిండియన్ స్టైల్‌లో ఉండేవి. దాంతో కొన్ని రీటేక్స్ తప్పలేదు. కానీ, డ్యాన్స్ బాగా చేసేది. పాట చిత్రీకరణలో తనకు తానుగా ఒకసారి నా దగ్గరకు వచ్చి 'సరోజ్‌జీ... ప్లీజ్ గివ్ మి మోర్ రిహార్సిల్స్ (నాతో ఎక్కువ రిహార్సిల్స్ చేయించండి). ఐయామ్ నాట్ ఎ గుడ్ డ్యాన్సర్ (నేను మంచి డ్యాన్సర్‌ని కాదు!)' అని చెప్పింది. తన నిజాయితీ చూసి నేను ఆశ్చర్యపోయా. ఆర్టిస్టులు ఎవరూ తాము సరిగా చేయలేమని చెప్పుకోరు. తర్వాత మేము మంచి స్నేహితులయ్యాం. శ్రీదేవితో సాంగ్ షూటింగ్ ఉంటే... నాకు ఓ ముద్దు వచ్చేది. సెట్‌లో అడుగు పెట్టగానే 'హల్లో సరోజ్' అని గట్టిగా కౌగిలించుకుని ఒక ముద్దు పెట్టుకునేది. నేనంటే తనకు అంత ఇష్టం. నాకు బాగా గుర్తు... ఒకసారి న్యూ ఇయర్ పార్టీకి నన్ను, నా దగ్గర పని చేసే ఆరుగురు డ్యాన్సర్లను మద్రాస్‌లోని వాళ్ళింటికి పిలిచింది. తనే ఫ్లైట్ టికెట్స్ పంపింది. మా ఆతిథ్యం మద్రాస్‌లోని వాళ్ళింటిలోనే. ఉదయం నిద్రలేవగానే నా తలదిండు పక్కన ఒక నగల పెట్టె ఉంది. నిద్ర లేచి చూడగానే నాకు భయం వేసింది. వేరే గదిలో పడుకున్నానేమో అనుకున్నా. వెంటనే వాళ్ళమ్మగారు కనిపించారు. విషయం చెప్పాను. 'శ్రీ' (శ్రీదేవి) నీకోసమే ఆ నగలు అక్కడ పెట్టారని చెప్పారు. అందులో డైమండ్ జ్యువెలరీ ఉంది. అలాగే, నా డ్యాన్సర్లు ఒక్కొకరికీ రూ. 11 వేలు ఇచ్చింది. పెళ్ళి చేసుకుని ఇండస్ట్రీని వదిలి వెళ్ళిన తర్వాత కలవడం తగ్గింది. ఒకసారి నేను కారులో వెళ్తుంటే ఆపింది. ఏంటని నేను కిందకు దిగితే.. తన పిల్లలు ఇద్దర్నీ నాకు పరిచయం చేసింది. తనెప్పుడు కలిసినా... ఎదుటివ్యక్తిని పలకరించే ఆప్యాయత మారదు.



కొరియోగ్రాఫర్ సరోజ్ ఖాన్‌తో..



శ్రీదేవి... సిరిగల దేవి!



అభినయ సిరిగల దేవి... అభిమాన సిరిగల దేవి... ఆత్మీయ సిరిగల దేవి... అతిలోక సుందరి శ్రీదేవి! అంటున్నారు దర్శకుడు ఎ. కోదండరామిరెడ్డి. శ్రీదేవి గురించి, ఆమెతో ఆయనకున్న అనుబంధం గురించి చిత్రజ్యోతితో ప్రత్యేకంగా సంభాషించారు.

ఒకసారి 'వజ్రాల దొంగ' పాటల రికార్డింగ్ కోసమని మద్రాస్ నుంచి బాంబే వెళ్తుంటే... వాళ్ళమ్మగారు 'ఏమీ అనుకోవద్దండీ! పాపకు పెరుగన్నం ఇష్టం. ఈ క్యాన్ తీసుకెళ్ళి ఇవ్వండి' అని చిన్న క్యాన్‌లో పెరుగన్నం ఇచ్చారు. నేను తీసుకెళ్ళి ఇవ్వగానే శ్రీదేవి ఎంత సంతోషపడిందో! బాంబేలో పెరుగన్నం దొరికినా... అమ్మ చేతి వంట అమ్మ చేతి వంటే కదా!

శ్రీదేవి ఇక లేరనే వార్త మీకు ఎప్పుడు తెలిసింది?

ఆదివారం ఉదయం ఎవరో ఫోన్ చేసి 'సార్... మెలకువగా ఉన్నారా? నిద్రపోయారా?' అనడిగారు. 'చెప్పండి' అన్నాను. 'శ్రీదేవిగారు చనిపోయారండీ' అన్నారు. ఠక్కున ఈ అమ్మాయి గుర్తు రాలేదు. 'ఏ శ్రీదేవి?' అనడిగా. ఎందుకంటే... తనకి ఎటువంటి ఆరోగ్య సమస్యలూ లేవు. అస్వస్థతకు గురైన వార్తలు వినలేదు. 'మన హీరోయిన్ శ్రీదేవి అండీ. బంధువుల పెళ్ళికని దుబాయ్ వెళ్ళారు. అక్కడ గుండెపోటుతో చనిపోయారు' అంటే... నా నోటి వెంట మాటలు రాలేదు. ఆల్ ఆఫ్ ఎ సడన్ శ్రీదేవి చనిపోయిందంటే... నేనసలు నమ్మలేదు.

మీరిద్దరూ ఒకరికొకరు ఎప్పుడు పరిచయమయ్యారు?

'కిరాయి కోటిగాడు' సెట్‌లో! నా దర్శకత్వంలో ఆ అమ్మాయి హీరోయిన్‌గా చేసిన మొదటి చిత్రమది. అంతకు ముందు తనతో పరిచయం లేదు. రైటర్ వెళ్ళి కథ చెప్తే... 'ఓకే' చేసింది. ఫస్ట్‌డే సెట్‌కి వచ్చినప్పుడు 'నా పేరు కోదండరామిరెడ్డి అమ్మా. డైరెక్టర్‌ని' అని పరిచయం చేసుకున్నా. 'అయ్యో... ఏంటండీ మీరు అలా చెబుతారు' అని గౌరవంగా మాట్లాడింది. తర్వాత 'రామరాజ్యంలో భీమరాజు', ఆ తర్వాత అక్కినేని నాగేశ్వరరావుగారితో చేసిన 'శ్రీరంగనీతులు' పెద్ద హిట్. అంతకు ముందు ఆయన చేసిన రెండు మూడు చిత్రాలు సరిగా ఆడలేదని అప్పుడు అక్కినేనిగారు సినిమాలు చేయకూడదనుకున్నారు. రచయిత డీవీ నరసరాజుగారికి నేను ఒక తమిళ సినిమా చూపించా. ఆయన ఇంప్రెస్ అయ్యి 'నాగేశ్వరరావు నాకోసం ఈ సినిమా తియ్. తప్పకుండా హిట్ అవుతుంది' అని చెప్పి కన్విన్స్ చేశారు. హీరోయిన్‌గా శ్రీదేవి అయితే బాగుంటుందని చెబితే.. అక్కినేనిగారు ఫోన్ చేసి ఆయనే మాట్లాడారు. మొత్తం మీద ఆ అమ్మాయి హీరోయిన్‌గా ఆరేడు చిత్రాలు చేశా.

సెట్‌లో శ్రీదేవి ఎలా ఉండేవారు?

చాలా మితభాషి! ఎవ్వరితోనూ ఎక్కువగా మాట్లాడేది కాదు. ఎవరినైనా కామెంట్ చేయడం గానీ... పల్లెత్తు మాట అనడం గానీ... ఉండదు. నాతో చాలా సన్నిహితంగా ఉండేది. ఏవైనా చిన్న చిన్న సమస్యలు (షూటింగులో) ఉంటే చెప్పేది గానీ ఒకరిపై ఎప్పుడూ కంప్లయింట్ చేయలేదు. ఇతరుల సినిమాల గురించి కామెంట్ చేయడం గట్రా లేవు. హీరోలు, హీరోయిన్ల గురించి బ్యాడ్‌గా చెప్పడం అసలే లేదు. నా దగ్గర అటువంటి మాటలూ జరగలేదు. నా దగ్గర జరగలేదంటే ఇంకెక్కడా జరిగి ఉండకపోవచ్చు.

ఎదుటివ్యక్తి చూపు తిప్పుకోనివ్వని అందం శ్రీదేవిది. సెట్‌లో జనాలు ఆమెను చూస్తుండేవారా?

మేకప్ వేసుకుని ఆ అమ్మాయి కారులోంచి దిగితే... ప్రతి ఒక్కరూ ఠక్కున ఆమె వైపు తిరగాల్సిందే. ఏం అందం అండీ! చీరకట్టు గానీ, మోడ్రన్ డ్రస్సు గానీ, లంగా ఓణీ గానీ... ఏది వేసుకున్నా ప్రతివాళ్ళూ ఒక్కసారి ఆ అమ్మాయిని చూస్తారు. అభిమానులు అయితే... అలాగే చూస్తారనుకోండి! భగవంతుడు ఆమెకు అంత అందం, మంచి శరీరాకృతి ఇచ్చాడు. బ్రహ్మాండమైన నటన ఇచ్చాడు.

మీరు అలా ఆశ్చర్యానికి గురైన సందర్భాలు ఉన్నాయా?

ఒక్కటా రెండా బోల్డన్నిసార్లు! కృష్ణ హీరోగా చేసిన 'కంచుకాగడా' చిత్రంలో శ్రీదేవి పాత్రకు చిన్న కామెడీ టచ్ ఇవ్వాలనుకుని చెబితే... అసలు చేసిందండీ? తను నటిస్తుంటే నేను పగలబడి నవ్వేవాణ్ణి. అంత బాగా చేస్తుంది. లవ్ సీన్స్ అయితే చెప్పనవసరం లేదు. 'ఒక రాధ - ఇద్దరు కృష్ణులు' చిత్రంలో కమల్ (హాసన్), శ్రీదేవి పోటీపడి నటించారు. నాకు ఏం అర్థమయ్యేది కాదు. నవ్వుతూనే ఉండేవాణ్ణి. ఎక్కడ కట్ చెప్పాలో తెలిసేది కాదు. సెట్‌లో నవ్వులే నవ్వులు. అరగంట సేపు షాట్‌లోంచి ఎవరూ బయటకు వచ్చేవాళ్ళం కాదు. అతనూ విపరీతంగా చేసేసి, ఆమె కూడా విపరీతంగా చేసేసి... ఇద్దరూ ఏం ఆర్టిస్టులండీ!

శ్రీదేవితో షూటింగ్‌కి ఎవరైనా వచ్చేవారా? ఆ అమ్మాయికి స్నేహితులు ఉన్నారా?

చిత్రపరిశ్రమలో ఎవరితోనూ సన్నిహితంగా ఉండేది కాదు. షూటింగులకు అప్పుడప్పుడూ చెల్లెలు శ్రీలత వచ్చేది. చిన్ననాటి స్నేహితులున్నారు. వాళ్ళంతా సాయంత్రం వేళల్లో ఆమె ఇంటికి వచ్చేవారు. ఇక, శ్రీదేవికి తల్లి రాజేశ్వరి అంటే ప్రాణం. ఆమె మరణించినప్పుడు భోరున విలపించింది. బ్రెయిన్‌లో రాంగ్ ఆపరేషన్ వల్ల తల్లి ప్రాణాలు విడిచిందనే వార్త విని శ్రీదేవి తట్టుకోలేకపోయింది.



తల్లి రాజేశ్వరితో

కమల్, శ్రీదేవి నటన మీకు విపరీతంగా నచ్చేయడంతో 'ఒక రాధ ఇద్దరు కృష్ణులు'లో సన్నివేశాలను హిందీ సినిమాలో ఉపయోగించారట?

అవును. రెండు సన్నివేశాలను ఉపయోగించా! 'అత్తకు యముడు అమ్మాయికి మొగుడు' చిత్రాన్ని హిందీలో అనిల్‌కపూర్, మాధురీ దీక్షిత్ జంటగా 'జమాయీ రాజా' పేరుతో రీమేక్ చేశా. 'ఒక రాధ ఇద్దరు కృష్ణులు'లో ఫస్ట్ నైట్ సీన్లు బ్రహ్మాండంగా పేలాయి. అందుకని, 'జమాయీ రాజా'లో పెట్టాను. అనిల్, మాధురి బాగానే చేశారు. కానీ, నాట్ అప్ టు ద మార్క్. కమల్, శ్రీదేవి చేసిన తర్వాత వాళ్ళ బదులు వేరేవాళ్ళని ఊహించుకోలేం.

విమానంలో పెరుగన్నం తీసుకెళ్ళా!

శ్రీదేవికి బాగా తినడం ఇష్టం. కానీ, తినలేదు. ఆర్టిస్టు కదా! తినకూడదు. నాకు తెలిసి ఆ అమ్మాయికి పెరుగన్నం అంటే చాలా ఇష్టం.

శ్రీదేవి నిర్మాత, చిరంజీవి హీరో.. ఆ సినిమా ఆగిపోయింది



శ్రీలత, వి.ఎస్.ఆర్. స్వామి, ఎమ్.జీ.ఆర్, కోదండరామిరెడ్డి, శ్రీదేవి, చిరంజీవి

ఎంతోమంది దర్శకులు శ్రీదేవికి సక్సెస్‌లు ఇచ్చారు. ఎంతోమంది దగ్గర పని చేసింది. ఎందుకనో... నేనంటే కొంచెం అభిమానం. తను సొంత సినిమా చేయాలనుకున్నప్పుడు ఆ చిత్రానికి నన్ను దర్శకత్వం వహించమని కోరింది. చిరంజీవి హీరోగా, శ్రీదేవి హీరోయిన్‌గా 'వజ్రాల దొంగ' (అప్పట్లో టైటిల్ అనౌన్స్ చేయలేదు!) ప్రారంభించాం. వాళ్ళ సిస్టర్‌తో కలిసి శ్రీదేవి ఆ చిత్రాన్ని నిర్మించాలనుకుంది. ముంబైలో పాటల రికార్డింగ్ కూడా చేశాం. పాటల రికార్డింగ్ దగ్గర ప్రతి బిట్ దగ్గరుండి చూసుకుంది. ఎక్కడ కలెక్ట్ చేసి పెట్టిందో తెలీదు కానీ... బోల్డంత కలెక్షన్ ఆమె దగ్గర ఉంది. సంగీత దర్శకుడు బప్పీ లహరికి అవన్నీ వినిపించి సాంగ్స్ రికార్డింగ్ చేయించుకుంది. కానీ, సినిమా మధ్యలోనే ఆపేశాం.

అందుకే ఆగిపోయింది




కోదండరామిరెడ్డి, శ్రీదేవి, చిరంజీవి

మణిరత్నం 'మౌనరాగం'లోని ఫ్లాష్‌బ్యాక్ స్ఫూర్తితో 'వజ్రాల దొంగ' కథ రెడీ చేశాం. యండమూరి వీరేంద్రనాథ్ రచయిత. పది రోజులు షూటింగ్ చేశాం. చెన్నైలో రెండు పాటలు తీశాం. అప్పటికే సినిమాకి విపరీతమైన క్రేజ్ వచ్చింది. సాధారణంగా బయ్యర్స్ ఎప్పుడూ నా దగ్గరకి వచ్చి 'సినిమా మాకు ఇప్పించండి' అని అడగలేదు. ఆ సినిమాకు చాలామంది పోటీపడ్డారు. నా దగ్గరకు వచ్చి రికమండ్ చేయమనే వారు. సినిమా క్రేజ్ చూసి నాకు డౌట్ వచ్చింది. ఒకవేళ మనం అంచనాలను అందుకోలేకపోతే... నాకు బ్యాడ్‌నేమ్ వస్తుంది. వాళ్ళిద్దరూ తొలిసారి నటిస్తున్నారు. వాళ్ళ కాంబినేషన్‌కి బ్యాడ్‌నేమ్ వస్తుంది. ఫస్ట్‌టైమ్ ఆ అమ్మాయి నిర్మాతగా చేస్తుంది. తనకీ బ్యాడ్‌నేమ్ వస్తుంది. ఎన్నో ఆలోచనలు. శ్రీదేవి దగ్గరకు వెళ్ళి 'అమ్మా... నాకెందుకో మనం ఇప్పుడు చేస్తున్న సబ్జెక్ట్, అంచనాలను అందుకుంటుందా? లేదా? అనే చిన్న డౌట్ ఉంది. ఏం చేద్దాం?' అన్నాను. 'సాంగ్స్ అయితే బాగున్నాయి. సబ్జెక్ట్ గురించి నాకు పెద్దగా తెలీదు. కొన్నాళ్ళు ఆపేసి, వేరే మంచి కథతో సినిమా చేద్దాం. లేదంటే ఇదే కథను మరింత బాగా చేసే అవకాశం ఉందేమో చూడండి' అని చెప్పింది. చాలామంది రచయితలతో కూర్చుని కథపై కసరత్తులు చేశాం. సరిగా రాలేదు. 'మిస్టర్ ఇండియా'ను తెలుగులో రీమేక్ చేద్దామా? అని శ్రీదేవి అడిగింది. చిరంజీవిగారు కూడా రషెస్ చూశారు. మాకు పెద్దగా నచ్చలేదు. లెంగ్త్ ఎక్కువని భావించాం. నాలుగైదు గంటలు వరుసగా ఆ సినిమా చూసేసరికి ఆ అమ్మాయికి బోర్ కొట్టింది. అలా అలా సినిమాను ఆపేశాం.

'కొండవీటి దొంగ' కు అడిగాం

లేదు. ఆ పాటలను శ్రీదేవి ఎవరికీ ఇవ్వనని చెప్పింది. నేను అమ్ముకునే మనిషిని కాదని వదిలేసింది. చిరంజీవి హీరోగా తీసిన 'కొండవీటి దొంగ'కు ముందు ఆ అమ్మాయినే అడిగాం. తను ఒప్పుకుంటే... సింగిల్ హీరోయిన్ సిన్మాగా చేద్దామనుకున్నాం. అప్పుడా పాటలను ఉపయోగించుకోవచ్చనేది నా ప్లాన్. నిర్మాత టి. త్రివిక్రమరావుగారితో వెళ్ళి 'అమ్మా! ఆ రెండు పాటలను వాడుకుంటాం. మీకు ఎంత ఖర్చు అయ్యిందో చెబితే ఇచ్చేస్తాం. మా సినిమాలో మీరు హీరోయిన్‌గా చేస్తే సంతోషం. మన కాంబినేషన్‌లో ఆ సినిమా కుదరలేదు. కనీసం ఇదైనా చేద్దాం' అని అడిగా. ముందు 'ఆలోచించుకుని చెప్తా' అంది. టైటిల్ ఏంటి? అనడిగితే... 'కొండవీటి దొంగ' అన్నాను. వాళ్ళమ్మగారితో ఆలోచించుకుని 'వద్దులేండి' అన్నారు. తర్వాత ఇద్దరు హీరోయిన్ల సినిమాగా విజయశాంతి, రాధలతో చేశా. తర్వాత చిరంజీవి, శ్రీదేవి జంటగా దత్తు (అశ్వినీదత్) గారు 'జగదేకవీరుడు - అతిలోక సుందరి' చేశారు.

శ్రీదేవి ముఖం చూస్తే మీకు గుర్తొచ్చే అంశం?




ఆ అమ్మాయిది అమూల్ బేబి ఫేస్ అండీ! ఆమె ముఖంపై క్లోజ్ అప్ పెడితే కట్ చెప్పాలని అనిపించదు. అలా చూడాలని అనిపిస్తుంది.

శ్రీదేవి నుంచి ఇతరులు నేర్చుకోవలసిన అంశాలు?

క్రమశిక్షణ, సమయపాలన (టైమింగ్), ఎదుటివారిని గౌరవించే తత్వం, చిత్రంలో పాత్రను అర్థం చేసుకునే తీరు! అంత క్రమశిక్షణ గల అమ్మాయిని నేను చూడలేదు. చెప్పిన టైమ్‌కి సెట్‌కి వచ్చేది. దర్శకుడు, మేకప్ ఆర్టిస్ట్ నుంచి చిన్న టెక్నీషియన్ దాకా ప్రతి ఒక్కరినీ నవ్వుతూ పలకరించేది.

అతిలోక సుందరి బిరుదుతో పాటు నటిగానూ శ్రీదేవికి మంచి పేరు తెచ్చుకున్నారు. నటిగా అంత పేరు రావడానికి కారణం ఏంటంటారు?

ఏ క్యారెక్టర్‌ను అయినా ఓన్ చేసుకునేది. తర్వాతరోజు నటించే సన్నివేశాలను ముందురాత్రి సిస్టర్ శ్రీలతతో డిస్కస్ చేసేదేమో? తెలీదు గానీ... మనం చెప్పినదాని కంటే రెండొందల శాతం అద్భుతంగా చేసేది. 'నేను చేసి చూపించింది ఇదా? ఇంత బాగా చేశానా?' అనుకుంటా. తర్వాత 'లేదు. ఆ అమ్మాయే చాలా బాగా చేసింది' అనిపించేది. నటించి మెప్పించేది. ఆ అమ్మాయి బాడీలో విపరీతమైన ఈజ్, గ్రేస్. ఏదైనా ఓన్ చేసుకోగలదు. చేసుకుని ఈజీగా గ్రేస్ యాడ్ చేసి చేస్తుంది. అందరూ డ్యాన్సులు చేస్తారు. అందరూ డైలాగులు చెప్తారు. అందరూ నడుస్తారు. కానీ, ఆ అమ్మాయి నడకలో, డ్యాన్స్‌లో ఒక గ్రేస్ ఉంటుంది. కళ్ళతో గానీ పెదాలతో గానీ చిన్న చమక్‌లు యాడ్ చేస్తుంది. ముఖ్యంగా ఆర్టిస్టులకు కావలసింది అదే! నాకు తనని చూస్తే ఆశ్చర్యం అనిపించేది.



సోదరి శ్రీలతతో..

భారత్ మనకేమీ
మేలు చేయడం లేదు : ట్రంప్

వాషింగ్టన్ : భారత దిగుమతి సుంకాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. హార్లీ డేవిడ్‌సన్ మోటార్ సైకిళ్లపై భారత్ విధిస్తున్న 50 శాతం దిగుమతి సుంకం ఇంకా ఎక్కువగానే ఉన్నట్టు గవర్నర్ల సమావేశంలో చెప్పారు. 'భారత ప్రధాని అద్భుతమైన వ్యక్తి. ఈ బైకులపై దిగుమతి సుంకాన్ని 50 శాతానికి తగ్గించినట్టు మోదీ ఇటీవల నాకు ఫోన్ చేసి చెప్పారు. అయితే ఆ చర్యతో మన హార్లీ డేవిడ్‌సన్ కంపెనీకి ఎలాంటి మేలు జరగదు' అన్నారు. మనం మాత్రం ఇప్పటికే ఎలాంటి సుంకాలు లేకుండానే భారత బైకుల దిగుమతులను అనుమతిస్తున్నాం అన్నారు.

విదేశీ పెట్టుబడులకు అన్ని విధాలా రక్షణ

భారత్ అత్యంత స్వేచ్ఛా విపణి.. ప్రపంచంతో వాణిజ్యానికి మా దేశం సిద్ధం

» కొరియా పారిశ్రామిక వర్గాలతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: భారత్‌లో భారీగా పెట్టుబడులు పెట్టాలని, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విదేశీ ఇన్వెస్టర్లను ప్రధాని మోదీ కోరారు. విదేశీ పెట్టుబడుల పోత్సాహం, రక్షణకు అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ), పారిశ్రామిక విధానం, ప్రోత్సాహక మండలి (డిఐపిపి) సంయుక్తంగా నిర్వహించిన ఇండియా-కొరియా బిజినెస్ సమ్మిట్‌లో ప్రధాని ప్రసంగిస్తూ.. ప్రపంచంతో వాణిజ్యానికి భారత మార్కెట్ సర్వసన్నద్ధంగా ఉందని, అత్యంత స్వేచ్ఛా విపణి తమదేనని అన్నారు. ఈ స్థాయి స్వేచ్ఛ, అభివృద్ధి కలిగిన మార్కెట్ ప్రపంచంలో మరెక్కడా లేదని ఆయన పేర్కొన్నారు. వ్యాపారాలకు నిలకడైన వాతావరణం ఏర్పాటు చేసేందుకు తమ ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు చేపట్టిందన్నారు.

ఒక్క రక్షణ రంగం మినహాయిస్తే మాన్యుఫ్యాక్చరింగ్ రంగ పెట్టుబడులకు ప్రభుత్వ అనుమతులు అక్కర్లేదని మోదీ పేర్కొన్నారు. ఆసియాలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారత్‌లోని 90 శాతం రంగాల్లో విదేశీ ఇన్వెస్టర్లు ప్రభుత్వ అనుమతి అవసరం లేకుండా నేరుగానే పెట్టుబడులు పెట్టవచ్చు. వినియోగదారుల కొనుగోలు శక్తిపరంగా భారత్ మూడో అతిపెద్ద దేశమని, జిడిపిపరంగా చూస్తే త్వరలోనే ఐదో అతిపెద్ద ఎకానమీగా ఎదగనుందని ప్రధాని అన్నారు. ప్రపంచంలో శరవేగంగా వృద్ధి చెందుతున్న వర్ధమాన దేశం కూడా ఇండియానే అని అన్నారు. ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమైన అంశాలైన డెమోక్రసీ (ప్రజాస్వామ్యం), డెమోగ్రఫీ (అధిక జనాభా), డిమాండ్ (గిరాకీ) కలిగి ఉన్న అతికొద్ద దేశాల్లో భారత్ ఒకటని మోదీ పేర్కొన్నారు.



అంతర్జాతీయంగా పోటీపడగలిగేలా నైపుణ్యం, వేగం, వ్యాప్తి కలిగిన తయారీ, సేవా రంగ సంస్థలను ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మోదీ అన్నారు. పెట్టుబడుల వాతావరణాన్ని మెరుగుపర్చేందుకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, దేశంలోని యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పించగలిగేలా వస్తు తయారీని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలనుకుంటున్న ప్రధాని చెప్పారు. దేశంలో వ్యాపార నిర్వహణకు అనూకూలంగా ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన పలు సంస్కరణలను కొరియా పారిశ్రామిక వర్గాలకు వివరించారు.

ప్రస్తుతం ఒకే జిఎస్‌టి రేటు కుదరదు

చెల్లింపులు పెరిగితే అప్పుడు చూద్దాం: ఆర్థిక మంత్రి జైట్లీ

న్యూఢిల్లీ: అన్ని వస్తు, సేవలపై ఒకే జిఎస్‌టి పన్ను రేటు ఉండాలన్న డిమాండ్‌ను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తోసిపుచ్చారు. పేదలు, ధనికుల మధ్య భారీ స్థాయిలో తారతమ్యాలు ఉన్న మన దేశంలో ప్రస్తుతానికి అది కుదిరే పని కాదన్నారు. పన్నులు చెల్లించాల్సి వారంతా పన్నులు చెల్లించే దశకు చేరితే ఈ విషయంలో ప్రభుత్వం మరిన్ని సంస్కరణలకు సిద్ధమవుతుందని హామీ ఇచ్చారు. ఢిల్లీలో సిఐఐ నిర్వహించిన 'భారత-కొరియా వ్యాపార సదస్సు'లో ఆర్థిక మంత్రి ఈ విషయాలు చెప్పారు. 'ఉదాహరణకు ప్రస్తుతం రెండు ప్రామాణిక పన్ను రేట్లు ఉన్నాయి. పన్ను చెల్లింపులు పెరిగితే వాటిని ఒకే రేటుగా విలీనం చేసే విషయం పరిశీలిస్తాం. అయితే మనం ఆ స్థాయికి చేరేందుకు కొంత సమయం పడుతుంది' అన్నారు. 17 రకాల పన్నులు, 23 సెస్సులను విలీనం చేయడంతోనే జిఎస్‌టిలో ప్రస్తుతం ఇన్ని శ్లాబులు నిర్ణయించాల్సి వచ్చిందని జైట్లీ చెప్పారు. అతి కొద్ది వస్తు, సేవలను మాత్రమే అత్యధిక శ్లాబైన 28 శాతం పన్ను రేటులో ఉంచిన విషయాన్ని గుర్తు చేశారు. తీవ్ర ఆర్థిక వ్యత్యాసాలున్న మన దేశంలో విలాస వస్తువులపై తక్కువలో తక్కువగా ఐదు శాతం జిఎస్‌టి విధించడం సాధ్యం కాదన్నారు.



అధిక వృద్ధి రేటు సాధించే సత్తా

ఏటా ఏడెనిమిది శాతానికి మించి జిడిపి వృద్ధి రేటు సాధించే సత్తా భారత ఆర్థిక వ్యవస్థకు ఉందని జైట్లీ ఒక జైట్లీ చెప్పారు. విధానపరంగా ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పాటు, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు కూడా ప్రస్తుతం ఇందుకు అనుకూలంగా ఉన్నట్టు తెలిపారు. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలో ఒకటైన మన ఆర్థిక వ్యవస్థ మరో 10-20 సంవత్సరాల వరకు అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందన్నారు. అంతర్జాతీయ పరిస్థితులు అనుకూలంగా లేని సమయంలోనూ మన ఆర్థిక వ్యవస్థ ఈ రికార్డు సొంతం చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు.

రాష్ట్రాల మధ్య పోటీ

మరో 10-20 సంవత్సరాల పాటు మన దేశ తయారీ రంగంలో వృద్ధి రేటు కొనసాగుతుందని జైట్లీ చెప్పారు. ప్రభుత్వం కూడా ఇందుకు దోహదం చేసే చర్యలు తీసుకుంటుందన్నారు. పెట్టుబడుల కోసం రాష్ట్రాల మధ్యా ప్రస్తుతం తీవ్ర పోటీ నెలకొందన్నారు.

ఎఐఐబి నుంచి మరిన్ని నిధులు

దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ఆసియా మౌలిక పెట్టుబడుల బ్యాంక్ (ఎఐఐబి) నుంచి మరిన్ని నిధులు ఆశిస్తున్నట్టు ఆర్థిక మంత్రి జైట్లీ చెప్పారు. ఈ బ్యాంకు ద్వారా గత రెండేళ్లలో ఐదు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు 100 కోట్ల డాలర్లకుపైగా రుణాలు అందాయి. 350 కోట్ల డాలర్ల రుణం కోసం మరో 12 ప్రాజెక్టులు ఎఐఐబి పరిశీలనలో ఉన్నట్టు ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులు చెప్పారు. ఆసియా దేశాల్లో మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అభివృద్ధిలో ఎఐఐబి కీలక పాత్ర వహించాలని అరుణ్ జైట్లీ కోరారు.

మూడు సంస్థలతో గూగుల్ జట్టు



న్యూఢిల్లీ: గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజం గూగుల్ తన సేవల పరిధిని మరింత విస్తృతం చేసేందుకు భారత్‌కు చెందిన మూడు సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఆ వివరాలు..

ఎయిర్‌టెల్ ద్వారా ఆండ్రాయిడ్ గో స్మార్ట్‌ఫోన్లు

గత డిసెంబరులో గూగుల్ తక్కువ ధరలో విడుదల చేసిన ఆండ్రాయిడ్ ఓరియో గో 4జి స్మార్ట్‌ఫోన్లు భారత మార్కెట్‌లో ప్రవేశపెట్టడానికి భారతి ఎయిర్‌టెల్, గూగుల్ ఒప్పందం కుదుర్చుకున్నాయి. 1 జిబి రామ్ కన్నా తక్కువ సామర్థ్యం గల ఓరియో గో స్మార్ట్‌ఫోన్లలో తక్కువ డేటా వినియోగించుకుంటూ వేగంగా పనిచేసే యాప్స్‌ను అమర్చారు. ఎయిర్‌టెల్‌కు చెందిన 'మేరా పెహలా స్మార్ట్‌ఫోన్' కార్యక్రమం కింద ఆండ్రాయిడ్ ఓరియో (గో ఎడిషన్) ఆపరేటింగ్ సిస్టమ్‌తో కూడిన జడ్ 50 స్మార్ట్‌ఫోన్లు మార్చి నెల మధ్యలో దేశవ్యాప్తంగా లక్షకి పైగా ఎయిర్‌టెల్ రిటైల్ స్టోర్లలో అందుబాటులో ఉంటాయి. మై ఎయిర్‌టెల్, ఎయిర్‌టెల్ టీవీ, వింక్ మ్యూజిక్ యాప్‌లతో వీటిని మార్కెటింగ్ చేస్తామని ఎయిర్‌టెల్ ప్రకటించింది. వీటిలో 4.5 అంగుళాల డిస్‌ప్లే, ఒక గిగాహెడ్జ క్వాడ్ కోర్ ప్రాసెసర్, 1 జిబి రామ్, 8 జిబి ఇంటర్నల్ మెమమీ, 5 ఎంపి వెనుక కెమెరా, ఫ్లాష్‌తో కూడిన ఫ్రంట్ కెమెరా ఉంటాయి. అయితే దాని ధర ఎంత ఉంటుందనేది వెల్లడించలేదు.

అపోలోతో కలిసి సింప్టమ్స్ సెర్చ్ ఫీచర్

తమ సెర్చ్ ఇంజిన్ ద్వారా అనారోగ్య లక్షణాల గురించి శోధించే వారికి మరింత మెరుగైన సమాచారం అందించేందుకు 'సింప్టమ్స్ సెర్చ్' పేరుతో సరికొత్త ఫీచర్‌ను గూగుల్ అందుబాటులోకి తేనుంది. ఇందుకోసం కార్పొరేట్ ఆసుపత్రుల నిర్వహణ సంస్థ అపోలో హాస్పిటల్స్‌తో జట్టు కట్టింది. ఇంటర్నెట్‌లో ఎక్కువగా శోధించే అనారోగ్య లక్షణాల గురించిన సమాచారాన్ని ఈ వారంలో జోడించనున్నట్లు, ఈ ఫీచర్ ఇంగ్లీష్, హిందీలో అందుబాటులో ఉంటుందని గూగుల్ తెలిపింది.

ఎస్‌బిఐతో గూగుల్ తేజ్ అనుసంధానం

దేశంలో డిజిటల్ లావాదేవీలను మరింత విస్తృతం చేసేందుకు గూగుల్‌కు చెందిన డిజిటల్ చెల్లింపుల మొబైల్ యాప్ తేజ్.. దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ ఎస్‌బిఐతో అనుసంధానితమైంది. ఈ భాగస్వామ్యం ద్వారా తేజ్ వినియోగదారులు తమ యాప్ ద్వారా ఎస్‌బిఐ యుపిఐ ఐడీని క్రియేట్ చేసుకోగలిగే సౌకర్యం కలిగిస్తున్నట్లు ఎస్‌బిఐ, గూగుల్ సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో తెలిపాయి. అంతే కాదు, ఎస్‌బిఐ కస్టమర్లకందించే ఎక్స్‌క్లూజివ్ ఆఫర్లను గూగుల్ తేజ్ యూజర్లు కూడా పొందవచ్చు. యునిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) ప్లాట్‌ఫాంపై నిర్మించిన గూగుల్ తేజ్ ద్వారా యూజర్లు తమ బ్యాంక్ ఖాతా నుంచి ఇతర ఖాతాలకు చెల్లింపులు జరిపేందుకు, నగదు బదిలీ చేసేందుకు వీలుంటుంది.



నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ స్కామ్‌లో
పిఎన్‌బి నష్టం 200 కోట్ల డాలర్లు

ఫైర్‌స్టార్ డైమండ్ దివాలా .. అలహాబాద్ బ్యాంక్ ఎండిని ప్రశ్నించిన సిబిఐ



న్యూఢిల్లీ : మేనమామ మెహుల్ చోక్సీతో కలిసి నీరవ్ మోదీ ప్రభుత్వ రంగ బ్యాంకు పిఎన్‌బికి వేసిన టోపీ మొత్తం 200 కోట్ల డాలర్ల (12,800 కోట్ల రూపాయలు)కు చేరింది. గతంలో వేసిన అంచనా (11400 కోట్ల రూపాయలు) కంటే ఇది మరో 1,400 కోట్ల రూపాయలు ఎక్కువ. ఈ విషయం పిఎన్‌బి అధికారికంగా వెల్లడించింది. ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకుల అంచనా. మామాఅల్లుళ్లు పిఎన్‌బితో పాటు ఇతర బ్యాంకుల్లోనూ భారీగానే రుణాలు తీసుకున్నారు. ఆ లెక్కలు కూడా బయటకు రావాల్సి ఉంది. అమెరికాలోని నీరవ్ మోదీ కంపెనీ ఫైర్‌స్టార్ డైమండ్ న్యాయస్థానంలో దివాలా పిటిషన్ దాఖలు చేసింది. తమ ఆస్తులు, అప్పుల మొత్తం దాదాపు 10 కోట్ల డాలర్లు ఉన్నట్టుగా పిటిషన్‌లో ఫైర్‌స్టార్ పేర్కొంది. నీరవ్ మోదీ గ్రూప్‌లో ఇది ఫ్లాగ్‌షిప్ కంపెనీ.

ఇదిలా ఉండగా బ్యాంకుల మొండిపద్దుల్లోనూ స్కామ్ లు ఉండి ఉంటాయని ప్రభుత్వం అనుమానిస్తోంది. 50 కోట్ల రూపాయల పైబడిన ఎన్‌పిఎల్లో మోసాలు ఏమైనా ఉన్నాయా అన్న విషయం క్షుణ్ణంగా పరిశీలించాలని ప్రభుత్వం పిఎస్‌యు బ్యాంకులను ఆదేశించింది. మరోవైపు అలహాబాద్ బ్యాంక్ ఎండి, సిఇఒ ఉషా అనంత సుబ్రమణియన్‌ను సిబిఐ ప్రశ్నించింది. ఈ కేసుకు సంబంధించిన ముఖ్య పరిణామాలు...

డుమ్మా...

నీరవ్ మోదీ, ఆయన భార్య అమీ, మేనమామ చోక్సీ సోమవారం నాడు లెక్క ప్రకారం ఇడి ఎదుట హాజరుకావాల్సి ఉంది. అయితే వారు పరారీలో ఉన్న విషయం తెలిసిందే. ఇడి సమన్లను వారు పట్టించుకోలేదు. మోదీ, చోక్సీ కుటుంబాలకు సంబంధించి విదేశాల్లో ఉన్న ఆస్తులపై కూడా ఇడి, సిబిఐ దృష్టి సారించాయి. న్యాయస్థానాల సహకారంతో విదేశాల్లోనూ సమాచారం సేకరించడానికి వీలుగా స్పెషల్ కోర్టు లెటర్స్ రోగాటరీని జారీ చేస్తోంది. ఇడి ఎదుట హాజరు కాకుండా డుమ్మా కొట్టడంతో నీరవ్‌మోదీకి వ్యతిరేకంగా నాన్‌బెయిలబుల్ వారెంట్స్ జారీ చేయాలని ఇడి అధికారులు మంగళవారం నాడు స్పెషల్ కోర్టులో పిటిషన్ వేశారు.

పిఎన్‌బి ఎండి, సిఇఒకు సమన్లు..

దేశాన్ని కుదిపేసిన భారీ బ్యాంకింగ్ స్కామ్ గురించి ప్రశ్నించేందుకు బ్యాంకు ఎండి, సిఇఒ సునీల్ మెహతాను తమ ఎదుట హాజరుకావాల్సిందిగా ఇడి ఆదేశించింది. సిబిఐ ఇప్పటికే బ్యాంకు ఇడి కెవి బ్రహ్మాజీ రావును ప్రశ్నించింది. అలహాబాద్ బ్యాంకు సిఇఒ ఎండి ఉషా సుబ్రమణియన్‌ను కూడా సిబిఐ అధికారులు ప్రశ్నించారు. ఈ మధ్యనే ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ) చీఫ్‌గా ఎన్నికైన ఉషా సుబ్రమణియన్ 2011-2017 మధ్యకాలంలో పిఎన్‌బిలో కీలకమైన బాధ్యతలు నిర్వహించారు. ఆ సమయంలోనే నీరవ్ మోదీ, చోక్సీ బ్యాంకును డొల్లగొట్టారు. మరోవైపు స్కామ్‌లు, రిస్క్‌లకు అవకాశం లేకుండా వ్యవస్థలను పక్కాగా తయారుచేసే వ్యూహాన్ని రూపొందించాలని పిఎస్‌యు బ్యాంకులకు ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకోసం 15 రోజుల గడువు ఇచ్చింది.

చేతులెత్తేసిన ఫైర్‌స్టార్

నీరవ్ మోదీ కంపెనీల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన వెంచర్ ఫైర్‌స్టార్ దివాలా పిటిషన్ దాఖలు చేయడం సంచలనం కలిగించింది. న్యూయార్క్ కేంద్రంగా వ్యాపారం చేస్తున్న ఈ సంస్థ న్యూయార్క్ సదరన్ బ్యాంక్‌రప్టసీ కోర్టులో సోమవారం నాడు దివాలా పిటిషన్‌ను దాఖలు చేసింది. అమెరికా, యూరప్, మధ్య ప్రాచ్య, దూరప్రాచ్య దేశాల్లో తనకు వ్యాపారాలున్నట్టుగా సంస్థ పిటిషన్‌లో పేర్కొంది. లిక్విడిటీ, సప్లయ్ చెయిన్ సమస్యల వల్ల దివాలా తీసినట్టు పేర్కొంది.

FIRESTAR DIAMOND

One source. Many advantages.

15 రోజుల్లో మోసాలను అరికట్టే చర్యలు

» పిఎస్‌బిలకు సర్కార్ ఆదేశాలు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంకు (పిఎస్‌బి)ల్లో మోసాలను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆర్థిక మోసాలకు అవకాశం ఉన్న నిర్వహణపరమైన, సాంకేతిక పరమైన లోపాలను గుర్తించి, 15 రోజుల్లో వాటిని అధిగమించేందుకు అవసరమైన చర్యలు సిద్ధం చేయాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ పిఎస్‌బిలను ఆదేశించింది. నీరవ్ మోదీ మోసంతో వాటిల్లిన నష్టం మరో 20.42 కోట్ల డాలర్లు పెరుగుతుందని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) ప్రకటించిన వెంటనే ప్రభుత్వం ఈ చర్యలకు ఉపక్రమించడం విశేషం. పిఎస్‌బిల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, చీఫ్ టెక్నాలజీ అధికారులే ఈ బాధ్యత తీసుకోవాలని ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ ఈ ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆర్థిక మోసాలను ఎదుర్కొనేందుకు బ్యాంకింగ్ రంగంలో అమలవుతున్న అత్యుత్తమ విధానాలను పిఎస్‌బిలూ అనుసరించాలని కోరారు.

ఆర్థిక లావాదేవీల్లో సీనియర్ అధికారుల బాధ్యతలనూ పక్కాగా నిర్ణయించాలని స్పష్టం చేశారు. పిఎస్‌బిల ఆర్థిక పరిపుష్టి కోసం వచ్చే రెండేళ్లలో ప్రభుత్వం రూ.2.11 లక్షల కోట్లు సమకూర్చబోతోంది. నీరవ్ మోదీలా మరే మోసగాడు పిఎస్‌బిలను మోసగించి ఈ నిధులు కాజేయకుండా అడ్డుకునేందుకు ప్రభుత్వం ఈ చర్య తీసుకుందని భావిస్తున్నారు.

బహుళ అంతస్తుల భవనాల కోసం 'మైగేట్'

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : బహుళ అంతస్తుల నివాస భవనాలకు సెక్యూరిటీ సొల్యూషన్లు అందించే స్టార్టప్ కంపెనీ మైగేట్ హైదరాబాద్ మార్కెట్లో ప్రవేశించింది. బహుళ అంతస్తుల భవనాల కోసం మైగేట్ యాప్ ఆధారిత మొబైల్ డివైస్‌ను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా కంపెనీ డైరెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన తమ యాప్ ఆధారిత డివైస్‌కు మంచి స్పందన లభించిందని, ప్రస్తుతం మై హోమ్ జువెల్, అపర్ణ సరోవర్, లోధా బెలెజ్జా, రెయిన్‌బో విస్టాస్‌లలో తాము దీన్ని ప్రవేశపెట్టామని చెప్పారు. ఈ ఏడాది హైదరాబాద్‌లో కనీసం 400 బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ భవన సముదాయాలకు తమ సొల్యూషన్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ఇది యాప్ ఆధారితంగా పని చేసే మొబైల్ పరికరం అని, సెక్యూరిటీ సిబ్బంది వద్ద పరికరం ఉంటుందని, కస్టమర్లు మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని దాని ద్వారా సెక్యూరిటీ సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేయవచ్చునని కంపెనీ వ్యవస్థాపకుడు విజయ్ అరిసెట్టి తెలిపారు. బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ సముదాయాల్లో నివశిస్తున్న వారు క్యాబ్‌లు బుక్ చేసుకోవడం దగ్గర నుంచి వివిధ వస్తువుల డెలివరీ వరకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ యాప్ ఆ ఇబ్బందిని పరిష్కరిస్తుందని ఆయన వివరించారు. ఉదాహరణకి క్యాబ్ బుక్ చేసుకుంటే అది సెక్యూరిటీ వద్దకు రాగానే సెక్యూరిటీ సిబ్బంది దానికి అనుమతి ఇవ్వవచ్చునా లేదా అన్నది సంబంధిత ఫ్లాట్‌లోని వారిని ఇంటర్‌కామ్‌లో సంప్రదిస్తారని, ఈ డివైస్ ఉన్నట్టయితే యాప్ ద్వారా ముందస్తుగానే సెక్యూరిటీకి తగు ఆదేశాలు జారీ చేయడం ద్వారా కారు వచ్చి కస్టమర్ పేరు చెప్పగానే సిస్టమ్ ఓకె చేయడం వల్ల ఇంటర్‌కామ్ అనుమతుల ఇబ్బంది తప్పుతుందని ఆయన పేర్కొన్నారు. ఇందులో వివిధ రకాల వెండర్లను, విజిటర్లను అనుమతించడం దగ్గర నుంచి ఇళ్లలోని వృద్ధులు, పిల్లల సంక్షేమానికి అలర్టులు పంపే సదుపాయం కూడా ఉంటుందని ఆయన చెప్పారు.

హెటెరో నుంచి
హెచ్‌ఐవి ఔషధం

HETERO

న్యూఢిల్లీ: హ్యూమన్ ఇమ్యూనోడెఫిషియెన్సీ వైరస్ (హెచ్ఐవి-1) చికిత్సలో ఉపయోగించే ఎమ్‌ట్రిసిటాబైన్ (200 ఎంజి) అండ్ టెనోఫోవిర్ అలాఫెనామైడ్(25 ఎంజి)కు జనరిక్ యాంటీ రెట్రోవైరల్ ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్‌ను విడుదల చేసినట్లు ఔషధాల తయారీ సంస్థ హెటెరో ప్రకటించింది. డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డిసిజిఐ) అనుమతి పొందిన ఈ ఉత్పత్తిని 'టాఫెరో-ఇఎం' బ్రాండ్‌నేమ్‌తో భారత మార్కెట్లో విక్రయించనున్నట్లు సంస్థ తెలిపింది. 12ఏళ్లకు పైబడిన పిల్లలు, పెద్దలకు హెచ్ఐవి చికిత్సలో ఈ ఔషధాన్ని ఉపయోగిస్తారు. ఇది గిలీడ్ ఫార్మాకు చెందిన డెస్కోవీ ఔషధానికి జనరిక్ వెర్షన్ అని హెటెరో వెల్లడించింది.

ఎయిర్‌సెల్‌కు అదనపు
పోర్టింగ్ కోడ్‌ల కేటాయింపు

న్యూఢిల్లీ: ఎయిర్‌సెల్ కస్టమర్లు ఇతర ఆపరేటర్ల నెట్‌వర్క్‌కు బదిలీ అయ్యేందుకు వీలుగా సంస్థకు అదనపు సమయంతోపాటు పోర్టింగ్ కోడ్‌లను కేటాయించాలని టెలికాం నియంత్రణ మండలి ట్రాయ్ నిర్దేశించింది. ఆంధ్రప్రదేశ్, అసోం, బిహార్, జమ్ము అండ్ కశ్మీర్, కర్నాటక, కేరళ, ముంబై, పంజాబ్‌తోపాటు పలు సర్కిళ్లలో మొబైల్ సేవలందించేందుకు ఎయిర్‌సెల్ లైసెన్సులు పొందింది. సంక్షోభంలో చిక్కుకున్న ఈ సంస్థ సేవల్లో తీవ్ర అంతరాయాల కారణంగా కస్టమర్లు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అంతేకాదు, ఇతర సర్వీస్ ప్రొవైడర్ నెట్‌వర్క్‌కు మారే విషయంలోనూ ఇబ్బందులెదుర్కొంటున్నారు.

2020కల్లా రూ.25 వేల కోట్లకు
ప్రీ-స్కూల్ రంగం

» లిటిల్ మిలీనియం సిఇఒ రామన్ బజాజ్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత్‌లో ప్రీ-స్కూల్ ఎడ్యుకేషన్‌కు డిమాండ్ గణనీయంగా పెరుగుతోందని లిటిల్ మిలీనియం ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ముఖ్య కార్య నిర్వహణాధికారి (సిఇఒ) రామన్ బజాజ్ అన్నారు. 2020కల్లా దేశంలో ప్రీ-స్కూల్ మార్కెట్ సైజు రూ.25,000 కోట్ల స్థాయికి చేరుకోవచ్చన్న అంచనాలున్నాయన్నారు. అయితే, ఇందులో అసంఘటిత విభాగ వాటానే అధికమని, సంఘటిత విభాగ వాటా ఇప్పుడిప్పుడే పుంజుకుంటోందన్నారు. 2008లో ఈ రంగంలోకి ప్రవేశించిన లిటిల్ మిలీనియం.. ప్రస్తుతం దేశంలోని వందకు పైగా నగరాల్లో 500కు పైగా ప్రీ-స్కూల్స్‌ను నిర్వహిస్తోంది. వచ్చే మూడేళ్లలో ఈ సంఖ్య 1000కి చేరుకోవచ్చని బజాజ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌లో ఫ్రాంచైజీల విస్తరణ యోచన

ఫ్రాంచైజీ మోడల్‌లో స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్న లిటిల్ మిలీనియం.. దక్షిణాదిలో 150 సెంటర్లను కలిగి ఉంది. అందులో 20లో హైదరాబాద్‌లో ఉన్నాయి. వచ్చే రెండేళ్లలో హైదరాబాద్ మార్కెట్లో ఫ్రాంచైజీల సంఖ్యను 50కి పెంచుకోవాలని అనుకుంటున్నట్లు బజాజ్ వెల్లడించారు.

జాబిలమ్మపై
'వొడాఫోన్ 4జి' నెట్‌వర్క్

vodafone

బార్సిలోనా (స్పెయిన్) : 'మీరు ఎక్కడికెళ్లినా, మా నెట్‌వర్క్ మిమ్మల్ని వెన్నంటే ఉంటుంది' అనే వొడాఫోన్ యాడ్ గుర్తుందా?. వొడాఫోన్ ఇపుడు ఆ ప్రచారాన్ని మరోసారి నిజం చేయబోతోంది. ఈ సారి ఏకంగా జాబిలమ్మపైనే 4జి నెట్‌వర్క్ ఏర్పాటు చేయబోతోంది. అది కూడా వచ్చే ఏడాదే. జర్మనీకి చెందిన పిటిసైంటిస్ట్స్ అనే సంస్థ 2019లో చందమామపై పరిశోధనల కోసం ప్రయోగించే 'మిషన్ టు మూన్' ప్రాజెక్టు కోసం వొడాఫోన్ ఈ 4జి నెట్‌వర్క్ ఏర్పాటు చేయబోతోంది. నోకియాతో కలిసి కంపెనీ ఈ సాంకేతిక అద్భుతానికి సిద్ధమవుతోంది. ఇదే జరిగితే జాబిలమ్మపై తొలి 4జి నెట్‌వర్క్ ఏర్పాటు చేసిన కంపెనీగా వొడాఫోన్ నిలిచిపోతుంది. చంద్రుడి ఉపరితలంపై నాసా వ్యోమగాములు నడిచిన సరిగ్గా 50 సంవత్సరాలకు, పిటిసైంటిస్ట్స్ అనే సంస్థ ప్రైవేట్‌గా ఈ బృహత్ ప్రయత్నానికి సిద్ధమవుతోంది. 11 రోజుల పాటు జరిగే ఈ మూన్ మిషన్‌ను వొడాఫోన్ 4జి ద్వారా లైవ్ హెచ్‌డి వీడియోలో వీక్షించవచ్చు.

జనవరి జిఎస్‌టి వసూళ్లు
రూ.86,318 కోట్లు

న్యూఢిల్లీ: గతనెలకు జిఎస్‌టి వసూళ్లు స్వల్పంగా తగ్గి రూ.86,318 కోట్లకు పరిమితమయ్యాయి. అంతక్రితం నెల(డిసెంబర్ 2017)లో వసూళ్లు రూ.86,703 కోట్లుగా నమోదయ్యాయి. కేంద్ర ఆర్థిక శాఖ గణాంకాల ప్రకారం.. ఈనెల 25నాటికి దేశంలో 1.03 కోట్ల మంది జిఎస్‌టి నెట్‌వర్క్‌లో రిజిస్టర్ చేసుకున్నారు. అందులో 17.65 లక్షల మంది కాంపొజిషన్ స్కీం పరిధిలోకి వస్తారు. ఈ పథకంలోని పన్ను చెల్లింపుదారులు ప్రతి మూడు నెలలకోసారి రిటర్నులు దాఖలు చేస్తే సరిపోతుంది. మిగతా 87.03 లక్షల మంది ప్రతినెలా రిటర్నులు ఫైల్ చేయాల్సి ఉంటుంది.

టీవీఎస్ నుంచి
'ఎన్‌టార్క్ 125' స్పోర్ట్స్ స్కూటర్

» ఎక్స్ షోరూమ్ ధర రూ.61,450

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ టీవీఎస్ మోటార్ కంపెనీ మార్కెట్లోకి మరో కొత్త స్కూటర్‌ను విడుదల చేసింది. 'టీవీఎస్ ఎన్‌టార్క్ 125' పేరుతో విడుదల చేసిన ఈ ప్రీమియం స్పోర్ట్స్ స్కూటర్‌లో అనేక అత్యాధునిక ఫీచర్స్ ఉన్నాయి. లీటర్ పెట్రోల్‌తో 48 కిలోమీటర్ల మైలేజ్ ఇచ్చే ఈ స్కూటర్ ఎక్స్ షోరూమ్ ధర తెలంగాణలో రూ.61,450. 18-24 సంవత్సరాల మధ్య వయసులో ఉంటే స్టైలిష్ యువతను దృష్టిలో ఉంచుకుని ఈ సరికొత్త స్కూటర్‌ను మార్కెట్‌లో ప్రవేశపెడుతున్నట్టు కంపెనీ జనరల్ మేనేజర్ బెనయ్ ఆంటోని విలేకరులతో చెప్పారు. దేశంలో ఇన్‌బిల్ట్ నేవిగేషన్ అసిస్టెంట్‌తో బ్లూటూత్ కనెక్టెడ్ స్కూటర్ 'టీవీఎస్ ఎన్‌టార్క్ 125' అని తెలిపారు. దేశంలో తొలి యాప్ ఎనేబుల్డ్ స్కూటర్ కూడా ఇదేనన్నారు. 'ఈ స్టైలిష్ స్కూటర్‌కు యువత నుంచి మంచి స్పందన లభిస్తుందని ఆశిస్తున్నాం. వచ్చే ఆర్థిక సంవత్సరం కనీసం రెండు లక్షల ఎన్‌టార్క్ 125 స్కూటర్లు అమ్మాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని ఆంటోని చెప్పారు. స్కూటర్ల మార్కెట్‌లో ప్రస్తుతం టీవీఎస్ మోటార్‌కి 15.9 శాతం వాటా ఉంది. ఎన్‌టార్క్ 125తో ఇది మరింత పెరుగుతుందని కంపెనీ ఆశలు పెట్టుకుంది.





హ్యుండయ్ నుంచి రెండు ఎలక్ట్రిక్ వాహనాలు

» నెక్సో, ఐయోనిక్ పేరుతో ఆవిష్కరణ

ముంబై: హ్యుండయ్ మోటార్స్ రెండు ఎలక్ట్రిక్ వాహనాలను ఆవిష్కరించింది. మంగళవారం ఢిల్లీలో జరిగిన ఇండో కొరియా బిజినెస్ సమ్మిట్‌లో వీటిని ప్రదర్శించింది. ఇందులో ఒకటి భవిష్యత్ తరం ఫ్యూయల్ సెల్ ఎలక్ట్రిక్ వెహికిల్ 'నెక్సో' కాగా.. మరొకటి బ్యాటరీ ఆధారంగా నడిచే గ్లోబల్ ఎలక్ట్రిక్ వెహికిల్ 'ఐయోనిక్'. గత 20 ఏళ్లుగా తమ సంస్థ మేక్ ఇన్ ఇండియాకు కట్టుబడి ఉందని, నేడు ఎస్‌యువి మోడల్ నెక్సోతోపాటు ఐయోనిక్‌ను ఈ సదస్సులో ప్రదర్శించడం ఎంతో గర్వకారణంగా ఉందని హ్యుండయ్ మోటార్ కంపెనీకి చెందిన నమయాంగ్ ఆర్ అండ్ డి సెంటర్ వైస్ ప్రెసిడెంట్ ఎస్‌హెచ్ కిమ్ అన్నారు.



ధర రూ.11.11 లక్షలు

మార్కెట్లోకి ట్రయంఫ్ సరికొత్త బైక్

న్యూఢిల్లీ: బ్రిటన్‌కు చెందిన సూపర్ బైకుల తయారీ సంస్థ ట్రయంఫ్ మోటార్‌సైకిల్స్ తన క్లాసిక్ క్రూయిజర్ బోన్‌విల్లే స్పీడ్ మాస్టర్‌ను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ధర రూ. 11,11,500. దేశవ్యాప్తంగా ఉన్న ట్రయంఫ్ షోరూమ్‌లన్నింటిలోనూ ఇదే ధరకు లభించనుంది. ఈ సంస్థకు హైదరాబాద్‌తోపాటు దేశంలోని 15 నగరాల్లో షోరూమ్‌లున్నాయి. ట్విన్ డిస్క్ బ్రెమ్‌బో బ్రేక్స్, హై స్పెసిఫికేషన్ సస్పెన్షన్ ఫీచర్స్‌తో కూడిన ఈ బైక్‌ను 1200సిసి హై టార్క్ పార్లల్ ట్విన్ ఇంజిన్, 12 లీటర్ల ఇంధనం నింపగలిగే ట్యాంక్‌తో డిజైన్ చేశారు.

పబ్లిక్ ఇష్యూకు మెడ్‌ప్లస్!

రూ.600 కోట్ల సమీకరణ లక్ష్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సర్వీసెస్.. పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం మార్కెట్ పరిస్థితులను గమనిస్తున్నామని, సాధ్యమైనంత త్వరలో పబ్లిక్ ఇష్యూ (ఐపిఒ)కు రావాలని యోచిస్తున్నట్లు మెడ్‌ప్లస్ హెల్త్ ఫౌండర్, సిఇఒ మధుకర్ గంగాడి వెల్లడించారు. మంగళవారం నాడిక్కడ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ బ్యాచ్‌టాగ్ ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే మార్కెట్ నియంత్రణ సంస్థ సెబికి డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డిఆర్‌హెచ్‌పి) దాఖలు చేయాలని చూస్తున్నట్లు చెప్పారు. ఇష్యూ ద్వారా 600 కోట్ల రూపాయలు సమీకరించాలని చూస్తున్నామని, అయితే ఐపిఒ ద్వారా ఎంత వాటాను విక్రయించాలనే దానిపై ఇంకా ఒక నిర్ణయానికి రాలేదని ఆయన చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో మెడ్‌ప్లస్ పబ్లిక్ ఇష్యూ మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు.



ఈ ఏడాది రూ.2,100 కోట్ల టర్నోవర్..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మెడ్‌ప్లస్ టర్నోవర్ 2,100 కోట్ల రూపాయల వరకు ఉంటుందని మధుకర్ వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ టర్నోవర్ 1,940 కోట్ల రూపాయలుగా ఉందని తెలిపారు. మెడ్‌ప్లస్ హెల్త్ ఏటా 15 శాతం వృద్ధిని సాధించుకుంటూ వస్తోందని ఆయన పేర్కొన్నారు. కాగా ప్రస్తుతం 1,400 మెడ్‌ప్లస్ స్టోర్లుండగా మరో రెండేళ్లలో వీటిని 2,000 కు చేర్చాలని చూస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది మార్చి చివరి నాటికి కొత్తగా 25 మెడ్‌ప్లస్ స్టోర్లను ప్రారభించనున్నట్లు మధుకర్ తెలిపారు.

ఫ్యాక్టరీ ధరలకే ఫర్నీచర్ ఉత్పత్తులు..

» ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ బ్యాచ్‌టాగ్ ప్రారంభం

వినియోగదారులకు నాణ్యమైన, అత్యుత్తమమైన గృహోపకరణాలు, ఫర్నీచర్, బిల్డింగ్ మెటీరియల్‌ను ఫ్యాక్టరీ ధరలకే అందిచేందుకు గాను ప్రత్యేకంగా బ్యాచ్‌టాగ్ డాట్‌కామ్‌ను ప్రారంభించినట్లు మధుకర్ తెలిపారు. ఫర్నీచర్ ఉత్పత్తుల కోసం ప్రారంభించిన కస్టమ్‌ఫర్నిష్‌కు వినియోగదారుల నుంచి మంచి స్పందన వచ్చిందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని అన్ని రకాలైన ఉత్పత్తులను ఒకే చోట అందించాలనే ఉద్దేశంతో బ్యాచ్‌టాగ్‌ను ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. నేరుగా తయారీదారుల (ఒఇఎం) నుంచి ఉత్పత్తులను కొనుగోలు చేస్తుండటంతో మార్కెట్ ధరలతో పోల్చితే 40 నుంచి 80 శాతం వరకు ఆదా అవుతుందని ఆయన చెప్పారు. బ్యాచ్‌టాగ్ ద్వారా వినియోగదారులు ఫర్నీచర్, హోం అప్లయెన్సెస్, ఫ్యాషన్, ఫ్యాషన్ యాక్సెసరీస్ సహా బిల్డింగ్ మెటీరియల్స్‌ను కొనుగోలు చేయవచ్చని తెలిపారు. బ్యాచ్‌టాగ్ కోసం ఇప్పటి వరకు 15 కోట్ల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టినట్లు మధుకర్ వెల్లడించారు. 15 కేటగిరీల కోసం 25కు పైగా ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్‌తో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఆయన చెప్పారు. కాగా బ్యాచ్‌టాగ్ కార్యకలాపాల విస్తరణ కోసం నిధులు సమీకరించాలని చూస్తున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే పలువురు ఇన్వెస్టర్లతో చర్చిస్తున్నట్లు మధుకర్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఉత్పత్తి కేంద్రం ప్రతి నెల 1000 సోఫాలు, వెయ్యికి పైగా వుడ్ యూనిట్లను సరఫరా చేసే సామర్థ్యాన్ని కలిగి ఉందని మధుకర్ తెలిపారు.

పేయ్‌నీర్ ఇండియా వ్యాపార విస్తరణ

» చౌకగా అంతర్జాతీయ చెల్లింపుల సేవలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పేయ్‌నీర్ ఇండియా తన అంతర్జాతీయ డిజిటల్ చెల్లింపుల వ్యాపార సేవలను విస్తరిస్తోంది. చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థ(ఎస్ఎంఇ)లనే కంపెనీ ఇందుకు లక్ష్యంగా చేసుకుంది. ప్రస్తుతం వివిధ దేశాల కరెన్సీల్లో అంతర్జాతీయ చెల్లింపులు జరపాలంటే బ్యాంకులు వివిధ ఫీజుల కింద ఒక్కో లావాదేవీపై ఆరు శాతం వరకు ఫీజులు వసూలు చేస్తున్నాయి. పెద్ద పెద్ద కంపెనీలు ఈ భారం భరించగలిగినా చిన్న చిన్న వ్యాపార సంస్థలకు మాత్రం ఇది పెను భారంగా మారింది. 'మా డిజిటల్ పేమెంట్ వ్యవస్థ ద్వారా మేము 0.8 శాతం నుంచి రెండు శాతం కరెన్సీ మార్పిడి చార్జిలకే ఈ చెల్లింపుల సేవలు అందిస్తున్నాం. దీంతో భారత్‌లో ఏటా మా వ్యాపారం 200 శాతం చొప్పున పెరుగుతోంది. ఇదే సమయంలో దేశంలో అంతర్జాతీయ డిజిటల్ చెల్లింపుల వృద్ధి రేటు 70 శాతం మాత్రమే' అని కంపెనీ కంట్రీ హెడ్ రోహిత్ కులకర్ణి చెప్పారు. పేయ్‌నీర్ ఇండియా ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు దేశంలోని 2,300 నగరాల్లోని చిన్న చిన్న వ్యాపార సంస్థలకు తన సేవలు అందిస్తోంది. ఒక్క హైదరాబాద్‌లోనే 6,600 సంస్థలు కంపెనీ నుంచి ఈ సేవలు అందుకుంటున్నాయి. ఈ చెల్లింపు సేవలకు కంపెనీ ఆర్‌బిఐ నుంచి అనుమతులు కూడా పొందింది. పేయ్‌నీర్ ప్రస్తుతం 200 కరెన్సీల్లో 150కి పైగా దేశాల్లో 40 లక్షల ఖాతాదారులకు తన డిజిటల్ చెల్లింపుల సేవలు అందిస్తోంది. అమెజాన్ వంటి ఇ-కామర్స్ దిగ్గజాలకు వ్యాపార సేవలు అందించే సంస్థలు కూడా తమ నుంచి చెల్లింపుల సేవలు అందుకుంటున్నట్టు కులకర్ణి చెప్పారు. అత్యాధునిక టెక్నాలజీ ఆధారంగా జరిగే తమ డిజిటల్ చెల్లింపుల భద్రతకూ ఎలాంటి ఢోకా లేదన్నారు.

దీపావళినాటికి 99 శాతం జనాభాకు చేరువ

» సామ్‌సంగ్‌తో కలిసి జియో ఐఓటి సేవలు

బార్సిలోనా (స్పెయిన్): ఈ ఏడాది దీపావళికల్లా దేశంలోని 99 శాతం జనాభాకు తమ సేవలను అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రిలయన్స్ జియో ప్రకటించింది. వ్యాపార విస్తరణ ప్రణాళికల్లో భాగంగా సామ్‌సంగ్‌తో కలిసి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటి) సర్వీసులను ప్రారంభించనున్నట్లు సంస్థ వెల్లడించింది. ప్రస్తుతం స్పెయిన్‌లోని బార్సిలోనా నగరంలో జరుగుతున్న మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ ప్రెసిడెంట్ జ్యోతింద్ర థాకర్ మాట్లాడుతూ.. "ప్రతినెలా 8,000 నుంచి 10,000 టవర్లను ఏర్పాటు చేస్తున్నాం. సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో దివాలీ నాటికల్లా సంస్థ నెట్‌వర్క్ దేశంలోని 99 శాతం జనాభాకు చేరువకానుంది" అని అన్నారు. ప్రస్తుతం సంస్థకు దేశవ్యాప్తంగా 16 కోట్ల మంది కస్టమర్లున్నారు.

దేశవ్యాప్తంగా ఒకేసారి ఐఓటి సర్వీసులు

ఐఓటి సేవల ప్రారంభానికి ఎంత సమయం పట్టవచ్చన్న ప్రశ్నకు రిలయన్స్ జియో వైస్ ప్రెసిడెంట్ తారెక్ అమీన్ సమాధానమిస్తూ.. ముందుగా ఇందుకు అవసరమైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒక్కో నగరంలో సేవలను ప్రారంభించుకుంటూ వెళ్లే బదులా దేశవ్యాప్తంగా ఒకేసారిగా అందుబాటులోకి తేవాలనుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటికే సంస్థ ముంబైలో ఐఓటి సేవలందిస్తోంది.



3.5 కోట్ల కస్టమర్ల హెచ్ఎంఎస్ఐ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్స్ ఇండియా (హెచ్‌ఎంఎస్ఐ) మూడున్నర కోట్ల కస్టమర్ల మైలురాయిని చేరింది. 17 సంవత్సరాల కాలంలో కంపెనీ ఈ ఘనత సాధించింది. 2001 సంవత్సరంలో హీరో కంపెనీతో భాగస్వామ్యాన్ని తెగతెంపులు చేసుకుని ప్రత్యేక ఆటోమొబైల్ కంపెనీగా వాహనాల విక్రయం చేపట్టిన ఈ సంస్థ మంగళవారం కొత్త కస్టమర్ చేరికతో ఈ కొత్త మైలురాయిని సొంతం చేసుకుంది. ప్రతి ఐదు సెకన్లకు ఒక కస్టమర్ హోండా కుటుంబంలో చేరుతున్నారని ఈ సందర్భంగా కంపెనీ ప్రెసిడెంట్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ మినోరు కటో తెలిపారు.

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రాజస్థాన్‌లోని తపుకరా ప్లాంట్ నుంచి యాక్టివా 4జి స్కూటర్‌ను ఆయన విడుదల చేశారు. మొత్తం 24 మోడల్స్‌తో తాము ఈ మైలురాయిని చేరిట్టు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ యద్వీందర్ సింగ్ గులేరియా తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా తమ విక్రయాల్లో 31 శాతం వాటా భారత్‌దేనని గులేరియా అన్నారు.

ర్యాలీకి బ్యాంక్ షేర్ల బ్రేక్

» సెన్సెక్స్ 100 పాయింట్లు డౌన్

ముంబై : బ్యాంకులో జరిగిన కుంభకోణం పరిమాణం మరో 1,300 కోట్ల రూపాయల మేరకు పెరిగి 12,717 కోట్ల రూపాయల వరకు వెళ్లవచ్చునని పిఎన్‌బి ప్రకటించడం రెండు రోజుల స్టాక్ మార్కెట్ ర్యాలీకి బ్రేక్ వేసింది. ఈ ప్రకటన ప్రభావంతో ఒక్క పిఎన్‌బి షేరు 12 శాతం మేరకు పతనం కాగా ఇతర బ్యాంకుల షేర్లు 7 శాతం మేరకు నష్టపోయాయి. దీనికి తోడు రెండు రోజుల ర్యాలీ అనంతరం సాగిన లాభాల స్వీకరణ కూడా మార్కెట్‌ను కుంగదీసింది. ఇంట్రాడేలో బిఎస్ఇలో 14.11 శాతం వరకు నష్టపోయిన పిఎన్‌బి షేరు చివరికి 12.11 శాతం నష్టంతో 98.35 రూపాయల వద్ద క్లోజయింది. ఈ షేరు వరుసగా నాలుగు సెషన్లలో 16 శాతం మేరకు దిగజారడంతో బ్యాంక్ మార్కెట్ విలువ 4547 కోట్ల మేరకు తుడిచిపెట్టుకుపోయింది. భారీగా నష్టపోయిన ఇతర బ్యాంకు స్టాక్‌లలో బ్యాంక్ ఆఫ్ ఇండియా (7.18 శాతం), ఐడిబిఐ (6.78 శాతం) ఉన్నాయి. ఇవి కాకుండా ఇండియన్ బ్యాంక్, యుకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, బ్యాంక్ ఆఫ్ బరోడా, అలహాబాద్ బ్యాంక్ షేర్లు కూడా నష్టాల్లో ముగిశాయి. ఉదయం మార్కెట్ ఉత్సాహంగానే ప్రారంభమైనా పిఎన్‌బి ప్రకటన దాన్ని నెగిటివ్ జోన్‌లోకి నెట్టింది. సెన్సెక్స్ 99.36 పాయింట్ల నష్టంతో 34346.39 పాయింట్ల వద్ద క్లోజ్ కాగా నిఫ్టీ 28.30 పాయింట్ల నష్టంతో 10554.30 వద్ద క్లోజయింది.

- బ్యాంకులకు బకాయిలన్నీ చెల్లించేస్తామని సింబోలి షుగర్స్ యాజమాన్యం చేసిన ప్రకటనతో బ్యాంకు షేర్లు కోలుకున్నాయి. 98 కోట్ల రూపాయల రుణం ఎగవేశారన్న ఆరోపణపై కంపెనీ చైర్మన్ గుర్మీత్ సింగ్ మాన్, డిప్యూటీ ఎండి గుర్‌పాల్ సింగ్‌లపై సిబిఐ కేసు నమోదు చేసింది. అయితే తమకు రుణం ఇచ్చిన ఒబిసి కన్సార్షియంతో చర్చించి ఆ బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించేస్తామని కంపెనీ ప్రకటించింది. దీంతో ఈ షేరు 11 శాతం మేరకు కోలుకుంది.
- విలీనం ప్రతిపాదన ప్రస్తుతానికి నిలిపివేస్తున్నట్టు ప్రకటించడంతో అంబుజా సిమెంట్, ఎసిసి షేర్లు మంగళవారం 4 శాతం మేరకు నష్టపోయాయి. బిఎస్ఇలో అంబుజా సిమెంట్ షేరు 3.91 శాతం నష్టంతో 252.05 రూపాయల వద్ద క్లోజ్ కాగా ఎసిసి షేరు 1.84 శాతం దిగజారి 1632.65 రూపాయల వద్ద ముగిసింది.
- తమ వద్ద వృధాగా పడి ఉన్న 89.69 ఎకరాల భూమిని విక్రయించడానికి డైరెక్టర్ల బోర్డు అనుమతించిందని స్కూటర్స్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది.
- ఆటో విడిభాగాల తయారీదారు భారత్ ఫోర్జ్ విద్యుత్ వ్యాపారం నుంచి పూర్తిగా వైదొలగాలని నిర్ణయించినట్టు ప్రకటించింది. ఈ నిర్ణయానికి అనుగుణంగా జిఇ, ఆల్‌స్టోమ్ భారత్ ఫోర్జ్ పవర్ లిమిటెడ్ జాయింట్ వెంచర్‌లో మిగతా 26 శాతం వాటాలను విక్రయించనున్నట్టు తెలిపింది.



పబ్లిక్ ఇష్యూకి టిసిఎన్ఎస్ దరఖాస్తు

మహిళల దుస్తుల తయారీలోని టిసిఎన్ఎస్ క్లోదింగ్ సంస్థ పబ్లిక్ ఇష్యూ జారీ చేయడానికి అనుమతి కోరుతూ సెబికి దరఖాస్తు చేసింది. కంపెనీలో 1.57 కోట్ల షేర్లను విక్రయించాలనుకుంటున్నట్టు తెలియచేసింది.



బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,590	---	---	31,500	30,700
క్రితం ముగింపు	31,600	31,560	---	31,500	30,740
22 క్యారెట్లు	29,250	---	---	29,160	29,240
క్రితం ముగింపు	29,260	29,300	---	29,150	29,270
వెండి (కిలో)	39,700	---	---	39,800	41,600
క్రితం ముగింపు	39,800	40,000	---	39,900	41,700

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	70.00	విజయవాడ	75.00
కరీంనగర్	71.00	గుంటూరు	74.00
వరంగల్	70.00	ఒంగోలు	77.00
మహబూబ్‌నగర్	70.00	చిత్తూరు	64.00
కర్నూలు	71.00	నెల్లూరు	66.00
విశాఖపట్నం	83.00	అనంతపురం	65.00
గోదావరి	75.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.15 నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	355.00	చిత్తూరు	388.00
వరంగల్	357.00	చెన్నై	395.00
విజయవాడ	348.00	నమక్కల్	380.00
గోదావరి	348.00	బెంగళూరు	385.00
విశాఖపట్నం	350.00	ముంబై	390.00



ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.98	68.39
పౌండ్	82.36	95.52
యూరో	72.73	84.33
ఆస్ట్రేలియా డాలర్	46.27	53.55
బహ్రెయిన్ దినార్	159.73	183.05
కువైట్ దినార్	178.89	222.70
ఒమని రియాల్	156.42	178.96
సౌదీ రియాల్	15.68	18.59
సింగపూర్ డాలర్	44.79	53.05
యుఎఇ దిరమ్	16.05	18.76

నిరోధం 10630

టెక్ వ్యూ

నిఫ్టీ పాజిటివ్‌గానే ప్రారంభమై తదుపరి స్థాయి 10630 వరకు వెళ్లి ఇంట్రాడే రియాక్షన్‌లో పడింది. టెక్నికల్‌గా ఇది మైనర్ కరెక్షన్ మాత్రమే. ఇంకా డౌన్‌ట్రెండ్‌లో ప్రవేశించలేదు. 20,50 డిఎంఎల వద్ద మరో పరీక్షకు సమాయత్తం అవుతోంది. మరింత అప్‌ట్రెండ్‌లో ప్రవేశించాలంటే ఈ స్థాయిల్లో బలంగా నిలదొక్కుకోవాలి.

- మరింత అప్‌ట్రెండ్ కోసం 10630 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 10700. ఇక్కడ కన్సాలిడేషన్ అనంతరమే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో పురోగమిస్తుంది.
- ప్రధాన మద్దతు స్థాయి 10500. భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి. విఫలమైతే స్వల్పకాలిక కరెక్షన్ మరింతగా కొనసాగుతుంది. ప్రధాన మద్దతు స్థాయిలు 10400, 10300.
- బ్యాంక్ నిఫ్టీ బలహీనంగా క్లోజయింది. ఇది మరింత అప్రమత్త సంకేతం.

బుధవారం స్థాయిలివే...

నిరోధం: 10630 **మద్దతు:** 10500

■ వి.సుందర్ రాజా

సాధారణంగా మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి : ఫాల్గుణ శుద్ధ త్రయోదశి **నక్షత్రం :** ఆశ్లేష

కృత్తిక, ఉత్తర, ఉత్తరాషాఢ నక్షత్ర జాతకులు, సింహ, ధనుస్సు రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10554.30 (-28.30)

ట్రెండ్ మార్పు వేళలు : 9.18; 2.46

ధోరణి: గ్రహగతులను బట్టి నిలకడ/నిస్తేజంగా ప్రారంభమై 10 నుంచి 1.30 వరకు మెరుగ్గా ట్రేడవుతూ తదుపరి ముగింపు వరకు నిలకడ/నిస్తేజంగా మారే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 10 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 1.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.45 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవలసి ఉంటుంది.

నిరోధం : 10595, 10630 **మద్దతు స్థాయిలు:** 10515, 10480

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinanciala strologer.blogspot.in

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు BSE

ACI INFOCOM 4.84(4.84)250
ADITYA SPIN. 8.29(7.9)395
AGRO TECH FO 632.85(631.85)271
AISHWARYA TE 5.8(6.09)6423
ALPHAGEO (I) 809(805.4)1030
ALU FLUORIDE 113.5(114.2)1970
AMAR RAJA BA 816(818.15)18849
ANDHRA BANK 45(45.85)206325
ANDHRA CEMEN 10.9(11.23)24480
ANDHRA PETRO 59.8(57.8)102353
ANJANI PORTL 192.95(192.85)6442
ASTRA MICRO 92(94.95)82036
AUROB.PHARMA 614.35(615.15)168949
AVANTEL LTD 534.3(538.5)3959
AVANTI FEEDS 2395.2(2456.05)11697
B.N.RATHI SE 41.5(41.75)680
BALAJI AMINE 657.95(668)4563
BAMBINO AGRO 238.15(243)393
BARTRONICSIN 13.27(13.61)56271
BHAGIRA.CHEM 306.4(300)1364
BHAGYA INL 50.5(42.1)168542
BHARATFIN 1028.65(1031.7)13344
BNR UDYOG 31.35(32.5)541
CAMBRIDGE 72.35(73.8)4503
CAT TECHN. 1.3(1.3)1160
CCHHL 14(13.9)29247
CCL PRODUCTS 298.65(294)6434
CELESTIAL 17.2(17.65)7521
CIL SECURITS 30(30.4)664
COROM INTER 543(542.65)13633
CUBEX TUBING 26.65(25.4)771
CYBERMATE 3.18(3.32)27418
CYIENT 629.5(636.3)3062
DANLAW TECH. 68.4(72)6461
DECAN CEMENT 556.6(576.8)818
DHAN ROTO SP 53.6(55.85)6323
DIAMONPOWER 13.45(13.65)19959
DIVI'S LAB. 1035(1036.15)74355
DIVYA.GRANIT 97.05(102)200
DQ ENT 14.7(14.65)1975
DR.REDDY'S 2234.15(2194.15)34928
EMPEE SUGARS 3.92(4.03)8308
EVEREST ORG. 147.55(139.95)5931
FACOR ALLOYS 3.06(3.12)166129
FIRSTOBJ 15.05(14.85)3473
GATI LTD. 113.25(114.2)112460
GAYATRI BIO 8.81(9.65)4115
GAYATRI PROJ 212.3(212)9026
GENNEX LAB 4.33(4.43)108609
GMR INFRASTR 18.8(19.05)2190983
GODAVARI DRU 34.75(35.65)4201
GOLDST INFRA 218.75(214.7)85789
GOLDSTONE EN 14.75(14.05)4652
GRANULES (I) 117.25(119.4)58788
GVK POWERINF 17.15(17.15)533311
HBL P SYS 56.2(57.25)28933
HERITGFOOD 675(678.4)1325
HIND.FLUROCA 12.7(13.3)2347
I.C.S.A. IND 3.2(3.3)14343
IKF TECHNO .64(.65)283868
INCAP LTD. 88.35(93)904
IPAPPM 314.05(316.35)3911
IVRCL LTD 4.42(4.46)183327
KAKATIYA CEM 294.1(297.05)5047
KALLAM SPG. 31.1(31.2)67928
KARAN WOO-SN 1.99(1.9)1000
KAVERI SEED 506.2(502.9)35453
KCP LTD 130.35(131.9)11377
KERNEX MICRO 43.45(45.5)9120
KNR CONST 308.25(303.25)23980
KREBS BIOCHM 162.95(161.5)392
LANCO INFRA 1.33(1.38)2909187
LOKESH MACH 66.3(67.8)3384
LOTUS CHOC 52.3(50)11816
MADHUCON PRJ 27.45(27.6)30886
MOLD-TEK TEC 59.25(61.05)300
MOSCHIP SEMI 32(32.1)20352
MSR INDIA 50.35(49.7)4028
N C L IND. 230.6(228.85)5447
NACLIND 44.6(44.2)16046
NATCO PHARM 769.55(775.05)37082
NCC 130.05(126.05)899855
NEHA INTER. 7.44(7.06)4945
NETTLINX LTD 78.5(78.05)13494
NEULAND LAB. 718.85(705.5)3625
NIHAR INFO 15.5(15)300
NILE LTD. 810.9(814.1)2909
NTL 3.96(3.88)5532
OIL COUNTRY 42.5(43.15)3717
PADMALAYA TE 4.85(4.74)3303
PALRED 92.15(92.2)636
PANYAM CEMEN 47.35(47.7)8883
PENNAR STEEL 60.6(61.55)57361
PFL INFOTECH 8.81(8.41)669
PHYTOCHEM I. 62(62.65)3093
PITTI LAMIN. 91.25(90.75)4365
POKARNA LTD 215.85(212.65)4975
PRAJAY ENGS. 12.35(13)13240
PREMIER EXPL 391(392.95)168
PRISM CEMENT 122.55(127.35)130927
RAIN 399.2(395.15)858554
RAJ PACKAGIN 37.2(38.95)3934
RAJVIR IND 44.05(43.75)197302
RESTILE CER. 6.9(7.25)14967
SAGAR CEM. 980.85(972.9)465
SAMKRG PIST. 302.65(304)3457
SAMPRE NUTRI 52(53.1)2154
SANGHI IND. 117.9(120.9)23858
SATVAH.ISPAT 22.6(22.35)12976
SAVEN TECHNO 25.7(24)86501
SMPL 1.4(1.42)1126
SMS PHARMACE 88.4(89.4)2019
SREE RAYALA 165.55(170.45)2263
STEEL EXCH 31(31)40206
SUJANA INDUS .93(.9)36403
SURANATP 5.5(5.26)20108
SURYACHAKRA 1(1.04)44032
SURYAMBA SP 77.85(72.8)1057
SURYAVA SPIN 5.8(6.1)37
SURYLAK.COTT 78.9(78.8)1515
SUVEN LIFE S 190.55(191.85)49212
TAJ GVK HOTL 166.05(168.05)4555
TANLA 31.7(32.35)34051
TCI INDUS. 921(940)118
TRANSCORP IN 34.1(34.4)6639
TRANSGENE BI 2.39(2.39)301
TRANSPORT CO 276.6(279.4)5529
USHER AGRO 6.61(6.51)1830
VICEROY HOTE 15.7(15.8)64595
VIJAY TEXTIL 55(56.5)799
VIMTA LABS 204.3(205)7951
VIRAT CRANE 51(51)16743
VIRINCHI 120.25(120.55)24261
VISAKA IND. 689.45(690.55)4376
VISTA PHARMA 48.95(44.8)325168
VIVIMED LABS 76.95(78.15)120452
VST INDUS. 3201(3208.55)19
WATERBASE 307.05(311.35)132427
XLENERGY 2.89(2.83)13756
YBRANTDIGI 5.16(5.27)202807
ZEN TECH 115.9(118.5)48487
ZENOTECH 44.5(43.9)6910



ఆకాశంలో లాడ్జ్

పెరూ కొండల్లో ఒళ్లు జలదరించే అనుభవం

నేలమీద ఎవ్వరైనా పడుకుంటారు. ట్రెక్కింగ్ చేసుకుంటూ వెళ్లి..కొండ మీద సేద తీరేవాళ్లు కూడా ఉంటారు. కానీ లోయకీ, కొండకీ మధ్యన.. కాలుజారితే ప్రాణాలు పోయే రాళ్ల అంచున నిద్రపోగలరా? సాహసం చేయరా డింభకా..! అంటున్నారు పెరూకి చెందిన స్కై లాడ్జ్ నిర్వాహకులు! నిట్టనిలువుగా ఉండే కొండకు వేల్లాడుతూ..క్యాప్సూల్ ఆకారంలో ఉండే గ్లాస్ లాడ్జ్‌లు పెరూలోని సాక్రెడ్ వ్యాలీలో పర్యాటకులను అబ్బురపరుస్తున్నాయి. దాదాపు 1300 అడుగులు ఎత్తులో ఉండే గ్లాస్ లాడ్జ్‌లను ట్రెక్కింగ్ చేసుకుంటూ చేరాలి. అడుగుతీసి అడుగువేయడం సాహసమైన చోట.. అంత ఎత్తుకు చేరినవారే.. గ్లాస్ లాడ్జ్‌లో ఒక రాత్రి బస చేయడానికి అర్హులు! 'ప్రకృతితో మనిషిని మళ్లీ అనుసంధానం చేసి..అసలైన విలాస జీవితానికి అర్థం చెప్పాలన్నదే మా ప్రయత్నం' అంటారు స్కైలాడ్జ్ మేనేజర్ నటాలియా రోడ్రిగూజ్! నాట్యురా వైవ్ అనే అడ్వెంచర్ కంపెనీ ఆలోచనల్లోంచి పుట్టిందే ఈ గ్లాస్ సూట్! ఇందులో 4 బెడ్‌లు, ఒక డైనింగ్ ఏరియా ఒక ప్రైవేట్ బాత్రూమ్ ఉంటాయి.. కొండల మధ్య ఓ ఆశ్చర్యానందాలతో కూడిన రాత్రిని సొంతం చేసుకోవాలంటే 400 డాలర్లు చెల్లించాలి.

ఎడారిలో సగం

సౌదీలో తొలగుతున్న ఆంక్షల పరదాలు.. మహిళలకు సమాన వ్యాపార అవకాశాలు

'ఆంక్షల పరదాలు దాటి మహిళలు బయటకు రాలేని సౌదీ అరేబియాలో..నీకు ప్రత్యేకమైన అధికారాలు కావాలా?' అన్న ప్రశ్నకు రోబో సోఫియా ఇచ్చిన సమాధానం అందరినీ ఆశ్చర్యపరిచింది. 'నాకు ప్రత్యేకమైన అధికారాలు, నిబంధనలు అవసరం లేదు. సౌదీ అరేబియా ఇచ్చిన పౌరసత్వ హోదాను ఉపయోగించుకుని మహిళల హక్కులపై మాట్లాడతాను' అంటూ హైదరాబాద్ ప్రపంచ ఐటి సదస్సు వేదిక నుంచి సోఫియా అన్న మాటలు స్ఫూర్తిని కల్గించాయి. నిజానికి సోఫియాకు గత ఏడాది పౌరసత్వం ఇచ్చిన తర్వాత.. సౌదీ అరేబియాలో మహిళా సాధికారతకు వేగంగా అడుగులు పడుతున్నాయి. యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ 'విజన్ 2030'లో భాగంగా తీసుకువస్తున్న సంస్కరణలు.. మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తున్నాయి.

కారు నుంచి షికారు వరకూ..

సౌదీ మహిళలు కారు నడపడానికి అనుమతిస్తూ గత ఏడాది సెప్టెంబరు 27న సౌదీ ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. సౌదీలో మహిళా డ్రైవర్లపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ జారీచేసిన ఉత్తర్వులు.. ఈ ఏడాది జూన్ నుంచి అమల్లోకి వస్తాయి. ఈ నేపథ్యంలో వేలాదిమంది మహిళలు డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేస్తున్నారు. అలాగే క్రీడా మైదానాల్లో మహిళలను అనుమతించడం సంచలనం సృష్టించింది. పరదాలు, ఆంక్షలు లేకుండా ఈ ఏడాది జనవరిలో మహిళలు స్వేచ్ఛగా సాకర్ మ్యాచ్‌ను వీక్షించారు. పురుష సంరక్షకుడు లేకుండా సౌదీలో మహిళలు గడప దాటలేరు. వివాహం చేసుకోలేరు. విడాకులు తీసుకోలేరు. ఉద్యోగం, ప్రయాణం చివరకు అత్యవసరంగా సర్జరీ చేయించుకోవాలన్నా మొన్నటి వరకూ గార్డియన్ తప్పనిసరి! ఇప్పుడిప్పుడే ఈ దేశంలో మార్పు వస్తోంది.



పెంచాలని సంకల్పించారు. ఇటీవల ఓ సౌదీ బ్యాంకుకి మహిళను సీఈవోగా నియమించి ఆశ్చర్యపరిచింది సౌదీ రాజకుటుంబం! అంతేకాదు పురుషుడి అనుమతితోనే గడపదాటాలన్న గార్డియన్ వ్యవస్థలో కూడా సవరణలు తెచ్చింది. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరుకుంటున్నామనీ, మహిళా సాధికారతకు కట్టుబడివున్నామని సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ప్రకటించారు. సౌదీలో రోబో సోఫియాకి పౌరసత్వం ఇచ్చారు పాలకులు. కానీ రోబోకి ఉన్న స్వేచ్ఛ సౌదీ మహిళలకు పూర్తిగా ఉన్నాయా? అన్న విమర్శలకు సంస్కరణలతో సమాధానమిస్తున్నారు యువరాజు సల్మాన్!

–సెంట్రల్ డెస్క్



పురుషులతో సమానంగా వ్యాపారాలు

ఇంతవరకూ సౌదీలో పురుషుల అనుమతి, అండదండలు లేకుండా మహిళలు అడుగు కూడా వేయలేని పరిస్థితి ఉంది. అయితే తాజాగా సౌదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం.. మహిళలు వ్యాపారవేత్తలుగా ముందడుగు వేయడానికి దోహదం చేస్తుంది. భర్త, తండ్రి లేదా పురుష సంరక్షకుని అనుమతితో సంబంధం లేకుండా.. సౌదీ మహిళలు వ్యాపారాలు చేయడానికి ప్రభుత్వం అనుమతించింది. తగ్గిన చమురు ధరలు, పెరిగిన మిలిటరీ ఖర్చుల నేపథ్యంలో ఇటీవల ఆర్థికంగా సౌదీ అరేబియా దెబ్బతింది. ఆర్థిక సంస్కరణలు చేపట్టడంతోబాటు మహిళా స్వేచ్ఛ ఆవశ్యకతను పాలకులు గుర్తించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో మహిళలను భాగస్వాములు చేసినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని అర్థం చేసుకున్నారు. దేశంలోని ఉద్యోగుల్లో 22 శాతం ఉన్న మహిళల భాగస్వామ్యాన్ని.. 2030నాటికి 30శాతానికి



ప్రిన్స్ సల్మాన్ విప్లవాత్మక సంస్కరణలు

యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ నేతృత్వంలో సౌదీ అరేబియాలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కేవలం చమురు ఎగుమతులపైనే ఆర్థిక వ్యవస్థ ఆధారపడకుండా..దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. అవినీతి ఆరోపణలపై రాజ కుటుంబ సభ్యులను కూడా వదలకుండా అరెస్టు చేయించిన యువరాజు సల్మాన్..ఏ స్థాయిలోనూ అక్రమాలను క్షమించమని సంకేతాలిచ్చారు. అదే సమయంలో 500 బిలియన్ డాలర్లతో ఎకనామిక్ జోన్స్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. పెట్టుబడులకు సౌదీ అరేబియా తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఆహ్వానం పలికారు.

పురుషులతో సమానంగా వ్యాపారాలు

ఇంతవరకూ సౌదీలో పురుషుల అనుమతి, అండదండలు లేకుండా మహిళలు అడుగు కూడా వేయలేని పరిస్థితి ఉంది. అయితే తాజాగా సౌదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం.. మహిళలు వ్యాపారవేత్తలుగా ముందడుగు వేయడానికి దోహదం చేస్తుంది. భర్త, తండ్రి లేదా పురుష సంరక్షకుని అనుమతితో సంబంధం లేకుండా.. సౌదీ మహిళలు వ్యాపారాలు చేయడానికి ప్రభుత్వం అనుమతించింది. 'గార్డియన్ అనుమతి అక్కర్లేదు. సౌదీ మహిళలు స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకోవచ్చు. పురుషులతో సమానంగా వ్యాపార రంగంలో పెట్టుబడులు పెట్టడానికి, పనిచేయడానికి అనుమతిస్తున్నాం' అని సౌదీ వాణిజ్య, పెట్టుబడుల శాఖ ట్వీట్ చేసింది.

పెరుగుతున్న విడాకుల పార్టీలు

6 నెలలుగా సౌదీ మహిళల జీవితాల్లో మార్పు కనిపిస్తోంది. భర్త నుంచి విడాకులు తీసుకున్న మహిళలు పార్టీలు చేసుకోవడం ట్రెండ్‌గా మారింది. గతంలో విడాకులు పొందిన మహిళలను సమాజం చిన్నచూపు చూసేది. కానీ ఇప్పుడు కాలం మారింది. విడాకులు తీసుకున్న మహిళలు తల పైకెత్తి బతుకుతున్నారు. నచ్చినవారిని రెండో పెళ్లి చేసుకుంటున్నారు. వైవాహిక జీవితంలో పడ్డ ఇబ్బందుల నుంచి విముక్తి లభించినందుకు.. చాలామంది పార్టీలు చేసుకుంటున్నారు. అన్యాయాన్ని ఎదుర్కొంటున్న మహిళలు ఆ పార్టీలకు హాజరై తమ బాధలు పంచుకుంటున్నారు.

మంత్రివర్గంలోనూ...



కార్మిక, సామాజిక అభివృద్ధి శాఖ డిప్యూటీ మంత్రిగా ఓ మహిళను సౌదీ రాజు నియమించారు. పని ప్రదేశాల్లో మహిళల పాత్రను విస్తరించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మహిళలపై పలు ఆంక్షలు విధించే సౌదీ ప్రభుత్వం.. సైన్యంలోనూ మహిళలు చేరేందుకు ఇటీవల అవకాశం కల్పించిన విషయం తెలిసిందే.





కమల్‌పై గౌతమి తిరుగుబాటు

కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేసినప్పటి వేతనం ఇవ్వలేదని ఆరోపణ

ఆ విషయం రాజ్‌కమల్ ఫిల్మ్స్ చూసుకుంటుందని కమల్ వివరణ

విశ్వనటుడు, మక్కల్ నీది మయ్యం పార్టీ అధ్యక్షుడు కమల్‌హాసన్‌పై ఆర్థిక లావాదేవీల విషయమై సీనియర్ నటి గౌతమి తిరుగుబాటు చేశారు. ఈ విషయం ఇప్పుడు తమిళనాట సంచలనం కలిగిస్తోంది. కమల్‌హాసన్, గౌతమి దాదాపు 13 ఏళ్ల బంధం నుంచి గత ఏడాది విడిపోయిన విషయం తెలిసిందే. అయితే కమల్ నుంచి విడిపోయిన సమయంలోనూ ఎలాంటి ఆరోపణలూ చేయని ఆమె, మంగళవారం చెన్నైలో మీడియా ఎదుట ఆయనపై విమర్శలు గుప్పించారు. రాజ్‌కమల్ ఫిల్మ్స్ నిర్మాణంలో కమల్‌హాసన్ తీసిన పలు చిత్రాలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేసినందుకు తనకు ఇంకా వేతనం ఇవ్వలేదని, దీనికి సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని వివరించారు. 30 ఏళ్లుగా తన గురించి ప్రజలకు తెలుసని, తాను ఏనాడూ మరొకరిని విమర్శించలేదని, మోసపోయినందువల్లే కమల్ గురించి నోరు విప్పానని గౌతమి పేర్కొనడం విశేషం. కాగా, గౌతమి వేతనం బాకీ సమస్యను తమ రాజ్‌కమల్ సంస్థ చూసుకుంటుందని కమల్ వివరణ ఇచ్చారు. అలాగే, పొరుగు రాష్ట్రాల్లో చదువుకుంటున్న తమిళ విద్యార్థులకు ప్రభుత్వం తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

- ఆంధ్రజ్యోతి, చెన్నై

'నాస్కామ్'కు కంట్రోల్+ఎస్

30 ఏళ్ల చరిత్రలో తొలి మహిళా ప్రెసిడెంట్



భారతీయ టెక్నాలజీ పరిశ్రమకు ఓ మహిళ నేతృత్వం వహించనున్నారు. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్(నాస్కామ్) ముప్పై ఏళ్ల చరిత్రలో..తొలి మహిళా ప్రెసిడెంట్‌గా దేబ్జానీ ఘోష్ ఏప్రిల్లో బాధ్యతలు చేపడతారు. టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ కంపెనీలు కల్గిన 167 బిలియన్ డాలర్ల భారత ఐటీ సేవల పరిశ్రమకు ఆమె అండగా నిలవనున్నారు. పురుషాధిక్య గ్లోబల్ టెక్నాలజీ రంగంలో వివక్షకు వ్యతిరేకంగా మహిళలకు బాసటగా నిలవనున్నారు. అమెరికాలో ఇరవై ఏళ్లపాటు పనిచేసిన దేబ్జానీ ఘోష్..ఇంటెల్‌సహా అనేక ప్రముఖ కంపెనీల్లో కీలక పదవులు అలంకరించారు. అనేక స్టార్టప్‌లను ప్రోత్సహిస్తూ.. ఏంజెల్ ఇన్వెస్టర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. భారత్‌లో దాదాపు 40 లక్షలమంది ఐటి నిపుణులున్నారు. ప్రతి నలుగురు పురుష ఇంజినీర్లలో ఒక మహిళా ఇంజినీర్ ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. అయినా ఇంతవరకూ దేశంలో ఏ ఐటీ కంపెనీకి మహిళ నేతృత్వం వహించలేదు. 'పరిస్థితులు మారాలి. ప్రతిభ, సామర్థ్యం కల్గిన మహిళలను కాపాడుకోవాలి' అని పిలుపునిస్తున్నారు దేబ్జానీ ఘోష్! నాస్కామ్ అధ్యక్షురాలిగా మహిళలు ఐటి సేవల రంగంలో కొనసాగేలా చేయడంపై దృష్టి సారిస్తానని తెలిపారు. .





ఢిల్లీలో స్మార్ట్ పోల్స్

వీధి దీపాలతో బాటు వైఫై, సీసీటీవీలు

ఇది స్మార్ట్ ప్రపంచం. మరి మారుతున్న కాలానికి తగ్గట్టుగా దేశ రాజధాని మారకపోతే ఎలా? అందుకే ఢిల్లీలో సాధారణ కరెంటు స్తంభాల స్థానంలో స్మార్ట్ పోల్స్ వచ్చేశాయి. తొలి దశలో న్యూఢిల్లీ మునిసిపల్ కౌన్సెల్ (ఎన్‌డీఎంసీ) పరిధిలో..మార్చి నెలాఖరు నాటికి వీధీ దీపాలకు బదులుగా..55 స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయనున్నారు. ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్, బాబా ఖారక్ సింగ్ మార్గ్, సంసద్ మార్గ్, జనపథ్ తదితర ప్రాంతాల్లో ఇప్పటికే 32 స్మార్ట్ పోల్స్ ఇన్‌స్టాల్ చేశారు. ప్రతి స్మార్ట్‌పోల్‌లో ఎల్ఈడీ లైట్లు, కమ్యూనికేషన్ మౌలిక వసతులు, వైఫై, పొల్యూషన్ మానిటర్లతోబాటు సీసీటీవీలు ఉంటాయి. పోల్‌ను నిలబెట్టిన తర్వాత అన్ని సౌకర్యాలు కల్పించడానికి 15 నుంచి 30 రోజులు పడుతుందని ఎన్‌డీఎంసీ వర్గాలు చెబుతున్నాయి. ప్రతి స్మార్ట్ పోల్ 9 నుంచి 12 మీటర్ల ఎత్తు ఉంటుంది. పోల్స్‌కు అమర్చిన స్మార్ట్ ఎల్ఈడీ లైట్లను రిమోట్‌తో ఆన్, ఆఫ్ చేయవచ్చు. స్టెయిన్‌లెస్ స్టీల్‌తో స్మార్ట్ స్తంభాలు తయారయ్యాయి. 2జీ, 3జీ, 4జీ సేవలకు వీలుగా టెలి కమ్యూనికేషన్ మైక్రోసెల్స్ ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. పోల్స్‌కు అమర్చిన సెన్సార్ల సాయంతో పీఎం 10, పీఎం 2.5, కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్ కాలుష్య స్థాయిలతోబాటు వాతావరణంలో తేమ, ఉష్ణోగ్రతలను తెలుసుకోవచ్చు.







ఆంగ్ల 'జనగణమన'కు 99 వసంతాలు!

మదనపల్లెలోని బీటీ కళాశాలే వేదిక.. ఇక్కడే జాతీయ గీతానికి బాణీలు...

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన జాతీయ గీతాన్ని ఆంగ్లంలోకి అనువదించి బుధవారం(28వతేదీ) నాటికి 99ఏళ్లు పూర్తవుతున్నాయి. దక్షిణ భారతదేశ పర్యటనలో భాగంగా 1919లో చిత్తూరు జిల్లా మదనపల్లెలోని బీటీ కళాశాలను సందర్శించిన ఠాగూర్... ఇక్కడ ఐదు రోజుల పాటు బస చేశారు. ఈ సమయంలోనే కళాశాలలోని బీసెంట్ హాల్లో అప్పటి ప్రిన్సిపాల్ జేమ్స్ కజిన్స్ సతీమణి మార్గరెట్ కజిన్స్ జాతీయగీతానికి బాణీలు కట్టారు. ఆ తర్వాతే ఇప్పుడు మనం పాడుకుంటున్న రూపంలో 'జనగణమన' మదనపల్లె నుంచి దేశ వ్యాప్తంగా విస్తరించింది. ఆయన ఇక్కడ ఉన్నప్పుడే మార్గరెట్ విజ్ఞప్తి మేరకు తరగతి గది నం.204లో జాతీయ గీతాన్ని బెంగాలీ నుంచి ఆంగ్లంలోకి అనువదించారు. 1919 ఫిబ్రవరి 28న తన స్వదస్తూరితో ఉన్న ఆ ప్రతిని జేమ్ కజిన్స్‌కు ఠాగూర్ బహూకరించారు. 'మార్నింగ్ సాంగ్ ఆఫ్ ఇండియా' పేరిట అనువదించిన ఆ ప్రతి నకలు బీటీ కళాశాలలో భద్రంగా ఉంది. – మదనపల్లె



భారత దేశంలో అత్యంత వేగంగా దూసుకువెళుతున్న వాటిలో రిటైల్ రంగం ఒకటి. జిడిపిలో దీని వాటా పదిశాతం. ఉద్యోగుల్లో ఎనిమిది శాతం మంది ఈ రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. రిటైల్ స్పేస్‌కు సంబంధించి ప్రపంచంలోనే అయిదో స్థానంలో భారత్ ఉంది. దేశ ప్రజలు ప్రధానంగా మధ్యతరగతి వినియోగ ధోరణిలో వచ్చిన మార్పులు ఈ రంగం వృద్ధికి దోహదపడుతున్నాయన్నది మార్కెట్ పరిశోధకుల విశ్లేషణ. ఇదంతా సరే, ఏటా పన్నెండు శాతం ఎదుగుదలను ఊహిస్తున్న రిటైల్ రంగంలోకి ప్రవేశించాలని నిర్ణయించుకుంటే ఏమి చేయాలన్నది ముఖ్యమైన ప్రశ్న. సంబంధిత ఇంటర్వ్యూని ఎలా ఎదుర్కోవాలన్నది మరో అంశం. ఈ నేపథ్యంలో సంబంధిత నిపుణుల సూచనలు చూద్దాం.

ప్ర: మా రిటైల్ సంస్థలో ఎందుకు పని చేయాలని అనుకుంటున్నావు?

జ: రిటైల్ అనే కాదు, ఏ కంపెనీ నుంచైనా ఇటు వంటి ప్రశ్న ఎదుర్కోవాల్సి రావచ్చు. 'వై' అన్నదో సర్వసాధారణమైన ప్రశ్న. సమాధానానికి ముందు అక్కడి మన ఉద్యోగ స్వరూప స్వభావాలను తెలుసుకుని మరీ జవాబు చెప్పాలి.

- బ్రాండ్ అండ్ డిజైనింగ్‌పై నాకు విపరీతమైన ఆసక్తి. నేను నమ్మిన కంపెనీలో పని చేయాలంటే నాకు చాలా ఇష్టం.
- లేదంటే ఇంకోలానూ సమాధానం చెప్పవచ్చు. నాకు రిటైల్‌లో పని చేయాలని ఉంది. జనాలకు షాపింగ్ అంటే చాలా ఇష్టం. వారితో కలసి పని చేయాలంటే నాకు ఆసక్తి. అందువల్లే మీ బిజినెస్‌లో ఉద్యోగిగా భాగస్వామిని కావాలని అనుకుంటున్నాను.

రిటైల్ జాబ్ ఇంటర్వ్యూ
సూటైతే సెట్ కావచ్చు

ప్ర: రిటైల్ రంగంలో గతంలో పని చేశారా?

జ: ఉదాహరణకు రిటైల్ రంగంలో పని చేయలేదనే అనుకుందాం. అది నేరుగా ఉత్పత్తి కానక్కర్లేదు. విషయం ఆసాంతం వివరించి ఎదుటి వ్యక్తి లేదంటే స్నేహితుడిని సమాధానపర్చడం కావచ్చు. అదీ కాదనుకుంటే పేరెంట్స్‌ను ఒప్పించడం కావచ్చు. ఆ రెంటిలో ఏదైనా అమ్మకం కిందే పరిగణించవచ్చు. ఎదుటి వ్యక్తిని ఒప్పించే కళ మీకు ఉంది. అదే మీ సామర్థ్యం. ఇక్కడ ఎలా సమాధానం చెప్పాలంటే.... ఇంత వరకు అనుభవం లేదు. అయితే నా ఆసక్తులు ఈ రంగంలో పనిచేసేందుకు ఉపకరిస్తాయని భావిస్తున్నాను. వ్యక్తుల్ని కలవడం నాకు సౌకర్యంగానే ఉంటుంది. ఫ్యాషన్ ప్రపంచంపై అప్‌టు డేట్‌గా ఉంటాను. మా చుట్టాలు, మిత్రులు దుస్తులు కొనుగోలు చేసేటప్పుడు నన్ను సంప్రదిస్తుంటారు. ఇలాంటి సమాధానాలతో ఆకట్టుకోవచ్చు.

ప్ర: వారానికి కనీసం పదహారు గంటలపైగా పని చేయగలరా?

జ: సాధారణంగా ఇలాంటి ప్రశ్నలను కాలేజీ చదువుతూ ఉద్యోగం కోసం వచ్చేవారిని అడుగుతూ ఉంటారు. ఈ ప్రశ్నకు ఇచ్చే జవాబులో నిజాయతీ కనిపించాలి. మీ వెసులుబాటుని అనుసరించి సమాధానం చెప్పగలగాలి.

- మొన్నటి వేసవి కాలంలో పూర్తి స్థాయిలో పని చేశాను. మళ్ళీ సెమిస్టర్ ఆరంభమైన తరవాత పార్ట్ టైమ్ షెడ్యూల్ ఎంచుకున్నాను. కాలేజీ నాకు చాలా ముఖ్యం. అలాగే కమిట్‌మెంట్ విషయంలో సీరియస్‌గానే ఉంటాను. అంగీకరించిన పనిని పూర్తి చేసే ఇంటికి వెళతాను.

ప్ర: షిఫ్టుల్లో పని చేయగలరా? లేట్ నైట్స్ ఉండగలరా? ఉదయాన్నే డ్యూటీకి రాగలరా? వీకెండ్స్ పనిచేయమంటే కుదురుతుందా?

జ: పై ప్రశ్నమాదిరిగానే ఇది కూడా ఉంటుంది. పని విషయంలో మీరెంత సీరియస్ అన్నది తెలుసుకోవడమే ఈ ప్రశ్న అడగడంలోని ఉద్దేశం. మీలో నిజాయతీ పాళ్ళు ఎంతో కనుగొనడం మరో లక్ష్యం.

- షిఫ్టుల్లో పని చేయడం నాకు సమస్య కాదు. చాలా దూరం నుంచి నేను ఇక్కడికి రావాలి. అందువల్ల నేను నైట్ డ్యూటీలను ప్రిఫర్ చేస్తాను. ఉదయమే రావడం కొద్దిగా కష్టమే. అవసరమైతే వీకెండ్స్‌లో పని చేయడానికి అభ్యంతరం లేదు అని చెప్పవచ్చు.

ప్ర: మిమ్మల్ని మేం ఎందుకు తీసుకోవాలి?

జ: ఇది అన్ని జాబ్‌లకూ వర్తిస్తుంది. ఇంటర్వ్యూలోనే ఈ ప్రశ్నకు చాలా వరకు సమాధానం చెప్పారు.

- బ్రాండింగ్, ఫ్యాషన్‌పై నాకు విపరీతమైన ఆసక్తి. ఇంకా లోతుగా ఈ విషయాలు తెలుసుకోవాలన్న ఆసక్తి ఉన్న వ్యక్తిని. అమ్మకాలు, కస్టమర్ సర్వీస్‌లో మరింత నేర్చుకోవాలని అనుకుంటున్నాను. ఏ రకంగా చూసుకున్నప్పటికీ మీకు నేను సూటవుతాను.
- ఇలా ప్రశ్నలను కొద్దిగా ఊహించుకుని వెళితే, నిక్కచ్చిగా, నిర్భయంగా సమాధానాలు చెప్పే వీలు ఉంటుంది.

ప్రైవేట్ జాబ్స్

డాక్టర్ రెడ్డీస్
- **ఉద్యోగం:** టెక్నికల్ ట్రైనీ
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో బీఎస్సీ (కెమిస్ట్రీ) ఉత్తీర్ణత.
- **ఎంపిక:** రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **చివరి తేదీ:** 2018 మార్చి 2
- **వెబ్‌సైట్:** www.drreddys.com, www.task.telangana.gov.in/Placements/Dr._Reddys_2018

లాగిన్ రేడియస్
- **ఉద్యోగం:** ఆటోమేషన్ ఇంజనీర్
- **అర్హత:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** కనీసం ఏడాది
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **వెబ్‌సైట్:** www.loginradius.com/careers/automation-engineer-qa-jaipur/

ప్రైమ్ సాఫ్ట్
- **ఉద్యోగం:** వెబ్ అప్లికేషన్ యూఐ డెవలపర్స్
- **అర్హత:** బిఇ, బిటెక్, ఎంఇ, ఎంటెక్, ఎంఎస్, ఎంసిఏ
- **అనుభవం:** 3 - 6 సంవత్సరాలు
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **వెబ్‌సైట్:** https://www.primesoft.net/jobs/web-application-ui-developers/

థాట్ వర్క్స్
- **ఉద్యోగం:** అప్లికేషన్ డెవలపర్(ఫుల్-స్టాక్)
- **అర్హత:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** 3 సంవత్సరాలు
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **వెబ్‌సైట్:** https://www.thoughtworks.com/jobs/903531

ఐఎస్‌పిజి
- **ఉద్యోగం:** ఫ్రంట్ ఎండ్ డెవలపర్(యూఐ)
- **అర్హత:** ఏదైనా డిగ్రీ/డిప్లొమా
- **అనుభవం:** 1 - 3 సంవత్సరాలు
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **వెబ్‌సైట్:** http://www.ispg.co/apply?jobid=18

విప్రో
- **ఉద్యోగం:** డెవలపర్ కోర్ జావా
- **అర్హత:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** 3 - 5 సంవత్సరాలు
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **వెబ్‌సైట్:** https://careers.wipro.com/share-search-for-jobs.aspx?job-code=565766&cc=TE&Subsource=DJ

గవర్నమెంట్ జాబ్స్

ఎయిమ్స్ రిషికేష్

రిషికేష్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)- డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 223

పోస్టులు: అసిస్టెంట్ ప్రొఫెసర్ 81, అడిషనల్ ప్రొఫెసర్ 36, అసోసియేట్ ప్రొఫెసర్ 75, ప్రొఫెసర్ 31

అర్హత: ఎంబీబీఎస్/ బీడీఎస్ ఉత్తీర్ణతతోపాటు ఎండీ/ ఎంఎస్/ ఎండీఎస్/ ఎంసీహెచ్ పూర్తిచేసి ఉండాలి. లేదా సంబంధిత విభాగంలో పీజీ/ డాక్టొరేట్ చేసి ఉండాలి. జూన్ 1 నాటికి ప్రొఫెసర్లకు 14 ఏళ్లు, అడిషనల్ ప్రొఫెసర్లకు 10 ఏళ్లు, అసోసియేట్ ప్రొఫెసర్లకు 6 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు 3 ఏళ్ల అనుభవం ఉండాలి.

ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా

దరఖాస్తు ఫీజు: జనరల్ & ఓబీసీ అభ్యర్థులకు రూ.3,000(ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: మార్చి 17 నుంచి

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 30

వెబ్‌సైట్: www.aiimsrishikesh.edu.in

ఎయిర్ ఇండియా

కోల్‌కతాలోని ఎయిర్ ఇండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ (ఏఐఈఎస్ఎల్)- కాంట్రాక్ట్ ప్రాతిపదికన యుటిలిటీ హ్యాండ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఐటిఐ అర్హత ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. ఏవియేషన్ సెక్టార్‌లో కనీసం పదేళ్ల అనుభవం తప్పనిసరి.

మొత్తం ఖాళీలు: 60

వయసు: 55 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: స్కిల్ టెస్ట్/ ఇంటర్వ్యూ/ ట్రేడ్ టెస్ట్ ద్వారా

కాంట్రాక్ట్ వ్యవధి: మూడేళ్లు

వేతనం: రూ.15418

దరఖాస్తు ఫీజు: రూ.500

దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 12

వెబ్‌సైట్: www.airindia.in

నిఫ్ట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్)- తాత్కాలిక ప్రాతిపదికన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

వయసు: 30 ఏళ్లు మించకూడదు.

అర్హత: కనీసం 55శాతం మార్కులతో సంబంధిత విభాగంలో పీజీతోపాటు కనీసం మూడేళ్ల పరిశోధన/ బోధన అనుభవం ఉండాలి. లేదంటే పిహెచ్‌డితోపాటు ఏడాది అనుభవం ఉండాలి.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ/ ప్రెజంటేషన్ ద్వారా

వేతనం: నెలకు రూ.66,000లతోపాటు హెచ్‌ఆర్‌ఏ ఇస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 21

వెబ్‌సైట్: www.nift.ac.in

మొత్తం ఖాళీలు: 63

భారత్ ఎలక్ట్రానిక్స్

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్)- తాత్కాలిక ప్రాతిపదికన డిప్యూటీ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

విభాగాలు: కంప్యూటర్ సైన్స్ 18, ఎలక్ట్రానిక్స్ 5

అర్హత: (బీఈ/ బీటెక్/ ఏఎంఐఈ/ బీఎస్సీ)(కంప్యూటర్ సైన్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్/ టెలీ కమ్యూనికేషన్స్/ కమ్యూనికేషన్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలి కమ్యూనికేషన్స్) ఉత్తీర్ణులై ఉండాలి. ఫిబ్రవరి 1 నాటికి ఏడాది అనుభవం ఉండాలి

వయసు: ఫిబ్రవరి 1 నాటికి 26 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ

కాంట్రాక్ట్ వ్యవధి: మూడేళ్లు

దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 14

వెబ్‌సైట్: www.bel-india.com

మొత్తం ఖాళీలు: 23

అనంతపురం వైద్య ఆరోగ్య శాఖ

అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం- కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: స్పెషలిస్ట్ డాక్టర్ 1, స్పెషలిస్ట్ కార్డియాలజీ 1, మెడికల్ అంకాలజిస్ట్ 1, మెడికల్ ఆఫీసర్ 5, స్టాఫ్ నర్స్ 2, రిహాబిలిటేషన్ వర్కర్ 7, డిస్ట్రిక్ట్ కన్సల్టెంట్ 1, ల్యాబ్ టెక్నీషియన్ 1, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ 3

అర్హత: పోస్టును అనుసరించి యంబిబిఎస్/ ఎండి- మెడిసిన్/ జీఎన్ఎం/ డిగ్రీ(ఫిజియోథెరపీ/ ఒకేషనల్ థెరపీ)/ బీడీఏ/ ఎమ్మెస్సీ/ డీఎంఎల్‌టీ/ ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. సంబంధిత రంగంలో కనీసం రెండు నుంచి నాలుగేళ్ల అనుభవం ఉండాలి.

వయసు: 50 ఏళ్లలోపు ఉండాలి.

దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 10

వెబ్‌సైట్: http://anantapuramu.ap.gov.in

మొత్తం ఖాళీలు: 22

ఇండియన్ ఆయిల్

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్)- జూనియర్ ఇంజనీర్ అసిస్టెంట్ గ్రేడ్ 4 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

పోస్టులు: జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్(ప్రొడక్షన్ 32, టీపీఎస్ 1, ఎలక్ట్రికల్ 9, మెకానికల్ - పంప్ & కంప్రెషర్స్ 3, ఇన్‌స్ట్రుమెంటేషన్ 5, ఫైర్ అండ్ సేఫ్టీ 1), జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అనలిస్ట్ 5, జూనియర్ మెటీరియల్ అసిస్టెంట్/ జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ 3

మొత్తం ఖాళీలు: 59

అర్హత: పోస్టును అనుసరించి కనీసం 50 శాతం మార్కులతో మూడేళ్ల డిప్లొమా/ బిఎస్సీ(ఫిజిక్స్/ కెమిస్ట్రీ/ ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ/ మేథమెటిక్స్)/ సంబంధిత ట్రేడ్‌లో ఐటిఐ ఉత్తీర్ణులై ఉండాలి. ఫైర్ & సేఫ్టీ విభాగానికి హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ కూడా ఉండాలి. అన్ని పోస్టులకు నిర్దేశించిన మేర అనుభవం ఉండాలి. ప్రొడక్షన్, టీపీఎస్, ఫైర్ అండ్ సేఫ్టీ విభాగాల్లో దరఖాస్తుకు మహిళలు అనర్హులు.

వయసు: ఫిబ్రవరి 28 నాటికి 18 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 10

దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: మార్చి 24

చిరునామా: Dy.General Manager(HR), Indian Oil Corporation Limited, PO.Jawahar Nagar, Dist.Vadodara - 391320

వెబ్‌సైట్: www.iocl.com

దిక్సూచి

పత్తి పంటకు అనుకూల నేలలు?

భూ ఉపరితలంపై ఉన్న మెత్తని పొరనే మృత్తిక లేదా నేల అంటారు. ఇది సాధారణంగా కర్బన, అకర్బన పదార్థాలతో కూడి ఉంటుంది. ఇది ప్రకృతిలో లభించే అత్యంత ప్రధానమైన సహజ వనరు. ఒక మీటరు మందం గల నేల ఏర్పడాలంటే సుమారు 5000 నుంచి 10,000 ఏళ్ల సమయం పడుతుంది. నేలలను గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'పెడాలజీ' అంటారు.

పోటీ పరీక్షల ప్రత్యేకం
జాగ్రఫీ

మృత్తికల రకాలు

ప్రపంచంలో మృత్తికలు/ నేలలను అవి ఏర్పడే ప్రాంతాలు అక్కడి శీతోష్ణ పరిస్థితుల ఆధారంగా మూడు రకాలుగా వర్గీకరించారు. అవి..

- జోనల్ మృత్తికలు
- ఇంట్రా జోనల్ మృత్తికలు
- అజోనల్ మృత్తికలు

జోనల్ మృత్తికలు

మాతృ శిలలు శిథిలమై ఒక నిర్దిష్ట ప్రాంతంలో ఏర్పడిన మృత్తికలనే 'జోనల్ మృత్తికలు' అంటారు. ఉదా: చెర్నోజమ్, పాడేజోల్, ఎర్ర మృత్తికలు, నల్లరేగడి మృత్తికలు, లాటరైట్ మృత్తికలు.

ఇంట్రా జోనల్ మృత్తికలు

నీటిలో కరిగిన లవణాలు భూమి లోపల నుంచి కేశనాళికా ప్రక్రియ ద్వారా భూ ఉపరితలం పైకి చేరి అందులోని తేమ శాతం ఆవిరైన తరవాత మిగిలిన లవణాలతో ఏర్పడిన నేలలనే 'ఇంట్రాజోనల్' మృత్తికలు అంటారు. ఉదా: పీట్ , టెర్రారోసా, క్షీర మొదలైనవి.

అజోనల్ మృత్తికలు

బహిర్జనిత బలాల వల్ల ఒండ్రు మట్టి, ఇసుక వంటి శిథిల పదార్థాలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రవాణా ద్వారా నిక్షేపించడం వల్ల ఏర్పడిన మృత్తికలనే అజోనల్ మృత్తికలు అంటారు. ఉదా: ఒండ్రు, లోమస్ మొదలైనవి.

భారతదేశ మృత్తికలు

మన దేశంలోని మృత్తికలను 'భారతదేశ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్)' ఎనిమిది రకాలుగా వర్గీకరించింది. అవి..

- ఒండ్రు నేలలు
- నల్ల రేగడి నేలలు
- ఎర్ర నేలలు
- లాటరైట్ నేలలు
- అటవీ నేలలు
- ఎడారి నేలలు
- లవణ/ క్షార నేలలు
- పీట్/ జీవ సంబంధ నేలలు

ఒండ్రు నేలలు

నదులు తీసుకొచ్చిన సారవంతమైన ఒండ్రు మట్టితో ఈ నేలలు ఏర్పడతాయి. ఇవి ప్రధానంగా ఉత్తర భారతంలోని గంగా, బ్రహ్మపుత్ర, సింధూనదీ పరీవాహక ప్రాంతాల్లోనూ; దక్షిణ భారతదేశ తూర్పు తీర ప్రాంతాల్లోని మహానది, గోదావరి, కృష్ణా, కావేరీ నదీ పరీవాహక ప్రాంతాల్లో అధికంగా విస్తరించాయి. ఇవి దేశంలోనే అత్యంత సారవంతమైన నేలలు. ఈ నేలల్లో పొటాషియం అధికంగా, ఫాస్పరస్‌లు అల్పంగా ఉంటాయి.



ఈ నేలలను అవి ఏర్పడిన విధానం, వాటి లక్షణాల ఆధారంగా రెండు రకాలుగా పేర్కొంటారు. అవి...

- ఖాదర్ నేలలు
- భంగర్ నేలలు

ఖాదర్ నేలలు

ఖాదర్ నేలలను కొత్త ఒండ్రు నేలలు అని కూడా అంటారు. ఇవి అత్యంత సారవంతమైన నేలలు. ఈ నేలలు నదులకు ఇరువైపులా ఉండి తరచూ వరదలకు గురవుతుంటాయి. అందువలన ఎప్పటికప్పుడు కొత్త ఒండ్రు ఈ నేలలపై చేరి వ్యవసాయానికి అనువుగా సారవంతంగా తయారవుతాయి.

భంగర్ నేలలు

వీటిని పాత ఒండ్రు నేలలు అంటారు. ఇవి సాధారణంగా నదులకు చాలా దూరంలో ఏర్పడతాయి. వీటికి వరదల బెడద ఉండదు. కాబట్టి కొత్త ఒండ్రు చేరదు. దీనితో ఇవి నిస్సారంగా ఉంటాయి. రసాయన ఎరువులను ఉపయోగించి వీటిని వ్యవసాయానికి వినియోగించవచ్చు.

ఉత్తర మైదానాల్లోని ఒండ్రు నేలలను స్థానికంగా తెరాయ్ నేలలు, బాబర్ నేలలు అని పిలుస్తారు. తెరాయ్ నేలలు ఎప్పుడూ చిత్తడిగా ఉంటే బాబర్ నేలలు గులక రాళ్లతో ఏర్పడతాయి. ఇవి వ్యవసాయానికి అనుకూలమైనవి కాదు. ఒండ్రు నేలలు అధికంగా విస్తరించి ఉన్న రాష్ట్రం ఉత్తరప్రదేశ్. పంజాబ్, హర్యానా, బీహార్, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా ఈ నేలలు ఉన్నాయి. ఇవి అన్ని రకాల పంటలకు అనుకూలమైనప్పటికీ మనదేశంలో ప్రధానంగా వరి, గోధుమ, చెరకు, జనుములను అధికంగా సాగు చేస్తున్నారు.

నల్లరేగడి నేలలు

అగ్ని శిలలైన బసాల్ట్ శిలలు క్రమక్షయం చెంది నల్లరేగడి నేలలు ఏర్పడతాయి. ఇవి మనదేశంలో వింధ్య, సాత్పురా పర్వతాలకు దక్షిణాన ఉన్న దక్కన్ పీఠభూమిలో అధికంగా విస్తరించాయి. ఈ నేలల్లో ఇనప ధాతువులు, మెగ్నీషియం ఆక్సైడ్‌లు ఎక్కువగా ఉండడం వల్ల ఇవి నలుపు రంగులో ఉంటాయి. ఈ మూలకాలతోపాటు సున్నం, పొటాష్ కూడా చెప్పుకోతగ్గ పరిమాణంలో ఉంటాయి. ఈ నేలల్లో ఫాస్ఫరస్, నైట్రోజన్, జీవసంబంధ పదార్థాలు తక్కువగా ఉంటాయి. వీటిని రేగడి నేలలు అని కూడా పిలుస్తారు. ఇవి అమెరికాలోని ప్రయరీ భూముల్లో ఉన్న 'చెర్నోజెమ్' నేలల వంటివి. ఈ నేలలు పత్తి పంటకు అనుకూలంగా ఉండడం వల్ల వీటిని పత్తి నేలలు అని కూడా పిలుస్తారు. నీటి ఎద్దడి ఏర్పడినపుడు ఈ నేలల్లో పగుళ్లు వస్తాయి. అందుకే వీటిని 'తనని తాను దున్నుకొనే నేలలు' అని కూడా పిలుస్తారు. ఇవి తేమను అధిక కాలం నిల్వ ఉంచుకోగల్గుతాయి. ఈ నేలలు అధికంగా మహారాష్ట్రలో ఉన్నాయి. గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా అక్కడక్కడా నల్ల రేగడి నేలలు విస్తరించాయి.

ఎర్ర నేలలు

అగ్ని శిలలైన గ్రానైట్ శిలలు క్రమక్షయం చెంది ఎర్ర నేలలు ఏర్పడతాయి. ఈ నేలల్లో ఫెర్రస్ ధాతువు ఉండటం వల్ల ఇవి ఎరుపు రంగులో ఉంటాయి. ఈ నేలల్లో ఒండ్రు శాతం తక్కువగా, ఇసుక పరిమాణం అధికంగా ఉంటుంది. అందుకే ఈ నేలలు తడిసినపుడు ఒదులుగా అవుతాయి. ఈ నేలలు వేళ్ల అధికంగా ఉండే లెగుమినస్ జాతికి చెందిన పంటలకు అనుకూలంగా ఉంటాయి. ఎర్ర నేలల్లో పప్పు ధాన్యాల పంటలు బాగా పండుతాయి. నీటి వసతులు కల్పించి వరి, గోధుమ, చెరకు పంటలను కూడా పండించవచ్చు. ఈ నేలలు మధ్యప్రదేశ్‌లో అధికంగా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ, జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా ఈ నేలలు కనిపిస్తాయి. తమిళనాడులోని అన్ని జిల్లాల్లో ఈ నేలలు ఉన్నాయి. వీటిలో నైట్రోజన్, ఫాస్ఫరస్, జీవ సంబంధ పదార్థాలు తక్కువ శాతంలో ఉంటాయి.

లాటరైట్ నేలలు

'లాటర్' అనే లాటిన్ పదం నుంచి 'లాటరైట్' అనే ఇంగ్లీష్ పదం వచ్చింది. లాటిన్‌లో లాటర్ అంటే బ్రిక్ అని అర్థం. అధిక వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు ఉన్న పర్వత లోయ ప్రాంతాల్లో ఈ లాటరైట్ నేలలు ఎక్కువగా ఏర్పడతాయి. అధిక వర్షపాతం వల్ల ఇక్కడ క్షాళన అధికంగా ఉంటుంది. దీనితో ఈ నేలలపైన ఉన్న సారవంతమైన మూలకాలు కరిగిపోయి అల్యూమినియం ఆక్సైడ్, సిలికా హైడ్రాక్సైడ్ వంటి మూలకాలు మిగిలిపోతాయి. ఈ మూలకాలు ఉన్న నేలలు తడిసినపుడు మెత్తగా ఉండి ఎండినపుడు గట్టి ఇటుకలా మారతాయి. వీటినే జేగురు నేలలు అనికూడా అంటారు. ఈ నేలల్లో నత్రజని, పొటాష్, సున్నం, మెగ్నీషియంలు తక్కువగా ఉంటాయి. పశ్చిమ కనుమలు, తూర్పు హిమాలయాలు, వింధ్య - సాత్పురా పర్వత ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా విస్తరించాయి. కాఫీ, తేయాకు, రబ్బరు, సుగంధ ద్రవ్యాల వంటి తోట పంటల సాగుకు ఈ నేలలు అనుకూలం.


ఎస్.వి. నారాయణ
సీనియర్ ఫ్యాకల్టీ

రాజస్థాన్ స్పిన్ కోచ్‌గా సాయిరాజ్ బహుతులే

ముంబై: ఐపీఎల్ టీమ్ రాజస్థాన్ రాయల్స్ స్పిన్ బౌలింగ్ కోచ్‌గా టీమిండియా మాజీ స్పిన్నర్ సాయిరాజ్ బహుతులే నియమితుడయ్యాడు. భారత్ తరఫున బహుతులే రెండు టెస్టులు, ఎనిమిది వన్డేలు ఆడాడు. ముంబై తరఫున 188 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన సాయిరాజ్.. 630 వికెట్లు పడగొట్టాడు. గత మూడేళ్లుగా బెంగాల్ రంజీ కోచ్‌గా ఉన్నాడు.

న్యూజిలాండ్ x ఇంగ్లండ్
రెండో వన్డే
ఉ. 6.30 నుంచి
స్టార్ స్పోర్ట్స్ సెలెక్ట్ -1లో..



కర్ణాటక మూడోస్సారి..

- ఫైనల్లో సౌరాష్ట్రపై విజయం
- మయాంక్ సూపర్ ఇన్నింగ్స్
- విజయ్ హజారే ట్రోఫీ

టన్నుల కొద్దీ పరుగులు చేస్తున్నా భారత జట్టులో చోటు దక్కించుకోలేకపోతున్న మయాంక్ అగర్వాల్.. మరోసారి కసితీరా బాదాడు..! అతడి జోరుతో కర్ణాటక జట్టు మూడోసారి విజయ్ హజారే ట్రోఫీని గెలుచుకోగలిగింది. ఈ అత్యున్నత పరిమిత ఓవర్ల దేశవాళీ టోర్నీ ఫైనల్లో సౌరాష్ట్రపై నెగ్గి ఆ జట్టు విజేతగా నిలిచింది. ముస్తాక్ అలీ, రంజీ ట్రోఫీలో నిరాశపరిచిన కర్ణాటక ఎట్టకేలకు ఈ సీజన్‌లో టైటిల్‌ను తమ ఖాతాలో వేసుకోగలిగింది.

న్యూఢిల్లీ: విజయ్ హజారే ట్రోఫీని సెంచరీతో ప్రారంభించిన ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (79 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సర్లతో 90) తుది పోరులోనూ అదరగొట్టాడు. దీంతో మంగళవారం సౌరాష్ట్రతో జరిగిన ఫైనల్లో కర్ణాటక జట్టు 41 పరుగుల తేడాతో నెగ్గింది. ఆ జట్టుకిది మూడో టైటిల్ కావడం విశేషం. ఫిరోజ్ షా కోట్ల మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక 45.5 ఓవర్లలో 253 పరుగులకు ఆలౌటైంది. ఐదు పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన స్థితిలో మయాంక్ విజృంభణతో జట్టు గాడిలో పడింది. పవన్ దేశ్‌పాండే (60 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 49), సమర్థ్ (65 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్‌తో 48) సహకారం అందించారు. కమలేశ్ మక్వానాకు నాలుగు వికెట్లు దక్కాయి. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సౌరాష్ట్ర 46.3 ఓవర్లలో 212 పరుగులకు ఆలౌట్ అయింది. కెప్టెన్ చటేశ్వర్ పుజారా (127 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్‌తో 94) పోరాటం వృథా అయింది. ప్రసిధ్ కృష్ణ, గౌతమ్‌లకు మూడేసి వికెట్లు తీశారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ మయాంక్ అగర్వాల్‌కు దక్కింది.

మయాంక్ జోరు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక మూడు ఓవర్లు ముగిసేలోపే కెప్టెన్ కరుణ్ నాయర్, కేఎల్ రాహుల్ వికెట్లను కోల్పోయింది. వీరిద్దరూ ఖాతానే తెరవలేకపోయారు. ఈ దశలో మయాంక్‌కు అండగా సమర్థ్ నిలిచాడు. సౌరాష్ట్ర బౌలర్లను నిలకడగా ఎదుర్కొంటూ స్కోరును పెంచడంపై వీరు దృష్టి పెట్టారు. ఆరంభంలో నిదానంగా ఆడిన ఈ జోడీ కుదురుకున్నాక చెలరేగింది. అటు మయాంక్ తన సూపర్ ఫామ్‌ను చాటుకుంటూ 50 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. జడేజా వేసిన 23వ ఓవర్‌లో మయాంక్ రెండు సిక్సర్లు, ఓ ఫోర్‌తో 17 పరుగులు సాధించాడు. అయితే వరుస ఓవర్లలో మయాంక్, సమర్థ్ పెవిలియన్‌కు చేరారు. దీంతో మూడో వికెట్‌కు 136 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత దేశ్‌పాండే మినహా ఎవరూ రాణించకపోవడంతో జట్టు భారీ స్కోరు చేయలేకపోయింది. లక్ష్య ఛేదనకు బరిలోకి దిగిన సౌరాష్ట్రను కర్ణాటక బౌలర్లు వణికించారు. 101 పరుగులకే ఆరు వికెట్లు నేలకూలి ఇబ్బంది పడింది. పుజారా ఆ మాత్రం రాణించడంతో జట్టు స్కోరు రెండు వందలైనా దాటగలిగింది.

ఐపీఎల్‌ను అలా భావించడం లేదు



న్యూఢిల్లీ: భారత వన్డే జట్టులో తిరిగి చోటు దక్కించుకునేందుకు తానేమీ నిద్రలేని రాత్రులను గడపడం లేదని ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తేల్చి చెప్పాడు. ప్రస్తుతం తాను పంజాబ్ కింగ్స్ లెవన్‌ను ముందుండి నడిపించడంపైనే దృష్టి సారించానని ఆ జట్టు కొత్త కెప్టెన్ అయిన అశ్విన్ స్పష్టం చేశాడు. పంజాబ్ జట్టులో ఉన్న యువరాజ్, ఫించ్‌లను కాదని ఫ్రాంచైజీ యాజమాన్యం అశ్విన్‌ను తమ సారథిగా ఎంచుకొంది. కొంతకాలంగా జడేజాతో కలిసి అశ్విన్ భారత వన్డే, టీ20ల్లో చోటు దక్కించుకోలేకపోతున్న విషయం తెలిసిందే. 'భారత జట్టులో తిరిగి చోటు దక్కించుకునేందుకు ఐపీఎల్‌ను వేదికగా భావించడం లేదు. ప్రతీ ఏడాది ఆడినట్టుగానే ఈసారీ ఐపీఎల్ బరిలోకి దిగుతాను. అయితే ఈ సీజన్‌లో నాపై పంజాబ్ కెప్టెన్‌గా పెద్ద బాధ్యత ఉంది. ఆ సవాల్‌ను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాను. అంతకుమించి ఇంకేమీ ఆలోచించడం లేదు. అన్నీ అనుకూలించినప్పుడు జాతీయ జట్టులోకి వస్తాన'ని అశ్విన్ అన్నాడు.

ఈ పరుగులు చాలవా?



- దేశవాళీ సీజన్‌లో అదరగొడుతున్న మయాంక్
- అయినా పట్టించుకోని సెలెక్టర్లు

ఎనిమిది మ్యాచ్‌లు.. మూడు సెంచరీలు.. నాలుగు అర్ధ సెంచరీలు.. ఇదీ విజయ్ హజారే ట్రోఫీలో ఓపెనర్ మయాంక్ అగర్వాల్ ట్రాక్ రికార్డు. ఏకంగా 107.9 సగటుతో 723 పరుగులు. అంతేనా దీనికన్నా ముందు జరిగిన రంజీ ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీల్లోనూ నిలకడగానే కాదు.. ఓరకంగా బౌలర్లపై విరుచుకుపడ్డాడు. తన బ్యాట్ నుంచి వరదలా వచ్చి పడుతున్న రన్స్‌తో మొత్తంగా ఈ సీజన్‌లో అతడు 2,141 పరుగులు సాధించాడు. దీంతో ఓ దేశవాళీ సీజన్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఇంకా ఈ సీజన్‌లో రెండు టోర్నీలు మిగిలే ఉన్నాయి. కానీ ఇంతటి ప్రతిభావంతుడు కళ్ల ముందు కనిపిస్తున్నా శ్రీలంకలో జరగబోయే ముక్కోణపు టోర్నీకి సెలెక్టర్లు మయాంక్‌ను పక్కన పెట్టడం విమర్శలకు దారితీసింది..!

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

జాతీయ జట్టులో చోటు సాధించాలంటే ముందుగా దేశవాళీ మ్యాచ్‌ల్లో సత్తా చాటుకోవాలి.. ఇదీ ఇటీవలి కాలంలో బీసీసీఐ కఠినంగా అమలు చేస్తున్న నిబంధన. దీనికి తోడు ఫిట్‌నెస్ ప్రమాణాలకు అనుగుణంగానే ఉందని నిరూపించుకుంటూ యోయో టెస్టును అధిగమించాల్సి ఉంటుంది. ఈ రెండు అంశాల్లో మయాంక్ అగర్వాల్‌కు తిరుగు లేదు. పరుగుల విషయాన్ని తీసుకుంటే అతడి బ్యాట్ ఇందుకు తగిన సమాధానమే ఇస్తోంది. అంతెందుకు శ్రీలంక, బంగ్లాదేశ్‌తో జరిగే ముక్కోణపు టోర్నీ కోసం భారత జట్టును ప్రకటించడానికి ఒక రోజు ముందు ఢిల్లీలో కర్ణాటక జట్టు సెమీఫైనల్ మ్యాచ్ ఆడింది. మహారాష్ట్రతో జరిగిన ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు జాతీయ సెలెక్టర్లు కూడా వచ్చారు. ఆ మ్యాచ్‌లో మయాంక్ 81 బంతుల్లో 86 పరుగులు చేసి జట్టును తుది పోరుకు చేర్చాడు. ఈ మ్యాచ్‌లోనే కాకుండా వరుసగా తను ఈ టోర్నీలో అద్భుత రీతిలో రాణిస్తూనే ఉన్నాడు. అందుకే కచ్చితంగా జట్టులో చోటు దక్కుతుందనే ఆశించాడు కాబోలు. పైగా మరో ఓపెనర్ రాహుల్ ఫామ్ కోల్పోయి తంటాలు పడుతున్నాడు. కానీ జరిగింది వేరు.. ఆదివారం జట్టును ప్రకటించారు. రాహుల్ బెర్త్ ఓకే.. కానీ ఆ జాబితాలో పరుగుల యంత్రం మయాంక్ పేరు మాత్రం కనిపించలేదు. ఇది అందరికీ షాక్‌ను కలిగించింది. దీనికి సెలెక్షన్ కమిటీ చెప్పిన సమాధానం మరీ వింతగా అనిపించింది. మయాంక్ భారత్ 'ఎ' జట్టులో లేడు కాబట్టే అతడి పేరును పరిగణనలోకి తీసుకోలేదని సెలెక్టర్లు వెల్లడించారు. ఈ కామెంట్‌పై నెటిజన్లు విరుచుకుపడుతున్నారు. జట్టు ఎంపిక పారదర్శకంగా లేదన్నది వారి వాదన. అయితే ఎన్నో ఆశలు పెట్టుకున్న భారత జట్టులో చోటు దక్కకపోయినా కూడా ఎలాంటి నిరాశ కనిపించకుండా మయాంక్.. మంగళవారం నాటి ఫైనల్లోనూ 90 పరుగులు సాధించి కసితో సమాధానం చెప్పాడు. ఇది ఆటపై అతడికున్న అంకితభావాన్ని సూచిస్తోంది.

రికార్డుల వెల్లువ

వాస్తవానికి కర్ణాటక రంజీ ట్రోఫీలో మయాంక్‌కు స్థానం అంత సులువుగా ఏమీ దక్కలేదు. ఆ జట్టు ఊతప్ప, సతీష్, రాహుల్, సమర్థ్, అభిషేక్ రెడ్డి ఇలా విజయవంతమైన ఓపెనర్లను కలిగి ఉంది. అయితే ఊతప్ప, సతీష్ ఇతర రాష్ట్రాలకు వెళ్లడంతో పాటు రాహుల్ భారత జట్టుకు ఎంపిక కావడం.. అభిషేక్ గాయంతో దూరం కావడంతో మయాంక్‌కు దారి సులువైంది. ఈ అవకాశాన్ని ఏమాత్రం వమ్ము చేయకుండా రెండు చేతులా సొమ్ము చేసుకున్నాడు. అయితే తొలి మూడు ఇన్నింగ్స్‌లో అతడు చేసింది 31 పరుగులు మాత్రమే. కానీ ఆ తర్వాత ఒక్కసాగా అతడు గేర్ మార్చాడు. మహారాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో అజేయంగా 304 పరుగులు చేసి పరుగుల దాహం తీర్చుకున్నాడు. ఈ దెబ్బతో జట్టు ఇన్నింగ్స్ తేడాతో నెగ్గింది. ఆ తర్వాత వరుసగా 176, 23, 90, 133నాటౌట్, 173, 134, 78 పరుగులతో దూసుకెళ్లాడు. అనంతరం జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ టీ-20లోనూ మూడు అర్ధ సెంచరీలతో 258 పరుగులు చేశాడు. ఇక విజయ్ హజారేలో విశ్వరూపమే ప్రదర్శించాడు. 109, 84, 28, 102, 89, 140, 81, 90లతో మొత్తం 723 పరుగులు సాధించాడు. అసలు ఓ సీజన్‌లో 2వేల పరుగులు సాధించిన ఆటగాడే లేడు. గతంలో శ్రేయాస్ అయ్యర్ (1947) చేసిన పరుగులే అత్యధికం. అయినా సీనియర్లకు విశ్రాంతినిస్తూ యువ ఆటగాళ్లతో జట్టును ఎంపిక చేసినా ఈ పరుగుల యంత్రానికి క్రికెట్ పెద్దలు మొండిచేయి చూపడంతో వర్ధమాన క్రికెటర్లకు ఎలాంటి సందేశం ఇస్తున్నారన్నది విమర్శకుల ప్రశ్న.

మయాంక్ రికార్డులు

- ఓ దేశవాళీ సీజన్‌లో అత్యధిక పరుగుల రికార్డు బద్దలు (2,141; రంజీ 1160, ముస్తాక్ అలీ 258, విజయ్ హజారే 723)
- లిస్ట్-ఎ సిరీస్‌లో అత్యధిక పరుగులు (723) చేసిన ఆటగాడు. సచిన్ రికార్డు (673, 2003 ప్రపంచకప్)ను అధిగమించాడు.
- విజయ్ హజారేకు సంబంధించి ఓ సీజన్‌లో మయాంక్‌వే అత్యధిక పరుగులు. దినేశ్ కార్తీక్ (607)ను అధిగమించాడు.

బోల్ట్ సాకర్ పోరు జూన్ 10న



పారిస్: అథ్లెటిక్స్‌కు గుడ్‌బై చెప్పి ఫుట్‌బాల్‌ను కెరీర్‌గా ఎంచుకున్న స్ప్రింట్ దిగ్గజం ఉసేన్ బోల్ట్ తన తొలి సాకర్ మ్యాచ్‌ను ఈ ఏడాది జూన్ 10న ఇంగ్లండ్‌లోని మాంచెస్టర్ యునైటెడ్ ఓల్డ్ ట్రాఫోర్డ్ స్టేడియంలో ఆడనున్నాడు. యునిసెఫ్ చిన్నారుల సహాయనిధిలో భాగంగా నిర్వహిస్తున్న ఈ చారిటీ ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో బ్రిటిష్ పాప్ స్టార్ రాబిన్ విలియమ్స్‌తో కలిసి బోల్ట్ సాకర్ ఆడనున్నాడు. సాకర్ ఎయిడ్ వరల్డ్ ఎలెవెన్ జట్టు తరఫున బోల్ట్ ఆ మ్యాచ్‌లో తలపడతాడు. తాను ఓ ఫుట్‌బాల్ జట్టుతో ఒప్పందం కుదుర్చుకున్నాననీ, ఆ జట్టు పేరేంటన్నది 24 గంటల్లో వెల్లడిస్తానంటూ సోమవారం బోల్ట్ ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే. అన్నట్టు.. ఆ మ్యాచ్‌లో సాకర్ ఎయిడ్ జట్టుకు బోల్ట్ కెప్టెన్ కావడం విశేషం.

ప్రపంచ జూనియర్ స్క్వాష్‌కు చెన్నై ఆతిథ్యం

చెన్నై: ఇటీవల అంతర్జాతీయ టోర్నీలకు వేదికగా మారిన చెన్నై నగరం మరో మెగా ఈవెంట్‌కు ఆతిథ్యమిచ్చేందుకు సిద్ధమైంది. ప్రపంచ జూనియర్ స్క్వాష్ వ్యక్తిగత చాంపియన్‌షిప్ (పురుషులు, మహిళలు)తో పాటు డబ్ల్యూఎస్‌ఎఫ్ పురుషుల జూనియర్ టీమ్ చాంపియన్‌షిప్ ఆతిథ్య హక్కులను చెన్నై దక్కించుకుంది. ఈ ఏడాది జూలై 18 నుంచి 23వ తేదీ వరకు ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్, ఇది ముగిసిన మరుసటి రోజే 24 నుంచి 29వ తేదీ వరకు టీమ్ ఈవెంట్‌లు చెన్నైలో జరగనున్నాయి.

మిథాలీకే పగ్గాలు..

ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు జట్టు ప్రకటన • వడోదరలో 12న మొదలు



న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికా పర్యటనను విజయవంతంగా ముగించిన భారత మహిళల క్రికెట్ జట్టు ఈసారి స్వదేశంలో మరో కీలక సవాల్‌కు సిద్ధమవుతోంది. ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై వన్డే సిరీస్‌లో భారత జట్టును మిథాలీరాజ్ నడిపించనుంది. వడోదర వేదికగా మార్చి 12 నుంచి 18 వరకు జరిగే మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్టును బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. ఐసీసీ మహిళల చాంపియన్‌షిప్‌లో భాగంగా జరిగే ఈ సిరీస్ కోసం.. సఫారీ పర్యటనలో మెప్పించిన జట్టునే దాదాపు కొనసాగించారు. మార్చి 12న తొలి వన్డే, 15న రెండో వన్డే, 18న చివరి మ్యాచ్ జరగనున్నాయి. వన్డే సిరీస్ ముగిశాక.. ముక్కోణపు టీ-20 సిరీస్ ఉంటుందని, ఆ జట్టును తర్వాత ప్రకటిస్తామని బీసీసీఐ తెలిపింది.


వన్డే జట్టు: మిథాలీ రాజ్ (కెప్టెన్), హర్మన్‌ప్రీత్ కౌర్ (వైస్ కెప్టెన్), స్మృతి మంధాన, పూనమ్ రౌత్, జెమీమా రోడ్రిగ్స్, వేదా కృష్ణమూర్తి, మోనా మెష్రమ్, సుష్మా వర్మ (వికెట్ కీపర్), ఏక్తా బిస్త్, పూనమ్ యాదవ్, రాజేశ్వరీ గైక్వాడ్, శిఖా పాండే, సుకన్య పరీద, పూజా వస్త్రాకర్, దీప్తి శర్మ.

కోహ్లీ దూకుడు శ్రుతి మించింది


స్టీవ్ వా

మొనాకో: సౌతాఫ్రికా పర్యటనలో విరాట్ కోహ్లీ దూకుడు కొంత శ్రుతిమించిందని ఆసీస్ దిగ్గజం స్టీవ్ వా అన్నాడు. 'కోహ్లీ తీరు చూస్తే.. కొంత అతి చేసినట్టుగా అనిపించింది. కానీ కెప్టెన్‌గా అనుభవం గడించే సమయంలో ఇలాంటి ప్రవర్తన సాధారణమేన'ని వా అన్నాడు. అయితే మిగతా వారితోనూ కొంత సంయమనంతో వ్యవహరించాల్సి ఉందని చెప్పాడు.

భారత్‌లో ఆ స్వర్ణం..అపురూపం



సెమెన్యా

మొనాకో: దక్షిణాఫ్రికా మిడిల్ డిస్టెన్స్ రన్నర్ కేస్టర్ సెమెన్యా.. రెండు ఒలింపిక్, మూడు ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్స్‌తో అథ్లెటిక్స్‌లో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకుంది. అయితే, పుణెలో జరిగిన 2008 కామన్వెల్త్ యూత్ గేమ్స్‌లో పసిడి పతకం సాధించడం తన జీవితంలో ఎంతో ప్రత్యేకమని చెప్పింది. 'ఒలింపిక్ చాంపియన్‌గా నిలవడం ఎంతో గొప్ప విషయం. కానీ కెరీర్‌లో తొలి స్వర్ణాన్ని భారత్‌లో నెగ్గడం ఎప్పటికీ మరచిపోలేను. అప్పుడే కెన్యా రన్నర్లను ఓడించగలననే ఆత్మస్థయిర్యం నాలో కలిగింద'ని లారెస్ వరల్డ్ స్పోర్ట్స్ అవార్డుల కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సెమెన్యా చెప్పింది.

19 ఏళ్లకే కెప్టెన్‌గా..

- రికార్డు సృష్టించనున్న రషీద్ ఖాన్



న్యూఢిల్లీ: అఫ్ఘానిస్థాన్ స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్ మరో రికార్డును ఖాతాలో వేసుకోనున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత పిన్న వయస్కుడైన కెప్టెన్‌గా అతను చరిత్ర సృష్టించనున్నాడు. ఇప్పటికే ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ఏ ఫార్మాట్‌లో అయినా నెంబర్ వన్ ర్యాంక్ అందుకున్న పిన్న వయస్కుడిగా రికార్డు కెక్కిన 19 ఏళ్ల రషీద్ అఫ్ఘాన్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. అపెండిసైటిస్ కారణంగా రెగ్యులర్ కెప్టెన్ అస్గర్ స్టానిక్జాయ్ పది రోజులు జట్టుకు దూరం కావడంతో అతని స్థానంలో వైస్ కెప్టెన్ రషీద్‌ను తాత్కాలిక సారథిగా ఎంపిక చేసినట్టు అఫ్ఘాన్ క్రికెట్ బోర్డు మంగళవారం ప్రకటించింది. దాంతో, 20 ఏళ్ల 297 రోజుల వయసులో సౌతాఫ్రికాతో టీ-20 మ్యాచ్‌లో బంగ్లాదేశ్ సారథిగా వ్యవహరించిన రజిన్ సాలేహ్‌ను రషీద్ అధిగమించనున్నాడు.

ద్యూతీచంద్‌కు స్వర్ణం

- ఇండియన్ గ్రాండ్ ప్రీలో సుధాకర్‌కు కాంస్యం


సుధాకర్
కోచ్ రమేశ్‌తో ద్యూతీచంద్

పటియాల: స్టార్ అథ్లెట్ ద్యూతీచంద్ కొత్త సీజన్‌ను ఘనంగా ప్రారంభించింది. మంగళవారం జరిగిన ఇండియన్ గ్రాండ్ ప్రీ టోర్నీ 100 మీటర్ల విభాగంలో తలపడిన ద్యూతీ 11.57 సెకన్లలో లక్ష్యం చేరి పసిడి పతకం కైవసం చేసుకుంది. హిమ్‌దాస్ (11.74), ప్రజ్ఞా ప్రకాశ్ (11.76) తర్వాతి స్థానాల్లో నిలిచారు. కాగా తెలంగాణకు చెందిన సీహెచ్ సుధాకర్ 100 మీటర్ల అంశంలో కాంస్యం దక్కించుకున్నాడు. 10.71 సెకన్లతో పరుగు పూర్తిచేసిన సుధాకర్‌ది ఖమ్మం జిల్లా కొత్తగూడెం. నేవీకి చెందిన విద్యాసాగర్ (10.65 సె.) స్వర్ణం, ఇన్‌కంటాక్స్ అథ్లెట్ అనురూప్ (10.70) రజతం గెల్చుకున్నారు.

ఆంతర్యం ఏమిటో..!

బీడబ్ల్యూఎఫ్ కొత్త రూల్స్‌పై కోచ్‌ల భిన్నాభిప్రాయాలు


విమల్ ఆరిఫ్ గోపీ

న్యూఢిల్లీ: బ్యాడ్మింటన్‌లో ఆన్-కోర్టు కోచింగ్ సమయాన్ని తగ్గించడంతో పాటు బీడబ్ల్యూఎఫ్ తలపెట్టిన అనేక మార్పులు అంతర్జాతీయ కోచ్‌లను గందరగోళంలో పడేశాయి. భారత్ కోచ్ పుల్లెల గోపీచంద్, డెన్మార్క్ చీఫ్ కోచ్ కెనెత్ జొనాసెన్ ఈ నిర్ణయం వెనకున్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా 11 పాయింట్ల తర్వాత లెమన్ బ్రేక్‌తో పాటు గేమ్ ముగిసిన తర్వాత విరామాల్లో తమ షట్లర్లకు కోచ్‌లు సూచనలిస్తూ ఉంటారు. అయితే, ఈ ఆన్-కోర్టు కోచింగ్ సమయాన్ని తగ్గించాలని బీడబ్ల్యూఎఫ్ కౌన్సిల్ నిర్ణయించింది. కానీ, ఎంత మేరకు తగ్గిస్తున్నారన్నది మాత్రం స్పష్టం చేయలేదు. అలాగే, 21 పాయింట్లకు బదులు 11 పాయింట్లతో బెస్టాఫ్-3 గేమ్‌ల స్థానంలో బెస్టాఫ్ ఫైవ్ ఫార్మాట్‌ను ప్రతిపాదించింది. ఇవి అమల్లోకి రావాలంటే మేలో బ్యాంకాక్‌లో జరిగే బీడబ్ల్యూఎఫ్ ఏజీఎమ్ ఆమోదం తెలపాల్సి ఉంటుంది. అయితే, ఆన్ కోర్టు కోచింగ్ సమయాన్ని తగ్గించడం వెనకున్న ఆంతర్యం ఏమిటో తనకు తెలియడం లేదని గోపీ పేర్కొన్నాడు. 'వివరాలతో కూడిన డ్రాఫ్ట్‌ను చూడలేదు గనక అసలు ఏమేం మార్పులు చేస్తున్నారో నాకు తెలియదు. గతంలో ఆన్-కోర్టు కోచింగ్ అనేది లేదు. మధ్యలో దాన్ని అనుమతించారు. ఇప్పుడు మళ్లీ ఆ సమయం తగ్గించాలని చూస్తున్నారు. అయితే, ఇలా చేయడం వెనకున్న లాజిక్ ఏమిటో నాకు అర్థం కావడం లేద'ని అన్నాడు. ఇక, ఆన్-కోర్టు కోచింగ్ బ్యాడ్మింటన్‌లో ఉన్న ప్రత్యేక లక్షణమని, దానితో.. కోర్టులో జరిగే విషయాలపై అభిమానుల్లో మరింత ఆసక్తి నెలకొంటుందని డెన్మార్క్ ప్లేయర్ విక్టర్ ఆక్సెల్సెన్‌ను నెంబర్ వన్‌గా తీర్చిదిద్దిన కోచ్ కెనెత్ జొనాసెన్ అన్నాడు. ఇతర క్రీడలతో బ్యాడ్మింటన్‌ను ప్రత్యేకంగా నిలిపేది అదేనన్నాడు. అయితే, ఆన్-కోర్టు కోచింగ్ సమయాన్ని తగ్గించడంతో షట్లర్లు మరింత దృఢంగా తయారవుతారని భారత మాజీ కోచ్‌లు విమల్ కుమార్, సయ్యద్ ఆరిఫ్ అంటున్నారు. 'ఈ నిబంధన వల్ల క్లిష్ట సమయాలను స్వతహాగా ఎలా ఎదుర్కోవాలనే దానిపై షట్లర్లకు మానసికంగా, శారీరకంగా సవాల్ ఎదురవుతుంది. ఇది వారి సత్తాకు నిజమైన పరీక్షగా నిలుస్తుంది. విరామ సమయాల్లో కోచ్‌లు వారితో మాట్లాడితే ఏమీకాదు.. కానీ, ఆడేటప్పుడు వారికి సూచనలివ్వడం సరికాద'ని విమల్ చెప్పాడు. ఇక, 'ఈ రోజుల్లో ప్లేయర్లు టెక్నాలజీ, కోచ్‌లపై అతిగా ఆధారపడుతున్నారు. అయితే, కోర్టులో అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవాలంటే.. షట్లర్లు వారి తెలివిని, అనుభవాన్ని ఉపయోగించుకోవాల'ని ఆరిఫ్ సూచించాడు.

ఆమె సినిమా నేనెన్నడూ చూడలేదు

- అన్నీ చట్టప్రకారమే జరిగాయి
- శ్రీదేవి శవపరీక్ష జరిపిన అష్రఫ్

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి



దుబాయ్ ఫిబ్రవరి 27: ఈయన పేరు అష్రఫ్ తమరచ్చేరి.... పుట్టింది కేరళలో. బతుకు తెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. అక్కడ సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్నాడు. ఈయన చేసే పని... మార్చురీలో శవపరీక్షలు జరిగినపుడు (ముఖ్యంగా ప్రవాసుల మృతదేహాలకు) - డాక్టర్లకు సాయపడడం, ఆ ప్రక్రియ పూర్తయ్యాక- పార్థివదేహాన్ని మళ్లీ అన్ని రసాయనాలతో కలిపి- పాడవకుండా బాగుచేసి- ఓ రూపం తెచ్చి- బంధువులకు అప్పగించడం. ఇలా ఇప్పటి వరకూ ఆయన రెండున్నర వేల మంది ప్రవాసీయుల మృతదేహాలకు- చట్టపరంగా చేయవల్సిన ప్రక్రియలు పూర్తి చేసి వారి స్వస్థలాలకు పంపించారు. అష్రఫ్ దుబాయి సమీపంలోని అజ్మాన్ లో తన కుటుంబంతో కలిసి నివాసముంటున్నారు.

అందాల నటి శ్రీదేవిని ఆయన ఎన్నడూ చూడలేదు.. కనీసం ఆమె నటించిన సినిమాలు కూడా చూడలేదు. చివరకు ఆమె విగతజీవిగా మారి మార్చురీకి చేర్చాక తొలిసారిగా చూశారు. శ్రీదేవి కేసులో దుబాయి ప్రభుత్వ అధికారులతో వ్యవహరించడానికి భారత కాన్సులేటు- ఆయనకు వకలా (పవర్ ఆఫ్ అటార్నీ లాంటిది) ఇచ్చింది.

మార్చురీలోకి బోనీ కపూర్ తరఫున ఆయన మేనల్లుడు సౌరభ్ మల్హోత్రాను అధికారులు అనుమతించారు. శ్రీదేవిని ఎన్నడూ అష్రఫ్ చూడకపోవడంతో- సౌరభ్ చూపిన మీదట- ఆమెను గుర్తించినట్లు సంతకం పెట్టి, తన వీసా కాపీని మార్చురీలో ఇచ్చి - ఇక అక్కడ నుంచి తాను చేయాల్సిన పనులు చేపట్టాడు. అక్కడ నుంచి శ్రీదేవి భౌతికకాయాన్ని తిరిగి విమానాశ్రయంలో చేర్చే దాకా ఆయనే దాని వెంట ఉన్నారు. బోనీ కపూర్ గానీ, మిగిలిన కుటుంబ సభ్యులు గానీ ఆయనతో మాట్లాడలేదు. అనిల్ అంబానీ పంపిన ప్రత్యేక విమానంలో పంపిన అనంతరం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. మరణం, దుఃఖం అందరికీ ఒక్కటేనని, కానీ ఓ ధనికుడి కంటే పేదవాడికి సాయం చేస్తేనే తనకు బాగా తృప్తి కలుగుతుందని అష్రఫ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం విదేశాలలో ప్రవాసీయుల సేవలను గుర్తించి ఇచ్చే ప్రతిష్ఠాత్మక ప్రవాసీ సమ్మాన్ ఆవార్డు గ్రహీత అయిన అష్రఫ్- శ్రీదేవితో పాటు మరో నాలుగు మృతదేహాలను కూడా కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు పంపారు. శ్రీదేవి కేసు దర్యాప్తు, శవపరీక్ష అన్నీ చట్టప్రకారమే జరిగాయని అష్రఫ్ వివరించారు.



అతిలోక సుందరి కుప్పకూలింది ఇక్కడేనా?

అతిలోక సుందరి.. ప్రేక్షకుల గుండెల్లో దేవత.. తొలి ఆలిండియా లేడీ సూపర్‌స్టార్.. చివరికి దుబాయ్‌లో ఏదో ఒక హోటల్లో బాత్‌టబ్‌లో ప్రమాదవశాత్తూ మునిగి చనిపోయింది! బాత్‌టబ్‌లో మరణం సాధ్యమేనా? అసలు.. అంతటి శ్రీదేవి ప్రాణాలు కోల్పోయిన బాత్‌టబ్ ఎలా ఉంటుంది? అన్న సందేహాలు చాలా మందికి వచ్చాయి. దానికి సమాధానంగా ఆంగ్ల చానల్ ఒకటి.. 'ఇదుగో శ్రీదేవి చనిపోయింది ఈ బాత్‌టబ్‌లోనే' అంటూ ఒక వీడియో విడుదల చేసింది. దుబాయ్‌లో శ్రీదేవి బసచేసిన జుమేరియా ఎమిరేట్స్ టవర్స్‌లోని బాత్‌టబ్ అది. అది నిజంగా శ్రీదేవి బసచేసిన గదిలోని బాత్‌రూమ్‌లోనిదేనా లేదా అదే హోటల్లోని మరో గదిలోనిదా? నిజానిజాలు ఆ చానల్‌కే తెలియాలి. ఆ చానల్ చూపిన బాత్‌టబ్ మాత్రం ఇది.



శ్రీదేవి... విట్నీ హూస్టన్

ఇద్దరి మరణాల మధ్య దగ్గరి పోలికలు

- బాలీవుడ్ నటి సిమీ గరేవాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: శ్రీదేవి, అమెరికా సంచలన గాయని విట్నీ హూస్టన్ మరణాల మధ్య దగ్గరి పోలికలు ఉన్నాయంటూ బాలీవుడ్ నటి, సెలబ్రిటీ చాట్ షో నిర్వాహకురాలు సిమీ గరేవాల్ ట్వీట్ చేశారు. పాప్ గీతాలతో అమెరికాను ఉర్రూతలూగించిన విట్నీ 2012 ఫిబ్రవరి 11న కాలిఫోర్నియా హోటల్‌లో స్నానపు తొట్టిలో ప్రాణాలు కోల్పోయి ఉండగా గుర్తించారు. ఆమె తీవ్రమైన గుండెపోటుకు గురయ్యారని మొదట భావించారు. ప్రీ-గ్రామీ పార్టీ ముందు ఆ దుర్ఘటన చోటుచేసుకుంది. అప్పుడామె వయసు 48 ఏళ్లు. ఆమె డ్రగ్స్ మత్తులో ప్రమాదవశాత్తు బాత్ టబ్‌లో మునిగి మరణించారని పోలీసులు నిర్ధారించారు. శ్రీదేవిది కూడా బాత్‌టబ్ మరణమే కావడం గమనార్హం.

పూల రెక్కలు.. కన్నీటి చుక్కలు





ముంబైలో శ్రీదేవి ఇంటి ముందు అభిమానులు, ఇంటి ఎదుట ఏర్పాటు చేసిన కటౌట్

(మొదటిపేజీ తరువాయి)

చనిపోయారన్న ఫోరెన్సిక్ నివేదికతో పబ్లిక్ ప్రాసిక్యూషన్ ఏకీభవించిందని.. సమగ్ర దర్యాప్తు అనంతరం, ఆమె మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించేందుకు ఆమోదం తెలిపిందని పేర్కొంది. "ఫోరెన్సిక్ నివేదిక ప్రకారం.. భారతీయ నటి (శ్రీదేవి) మరణం ప్రమాదవశాత్తూ నీట మునగడం వల్ల సంభవించింది. ఈ కేసు విచారణ ముగిసింది" అని తేల్చిచెప్పింది. ఒక మృతి కేసు గురించి దుబాయ్ మీడియా ఇలాంటి ప్రకటన చేయడం అత్యంత అరుదైన విషయం. మరోవైపు.. శ్రీదేవి మృతికి సంబంధించి భారత్‌లో నెలకొన్న పరిస్థితి గురించి ఇండియాలోని యూఏఈ దౌత్యవేత్తలు తమ ప్రభుత్వానికి నివేదించారు. సహజ మరణం కేసుల్లో సైతం ఒక్కోసారి మృతదేహం అప్పగింతకు 2-3 రోజుల వ్యవధి పట్టడం దుబాయ్‌లో సర్వసాధారణమేనని.. ఇది తెలియని భారతీయ మీడియా గందరగోళం చేసిందని అధికారవర్గాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి.

అంతకుముందు..

శ్రీదేవి కేసుకు సంబంధించిన పలు అంశాలపై దుబాయ్ పోలీసులు, వైద్య, న్యాయ నిపుణులు నయాబ్ సమక్షంలో సోమవారం రాత్రి, మంగళవారం ఉదయం విస్తృతంగా చర్చించారు. ఆమె శరీరంపై ఉన్న స్వల్ప గాయాల గురించి కూడా అనేక కోణాల్లో చర్చించారని, ఆమె భౌతికకాయాన్ని మంగళవారం మరోసారి పరిశీలించారని, బోనీకపూర్ పాత్రపై క్షుణ్ణంగా విచారించారని విశ్వసనీయవర్గాల సమాచారం. ఆమె ప్రమాదవశాత్తూ నీట మునిగారని చెప్పడానికి బలమైన ఆధారాలున్నాయని, బోనీకపూర్ పక్షాన ఎలాంటి నేరపూరిత కుట్రా లేదని నిర్ధరించుకున్నాకే భౌతికకాయాన్ని అప్పగించేందుకు, భారత్‌కు పంపేందుకు ఆమోదం తెలిపారు. తాను శ్రీదేవిని అమితంగా ప్రేమిస్తానని ఆమె వ్యక్తిత్వంపై ఎలాంటి మచ్చా పడనివ్వనని, తనపై భారతీయ మీడియాలో ఎన్ని వార్తలు వస్తున్నా పూర్తిగా మౌనం వహిస్తున్నానని బోనీ కపూర్ దుబాయ్ అధికారులకు వివరించినట్టు సమాచారం. బోనీకపూర్ మేనల్లుడు సౌరభ్ మల్హోత్రా, ప్రవాస సామాజిక కార్యకర్త అష్రఫ్ తమరచ్చేరి భారతీయ కాన్సులేట్ ప్రతినిధుల సమక్షంలో.. అక్కడి సిబ్బంది ఎంబామింగ్ ప్రక్రియ పూర్తిచేసి.. శ్రీదేవి మృతదేహాన్ని అంతర్జాతీయ విమానయాన సంస్థ నిబంధనల ప్రకారం ప్యాకింగ్ చేసి ఇచ్చారు. వెంటనే శవపేటికను దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి తరలించారు. ఎంబామింగ్ జరుగుతున్న సమయంలోనే.. దుబాయ్‌లోని భారత కాన్సులేట్ జనరల్.. ఆమె పాస్‌పోర్ట్ రద్దు చేసింది. అన్నీ ముగిశాక బోనీకపూర్, ఆయన కుమారుడు అర్జున్‌కపూర్ శ్రీదేవి భౌతికకాయంతో రాత్రి 7 గంటలకు అనిల్ అంబానీ అడాగ్ గ్రూపునకు చెందిన ఎంబ్రాయర్ జెట్ విమానంలో దుబాయ్ నుంచి రాత్రి 9.30 గంటలకు ముంబై ఏయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ముంబై విమానాశ్రయం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు ప్రత్యేక అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి, దాంట్లో శ్రీదేవి భౌతికకాయాన్ని ఆమె నివాసానికి తరలించారు. శ్రీదేవి అంత్యక్రియలు బుధవారం సాయంత్రం ముంబైలోని విలేపార్లే సేవాసమాజ్ హిందూ శ్మశానవాటికలో జరగనున్నాయి. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఒక ప్రకటన విడుదలైంది. శ్రీదేవికి కడసారి నివాళులు అర్పించాలనుకునే అభిమానుల సందర్శనార్థం.. బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల దాకా ఆమె భౌతికకాయాన్ని అంధేరీ వెస్ట్‌లోని లోఖండ్‌వాలా కాంప్లెక్స్‌లో ఉన్న సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్ (గార్డెన్ నంబర్ 5)లో ఉంచనున్నారు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో అంతిమయాత్ర ప్రారంభించి.. 3.30 గంటల సమయంలో దహనక్రియలు నిర్వహిస్తారు. మీడియా వ్యక్తులు కెమెరాలను, ఇతర రికార్డింగ్ పరికరాలను బయటే వదిలి రావాలని స్పష్టం చేశారు. 'ఈ కష్టకాలంలో అండగా నిలిచిన మీడియాకు ఖుషి, జాన్వి, బోనీకపూర్, కపూర్, అయ్యప్పన్ కుటుంబాల తరపున కృతజ్ఞతలు' అని శ్రీదేవి కుటుంబసభ్యులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

అనుమానాలు యథాతథం

శ్రీదేవి మృతి కేసు క్లోజ్ అయినట్టు దుబాయ్ ప్రభుత్వం ప్రకటించింది. కానీ.. ఈ కేసుకు సంబంధించిన పలు అనుమానాలకు మాత్రం ఇంకా సమాధానాలు లేవు. దుబాయ్ పోలీసులు చెబుతున్నదాని ప్రకారం వారికి బోనీ నుంచి కాల్ వచ్చింది రాత్రి 9 గంటలకు. తాము అక్కడికి చేరుకునే సమయానికి ఆమె చనిపోయిందని పోలీసులు చెబుతున్నారు. ఆమె మరణించిన సమయాన్ని అటాప్సీ నివేదికలో 10.01 గంటలుగా పేర్కొన్నారు. కేసు వివరాలన్నింటినీ దుబాయ్ అధికారులు భారత ప్రభుత్వానికి తెలియజేసి ఉంటారని విశ్వసనీయవర్గాల సమాచారం.



'ప్రమాదవశాత్తూ మునిగి చనిపోయింది'

దుబాయ్, ఫిబ్రవరి 27: నటి శ్రీదేవి ఫిబ్రవరి 24న స్పృహ కోల్పోయి.. ప్రమాదవశాత్తూ బాత్‌టబ్‌లో మునిగి చనిపోయారని ఎంబామింగ్ సర్టిఫికెట్‌లో దుబాయ్ ఆరోగ్య శాఖ నిర్ధారించింది. ఆమెకు ఇన్‌ఫెక్షన్ సోకే ఎలాంటి వ్యాధులూ లేవని స్పష్టం చేసింది. తన పర్యవేక్షణలోనే శ్రీదేవి భౌతికకాయానికి ఎంబామింగ్ (రసాయన ప్రక్రియ) పూర్తిచేసి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు దుబాయ్ హెల్త్ అథారిటీకి చెందిన అష్రాఫ్ ప్రకటించారు. అంతకు ముందు శ్రీదేవి మృతి కేసును క్లోజ్ చేస్తున్నట్లు దుబాయ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పేర్కొన్నారు. అపస్మారక స్థితిలో..శ్రీదేవి నీటిలో మునిగి చనిపోయినట్లు నిర్ధారణకు వచ్చామనీ, భవిష్యత్తులో ఈ కేసుపై ఎలాంటి దర్యాప్తూ ఉండదని స్పష్టం చేశారు. శ్రీదేవి వయస్సు 54 ఏళ్లు కాగా ఎంబామింగ్ సర్టిఫికెట్‌లో 52 ఏళ్లుగా పేర్కొనడం గమనార్హం!

నిర్దయగా కథనాలొద్దు

- మీడియాపై సెలబ్రిటీల రుసరుస



ముంబై: శ్రీదేవి మరణానికి సంబంధించి అనేకానేక కథనాలు ప్రసారం చేస్తున్న వార్తా ప్రసార మాధ్యమాలపై సినీ ప్రముఖులు విరుచుకు పడ్డారు. "నిర్దయగా, ఎదుటివారి మనోభావాలతో నిమిత్తం లేకుండా ప్రవర్తించవద్దని" కోరారు. దయాదాక్షిణ్యాలు లేకుండా కథనాలు ప్రసారం చేస్తున్నారు, ఏదో కుట్ర జరిగిపోయిందంటున్నారు, ఇది ఎదుటివారిని ఎంత బాధిస్తాయి?, మీ మాటలకు అంతూ పొంతూ లేదా? అని విద్యాబాలన్ ఘాటుగా ప్రశ్నించారు. "శ్రీదేవి మరణం మీడియాకు వినోదం పంచుతున్నట్లుంది..ఇది సిగ్గుచేటు.. తమ సూపర్‌స్టార్‌ని మీడియా హత్య చేస్తుంటే యావద్దేశం మౌనంగా చూస్తోంది" అని ఫర్హాన్ అఖ్తర్ రాశారు. 'ప్రేమతో చూడండి.. అదొక్కటే మార్గం" అని బిగ్ బీ అమితాబ్ బచ్చన్ మీడియాకు హితవు పలికారు. "ఒక లెజెండ్ మరణం గురించి ఇలాంటి రిపోర్టింగ్ చేసిన పాత్రికేయులు అసలు ప్రశాంతంగా నిద్రపోగలరా అని నాకు అనిపిస్తోంది" అని సోనూ సూద్ వ్యాఖ్యానించారు. "శ్రీదేవి గారూ! వీళ్ల (మీడియా) మిమ్మల్ని చావులోనూ ప్రశాంతంగా ఉండనివ్వరు" అని రోహిత్ రాయ్ కటువుగా అన్నారు. "శ్రీదేవి మరణం వెనుక కారణాలు తెలుసుకోవాలన్న మీడియా ఆతృత అర్థం చేసుకోదగ్గదే.. కానీ ఊహాజనిత, కల్పిత కథనాలు వెలువరించకండి" అని ఎమిరేట్స్‌లో భారత రాయబారి నవదీప్ సూరి కోరారు.

తప్పుడు ప్రచారాలొద్దు

టాలీవుడ్ యువ నటీనటులు. "లెట్ హెర్ రెస్ట్ ఇన్ పీస్" (ఆమె ఆత్మకు శాంతి నివ్వండి) అనే హేష్ ట్యాగ్‌తో ట్విట్టర్‌లో ప్రచారం నిర్వహించారు.

అల్లు అర్జున్: మీడియాకు, సామాజిక మాధ్యమాలకు విషయాన్ని వివరాల్ని అందజేసే వారందరికీ నా వినతి ఒకటే.. ఊహాగానాలు వద్దు.. చనిపోయిన వారిని గౌరవిద్దాం

రానా దగ్గుబాటి: దేశం గర్వించే లెజెండ్ శ్రీదేవి. చిత్రసీమలో ఆమె నటించిన తీరు ఇతర నటీనటులతో పోల్చలేనిది. అలాంటి గొప్ప వ్యక్తి ఇమేజిపై బురద జల్లొద్దు.. ఆమె జ్ఞాపకాలను తుడిచేయకండి

కాజల్ అగర్వాల్: శ్రీదేవి ఇమేజిని దెబ్బతీసే నీచమైన ప్రచారం వద్దు...దయచేసి సీరియస్‌గా చెబుతున్నా.. వద్దు.

తాప్సీ పన్ను: శ్రీదేవి ఆత్మకు శాంతి కలగనివ్వండి

ప్రణీత: ఇది పోటీ కాదు..వదంతులు రాసే సమయం కాదు.. ఒకరి మరణాన్ని హేళన చేయవద్దు

ఆన్‌లైన్‌లోనే ఈపీఎఫ్ క్లెయింలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: భవిష్య నిధి నుంచి డబ్బును ఉపసంహరించుకునే ఉద్యోగులు ఆన్‌లైన్ ద్వారా క్లెయిం చేసుకోవాలని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) తెలిపింది. రూ. 10లక్షలకు పైబడిన ఉపసంహరణలకు ఆన్‌లైన్ తప్పనిసరి అని పేర్కొంది. పెన్షనర్ల విషయంలో ఆ మొత్తం రూ. 5లక్షలు దాటితే.. కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించరని.. వెబ్‌సైట్ ద్వారానే క్లెయిమ్ చేసుకోవాలని సూచించింది. ఉపసంహరణలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే ముందే.. తమ యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎన్)ను యాక్టివేట్ చేసుకోవాలని తెలిపింది. బ్యాంకు అకౌంట్ నంబరుతో యూఏఎన్ సంఖ్య అనుసంధానం (సీడింగ్) తప్పనిసరి అని పేర్కొంది. కేంద్ర భవిష్య నిధి కమిషనర్ జూన్ 17న నిర్ణయం తీసుకున్నా.. తమకు ఆదేశాలు మంగళవారం అందాయని అధికారులు తెలిపారు.

'యుమాంగ్'తో పీఎఫ్‌కు ఆధార్ లింక్

బ్యాంకు లావాదేవీల నుంచి ప్రభుత్వ పథకాల వరకు అన్నింటికీ కేంద్రం ఆధార్‌ను తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. గడువులోగా వాటన్నింటికీ ఆధార్‌ను అనుసంధానం చేసుకునే క్రమంలో చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. అందుకే 'యుమాంగ్' (UMANG) యాప్ ద్వారా పీఎఫ్‌కు ఆధార్‌ను లింక్ చేసుకునే సదుపాయాన్ని కేంద్రం కల్పించింది.

రైతులకు అచ్చేదిన్!

(మొదటిపేజీ తరువాయి)



వందశాతం సాగు సాధ్యమైందని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడులు గణనీయంగా పెరిగాయన్నారు. ఇలాంటి ప్రయోగాలు కర్ణాటకలో ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. గత ఐదేళ్లుగా కర్ణాటకలో రైతు వ్యతిరేక విధానాలతో పాలన సాగుతోందని, రైతులు పూర్తిగా నిస్పృహకు గురయ్యారని వ్యాఖ్యానించారు. రైతుల కోసం, బలహీన వర్గాలు, నిరుపేదల సంక్షేమానికి కేంద్రం తీసుకుంటున్న చర్యలను ప్రధాని వివరించారు. పల్లెల తలరాతను మారిస్తే మొత్తం దేశం తలరాత మారుతుందని వ్యాఖ్యానించారు. వచ్చేది రైతు ప్రభుత్వమే అంటూ బీజేపీ కార్యకర్తలను ఉత్సాహపరిచారు.

సిద్దరామయ్య కాదు... సీదా రూపయ్యా సర్కార్

కర్ణాటకలో సిద్దరామయ్య సర్కారుకు బదులు సీదా రూపయ్యా(పని చేస్తే ఏమిస్తావ్ అనే రకం) సర్కారు నడుస్తోందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఇక్కడ ఏ పనైనా డబ్బులిస్తేనే పని జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వంలోని వారికి నేరుగా కమీషన్లు అందుతున్నాయని ఆరోపించారు. '10 శాతం కమీషన్ ప్రభుత్వం' దిగిపోతేనే కర్ణాటక ప్రజలకు విముక్తి లభిస్తుందని అన్నారు. కేంద్రంలో తమ ప్రభుత్వం పారదర్శకంగా నిజాయితీతో పని చేస్తోందని తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ మంత్రుల తరహాలో తమ మంత్రులపై ఎక్కడా ఐటీ దాడులు జరగలేదని, ఇళ్లలో కట్టలకు కట్టలు డబ్బులు పట్టుబడలేదని చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రజలకు ఎప్పుడు అవకాశం వచ్చినా కాంగ్రెస్‌ను గద్దె దింపుతారని, దేశంలోని అన్ని సమస్యలకు కారణం కాంగ్రెస్ సంస్కృతేనని అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: **K. Srinivas**, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .**Managing Director : Vemuri Radha Krishna**, Founder: K.L.N.Prasad.